# దారి దీపం
మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 4 - సంచిక 7 | ఏప్రిల్ 2026 | వెల : రూ.15

డాక్టర్ బీఆర్ అంబేద్కర్
జయంతి - ఏప్రిల్ 14



## సామాజిక, ఆర్థిక న్యాయం కోసం..
## మహనీయుల స్ఫూర్తితో మరో ప్రజా ఉద్యమం



**జ్యోతిబా ఫూలే**
**జయంతి- ఏప్రిల్ 11**



**బాబూ జగజ్జీవన్ రామ్**
**జయంతి -ఏప్రిల్ 5**



**సావిత్రిబాయి ఫూలే**
**జయంతి - జనవరి 3**



**ఫాతిమా షేక్**
**జయంతి - జనవరి 9**



# మహనీయుల స్ఫూర్తితో మరో ఉద్యమం

ఏప్రిల్ నెల మొదటి పక్షంలోనే అంబేద్కర్, జ్యోతిబాఫూలే, జగజ్జీవన్ రామ్ జయంతులు వస్తాయి. ఇవి లాంఛనంగా జరుపుకునే జయంతులు కావు. వారి విగ్రహాల దండలు వేసి సరిపెట్టుకునేవి కావు. వారి నుంచి స్ఫూర్తిపొందాలి. సామాజిక, ఆర్థిక, న్యాయం కోసం మరో ప్రజా ఉద్యమానికి ప్రతినపూనాలి. వాటి సాధన కోసం నిరంతర కృషి,ప్రయత్నాలు సాగించాలి. అలాంటి స్ఫూర్తిని, ఉద్యమ కాంక్షను పాదకొల్పడానికి "దారిదీపం" ప్రత్యేక సంచిక రూపొందించింది. ఈ సంచికను అందరితోపాటు ప్రత్యేకంగా శ్రమజీవులు, వివక్ష తరగతుల సమూహాలు తమ కార్యాచరణకు కరదీపికగా వినియోగించుకోవాలని కోరుతున్నాం. జ్యోతిబా ఫూలేతో ప్రారంభమైన "సామాజిక న్యాయం" ఒక ఉద్యమంగా కొనసాగి అంబేద్కర్ సారథ్యంలో రూపుదిద్దుకున్న రాజ్యాంగంలో నిర్దిష్ట రూపం ధరించింది. రాజ్యాంగ పీఠికలోనే సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందరికీ కల్పించే హామీని ప్రకటించింది. వాటిని ప్రాథమిక హక్కులుగా ప్రకటించింది.

రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాల తర్వాత మన సమాజంలో కుల వివక్ష వుంది. లింగ వివక్ష వుంది. మత వివక్ష వుంది. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న హిందుత్వ రాజకీయం, ఆర్ఎస్ఎస్ "హిందూ రాష్ట్ర" నినాదాలు రాజ్యాంగ విరుద్ధం మాత్రమే కాదు. ప్రజలను విభజించి విద్వేషాన్ని రెచ్చగొడుతున్నాయి. పర్యవసానంగా దళితుల మీద, మహిళల మీద, మైనారిటీ మతస్తుల మీద దాడులు, అత్యాచారాలు పెరుగుతున్నాయి. హిందుత్వ రాజకీయాన్ని, హిందూ రాష్ట్ర నినాదాన్ని ప్రతిఘటించకపోతే తిరిగి మనువాద రాజకీయం పైచేయి సాధిస్తుంది. దేశ ప్రజలందరి రాజ్యాంగ హక్కులను హరిస్తుంది.

మరోపక్క మోదీ పాలన బిలియనీర్ల పాలనగా, కార్పొరేట్ల పాలనగా మారింది. మోదీ పాలనలో 20 లక్షల కోట్ల రుణమాఫీలు రాయితీలు పొందారు. అన్ని సహజ వనరులు వారికి ధారాదత్తం చేస్తున్నారు. ఇప్పుడు దేశ సంపదలతో ఒక శాతం బిలియనీర్లు, కార్పొరేట్లు 46 శాతం స్వంతం చేసుకున్నారు. పది శాతం దగ్గర 75 శాతం సంపద గుట్టపడింది. పేదలను పరోక్ష పన్నులు పీల్చి పిప్పి చేస్తున్నాయి. నిరుద్యోగం, అధిక ధరలు, ఉపాధి లేమి వారి జీవితాలను దుర్భరం చేస్తున్నాయి. సంపద సృష్టిలో కీలక పాత్ర పోషిస్తున్న శ్రమ జీవులకు, పేదలకు అందులో వాటా దక్కడం లేదు. ఈ నేపథ్యంలో సామాజిక, ఆర్థిక న్యాయం కోసం మరో ప్రజా ఉద్యమానికి సిద్ధం కావాలి. దేశంలో పది శాతం దగ్గర పోగుబడ్డ సంపదపై రెండు నుంచి నాలుగు శాతం సంపద పన్ను విధిస్తే 20 నుంచి 25 లక్షల కోట్లు వస్తుందని, దీనిని జాతీయ సంక్షేమ నిధిగా ప్రకటించి పున: పంపిణీకి వీలుందని ఆర్థిక వేత్తలు అంచనాలు వేస్తున్నారు.

ఈ సంక్షేమ నిధి నుంచి శ్రమ జీవులకు హక్కుగా బోనస్, నివాస వసతి, ఆహార భద్రత, ఉపాధి హామీతోపాటు అందరికీ మంచి ప్రమాణాల విద్య, ఆరోగ్య సేవలు అందించే వీలుంది. రైతుల పంటలకు లాభసాటి మద్దతు ధర, యువతకు నైపుణ్యాలు, ఉపాధి హామీ సాధించవచ్చు. సామాజిక న్యాయం, సంపద పునః పంపిణీపై ఈ సంచిక చివర ఒక ప్రత్యేక వ్యాసం ప్రచురిస్తున్నాం. తప్పక చదవండి. సామాజిక, ఆర్థిక న్యాయానికి మరో ప్రజా ఉద్యమానికి అంకితం అవుదాం. ❑

**- డి.వి.వి.యస్.వర్మ, సంపాదకులు, 85006 78977**

ఏప్రిల్ - 2026

పేజీలు : 85

# దారి దీపం

మాసపత్రిక

సంపుటి : 4 - సంచిక : 7

డి.వి.వి.యస్.వర్మ
- సంపాదకులు


సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..


1. మహనీయుల స్ఫూర్తితో మరో ఉద్యమం - సంపాదకీయం 3
2. వైరుధ్యాల జీవితాల్లోకి అడుగు పెడుతున్నాం.. డా బి.ఆర్.అంబేద్కర్ చారిత్రాత్మక ప్రసంగం 5
3. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ - రాజాబాబు కంచర్ల 12
4. ప్రజాస్వామ్యమే అంబేద్కర్ భావసారం - మల్లేపల్లి లక్ష్మయ్య 16
5. అంబేద్కర్ హిందూ రాజ్యం - బి.బి.సి. 18
6. మానవ హక్కుల మహానేత అంబేద్కర్ - గెయిల్ ఓంవెడ్ట్ 19
7. అంబేద్కర్ పోరాట వెలుగులో సామాజిక న్యాయం - జస్టిస్ వీ.ఆర్.కృష్ణయ్యరు 21
8. హిందూత్వ, సామాజిక న్యాయం ఒకే ఒరలో ఇమడవు ! - బి.వి.రాఘవులు 24
9. అంబేద్కర్ ఒక గొప్ప ఆర్థికవేత్త - బీబీసీ కథనం 26
10. దళితులు - భూమి - అంబేద్కర్ - డా॥ కత్తి పద్మారావు 30
11. బీఆర్ అంబేద్కర్ మార్గం : దేశంలో సామ్యవాద ఆర్థిక అభివృద్ధి - డా కత్తి పద్మారావు 32
12. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దృక్పథంలో 'స్త్రీ' - ప్రొఫెసర్ జి.హరగోపాల్ 34
13. మహిళా హక్కులపై అంబేద్కర్ కృషి - మాడభూషి శ్రీధర్ 41
14. అంబేద్కర్ అస్తిత్వవాది కాదు అచ్చమైన దేశీయ ఆధునికతా వాది - మెట్టు రవీందర్ 47
15. అంబేద్కర్ బౌద్ధ దీక్ష - నైతికత, సమానత - మోకా సత్తిబాబు 50
16. రెండూ సామాజిక విప్లవ సిద్ధాంతాలే.. - మల్లేపల్లి లక్ష్మయ్య 52
17. మార్క్స్, అంబేద్కర్లవి కుల, వర్గ జమిలి సిద్ధాంతాలే - అబ్దుల్ నూర్ బాషా 54
18. కుల నిర్మూలన సాధించే మార్గం - ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ 59
19. మహా కుంభమేళాలో హిందూ రాష్ట్ర రాజ్యాంగం - సంజయ్ పాండే 64
20 భారత ప్రప్రథమ సామాజిక తత్వవేత్త 65
21. సమన్యాయ సత్యశోధకుడు 68
22. క్రాంతి జ్యోతి సావిత్రిబాయి ఫూలే 69
23. తొలి ఆధునిక కవయిత్రి సావిత్రి బాయి ఫూలే - కాత్యాయనీ విద్మహే 70
24. తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ - ఇక్బాల్ యంజీ 76
25. వివక్షపై తిరుగుబాటు జెండా బాబూజీ - కృపాకర్ పొనుగోటి 78
26. జాతీయ దృక్పథం గల దళితోద్ధారకుడు - డొక్కా మాణిక్య వరప్రసాద్ 80
27. సామాజిక, ఆర్థిక న్యాయం కోసం.. ప్రజా ఉద్యమాన్ని ఎలా రూపొందించాలి ? - డి.వి.వి.యస్.వర్మ 81
28. పూలే, జగ్జీవన్ పుస్తకాలు 84
29. అంబేద్కర్ పుస్తకాలు 85

# వైరుధ్యాల జీవితాల్లోకి అడుగు పెడుతున్నాం



**రాజ్యాంగ ముసాయిదా పూర్తయిన సందర్భంగా**
**1949 నవంబరు 25న డా బి.ఆర్.అంబేడ్కర్ చారిత్రాత్మక ప్రసంగం**

## అధ్యకా..

1946 డిసెంబరు 9న మొట్ట మొదటగా సమావేశమైన నాటి నుంచి ఈ రాజ్యాంగ రచనా సభ నేటికి 2 సంవత్సరాల 11 నెలల 17 రోజులపాటు చర్చించింది. ఈ కాలంలో 11 సమావేశాలు జరిగాయి. మొదటి ఆరు సమావేశాల్లో ఆబ్జెక్టివ్స్ రిజల్యూషన్ (ఆశయాల తీర్మానం), ప్రాథమిక హక్కులు, యూనియన్ (కేంద్ర రాజ్యాంగం, యూనియన్ అధికారాలు, ప్రావిన్షియల్ (రాష్ట్రాల) రాజ్యాంగం, మైనార్టీలు, షెడ్యూల్ ఏరియాలు, షెడ్యూలు తెగలపై వివిధ కమిటీల నివేదికలపై చర్చించాం.

ఏడు, ఎనిమిది, తొమ్మిది, పది, పదకొండు సమావేశాల్లో ముసాయిదా రాజ్యాంగం గురించి చర్చించాం. ఈ 11 సమావేశాలు 165 రోజులు జరిగాయి. ఇందులో 114 రోజులు మనం ముసాయిదా రాజ్యాంగం గురించి మాట్లాడుకున్నాం. 29 ఆగస్టు 1947న ఈ రాజ్యాంగ రచనా సభ డ్రాఫ్టింగ్ కమిటీని ఎన్నుకొంది. డ్రాఫ్టింగ్ కమిటీ మొదటి సమావేశం ఆగస్టు 30న జరిగింది. 141 రోజులపాటు రాజ్యాంగ ముసాయిదా తయారు చేసేందుకు కృషి సల్పింది. రాజ్యాంగ సలహాదారు రూపొందించిన 243 ఆర్టికల్స్, 13 షెడ్యూళ్ల ప్రతిపై డ్రాఫ్ట్ కమిటీ కసరత్తు చేసింది. రాజ్యాంగ సభకు 315 ఆర్టికల్స్, 8 షెడ్యూల్స్ తొలి రాజ్యాంగ ముసాయిదాను సమర్పించింది. మొత్తం 7,635 సవరణలు ముందుంచగా అందులో 2,473 సవరణలు సభలో చర్చించాం.

రాజ్యాంగ రచనకు మా కమిటీ ఎక్కువ సమయం తీసుకుందని, ప్రజాధనం వృథా అవుతోందని విమర్శలు వస్తున్నందున నేను ఈ వాస్తవాలను వెల్లడించాల్సి వస్తోంది. రోమ్ తగలబడుతోంటే నీరో ఫిడేలు వాయిస్తున్నట్టుందన్న పై విమర్శలో సత్యమేమైనా వుందా ? ఇక, ఇతర దేశాల రాజ్యాంగ రచనకు ఆయా దేశాల రాజ్యాంగ రచనా సభలు తీసుకున్న సమయాన్ని లెక్కిద్దాం. అమెరికాలో 1787 మే 25న మొదలు పెట్టి నాలుగు నెలల కాలంలో అంటే 1787 సెప్టెంబరు 17 నాటికి రాజ్యాంగ రచన ముగించారు. కెనడాలో 1864 అక్టోబరు 10న మొదలై మార్చి 1867కు రాజ్యాంగ చట్టం చేశారు. ఇందుకు పట్టిన కాలం 2 సంవత్సరాల 5 నెలలు. మార్చి 1891లో ప్రారంభిస్తే 9 జూలై 1900 నాటికి, అంటే 9 సంవత్సరాలకు గాని ఆస్ట్రేలియా రాజ్యాంగం రూపొందలేదు. 1908లో ప్రారంభించి ఒక సంవత్సర కాల శ్రమతో 1909 సెప్టెంబరు 20 నాటికి దక్షిణాఫ్రికా తన రాజ్యాంగాన్ని రచించుకొంది. అమెరికా, దక్షిణాఫ్రికా రాజ్యాంగాల రూపకల్పనకంటే అధిక సమయం తీసుకున్నప్పటికీ, మనం కెనడా, ఆస్ట్రేలియా రాజ్యాంగాల రచనా కాలంతో పోల్చుకుంటే తక్కువ సమయం తీసుకున్నట్టే లెక్క. సమయంతో పోల్చే సందర్భంలో కూడా రెండు అంశాలను మనం పరిగణనలోకి తీసుకోవాలి.

**అందులో ఒక అంశం :** అమెరికా, కెనడా, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా దేశాల రాజ్యాంగాలు మన దేశ రాజ్యాంగంకన్నా చిన్నవి. మన రాజ్యాంగంలో 395 ఆర్టికల్స్ వుండగా అమెరికా రాజ్యాంగంలో కేవలం ఏడు ఆర్టికల్స్ మాత్రమే వున్నాయి. అందులో మొదటి నాలుగు ఆర్టికల్స్‌లో 21 సెక్షన్స్ మాత్రం వుంటాయి. కెనడా రాజ్యాంగం 147 ఆర్టికల్స్, ఆస్ట్రేలియా రాజ్యాంగం 128 ఆర్టికల్స్, దక్షిణాఫ్రికా రాజ్యాంగం 153 ఆర్టికల్స్ కలిగి వున్నాయి.

**రెండో అంశం :** కెనడా, ఆస్ట్రేలియా, అమెరికా, దక్షిణాఫ్రికా రాజ్యాంగ రచనాకర్తలు సవరణల సమస్యను ఎదుర్కొనలేదు. ఆ రాజ్యాంగాలు ప్రతిపాదించగానే ఎటువంటి సవరణల సమస్యలు లేకుండా యథాతథంగా ఆమోదించారు. మరోవైపు మన

రాజ్యాంగం 2,473 సవరణల చర్చను ఎదుర్కోవలసి వచ్చింది. అందువల్ల రాజ్యాంగ రచన ఆలస్యమైందన్న ఆరోపణ అసంబద్ధమైనది. ఇంత త్వరగా రాజ్యాంగ రచన పూర్తయినందుకు ఈ సభ తనను తాను అభినందించుకోవాలి.

డ్రాఫ్టింగ్ కమిటీ రచనా నాణ్యత విషయం గురించి వస్తే, నజీరుద్దీన్ అహ్మద్ అభిప్రాయంలో నాసిరకం, తక్కువస్థాయి. ఈ అభిప్రాయం కలిగి వుండే హక్కు ఆయనకుంది. డ్రాఫ్టింగ్ కమిటీకంటే తనకెక్కువ సామర్థ్యముందని ఆయన అభిప్రాయం. ఈ సభ డ్రాఫ్టింగ్ కమిటీలో ఆయననూ ఒక సభ్యునిగా ఎన్నుకొంటే మేం ఆయనను సాదరంగా ఆహ్వానించేవాళ్లం. కమిటీలో ఆయన లేకపోవడమన్నది మా తప్పు కాదు.

డ్రాఫ్టింగ్ (రచనా) కమిటీని డ్రిఫ్టింగ్ (నీళ్లలో ఎటుబడితే అటు కొట్టుకుపోతున్న) కమిటీగా వర్ణించి ఆయన తన అసమ్మతిని తెలిపారు. అయితే నేర్పరితనంతో కూడిన వేగానికి (డ్రిఫ్ట్), నేర్పు లేని వేగానికి (డ్రిఫ్ట్) తేడా వుంది. పరిస్థితులకు అనుగుణంగా నేర్పుగానే ఈ కమిటీ కదిలింది. తెలియనిచోట కాక తెలిసిన చోటే చేపల వేట చేసింది. ఎటుబడితే అటు కొట్టుకుపోకుండా అన్వేషణతోనే కొనసాగింది. ఆయన ఏ ఉద్దేశంతో ఆ వ్యాఖ్య చేసినా దాన్ని మేం అభినందనగానే స్వీకరిస్తున్నాం. అనవసరమైన సవరణ ప్రతిపాదనలను తొలగించి అవసరమైన ప్రతిపాదనలను కమిటీ స్వీకరించింది. అలా చేయకపోవడం బాధ్యత రాహిత్యం, అగౌరవమైన చర్యే కదా! అలా చేయడం పొరపాటైతే ఆ పొరపాటు సరిదిద్దుకొనేందుకు మాకు అభ్యంతరం ఏమీ లేదు.

ఒక్క సభ్యుడు మినహా మిగిలిన రాజ్యాంగ సభ అంతా మా కమిటీ పనితీరుపై సంతృప్తికరంగా అభినందనీయంగా వున్నందుకు సంతోషిస్తున్నాం. ఓ వైపు యావత్ సభ, మరోవైపు మా కమిటీ సభ్యుల అభినందనల వెల్లువ నన్ను ముంచెత్తింది. వారికి ఏ విధంగా కృతజ్ఞతలు చెప్పాలన్నా, నాకు సరైన మాటలు దొరకడం లేదు. షెడ్యూల్డు కులాల ప్రయోజనాలు పరిరక్షించే ఏకైక ప్రయోజనంతోనే నేను ఈ సభలో అడుగుపెట్టాను. అత్యంత బాధ్యతాయుతమైన పనులను నాకప్పగిస్తారని ఊహించలేదు. డ్రాఫ్టింగ్ కమిటీలో సభ్యునిగా ఎన్నుకున్నప్పుడు ఆశ్చర్యపడ్డాను. కమిటీ చైర్మన్‌గా ఎన్నుకున్నప్పుడు సంభ్రమాశ్చ ర్యాలకు గురయ్యాను. నిజానికి డ్రాఫ్టింగ్ కమిటీలో నాకంటే సమర్థుడైన మిత్రుడు అల్లాడి కుప్పుస్వామి అయ్యర్ వున్నారు. అయినప్పటికీ నా మీద నమ్మకం, విశ్వాసం వుంచి దేశానికి సేవ చేసేందుకు నన్ను ఎన్నుకొన్న ఈ సభకు నేనెంతగానో కృత జ్ఞతలు తెలియజేసుకుంటున్నాను (కరతాళ ధ్వనులు).

డ్రాఫ్టింగ్ కమిటీ కోసం ముసాయిదా ప్రతిని తయారు చేసిన రాజ్యాంగ సలహాదారు బి.ఎన్.రావుకు కూడా ఈ అభినందనల్లో వాటా చెందాలి. 141 రోజులపాటు విభిన్న దృక్పథాలను సహనంతో పరిశీలించి వాటిని సర్దుబాటు చేసుకునే సమర్థతతో, నిజాయితీతో నూతన సూత్రాలను ఎప్పటికప్పుడు ఆవిష్కరించిన మా డ్రాఫ్టింగ్ కమిటీలోని సభ్యులకు అభినందనలు చెందాలి.

చీఫ్ డ్రాఫ్ట్‌మన్ (ముఖ్య రాయసగాడు) ఎన్.ఎన్.ముఖర్జీకి మరింతగా ఈ అభినందనలు చెందాలి. అత్యంత క్లిష్టమైన ప్రతిపాదనలను సులభతరం చేసి లీగల్ సూత్రాల ప్రకారం వాటిని రూపకల్పన చేసిన ఆయన ప్రతిభ అనితరసాధ్యం. ఆయన నిరంతర కృషీవలుడు. ఈ సభ సేకరించుకొన్న విలువైన వ్యక్తి. ఆయన సహాయం లేకుంటే ఈ రాజ్యాంగ రచనకు మరిన్ని సంవత్సరాలు పట్టేది. ముఖర్జీ సిబ్బందిని ఈ సందర్భంగా మనం గుర్తించి గౌరవించాలి. అర్ధరాత్రులు దాటాక వారు చేసిన కష్టతరమైన శ్రమ గురించి నాకు తెలుసు. వారి శ్రమకు, సహకారానికి ధన్యవాదాలు (కరతాళ ధ్వనులు).

ఇందులోని సభ్యులు ఒక గుంపుగా కాక, ఎగుడుదిగుడు రాళ్లతో కూడిన ఒక రోడ్డు పక్క కాలిబాటగా కాక, ఎవరికి వారే అన్న తీరున కాక.. వుండటంతో మా శ్రమ తప్పింది. లేకపోతే అయోమయ వాతావరణం నెలకొనేది. సభా కార్యక్రమాలు పద్ధతిగా, క్రమశిక్షణగా నడిపేందుకు కాంగ్రెస్ పార్టీ సహకరించింది. అందువల్ల అభినందనలు ఆ పార్టీకి కూడా చెందాలి. పార్టీ క్రమశిక్షణకు సభ్యులందరూ లొంగి వుండకపోతే సభా కార్యకలాపాలు సజావుగా సాగేది కాదు. పార్టీ క్రమశిక్షణ సభ్యులను 'అవును' అని ఆమోదించే వారిగా మలచింది.

అదృష్టవశాత్తు తిరుగుబాటుదారులు వున్నారు. వారు కామత్, డా॥ పీఎస్ దేశముఖ్, సిధ్వ, ప్రొ॥ సక్సేనా, పండిట్ ఠాకూర్, దాస్ భార్గవ, ప్రొ॥ కె.టి.షా, పండిట్ హృదయనాథ్ కుంజ్రూలు. వారు లేవనెత్తిన అంశాలు సైద్ధాంతికమైనవి. వారు లేవనెత్తిన అంశాలు నేను అంగీకరించలేదంటే ఆ సలహాలు విలువైనవి కావని మాత్రం అర్థం కాదు. సభ నిర్వహణలో వారందించిన సేవలకు ధన్యవాదాలు. ఈ సందర్భంగా రాజ్యాంగాన్ని కేవలం యాంత్రికంగా ఆమోదించడం కాకుండా రాజ్యాంగ మౌలిక ఆదర్శాలను గురించి సవివరంగా పరిశోధించి చర్చించే అవకాశం కలిగింది.

చివరగా సభ కార్యకలాపాలను సజావుగా నిర్వహించిన సభాధ్యక్షులకు కృతజ్ఞతలు. ఈ సందర్భంగా మీరు చూపిన చొరవ, సమన్వయం సభికులెవరూ మర్చిపోలేరు. కొన్ని సంద ర్భాల్లో డ్రాఫ్టింగ్ కమిటీ సవరణలకు సాంకేతిక అంశాలు అడ్డు వచ్చిన సందర్భాల్లో నేనెంతో ఆందోళనకు గురయ్యాను. అయితే రాజ్యాంగ రచనా పద్ధతిని న్యాయ సాంకేతిక అంశాలు అడ్డుకోని వ్వకుండా సభాధ్యక్షులు చూపిన చొరవకు ధన్యవాదాలు. రాజ్యాంగానికి మద్దతుగా అన్ని అంశాలనూ సవివరంగా నా మిత్రుడు సర్ అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, టి.టి.కృష్ణమా చార్యులు మాట్లాడారు. కాబట్టి ఇక నేను ఆ అంశాల జోలికి పోను. **ఎందుకంటే ఒక రాజ్యాంగం ఎంత మంచిదయినా, అది అమలు చేయాల్సిన వారు చెడ్డ వారైతే అది చెడుపు చేస్తుంది.**

**అదేవిధంగా ఒక రాజ్యాంగం ఎంత చెడ్డదైనా దాన్ని అమలు చేసేవారు మంచివారైతే, ఆ రాజ్యాంగం మంచే చేస్తుంది.** రాజ్యాంగ ప్రవృత్తిపై పూర్తిగా రాజ్యాంగ ఆచరణ ఆధారపడి వుండదు. రాజ్యం యొక్క ముఖ్య అంగాలైన చట్టసభ వ్యవస్థ, అధికార వ్యవస్థ, న్యాయవ్యవస్థల గురించి రాజ్యాంగం చెబుతుంది. రాజకీయ పార్టీలు, వ్యక్తులు, వారి కోరికలు, రాజకీయాల వంటి అంశాలపైన రాజ్యం యొక్క ఈ ముఖ్య అంగాల పని తీరు ఆధారపడి వుంటుంది.

భారత ప్రజలు, వారి ఆకాంక్షలు, ఆశయాలు ఎలా వుండగలవో ఎవరు చెప్పగలరు ? తమ ఆశయాల సాధన కోసం వారు విప్లవ పద్ధతులను అవలంభిస్తారా ? ఒకవేళ వారు విప్లవ మార్గం అనుసరిస్తే, రాజ్యాంగం ఎంత మంచిదైనా అది కూలిపోతుందని చెప్పడానికి ప్రవక్తలేం దిగి రావాల్సిన అవసరం లేదు. ప్రజలు, రాజకీయ పార్టీలు అనుసరించే పద్ధతులు, మార్గాల గురించి తెలియకుండా రాజ్యాంగంపై ఎటువంటి తీర్పులూ తీర్చడం వ్యర్థం.

ప్రధానంగా కమ్యూనిస్టు, సోషలిస్టు పార్టీలు రెండూ రాజ్యాంగాన్ని ఖండించాయి. వారు రాజ్యాంగాన్ని ఎందుకు ఖండిస్తున్నారు ? నిజంగా ఈ రాజ్యాంగమంత చెడ్డదా ? 'కాదు' అని చెప్పేందుకు నేను సంశయించను. శ్రామికవర్గ నియంతృత్వ సూత్రం ఆధారంగా రాజ్యాంగం కావాలన్నది కమ్యూనిస్టు పార్టీ ఆదర్శం. సోషలిస్టులకు రెండు అంశాలు కావాలి. సోషలిస్టులు అధికారంలోకి రాగానే ఎటువంటి పరిహారమూ చెల్లించకుండా వ్యక్తిగత ఆస్తినంతా జాతిపరం లేదా సమాజపరం చేయాలన్నది సోషలిస్టులు కోరే మొదటి అంశం. రాజ్యాంగంలో పొందుపర్చిన ప్రాథమిక హక్కులు పరిపూర్ణంగా వుండాలని, వాటికి ఎటువంటి పరిమితులు వుండకూడదని, అలా వుంటే ఒకవేళ వారు అధికారంలోకి రాలేకపోయినా, ఆ అపరిమిత స్వేచ్ఛను ఉపయోగించి కేవలం విమర్శించడానికే పరిమితం కాకుండా రాజ్యాన్ని కూలదోయవచ్చన్నది వారు ఆశించే రెండో అంశం. పైకారణాలతో వారు రాజ్యాంగాన్ని ఖండిస్తున్నారు. రాజకీయ ప్రజాస్వామ్య వ్యవస్థలో కేవలం పార్లమెంటరీ ప్రజాస్వామ్య పద్ధతి మాత్రమే ఉన్నతాదర్శ పద్ధతి అని నేను చెప్పబోవడం లేదు. పరిహారం ఇవ్వకుండా వ్యక్తిగత ఆస్తిని స్వాధీనం చేసుకోకూడదనే సూత్రం అత్యంత పవిత్రమైనదని, ఆ పద్ధతి నుంచి వైదొలగాల్సిన అవసరం లేదని నేను చెప్పలేదు. ప్రాథమిక హక్కులు పరిపూర్ణంగా వుండకూడదని, వాటిపై విధించిన పరిమితులు తొలగించకూడదని నేను చెప్పలేదు. నేను చెప్పాలనుకుంటుందల్లా రాజ్యాంగంలో పొందుపరిచిన సూత్రాలు ప్రస్తుత తరానికి సంబంధించిన దృక్పథాలు, లేదా, ఒకవేళ ఈ ప్రకటన అతిశయోక్తి అనుకుంటే, ఇవి ఈ రాజ్యాంగ రచనా సభ సభ్యుల అభిప్రాయాలు. ఈ అభిప్రాయాలను రాజ్యాంగంలో చేర్చినందుకు డ్రాఫ్టింగ్ కమిటీని ఎందుకు

**మన దేశంలో ప్రజాస్వామ్యం చాలా కాలం నుంచి లేకపోవడం వల్ల ప్రజాస్వామ్య భావన కొత్తగా వచ్చినట్లు భావించి, మన దేశంలాంటి దేశంలో ఈ ప్రజాస్వామ్యం నియంతృత్వంగా మారే ప్రమాదం వుంది. కొత్తగా జన్మించిన ఈ ప్రజాస్వామ్య శిశువు తన రూపాన్ని కోల్పోయి నియంతృత్వానికి చోటిచ్చే పరిస్థితి వుంది. ఏ మాత్రం పొరపాటు జరిగినా నియంతృత్వం వచ్చే ప్రమాదమే అత్యధికంగా కనబడుతోంది.**

నిందిస్తారు ? రాజ్యాంగ సభ సభ్యులను ఎందుకు నిందించాలి? అమెరికా రాజ్యాంగాన్ని రూపొందించటంలో ముఖ్యపాత్ర వహించిన రాజనీతిజ్ఞుడు థామస్ జెఫర్సన్ వెలిబుచ్చిన బలమైన అభిప్రాయాలు రాజ్యాంగ రూపశిల్పులు విస్మరించరానివి.

ఒక సందర్భంలో జెఫర్సన్ ఇలా అన్నారు : **"ఒక హక్కుగా ప్రతీ తరం ఒక ప్రత్యేక జాతిగా ఒకే విధంగా కలిసివుంటుంది. అయితే ఆ తరం మరొక దేశాన్ని.. ప్రజలను చూసే విధంగా తన తరువాతి తరాన్ని చూడకూడదు".** మరో సందర్భంలో ఆయనిలా అన్నారు : **జాతి కోసం ఏర్పరచిన సంస్థలు ప్రజలకు జవాబుదారీగా వుండాల్సినపుడు ఎట్టి పరిస్థితుల్లో వాటిని కదిలించకూడదు. మార్చకూడదు. ఎందుకంటే వాటిని నిర్వహించేవారు ప్రజల విశ్వాసం కోసం పనిచేస్తున్నారని చెప్పడం అభినందనీయమే. కానీ అది జాతి వ్యతిరేకం. కానీ మన పూజారులు, లాయర్లు, గత తరం వారు ఈ భూమిపై మహోన్నతులని, కనుక వారి చట్టాలను శిరసావహించాలనే సిద్ధాంతాన్ని మనపై రుద్దుతారు. వాటిని మార్చరాదంటారు. అదే విధంగా మనమూ చట్టాలను చేసి తరువాతి తరం వారిపై రుద్దుతాము. వాటిని వారు మార్చవీల్లేదంటాం. దీనర్థం ఏమంటే ఈ భూమి చనిపోయిన వారికే చెందినది కాని, బతికున్నవారికి చెందినది కాదని"** జెఫర్సన్ చెప్పింది పాక్షిక సత్యం కాదు. సంపూర్ణ సత్యమని నేనంటాను. నిస్సందేహంగా, ఈ సూత్రాన్నుంచి మన రాజ్యాంగ సభ వైదొలిగితే నిందకే కాదు, ఖండనకు అర్హమౌతుంది. అయితే మనం ఈ సూత్రాన్నుంచి వైదొలగలేదు. ఇందుకోసం మనం రాజ్యాంగ సవరణ నిమిత్తం చేసిన ఆర్టికల్‌ను చూడాలి. కెనడా తరహాలో ఈ రాజ్యాంగమే అంతిమం. కచ్చితం అనే ముద్ర వేయకుండా సంయమనం పాటిస్తూ, అమెరికా, ఆస్ట్రేలియాల తరహాలో అసాధారణ విషయాలు, పరిస్థితులు నిర్వహించేందుకు సవరణ వీలు కల్పించే విధంగా అవకాశం ఇస్తూ, రాజ్యాంగాన్ని సవరించేందుకు సుగమమైన పద్ధతి ఏర్పరచాం.

ప్రపంచంలో ఎక్కడైనా మన రాజ్యాంగ సభ ఏర్పరచిన

విధంగా సులభతరమైన రాజ్యాంగ సవరణ విధానం వుందేమో చూపాలని నేను విమర్శకులకు సవాలు విసురుతున్నాను. రాజ్యాంగంలోని ఒక అంశాన్ని నేను ప్రస్తావించదలచుకున్నా. కేంద్రీకృత రాజ్యంగా తీర్చిదిద్దామని, రాష్ట్రాలను మునిసిపాలిటీల స్థాయికి దిగజార్చామని తీవ్రమైన ఫిర్యాదు చేశారు. ఈ విమర్శ సరైనది కాదు. ఇది వాస్తవాన్ని వక్రీకరించడమే. రాజ్యాంగం ఏం ఆశిస్తుందో తెలుసుకోవడంలో విఫలం చెందడమే. కేంద్ర, రాష్ట్ర సంబంధాలు ఏ ప్రాథమిక సూత్రంపై ఆధారపడి ఏర్పడతాయో అర్థం చేసుకోగలగాలి. సమాఖ్య సిద్ధాంతం ప్రాథమిక సూత్రమేమంటే, చట్టసభలు - అధికార వ్యవస్థలు కేంద్ర, రాష్ట్రాల మధ్య కేవలం చట్టాల ద్వారా విభజించబడవు. అవి రాజ్యాంగాన్ని బట్టి తమ వ్యవస్థల అధికారాన్ని పంచుకుంటాయి. రాజ్యాంగం చేసిందదే. మన రాజ్యాంగం ప్రకారం ఏ రాష్ట్రమూ తన చట్టసభల, అధికార వ్యవస్థల కోసం కేంద్రంపై ఆధార పడదు. ఈ వ్యవహారంలో కేంద్రమూ, రాష్ట్రాలూ సమానంగానే వుంటాయి. ఇటువంటి రాజ్యాంగాన్ని కేంద్రీకృత వ్యవస్థ ప్రోత్సహించలేదని ఎలా అనగలరు ? అయితే రాజ్యాంగం కేంద్రానికి అత్యధికంగా చట్టసభలు, అధికార వ్యవస్థల పని తీరుకు ఆస్కారమిచ్చిందని, ఇది ఇతర సమాఖ్య రాజ్యాంగాలు ఇచ్చిన అధికారాలకంటే అధికమని అనిపించవచ్చు. అవశేష అధికారాలు (రెసిడ్యుయరీ పవర్స్) కేంద్రానికే ఇచ్చారని, రాష్ట్రాలకు ఇవ్వలేదని అనిపించవచ్చు. అయితే సమాఖ్య స్వభావసారం ఇది కాదు. సమాఖ్య స్వభావసారంలో ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఇంతకుముందు నేను చెప్పినట్లు కేంద్రమూ, రాజ్యాంగ విభాగాలలో చట్టసభల, అధికార వ్యవస్థల విభజన. ఈ సూత్రం మన రాజ్యాంగంలో పొందు పరచబడింది. ఇందులో ఏ సందేహమూ లేదు. అందువల్ల కేంద్ర పెత్తనంలో రాష్ట్రాలు వున్నాయన్నది అపోహ మాత్రమే. ఈ విభజన రేఖను కేంద్రం అతిక్రమించలేదు. అదే విధంగా న్యాయ వ్యవస్థ కూడా. ఎందుకంటే ఈ విధంగా ఒక మంచి వాక్యముంది - అదేమంటే

> **"కోర్టులు మార్చగలవు. కాని, అవి ప్రత్యామ్నాయం కాలేవు. అవి ఇంతకు ముందటి వ్యాఖ్యానాలను తిరగ రాయగలవు. కొత్త చర్చ చేయగలవు. నూతన దృక్పథాలను ప్రవేశపెట్టగలవు. చిన్న కేసులను వేరు చేయగల గీతలను మార్చగలవు. అయితే దాటి పోలేని అడ్డుగోడలు కోర్టులకూ వున్నాయి. ప్రత్యేకించి ఇవ్వబడ్డ అధికారాలను తిరిగి అటూ ఇటూ కేటాయించి మార్చేందుకు వాటికి వీలుండదు. ఒకరికి సంపూర్తిగా కేటాయించిన అధికారాలను మరొకరికి కోర్టులు బదలాయించలేవు".**

సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రీకృత రాజ్య వ్యవస్థ అన్న మొదటి చర్చ వీగిపోయింది. రాష్ట్రాలపై కేంద్ర పెత్తనం అనేది

> **'ఏ వ్యక్తీ తన గౌరవాన్ని కోల్పోయి, ఏ స్త్రీ తన శీలాన్ని కోల్పోయి. ఏ దేశమూ తన స్వాతంత్ర్యాన్ని కోల్పోయి కృతజ్ఞతలు చెల్లించకూడదు. ఈ హెచ్చరిక ఇతర దేశం కన్నా భారతదేశానికి ఎంతగానో అవసరం. ప్రపంచంలో ఏ దేశంలోనూ లేని విధంగా భారతదేశ రాజకీయాల్లో భక్తి, నాయకారాధన విపరీతంగా రాజ్యమేలుతున్నాయి. మతంలో భక్తి ఆత్మకు మోక్షం కలిగించవచ్చు. కానీ రాజకీయాల్లో భక్తి, నాయకారాధన దిగజారుడుతనానికి, నియంతృత్వానికి దారి తీస్తుంది.**

రెండో ఆరోపణ. ఈ ఆరోపణ పరిశీలించదగ్గది. కేంద్రానికి ఇటువంటి అధికారాలు ఇచ్చామని రాజ్యాంగాన్ని ఖండించే ముందు కొన్ని అంశాలను గమనంలో వుంచుకోవాలి. మొదటిది. ఈ అధికారాలు రాజ్యాంగంలో సాధారణ స్వభావంగా పొందుపర్చిన అధికారాలు కావు. ఎమర్జెన్సీ (అత్యవసర) కాలంలోనే ఉపయోగించే అధికారాలివి. ఇక గుర్తుంచుకోవాల్సిన రెండో అంశం : అత్యవసర సమయాల్లో కేంద్రానికి ఇటువంటి అధికారాలు ఉండటాన్ని మనం నివారించగలమా ? అత్యవసర సమయంలో కూడా కేంద్రానికి ఇటువంటి అధికారాలు వుండటం అంగీకరించని వారు ఈ విషయంలో సమస్య ప్రాతిపదిక ఏమిటో స్పష్టమైన అవగాహన కలిగి వుండాలి. ఈ సమస్య గురించి 1935 డిసెంబరు "రౌండ్ టేబుల్" పత్రికలో ఒక రచయిత ఇలా స్పష్టంగా వివరించారు.

> **"హక్కులు, అధికారాల సమ్మిళితంగా రాజకీయ వ్యవస్థలుంటాయి. ఇక్కడ ప్రశ్నేమంటే ఎవరి హక్కులు, అధికారాలు, అవి ఎంత వరకూ, ఏ స్థాయి వరకూ.. పౌరుడు విధేయంగా రుణపడి వుండవల్సిందేనా ? సాధారణ పరిస్థితులలో ప్రశ్న తలెత్తదు. ఒక వ్యక్తి ఒక చోట ఒక అధికా రానికి లొంగి, మరోచోట నియమిత పద్ధతుల్లో మరో అధికారం వద్ద తన పని తాను చేసుకుంటూ వుంటాడు. సంక్షోభ సమ యంలో, ఎవరి అధికారం కోసం వారి హక్కుల సంఘర్షణ తలె త్తవచ్చు. అప్పుడు నిజమైన (అంతిమ) విధేయతను విభజించలే మని స్పష్టంగా తెలుస్తుంది. చట్టాలను న్యాయపరంగా వ్యాఖ్యానించి, విధేయత సమస్యను నిర్ధారించి నిర్ణయించలేం. వాస్తవాలకు పరిమితమై చట్టం వ్యవహరించాలి. లేకపోతే చట్టం భ్రష్టుపడుతుంది. లాంఛనాలన్ని తొలగించి వేస్తే చివరకు మిగిలే ప్రశ్నేమిటంటే, పౌరుని అవశేష విధేయతను శాసించే అధికారమేమిటని ? కేంద్రమా ? లేక అందులో భాగమైన రాష్ట్రమా ?"**

అసలు సమస్యకు ఆయువు పట్టేమిటన్న ప్రశ్నకు మనమిచ్చే సమాధానమే ఈ సమస్యకు పరిష్కారం. అత్యవసర సమయంలో పౌరుని అవశేష విధేయత కేంద్రంపట్టే వుండాలని, రాష్ట్రాల పట్ల కాదని అత్యధిక ప్రజల అభిప్రాయంగా వుంటుంద నటంలో ఎటువంటి సందేహమూ లేదు. ఎందుకంటే ఏకీకృత లక్ష్యంతో దేశ ఆసక్తుల కోసం పనిచేయగలిగేది కేంద్రమే కాబట్టి. అందువల్లే అత్యవసర సమయాల్లో కేంద్రానికి కొన్ని విశేష అధికారాలు ఇవ్వడంలో అర్థముంది. ఈ అత్యవసర సమయ అధికారాలు రాష్ట్రాలపై విధించే బాధ్యత ఏమిటి ? వారి రాష్ట్ర ప్రాంతీయ ఆసక్తులను పరిగణనలోకి తీసుకుంటూనే, మొత్తంగా జాతి అభిప్రాయాలనూ, ఆసక్తులనూ పరిగణించాల్సి వస్తుంది. అంతకంటే మరేం వుండబోదు. ఈ సమస్యను అర్థం చేసుకోలేని వారే ఆరోపణలు చేస్తారు. నా మస్తిష్కం ఈ దేశ భవిష్యత్తు గురించి ఆలోచిస్తోంది. అందువల్ల నా భావాలను వెలిబుచ్చేందుకు నేను ఈ అవకాశాన్ని వినియోగించుకుంటున్నాను. 1950 జనవరి 26వ తేదీ నుంచి భారతదేశం స్వతంత్ర దేశం కాబోతోంది.(కరతాళ ధ్వనులు) ఈ దేశ స్వాతంత్ర్యం భవిష్యత్ లో ఎలా వుండబోతుంది? ఏం కాబోతుంది? స్వతంత్రాన్ని ఈ దేశం నిలబెట్టుకోగలుగుతుందా? లేక తిరిగి స్వతంత్రం కోల్పోతుందా ? నా మదిలో మెదిలిన తొలి ప్రశ్న ఇదే. మన దేశం ఇంతకుముందు స్వతంత్ర దేశం కాదని కాదు. ఒకప్పుడు వున్న స్వాతంత్ర్యాన్ని మన దేశం కోల్పోయింది. రెండోసారి కూడా ఈ దేశం స్వతంత్రాన్ని కోల్పోతుందా ? ఈ ప్రశ్నే నన్ను భవిష్యత్తు పట్ల ఆలోచింపజేసేట్లు చేసింది. గతంలో దేశం స్వాతంత్రం కోల్పోయిందన్న వాస్తవమే కాక ఆ స్వాతంత్రం కొందరు వ్యక్తుల శీలం లేని వ్యక్తిత్వం, ద్రోహాల కారణంగా జరిగిందన్న వాస్తవం నన్ను చలింపజేస్తోంది.

మహ్మద్ బిన్ ఖాసిం సింధులపై దండయాత్ర చేసినపుడు దహర్ రాజు సేనాధిపతులు ఖాసిం ప్రతినిధులిచ్చిన లంచాలు మరిగి రాజుకు ద్రోహం చేశారు. జయచంద్రుడు మహ్మద్ ఘోరీ ని స్వయంగా ఆహ్వానించి పృధ్వీరాజును ఓడించేందుకు తానూ, సోలంకి రాజులు సహాయపడుతామని వాగ్దానం చేశాడు. హిందువుల కోసం శివాజీ పోరాడుతున్న సమయంలో ఇతర మరాఠా రాజులు మొగల్ చక్రవర్తుల సరసన చేరారు. బ్రిటీషు వారు సిక్కులపై దండెత్తినప్పుడు వారి సేనాధిపతి గులాబ్‌చంద్ ఉలుకూ పలుకూ లేకుండా చూస్తూ వుండి పోయాడు. 1857లో దేశంలో బ్రిటీషు వ్యతిరేక స్వతంత్ర సమరం మొదలైనప్పుడు సిక్కులు మౌన ప్రేక్షకులుగా చూస్తూ నిలబడ్డారు. చరిత్ర మరలా దానంతటదే పునరావృతం అవుతుందా ? ఈ ఆలోచన నన్ను ఉద్విగ్నుణ్ణి చేస్తోంది. మన పురాతన కులాలూ, వర్గాలు వంటి శత్రువులతోపాటు ఇప్పుడు భిన్న, వ్యతిరేక రాజకీయ ఆసక్తులు కలిగిన రాజకీయ పార్టీలు తోడవడంతో, ఆ వాస్తవ పరిస్థితులను గమనించి నాలో ఉద్విగ్నత మరింత బలపడుతోంది.

**భారతీయుడు తన దేశం కంటే కులాన్ని అధికంగా గౌరవిస్తాడా ? లేక కులం కంటే దేశాన్ని అధికంగా గౌరవిస్తాడా ? ఏమో నాకు తెలియదు. కానీ, రాజకీయ పార్టీలు దేశం కంటే తమ కులాన్నే అధికంగా గౌరవిస్తే, మన దేశ స్వాతంత్రం చిక్కుల్లో పడి, రెండోసారి, బహుశా ఎప్పటికీ తన స్వాతంత్ర్యాన్ని కోల్పోవడం మాత్రం ఖాయం. ఈ పరిస్థితి రాకుండా మనం నిరంతరం జాగరూకతతో వ్యవహరించాలి. చివరి రక్తపుబొట్టు ధారపోసైనా సరే మనం మన స్వాతంత్రాన్ని పరిరక్షించుకోవాలి**

భారతీయుడు తన దేశంకంటే కులాన్ని అధికంగా గౌరవిస్తాడా ? లేక కులం కంటే దేశాన్ని అధికంగా గౌరవిస్తాడా ? ఏమో నాకు తెలియదు. కానీ, రాజకీయ పార్టీలు దేశంకంటే తమ కులాన్నే అధికంగా గౌరవిస్తే, మన దేశ స్వాతంత్రం చిక్కుల్లో పడి, రెండోసారి, బహుశా ఎప్పటికీ తన స్వాతంత్ర్యాన్ని కోల్పోవడం మాత్రం ఖాయం. ఈ పరిస్థితి రాకుండా మనం నిరంతరం జాగరూకతతో వ్యవహరించాలి. చివరి రక్తపు బొట్టు ధారపోసైనా సరే మనం మన స్వాతంత్రాన్ని పరిరక్షించుకోవాలి.

1950 జనవరి 26 నుంచి ఇండియా ప్రజాస్వామ్య దేశం అవుతోందంటే ఈ దేశంలో ప్రజల చేత, ప్రజల వలన, ప్రజల కొరకు ప్రభుత్వం ఏర్పడబోతోందని అర్థం. ఈ ఆలోచనే మరలా నా మస్తిష్కంలోకి వస్తోంది. ఈ దేశ ప్రజాస్వామ్య రాజ్యాంగానికి ఏం కాబోతోంది ? ఈ రాజ్యాంగాన్ని దేశం నిలబెట్టుకుంటుందా లేక కోల్పోతుందా ? ఇది నాకు వెనువెంబడి వచ్చిన రెండో ఆలోచన. ఈ ఆలోచన మొదటి ఆలోచన వలే నన్ను ఉద్విగ్నభరితుణ్ణి చేస్తోంది. భారతదేశానికి ప్రజాస్వామ్యం గురించి ఇంతకుముందు చరిత్రలో తెలియదని కాదు. ఒకప్పుడు మన దేశం నిండా గణతంత్ర రాజ్యాలుండేవి. ఏకచ్ఛత్రాధిపత్య రాజ్యాలు ఉన్నప్పటికీ అవి కూడా ఎన్నికలతోనో లేదా అతి కొద్దిగానో వున్న రాజ్యాలు. అవి పరిపూర్ణమైన రాజ్యాలు కావు, పార్లమెంట్ గురించి పార్లమెంటరీ సంప్రదాయాల గురించి చరిత్రలో ఈ దేశానికి తెలియదని కాదు.

బౌద్ధ బిక్కు సంఘాల అధ్యయనాలు తెలిపేదేమంటే దేశ చరిత్రలో కేవలం పార్లమెంటే కాదు (నిజానికి బౌద్ధ సంఘాలే వాటంతటకవి పార్లమెంట్లు), నేడు ఆధునిక కాలంలో అనుసరిస్తున్న పార్లమెంటరీ సంప్రదాయ పద్ధతులన్ని ఆ నాడు వుండేవి. సీటింగ్ అరేంజ్‌మెంట్, మోషన్స్, రిజల్యూషన్స్, కోరం, విప్, బాలట్ ఓటింగ్, సెన్సూర్ మోషన్, రెగ్యులరైజేషన్, రెస్ జుడికటా, ఓట్ కౌంటింగ్.. వంటి నేటి పార్లమెంటరీ పద్ధతులను ఆనాడు బౌద్ధ సంఘాలు పాటించి చూపాయి. ఈ పార్లమెంటరీ పద్ధతులన్నింటినీ బుద్ధుడే తన భిక్కు సంఘాలలో ప్రవేశపెట్టాడు.

ఆనాడు దేశంలో వున్న గణతంత్రాల అసెంబ్లీల నుంచి ఆయన ఈ పార్లమెంటరీ పద్ధతుల సూత్రాలను అరువు తెచ్చుకున్నాడు. ఇటువంటి గొప్ప ప్రజాస్వామ్య వ్యవస్థను భారతదేశం కోల్పోయింది. మరలా రెండోసారి కోల్పోతుందా? ఏమో ? మన దేశంలో ప్రజాస్వామ్యం చాలాకాలం నుంచి లేకపోవడం వల్ల ప్రజాస్వామ్య భావన కొత్తగా వచ్చినట్లు భావించి, మన దేశంలాంటి దేశంలో ఈ ప్రజాస్వామ్యం నియంతృత్వంగా మారే ప్రమాదం వుంది. కొత్తగా జన్మించిన ఈ ప్రజాస్వామ్య శిశువు తన రూపాన్ని కోల్పోయి నియంతృత్వానికి చోటిచ్చే పరిస్థితి వుంది. ఏ మాత్రం పొరపాటు జరిగినా నియంతృత్వం వచ్చే ప్రమాదమే అత్యధికంగా కనబడుతోంది. ప్రజాస్వామ్యం కేవలం ఒక రూపంగానే కాక ఒక వాస్తవంగా వుండాలంటే మనం ఏం చేయాలి ?

మొదటగా, మన సాంఘిక, ఆర్థిక లక్ష్యాలు సాధించాలంటే మనం రాజ్యాంగబద్ధ పద్ధతులకు కట్టుబడి వుండాలన్నది నా తీర్పు. రక్తపాత విప్లవ పద్ధతులను మనం వదులుకోవాలి. పౌర సహాయ నిరాకరణ, సత్యాగ్రహ పద్ధతులను వదిలేయాలి. అయితే, సాంఘిక ఆర్థిక లక్ష్యాలను చేరుకునేందుకు రాజ్యాంగ బద్ధ పద్ధతులు అందుబాటులో లేకపోతే రాజ్యాంగేతర పద్ధతులకు సర్వత్రా మద్దతు లభిస్తుంది. నిజానికి రాజ్యాంగ బద్ధ పద్ధతులు అందుబాటులో వున్నట్లయితే రాజ్యాంగేతర పద్ధతులకు మద్దతు లభించదు. రాజ్యాంగేతర పద్ధతులను మనం 'అరాచక వ్యాకరణం' (Grammer of anarchy)గా భావించాలి. వీటిని త్వరగా వదిలించుకోవాలి. అప్పుడే మనకు క్షేమం.

మనం పాటించాల్సిన రెండో అంశం జాన్ స్టువర్ట్ మిల్ చేసిన హెచ్చరిక. **ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన వారు ఆయన చెప్పినట్లు "తమ స్వాతంత్ర్యాన్ని ఎటువంటి గొప్ప వ్యక్తి పాదాల వద్ద వుంచకూడదు. అదే విధంగా నమ్మకూడదు. అధికారం ఇవ్వకూడదు. అందువల్ల ఆ వ్యక్తి సంస్థలను/ వ్యవస్థలను మార్చివేసే అవకాశముంది".** దేశానికి జీవితాంతం సేవ చేసిన గొప్ప వ్యక్తికి కృతజ్ఞతలు చెల్లించడంలో తప్పులేదు. కృతజ్ఞతాస్తుతికి కూడా ఒక స్థాయి వరకూ మాత్రమే. డేనియల్ ఓ కన్నెల్ చెప్పినట్లు **"ఏ వ్యక్తీ తన గౌరవాన్ని కోల్పోయి, ఏ స్త్రీ తన శీలాన్ని కోల్పోయి, ఏ దేశమూ తన స్వాతంత్రాన్ని కోల్పోయి కృతజ్ఞతలు చెల్లించకూడదు".** ఈ హెచ్చరిక ఏ ఇతర దేశం కన్నా భారతదేశం వంటి దేశానికి ఎంతగానో అవసరం,

**ప్రపంచంలో ఏ దేశంలోనూ లేని విధంగా భారతదేశ రాజకీయాల్లో భక్తి, నాయకారాధన విపరీతంగా రాజ్యమేలు తున్నాయి. మతంలో భక్తి ఆత్మకు మోక్షం కలిగించవచ్చు. కాని రాజకీయాల్లో భక్తి, నాయకారాధన దిగజారుదుతనానికి, నియంతృత్వానికి దారితీస్తుంది. కేవలం రాజకీయ ప్రజాస్వామ్యం తోనే సంతృప్తి చెందరాదు అన్నది మూడో అంశం. మన**

**మన సమాజంలో సమానత్వం లేదు. భారత సాంఘిక రంగంలో నిచ్చెన మెట్ల అసమానత్వ వ్యవస్థ వుంది. ఇందువల్ల కొందరు అధికులుగా, మిగిలిన వారు అల్పులుగా గుర్తించబడుతున్నారు. ఆర్థికరంగంలో అనంతైశ్వర్యాలతో కొందరు తులతూగుతుంటే బహుజనులు పేదరికంలో మగ్గిపోతున్నారు. 1950 జనవరి 26 నుంచీ మనం వైరుధ్యాల జీవితంలోకి అడుగిడుతున్నాం. రాజకీయాల్లో సమానత్వం వుంటుంది కానీ సాంఘిక ఆర్థిక రంగాలలో అసమానత్వం వుంటుంది.**

**రాజకీయ ప్రజాస్వామ్యాన్ని మనం సామాజిక ప్రజాస్వామ్యంగా పరివర్తన చెందించుకోగలగాలి. సామాజిక ప్రజాస్వామ్య పునాది లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం మనజాలదు.**

సామాజిక ప్రజాస్వామ్యమంటే ఏమిటి? జీవితాదర్శాలుగా స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను గుర్తించి జీవన విధానంగా మార్చుకునేదే సామాజిక ప్రజాస్వామ్యం. ఈ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం సూత్రాలు మూడూ విడదీయరాని అంశాలు. ఈ 'త్రిత్వ' అంశాలు ఒక దానితో ఒకటి పెనవేసుకున్నవి. వాటిని ఒక దానితో ఒకటి విడదీస్తే ప్రజాస్వామ్యం ఓడిపోతుంది. స్వేచ్ఛను సమానత్వం నుంచి, సమానత్వాన్ని సౌభ్రాతృత్వం నుంచి, అదేవిధంగా స్వేచ్ఛా సమానత్వాలను సౌభ్రాతృత్వం నుంచి విడదీయకూడదు. సమానత్వం లేని స్వేచ్ఛ బహుజనంపై అల్పజనుల ఆధిక్యతను స్థిరీకరిస్తుంది. సౌభ్రాతృత్వం లేని స్వేచ్ఛ, సమానత్వాలు తమ సహజ గుణాలు కోల్పోతాయి. అప్పుడు వాటిని అమలు చేసేందుకు ఒక పోలీస్ కానిస్టేబుల్ అవసరమవుతాడు.

భారత సమాజంలో రెండు అంశాలు పూర్తిగా లేవని మనం ముందుగా గుర్తించాలి. మొదటిది, మన సమాజంలో సమానత్వం లేదు. భారత సాంఘిక రంగంలో నిచ్చెన మెట్ల అసమానత్వ వ్యవస్థ వుంది. ఇందువల్ల కొందరు అధికులుగా, మిగిలిన వారు అల్పులుగా గుర్తించబడుతున్నారు. ఆర్థిక రంగంలో అనంతైశ్వర్యాలతో కొందరు తులతూగుతుంటే బహుజనులు పేదరికంలో మగ్గిపోతున్నారు. 1950 జనవరి 26 నుంచి మనం వైరుధ్యాల జీవితంలోకి అడుగిడుతున్నాం. రాజకీయాల్లో సమానత్వం వుంటుంది. కాని సాంఘిక, ఆర్థిక రంగాలలో అసమానత్వం వుంటుంది.

రాజకీయాల్లో ఒక మనిషికి ఒక ఓటు. ఒక ఓటుకు ఒక విలువ అనే సూత్రాన్ని గుర్తిస్తున్నాం. కాని, మన సాంఘిక, ఆర్థిక నిర్మాణ రీత్యా మన సాంఘిక, ఆర్థిక జీవితంలో ఒక మనిషికి

ఒక విలువ అనే సూత్రాన్ని మనం నిరాకరిస్తూనే వుంటాం. ఈ వైరుధ్యాల జీవిత జీవనాన్ని మనం ఎంతకాలం కొనసాగిస్తాం? సాంఘిక ఆర్థిక జీవితంలో అసమానత్వాన్ని ఇంకా ఎంతకాలం మనం కొనసాగిస్తాం ? ఇలాంటి అసమానతలు కొనసాగడం ద్వారా మన రాజకీయ ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టివేస్తాం. సాధ్యమైనంత త్వరగా అసమానతల వైరుధ్యాన్ని పోగొట్టాలి. లేకుంటే ఎంతో కష్టపడి ఈ సభ రూపకల్పన చేసిన ప్రజాస్వామ్యం తెలిపోతుంది.

సౌభ్రాతృత్వ సూత్రాన్ని గుర్తించాలన్న అవసరాన్ని మనం గుర్తిస్తున్నాం. అంటే ఏమిటి ? భారతీయులమందరమూ ఒక్కటే అన్న భావనే సాంఘిక జీవితంలో ఐక్యత, సంఘీభావాన్ని ఈ సౌభ్రాతృత్వ సూత్రం కలిగిస్తుంది. ఈ భావన కలిగించడం అత్యంత కష్టతరమైన అంశం. ఈ భావన సాధించడం ఎంత కష్టమైనదో తెలిపేందుకు యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా గురించి జేమ్స్ తన 'అమెరికన్ కామన్వెల్త్‌లో చెప్పిన కథ నుంచి మనం తెలుసుకోవచ్చు. జేమ్స్ మాటల్లోనే చెప్పాలంటే ఆ కథ ఇలా వుంది. 'కొన్నేళ్ల క్రితం అమెరికన్ ప్రొటస్టంట్ ఎపిస్కోపల్ చర్చి 300 ఏళ్ల సమావేశం జరిగింది. ప్రార్థనలో కొన్ని అంశాలను మార్చాలని ఆ సమావేశం నిర్ణయించింది. ప్రార్థనలో ఒక వాక్యం చేర్చాలని న్యూ ఇంగ్లాండుకు చెందిన ప్రసిద్ధ క్రైస్తవ మత బోధకుడు ప్రతిపాదించగా సమావేశం ఆమోదించింది.

ఆ వాక్యం "ఓ దేవుడా, మా జాతి(నేషన్)ని ఆశీర్వదించు". మరుసటిరోజు ఆ వాక్యాన్ని ప్రార్థనలో ప్రస్తావించినపుడు 'జాతి' అనే పదాన్ని భక్తులు తీవ్రంగా వ్యతిరేకించారు. అందువల్ల ఆ పదాన్ని తీసివేసి "ఓ దేవుడా, యునైటెడ్ స్టేట్స్‌ను ఆశీర్వదించు" అని ప్రార్థనా వాక్యాన్ని మార్చారు. ఆ సమయంలో అమెరికా ప్రజలు తామంతా ఒకే 'జాతి' అని అంగీకరించడానికి సిద్ధంగా లేరు. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా ప్రజలే తమను ఒక జాతిగా అంగీకరించడానికి సిద్ధంగా లేకపోతే, ఇక భారత దేశంలో ఆ పదాన్ని అంగీకరించడం ఇంకెంత కష్టమో ఒకసారి ఆలోచించండి. రాజకీయ స్పృహ కలిగిన భారతీయులు "భారత ప్రజలు" అనే పదాన్ని నిరసించి "భారత జాతి" అనే పదాన్ని కోరుకున్న విషయం నాకు తెలుసు. మనమంతా ఒకే జాతి అని భావించడం ద్వారా మనం ఒక పెద్ద భ్రమలో వున్నాం. వేల కులాలుగా విభజనకు గురైన ప్రజలు ఒకే జాతిగా ఎలా మనగలరు ? సామాజికంగా, మానసికపరంగా మనమింకా ఒకే జాతిగా మారలేదన్న వాస్తవాన్ని మనం ఎంత తొందరగా గుర్తిస్తే అంత మంచిది. అప్పుడే మనం ఒక జాతిగా రూపొందాలన్న స్పృహ కలిగి ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెడతాం. కానీ, యునైటెడ్ స్టేట్స్‌కంటే కూడా మన దేశంలో ఈ వాస్తవాన్ని గుర్తించడం చాలా కష్టం. అమెరికాలో కులం లేదు. ఇండియాలో కులాలున్నా కులాలు జాతి వ్యతిరేకం. ఎందుకంటే మొదటగా అవి సామాజిక జీవితంలో విడివిడిగా వుండేందుకు ప్రజలను ప్రోత్సహిస్తాయి. ఎందుకంటే అవి అసూయను, పరస్పర విద్వేషాన్ని కలిగిస్తాయి. మనం ఒక వాస్తవ జాతిగా, రూపొందాలంటే మనం ఈ అడ్డంకులను అధిగమించాలి. ఒక జాతి ఏర్పడినపుడే సౌభ్రాతృత్వం సాధ్యమౌతుంది. సౌభ్రాతృత్వం లేని స్వేచ్ఛ, సమానత్వం గోడకు వేసిన సున్నంలాంటివి. మన ముందు భవిష్యత్‌లో మనకెదురయ్యే సవాళ్లివి. ఈ విషయాలు చాలా మందికి రుచించకపోవచ్చు.

> **ఈ దేశంలో రాజకీయాధికారం చాలా కాలంగా అల్పజనుల గుత్తాధికారంగా వుండి, బహుజనులను బరువులు మోసే పశువుల్లా చూసింది. వారిని వధించింది. ఈ గుత్తాధిపత్యం బహుజనుల అభివృద్ధి అవకాశాలను దెబ్బ తీయటమే కాక వారి జీవితాన్ని, జీవనసారాన్ని పిండి పీల్చి పిప్పి చేసింది. ఈ పీడిత వర్గాలు పాలితులుగా వుండి అలిసిపోయారు. వారు తమను తామే పాలించుకోవాలన్న ఆతృతతో వున్నారు. పీడిత వర్గ ప్రజల్లో వస్తున్న ఈ స్వీయ స్పృహ వర్గ పోరాటం లేదా వర్గ యుద్ధానికి దారి తీయకముందే మనం మేల్కోవాలి. అటువంటి ఒక రోజు వచ్చిన నాడు మహా ప్రళయం సంభవిస్తుంది.**

అబ్రహాంలింకన్ చెప్పినట్టు చీలిపోయిన ఏ ఇల్లూ (సభ) మనజాలదు. ఎక్కువ కాలం నిలబడలేదు. అందువల్ల పీడిత వర్గ ప్రజల ఆకాంక్షలను ఎంత త్వరగా మనం గుర్తించగలిగితే ఈ దేశానికి, దేశ స్వాతంత్రానికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు అంత మంచిది. సమస్త జీవన రంగాల్లో సమానత్వం, సౌభ్రాతృత్వం సాధించినప్పుడు అది సాధ్యం. అందువల్లే నేను స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం గురించి నొక్కి చెబుతున్నా. స్వాతంత్ర్యం సంతోషకరమే. కాని, ఈ స్వాతంత్ర్యం మనపై అనేక బాధ్యతలను వుంచింది.

ఇక ఇప్పటి నుంచి జరిగే తప్పులకు మనం బ్రిటీషు వారిని బాధ్యులు చేసి నిందించలేం. ఇప్పటి నుంచి జరిగే తప్పులకు మనమే బాధ్యులం అవుతాం. తప్పు పరిస్థితులు ఏర్పడే పెద్ద ప్రమాదం పొంచి వుంది. కాలం వేగంగా మారుతోంది. మన ప్రజలు వినూత్న భావజాలాలతో కదులుతున్నారు. ప్రజల చేత ప్రభుత్వంతో ప్రజలు విసిగిపోయారు. ప్రజల కొరకు ప్రభుత్వం కావాలంటున్నారు. ప్రజల చేత, ప్రజల వలన ప్రభుత్వం అనే అంశాల గురించి వారికంత ఆసక్తిలేదు. ప్రజలు ప్రజల చేత ప్రభుత్వం బదులు ప్రజల కొరకు ప్రభుత్వం కోరుకుంటారు.

**రాజ్యాంగ ముసాయిదా ప్రతిని ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజల వలన ప్రభుత్వం అనే రాజ్యాంగంలో మనం. రాజ్యాంగాన్ని కాపాడాలంటే మన మార్గంలో ఎదురయ్యే దుష్టశక్తులను గుర్తించాలి. అలా చేయడమే దేశ సేవ. ఇంతకంటే వేరు మార్గం లేదు.** ❑

# భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్




- రాజాబాబు కంచర్ల

**మన దేశంలోని అనేక ముఖ్య ఘట్టాలలో, ఉద్యమాలలో నవభారత నిర్మాణం కోసం, ప్రజాస్వామ్యం కోసం, సామాజిక రుగ్మతలు లేని దేశం కోసం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చేసిన కృషి అనిర్వచనీయం. దేశవ్యాప్తంగా పేరొందిన ఎందరెందరో ఉద్దండులు, ప్రముఖులు ఆయన సమకాలీనులు గానూ, ప్రత్యర్థులుగాను ఉన్నారు. అంబేద్కర్ జీవితానుభవంలో గుర్తించిన సామాజిక రుగ్మతలు, జరిపిన ఉద్యమాలు, అధ్యయనం, ఆలోచనలను ప్రయోగాత్మకంగా పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భారత సమాజం గురించి ఆయన లోతుగా పరిశీలన చేసి, లేవనెత్తిన అనేక ప్రశ్నలు నేటికీ సజీవంగా ఉన్నాయి. అవి ఆయన కృషిని, ప్రాధాన్యతని నేటికీ గుర్తు చేస్తున్నాయి. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన గురించిన స్ఫూర్తిదాయక విషయాలతో ఈ ప్రత్యేక కథనం..**

భారత రాజ్యాంగ నిర్మాత, రాజనీతి కోవిదుడు, న్యాయశాస్త్ర పారంగతుడు, పరిపాలనాదక్షుడుగా అశేష ప్రజాభిమానాన్ని చూరగొన్న మహామనీషి డాక్టర్ బాబాసాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్. అంబేద్కర్ ఒక ఆశాజ్యోతి. ఒక చైతన్య కేతనం. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వాల మేలు కలయిక. మహర్ కులంలో జన్మించి, విద్యార్థి దశ నుంచే సమాజం చేత దుర్భరమైన వివక్షను, అవమానాలను ఎదుర్కొన్న అంబేద్కర్ గొప్ప మానవతావాది, సమతావాది, హేతువాది, స్వేచ్ఛావాది. చిన్నతనం నుంచే నిరుపేద దళిత వర్గాల సముద్ధరణే లక్ష్యంగా జీవించాడు. ఆయన ఏ వృత్తి చేపట్టినా తన లక్ష్యానికి మాత్రం దూరం కాలేదు. అదే సమయంలో తన రచనా వ్యాసంగాన్ని విడువలేదు. ఉన్నత విద్య అభ్యసించిన ఆయన, తన విజ్ఞానాన్ని ఆర్థిక ప్రయోజనాలకు కాక సాంఘిక సంస్కరణలకు, సమాజానికి వినియోగించిన త్యాగశీలి. మతం పేరుతో మనుషులలో అంతరాలు నిర్మించి, వాటిని తమ స్వప్రయోజనాల కోసం వ్యవస్థలుగా మార్చిన మతోన్మాదుల సిద్ధాంతాలను ఖండించారు. సర్వమానవ సమానత్వాన్ని సహేతుకంగా నిరూపించిన సమతావాది అంబేద్కర్. ఆయన శత జయంతి సందర్భంగా 1991లో భారత ప్రభుత్వం ఆయనకు 'భారతరత్న' బిరుదును ప్రదానం చేసింది.

'నేను మతానికి వ్యతిరేకిని కాదు. మతం పేరిట జరుగుతున్న




కపట నాటకానికి మాత్రమే నేను వ్యతిరేకిని' అంటారాయన. న్యాయవాదిగా ఆర్థిక, సాంఘిక, మత, రాజకీయ వ్యవస్థలను సమగ్రంగా సమీక్షించారు. పటిష్ఠ జాతీయ నిర్మాణానికి అవసరమైన సిద్ధాంతాలను రూపొందించి, వాటి సాధనకు ఉద్యమాలు నడిపిన కార్యశీలి. తాను నమ్మిన సిద్ధాంతాల కోసం గాంధీని కూడా వ్యతిరేకించి, దళిత జాతి అభ్యుదయానికి, అభ్యున్నతికి నిరంతరం శ్రమించిన మహనీయుడు. స్వేచ్ఛ, సమత, సౌభ్రాతృత్వాల పునాదులపై రాజ్యాంగాన్ని రూపొందించారు. విద్య, ఉద్యోగ రంగాలలో స్త్రీలకు సమాన అవకాశాలు, ఆస్తులలో సమాన వాటాలు ప్రతిపాదించిన మానవతావాది. 'మేకల్ని బలి ఇస్తారు కాని, సింహాల్ని బలివ్వరు. మీ హక్కులు నిలవాలంటే బలహీనత పనికిరాదు. నేటి మీ కష్టాలన్నీ పూర్వకర్మ ఫలితాలు కావు. అగ్రవర్ణాలు కుట్ర చేసి, మీపై రుద్దినట్టివి. మీ బానిసత్వాన్ని మీ స్వశక్తితోనే రూపుమాపుకోవాలి. దేవుళ్లు, తీర్థ యాత్రలు, ప్రవక్తలు, ఉపవాసాలు, మతగ్రంథాలు వంటివేవీ మిమ్మల్ని రక్షించలేవు' అని నిద్రాణమై వున్న అణగారిన తరగతుల వారి ఆలోచనల్ని మేల్కొల్పిన చైతన్యశీలి అంబేద్కర్.

### బాల్యం, చదువు..

రామ్‌జీ, భీమాబాయి దంపతుల 14 మంది సంతానంలో ఆఖరివాడు అంబేద్కర్. 1891 ఏప్రిల్ 14న మహారాష్ట్రలో ముంబయికి దగ్గరగా వుండే మోవో గ్రామంలో జన్మించాడు. అంటరానితనం తీవ్రంగా వున్న మహర్ కులంలో పుట్టాడు. ఆయన అసలు పేరు భీమారావు రాంజీ అంబావడేకర్. ఆ

పేరును అంబేద్కర్‌గా మార్చారు ఆయన టీచర్ మహదేవ్ అంబేద్కర్. చిన్నప్పటి నుంచే కులతత్వం, అంటరానితనం యొక్క క్రూరవివక్షలకు గురైన అంబేద్కర్.. తన యావత్ జీవితమూ కులతత్వపు మూసలో కరిగి, అంటరానితనపు గరళాన్ని మింగుతూ.. వాటితోనే పోరాడుతూ వచ్చారు.

పుట్టుకతో అంటరానివాడు కావడంతో స్కూల్‌లో అంబేద్కర్‌ను విడిగా కూర్చోబెట్టేవారు. సహ విద్యార్థులతో తిరగడంగానీ, ఆడుకోవడానికి నోచుకోలేదు. తన నోట్ పుస్తకాలను టీచర్లు తాకే వారు కాదు. రామ్‌జీ సతారా వదలి పిల్లల చదువు కోసం ముంబయి చేరాడు. ఎల్‌ఫిన్‌స్టన్ హైస్కూల్‌లో చేరిన అంబేద్కర్ 1907లో మెట్రిక్యులేషన్ పాసయ్యాడు. ఆయన కుటుంబం దానిని కనీవినీ ఎరుగని అద్భుత సంఘటనగా భావించింది. సంస్కృతం చదువుకోవాలని ఆశించిన అంబేద్కర్‌కు కులం అడ్డొచ్చింది. ఇష్టం లేకున్నా పర్షియన్ భాష చదివాడు. 14వ ఏటనే తొమ్మిదేళ్ల రమాబాయితో పెళ్లి జరిగింది. రమాబాయి అనారోగ్యంతో 1935లో మరణించారు. ఆ తర్వాత తన 56వ ఏట ఒక బ్రాహ్మణ కుటుంబానికి చెందిన శారదా కబీర్‌ను వివాహం చేసుకున్నారు.

బరోడా మహారాజు శాయాజీరావ్ గైక్వాడ్ ఇచ్చిన 25 రూపాయల విద్యార్థి వేతనంతో 1912లో బి.ఎ. పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. పట్టభద్రుడైన తర్వాత బరోడా సంస్థానంలో ఉద్యోగం లభించింది. కానీ ఉన్నత విద్య అభ్యసించాలన్న పట్టుదల వల్ల ఉద్యోగంలో చేరలేదు. మహారాజుకు తన కోరికను తెలిపారు. విదేశంలో చదువు పూర్తి చేసిన తరువాత బరోడా సంస్థానంలో పదేళ్లు పనిచేసే షరతుపై 1913లో రాజాగారి ఆర్థిక సహాయం అందుకొని, కొలంబియా విశ్వ విద్యాలయం చేరాడు. 1915లో ఎం.ఏ., 1917లో పి.హెచ్.డి. డిగ్రీలను సంపాదించారు. ఆనాటి సిద్ధాంత వ్యాసమే పదేళ్ల తర్వాత 'ది ఎవల్యూషన్ ఆఫ్ ప్రొవిన్షియల్ ఫైనాన్సస్ ఇన్ ఇండియా' పేరుతో ప్రచురించబడింది. 1917లో డాక్టర్ అంబేద్కర్‌గా స్వదేశం తిరిగి వచ్చారు. అప్పటికతని వయస్సు 27 ఏళ్లు. అస్పృశ్యుడొకడు అంతగొప్ప పేరు సంపాదించుకోవటం నాటి అగ్రవర్ణాల వారికి ఆశ్చర్యం కల్గించింది. వచ్చాక మహారాజా గారి మిలిటరీ కార్యదర్శి అయ్యాడు. కానీ ఆఫీసులో నౌకర్లు కూడా ఆయన బల్లపై కాగితాలను ఎత్తివేసేవారు ! బలహీన వర్గాలలో చైతన్యాన్ని రగిలించి, వారికి నాయకత్వం వహించి, అంబేద్కర్ తన మహా ప్రస్థానానికి శ్రీకారం చుట్టారు. దళిత జనాభ్యున్నతి కోసం ఆయన సాగించిన అవిశ్రాంత పోరాటానికి వెన్నుదన్నుగా భారత చరిత్ర, శ్రుతి స్మృతి పురాణాది సమస్త ప్రాచీన వాఙ్మయాన్ని, అందుకు సంబంధించిన ఆధార గ్రంథాల్ని క్షుణ్ణంగా ఆకళింపు చేసుకున్నారు. ఆయనొక నడుస్తున్న విజ్ఞాన సర్వస్వం. తాను చేపట్టిన మహత్తర సంస్కరణోద్యమాన్ని శక్తిమంతంగా నడిపించారు. నిరంతరం అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారు. అంబేద్కర్‌కన్నా గాంధీజీ దాదాపు 22 ఏళ్లు పెద్ద అయినప్పటికీ, వీరిద్దరూ దాదాపు ఒకే సమయంలో అంటే, 1917 ప్రాంతంలో భారత రాజకీయ రంగం మీదకి వచ్చారు.

## తెలియని నిజాలు..



- విదేశాల్లో ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీ పొందిన తొలి భారతీయుడు అంబేద్కర్.
- మధ్యప్రదేశ్, బీహార్ అభివృద్ధి కోసం ఈ రాష్ట్రాలను విభజించాలని 50వ దశకంలోనే చెప్పారు.
- అంబేద్కర్ వ్యక్తిగత గ్రంథాలయం పేరు 'రాజ్‌గిర్'. అందులో 50 వేలకు పైగా పుస్తకాలు ఉంటాయి. అది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రైవేట్ లైబ్రరీగా గుర్తింపు తెచ్చుకుంది.
- 2004లో కొలంబియా యూనివర్సిటీ తయారు చేసిన ప్రపంచంలో టాప్-100 స్కాలర్స్ జాబితాలో మొదటి పేరు డా. భీమ్‌రావ్ రామ్‌జీ అంబేద్కర్‌ది! ఆయన రాసిన 'వెయిటింగ్ ఫర్ ఎ వీసా' పుస్తకం.. కొలంబియా వర్సిటీలో ఓ టెక్స్ట్ బుక్.
- అంబేద్కర్‌కు 64 సబ్జెక్టలలో మాస్టర్స్ డిగ్రీ ఉంది. హిందీ, పాలీ, సంస్కృతం, ఇంగ్లీష్, ఫ్రెంచ్, జర్మన్, మరాఠీ, పర్షియన్, గుజరాతీ వంటి భాషలు ఆయనకు తెలుసు. వీటితోపాటు దాదాపు 21 ఏళ్లపాటు.. ప్రపంచంలోని అన్ని మతాల గురించి చదివారు.
- లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ఎనిమిదేళ్ల కోర్సును కేవలం రెండేళ్ల, మూడు నెలల్లో పూర్తి చేశారు. ఇందుకోసం ఆయన రోజుకు 21 గంటలు చదివేవారు.
- అంబేద్కర్ తన జీవిత కాలంలో 527 ప్రసంగాలు చేశారు.
- అంబేద్కర్ తనతోపాటు 8,50,000 మంది అనుచరులతో బౌద్ధమతంలోకి మారారు. ప్రపంచంలోనే అతిపెద్ద మతమార్పిడి ఇదే.
- లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి 'డాక్టర్ ఆఫ్ ఆల్ సైన్సెస్' పీహెచ్‌డీ పొందిన తొలి, ఏకైక వ్యక్తి అంబేద్కర్.
- అంబేద్కర్ తొలి విగ్రహాన్ని 1950లో కొల్హాపూర్‌లో నిర్మించారు. అప్పటికి ఆయన జీవించే ఉన్నారు.

## కులవివక్ష..

మహారాష్ట్రలో ఛాందస బ్రాహ్మణత్వం ఏలుబడి చేసే రోజులలో కుల పీడన అతిక్రూరంగా సాగింది. అస్పృశ్యులు అత్యంత అవమానకరమైన, అమానుషమైన పీడనకు గురయ్యారు. వారు తమ మెడలకు మట్టి ముంతలను కట్టుకుని, తమ వెనుక భాగాన చీపురు కట్టుకుని అగ్రవర్ణాల వారికి దూరంగా నడవాలి. అగ్రవర్ణాల వారు నడిచి వెళ్లే వీధులలో అంటరానివారి ఉమ్ములతో, పాదముద్రలతో కలుషితం కాకుండా ఇటువంటి నిర్బంధాలను ప్రయోగించేవారు. అందరూ నీళ్లు తోడుకునే బావులు, చెరువులలో వీళ్లు నీళ్లు ముట్టుకోకూడదు. దళితులు తోడితే నీరు మైలపడిపోతుంది. దేవాలయాల్లోని దేవుడ్ని చూడకూడదు. చూస్తే దేవుడు కూడా మైలపడిపోతాడు. చదువుకోకూడదు, ఆస్తులు సంపాదించుకోకూడదు. మంచి బట్టలు కట్టుకోకూడదు. చెప్పులు వేసుకోకూడదు. విలువైన ఆభరణాలు ధరించకూడదు. ఊరికి దూరంగా మురికి కూపంలో పూరిపాకల్లో నివసించాలి. ఇది హిందూమతం దళితుల పట్ల వ్యవహరించిన వర్ణాశ్రమ ధర్మం తీరు. ఇది మనుధర్మం కల్పించిన దుర్గతి. అగ్రవర్ణాలు అనుసరించిన దుర్నీతి. అగ్రవర్ణాల వారు నడిపే ఏ పత్రికలోనూ ఈ వార్తలు కనిపించేవి కావు. దీనిపై అంబేద్కర్ తీవ్రంగా స్పందించారు. దేశంలో దళితుల పట్ల జరుగుతున్న ఈ దుర్గతిని, దుర్నీతిని తన పత్రికల్లో చీల్చి చెండాడారు. 1927లో అంబేద్కర్ 'బహిష్కృత భారతి' అనే మరాఠి పక్ష పత్రిక ప్రారంభించాడు. ఆ పత్రికలో రాసిన ఒక వ్యాసంలో "తిలక్ గనుక అంటరానివాడుగా పుట్టి వుంటే– 'స్వరాజ్యం నా జన్మ హక్కు' అని ఉండడు. 'అస్పృశ్యతా నివారణే నా ధ్యేయం, నా జన్మ హక్కు' అని ప్రకటించి ఉండేవాడ"ని రాశారు. అంటే ఆనాడు అంబేద్కర్ కులతత్వాన్ని ఎంతగా అనుభవించారో అర్థమౌతుంది. 'కులాన్ని నిర్మూలించండి. దానివలన ఎటువంటి ప్రయోజనమూ లేదు. మన బానిసత్వానికి కారణం అదే. కులంతో ఒక జాతినీ నిర్మించలేము, ఒక నీతినీ నిర్మించలేము' అని ఎలుగెత్తి చాటినవాడు అంబేద్కర్.

## పీడితుల పక్షాన పాత్రికేయం..

వందేళ్ల కిందట మన దేశ పత్రికా రంగం ఎట్లా కులాధిపత్యంతో సామాజిక ఉద్యమాలను, బహుజన నాయకులను తొక్కి పెట్టిందో.. ఇవాళ దేశంలోని మీడియా.. ఆ పద్ధతినే మరింత పదునుబెట్టి ఆచరిస్తోంది. పీడితుల పక్షాన నిలబడినట్లు నటిస్తూనే మనువాద భావజాలాన్ని ప్రదర్శిస్తోంది. కింది కులాల వారికి జరగాల్సినంత మేలు జరగకుండా ఈ మీడియా ప్రతిబంధకంగా మారింది. తమ వర్గాల వారు బాగుపడాలంటే వారి సమస్యలను లేవనెత్తి, పరిష్కారం కోసం

### అభ్యసించిన డిగ్రీలు



- బిఎ (బాంబే విశ్వ విద్యాలయం, 1912)
- ఎంఎ (కొలంబియా విశ్వ విద్యాలయం, 1915)
- ఎమ్మెస్సీ (లండన్ స్కూల్ ఆఫ్ ఏకనామిక్స్, 1921)
- పిహెచ్‌డి (కొలంబియా విశ్వ విద్యాలయం, 1917)
- డీఎస్‌సి (లండన్ విశ్వవిద్యాలయం, 1923)
- బారిష్టర్ ఎట్ లా (గ్రేస్ ఇన్ లండన్, 1923)
- ఎల్ఎల్‌డి (కొలంబియా విశ్వవిద్యాలయం, 1952, గౌరవపట్టా)
- డి.లిట్ (ఉస్మానియా విశ్వవిద్యాలయం, 1953, గౌరవపట్టా)

పోరాడేలా చేసే ఒక పత్రిక అవసరమని అంబేద్కర్ భావించారు. ఆయన ఆలోచనకు కొల్హాపూర్ రాజు శాహు మహరాజ్ సహాయం అందింది. దీంతో అంబేద్కర్ ముంబయిలో 1920 జనవరి 31న 'మూక్ నాయక్' అన్న పేరుతో పత్రిక తొలి సంచికను వెలువరించారు.

మహారాష్ట్రలో అత్యంత ఆదరణ పొందిన స్కాలర్ ఆర్.జి. భండార్కర్ మనవరాలు 1927లో గులాబ్‌ఖాన్ బషీరుద్దీన్ అనే విద్యావంతుణ్ణి ప్రేమించి, పెళ్లి చేసుకున్నారు. దీంతో ముంబయిలోని అన్ని పత్రికలు ఈ వివాహాన్ని ఖండిస్తూ సంపాదకీయాలు రాయగా, అంబేద్కర్ ఒక్కరే తాను నడిపే 'బహిష్కృత్ భారత్' పత్రికలో 'వివాహం అనేది ఇద్దరు వ్యక్తుల ఇష్టానికి సంబంధించినది. దాంట్లో మూడో వ్యక్తి జోక్యం అవసరం లేదు' అని సంపాదకీయం రాశారు.

మరో సంఘటన 1927లో అంబేద్కర్ 'మహద్ చెరువు' పోరాటం. మొత్తం కొంకణ్ మహారాష్ట్రలో రెండు, మూడు నెలలు ప్రచారం చేసి, దళితులను సంఘటితం చేశారు అంబేద్కర్. మహద్ చెరువు నీళ్లు దళితులకు దక్కాలని, ఆ చెరువు దగ్గర ఒక టెంట్ వేసుకొని, నిరసన వ్యక్తం జేస్తూ అంబేద్కర్ సత్యాగ్రహం చేశారు. గాంధీ 1930లో నిర్వహించిన ఉప్పు సత్యాగ్రహం కంటే మూడేళ్ల ముందే అంబేద్కర్ 'మహద్ చెరువు' సత్యాగ్రహం నిర్వహించారు. పెరియార్ రామస్వామి నాయకర్ నడిపించిన 'రివోల్ట్', జస్టిస్ పార్టీ తరపున నడిచిన ఇంగ్లీషు పత్రిక 'జస్టిస్', తెలుగులో 'ఆంధ్రప్రకాశిక', తమిళంలో 'ద్రావిడన్' అనే పత్రికలు గాంధీ భావజాలాన్ని వ్యతిరేకించాయి.

# ఆరు ప్రముఖ రచనలు..

సమానత్వం, నిమ్న జాతుల వారి హక్కుల కోసం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆయన జీవితాంతం పోరాడారు. భారత రాజ్యాంగాన్ని రచించిన ఆయన అద్భుతమైన రచయిత కూడా. రాజకీయాలు, ఆర్థిక శాస్త్రం, మతం, కులతత్వం, వర్ణాలు, పాలన సహా అనేక అంశాలపై ఆయన పుస్తకాలు రచించారు.

- 1. ది అనిహిలేషన్ ఆఫ్ క్యాస్ట్ (The Annihilation of Caste):అంటరాని కులాలకు చెందిన ప్రజలు, మహిళలు మతం పేరుతో అణచివేతకు గురవుతున్నారంటూ హిందుత్వాన్ని ఈ పుస్తకంలో తీవ్రంగా విమర్శించారు. కుల వ్యవస్థను అంతం చేసేందుకు కులాంతర వివాహాలు మాత్రమే సరిపోవని, మత భావనలను అంతం చేయాలని తన అభిప్రాయాలను ఈ పుస్తకంలో పొందుపరిచారు.
- 2. క్యాస్ట్స్ ఇన్ ఇండియా (Castes in India) : మానవ శాస్త్ర అంశంపై న్యూయార్క్‌లో జరిగిన సదస్సులో అంబేద్కర్ ప్రసంగించిన విషయాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. ఉన్నత వర్గమంటూ స్వయంగా ప్రకటించుకున్న వారు.. ఇతరులు కూడా వారిని అనుసరించే విధంగా దారి తీసిన పరిస్థితులను ఈ పుస్తకంలో వివరించారు.
- 3.హూ వర్ ది శూద్రాస్?(Who were the Shudras) : వర్ణ వ్యవస్థలో అట్టడుగు కులంగా భావించే శూద్రుల మూలాన్ని వెలుగులోకి తెచ్చేందుకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఈ పుస్తకం రచించారు. వేదాలు, భారతీయ గ్రంథాలు, మహా భారతం ఆధారంగా చేసుకొని, ఈ పుస్తకాన్ని అంబేద్కర్ రాశారు.
- 4.రిడిల్స్ ఇన్ హిందూయిజమ్(Riddles in Hinduism): వేదాలకు ఉన్న అతీత అధికారాలను ఈ పుస్తకంలో నిలదీశారు. బ్రాహ్మణులకు స్వప్రయోజనాలను కల్పించేందుకే ఈ వేదాలు ఏర్పడ్డాయని ఆయన అభిప్రాయపడ్డారు. మతానికి సంబంధించిన అనేక ప్రశ్నలను ఆయన లేవనెత్తారు.




- 5. ది ప్రాబ్లమ్ ఆఫ్ రూపీ: ఇట్స్ ఆరిజిన్ అండ్ ఇట్స్ సొల్యూషన్ (The Problem of Rupee : Its Origin and Its Solution) : లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో తన డాక్టోరల్ థీసిస్‌గా ఈ పత్రాలను అంబేద్కర్ సమర్పించారు. ఇదే పుస్తకంగా ప్రచురితమైంది. భారతీయ రాజుల కాలం నుంచి 20వ శతాబ్దం వరకు రూపాయి పరిణామ క్రమాన్ని ఈ పరిశోధనలో అంబేద్కర్ వివరించారు.
- 6. ది బుద్ధ అండ్ హిజ్ ధమ్మ (The Buddha and his Dhamma): బౌద్ధ మత సిద్ధాంతాన్ని ఈ పుస్తకంలో విశ్లేషించారు. ఇది అంబేద్కర్ చివరి రచన.

అంబేద్కర్ నడిపిన పత్రికలు ఈ కోవలోనివే ! బ్రాహ్మణేతర భావజాలాన్ని ప్రచారం చేశాయి.

ఆ తర్వాత 'బహిష్కృత్ భారత్', 'సమత', 'జనత', 'ప్రబుద్ధ భారత్' పత్రికలను తన నేతృత్వంలోనే అంబేద్కర్ నడిపించారు. ఈ పత్రికలు దళిత, బహుజన సమస్యలను వెలుగులోకి తేవడంలో ముందు వరుసలో ఉండేవి. ఎప్పటికప్పుడు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ పత్రికలను నాలుగు దశాబ్దాల పాటు నడిపించారు. వివిధ ప్రాంతాల నుంచి ముంబయికి చదువుకోవడానికి వచ్చే దళిత విద్యార్థులకు పత్రికాఫీసులోనే ఆశ్రయం కల్పించేవారు. కాలేజ్ సమయం తర్వాత పత్రికలో పనిచేసే విధంగా వారికి తర్ఫీదునూ ఇచ్చేవారు. తద్వారా మహారాష్ట్రలో తొలితరం దళిత జర్నలిస్టులు తయారు కావడానికి ఆయన పునాదులు వేశారు.

**మహిళలు పట్ల మర్యాద..**

'మహిళల సన్నిధిలోనే దివ్యత్వం వుంటుంది' అంటూ మహిళ పట్ల తనకున్న గౌరవాన్ని చాటుకున్నారు అంబేద్కర్. మహిళలు ఆరోగ్యంగా, మంచి దుస్తులతో సంతోషంగా వుండాలని ఆయన తలచేవారు. చదువులు, ఉద్యోగాలు, వ్యాపారాలతోపాటు సంస్థలను నడపడంలోనూ స్త్రీలు మంచి ప్రావీణ్యత సాధించాలనే వారు. సహజంగానే ఆడపిల్లలో తల్లి గుణం వుంటుందని, ఉన్నతమైన నైతిక విలువలతో వుంటారని, వారిలో నేర్చుకునే గుణం **(మిగతా 17వ పేజీలో)**

# ప్రజాస్వామ్యమే అంబేద్కర్ భావసారం



- మల్లేపల్లి లక్ష్మయ్య

అంబేద్కర్ సాగించిన కార్యాచరణ మీద చాలా మంది అసమగ్రమైన అధ్యయనంతో అసందర్భంగా మాట్లాడుతున్నారు. అంబేద్కర్ ప్రతి విషయాన్నీ అనుభవించి, ఆలోచించాడు. దానికి తగ్గట్టుగా అధ్యయనం సాగించాడు. ఆ అధ్యయనాన్ని అక్షర బద్ధం చేశాడు. ఆయన తన ఆదర్శ సమాజానికి ప్రజాస్వామ్యాన్ని భూమికగా ఎంచుకొని, సమానత్వాన్ని సాధించాలని భావించాడు. ఆయన చేసిన రచనలు, సాగించిన వాదనలు, ఉద్యమాలన్నీ అదే మార్గంలో ఉంటాయి. ఆయన సమానత్వాన్ని లక్ష్యంగా చేసుకున్న ప్రజాస్వామ్యాన్ని మార్గంగా ఎంచుకున్నాడు. అందుకే అంబేద్కర్‌ను అర్థం చేసుకోవాలంటే మనకు అందుబాటులో ఉన్న ఆయన నలభై సంవత్సరాల రచనల్లో కొన్నిటినైనా చదవాలి.

'భిక్షువులారా ! శ్రావస్తిలో ఒకప్పుడు ఒక రోజు.. పుట్టుకతో అంధులైన వారిని పిలిచి, ఒక ఏనుగును తెప్పించి, దానిని గుర్తు పట్టమని, అది ఏ ఆకారంలో ఉంటుందో చెప్పాలని ఆజ్ఞాపించారు. అయితే అంధులు ఒక్కొక్కరు ఏనుగులోని ఒక్కొక్క భాగాన్ని తడిమిచూసి తమ అభిప్రాయాలను వివరించారు. తలను పట్టుకున్న మొదటివాడు అది ఒక కుండలాగా ఉందన్నాడు. చెవి పట్టుకున్న వాడు అది చేటలా ఉందన్నాడు. దంతాన్ని తాకిన వాడు నాగలి కర్రుగా అనుకున్నాడు. మరొకరు తొండం ఎడ్ల బండి కాడిలా ఉందన్నాడు. ఆఖరి వాడు తోకను ముట్టుకొని అది రోకలిలా ఉందని చెప్పాడు. వీళ్లందరు ఏనుగు మొత్తాన్ని తాకలేదు. అది ఎట్లా ఉందో చెప్పలేకపోయారు. వాళ్లు పుట్టుకతో అంధులు కావడం వల్ల అట్లా అనుకున్నారు. అయితే కండ్లు ఉండి, ధమ్మాన్ని (ధర్మాన్ని) సమగ్రంగా అర్థం చేసుకోలేక చాలా మంది తమకు ఏది తోస్తే అది మాట్లాడుతున్నారు. అటువంటి వాళ్లకు ఏ ధర్మమైనా అర్థం కాదు. అందుకే ప్రతి చిన్న విషయానికీ వాదోపవాదాలకు రావడం, తమ అజ్ఞానాన్ని జ్ఞానంగా ప్రదర్శించడం చేస్తున్నారు. మీరు అలా చేయకూడదు. ఏదైనా ఒక విషయాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి" అంటూ గౌతమ బుద్ధుడు తన శిష్యులకు హితబోధ చేశారు. ఇది బౌద్ధ సాహిత్యంలో తిత్తియసుత్తలో ఉంది. ఆ తర్వాత ఇదే కథ జైన, హిందూ, సూఫీ సాహిత్యంలోకి వెళ్లింది.

చాలా మందికి ఈ కథ తెలుసు. ఏదైనా ఒక విషయాన్ని సమగ్రంగా అర్థం చేసుకోకుండా మాట్లాడే వాళ్ల గురించి, వాదోపవాదాలు చేసే వాళ్లను గురించి ఈ కథ చెప్పడం వింటూంటాం. అయితే ఇక్కడ సందర్భమేమిటనే సందేహం రాక తప్పదు. భారతదేశ సామాజిక గతిని, స్థితిని తెలియజేసి, దానిని ఎలా మార్చాలో తన విస్తృతమైన అధ్యయనం ద్వారా తెలియజేసిన భారత సామాజిక విప్లవకారుడు బాబాసాహెబ్ అంబేద్కర్ విషయంలో ఇటీవల ఇదే జరుగుతున్నది.

అంబేద్కర్ తాత్విక చింతన, ఆయన సాగించిన కార్యాచరణ, జీవిత ఘట్టాలు, ఇట్లా అనేక విషయాలపై చాలా మంది అసమగ్రమైన అధ్యయనంతో అసందర్భంగా మాట్లాడుతున్నారు. అయితే ఎవరినీ నిందించడం నా ఉద్దేశం కాదు. కానీ దాని వల్ల అంబేద్కర్ ప్రధానమైన తాత్విక చింతన, ఆయన సాగించిన సంఘర్షణాయుతమైన జీవన గమనం తప్పుగా అర్థం అవుతుంది. నిజానికి బాబాసాహెబ్ అంబేద్కర్ తాత్విక కేంద్ర బిందువులను అర్థం చేసుకుంటే, ఆయన మనకు అర్థం అవుతారు. బాబా సాహెబ్ అంబేద్కర్ ఈ దేశపు మూలస్తంభపు పునాదిని కనిపెట్టారు. అందుకోసం తన జీవితాన్ని అంకితం చేశారు. అంబేద్కర్‌ను మనం మేధావిగా చెప్పుకుంటాం. అయితే అది సాధ్యం కావడానికి ఆయన అనుభవం, ఆందోళన, ఆలోచన, అధ్యయనం, అక్షరం, ఆచరణలు ఒకదాని వెంట ఒకటి నడిచాయి.

అంబేద్కర్ ప్రతి విషయాన్నీ అనుభవించి, ఆలోచించాడు. దానికి తగ్గట్టుగా అధ్యయనం సాగించాడు. అందుకు తగ్గట్టుగా అధ్యయనాన్ని అక్షరబద్ధం చేశాడు. దానిని ఆచరణలో చూపెట్టాడు. తాత్వికవేత్తలు చెప్పినట్టుగా, ప్రపంచాన్ని చాలా మంది అధ్యయనం చేసి, వ్యాఖ్యానిస్తూ ఉంటారు. కానీ మార్చడమెలాగో చెప్పిన వాడే తాత్వికుడు. అటువంటి వాడే అంబేద్కర్. బాబాసాహెబ్ అంబేద్కర్ తన కాలేజీ చదువు ముగించుకొని, కొలంబియాలో ఉన్నత చదువుల కోసం వెళ్లాడు. అక్కడ తన జీవిత అనుభవం ద్వారా ఏర్పడిన ఆందోళనను ఆలోచనలో పెట్టి అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయంలో చేసిన అధ్యయనం ఆయనను ఒక తాత్వికుడిగా తీర్చిదిద్దుకోవడానికి మంచి అవకాశాన్ని ఇచ్చింది. దానికి ప్రధానమైన వ్యక్తి ఆయన గురువు ప్రొఫెసర్ జాన్ డ్యూయీ. పంతొమ్మిదవ, ఇరవైవ శతాబ్దాలలో అమెరికాలోని తాత్వికుల్లో జాన్ డ్యూయీ అగ్రగణ్యుడు. అటువంటి ఒక తాత్వికుడు అంబేద్కరుకు గురువుగా దొరికాడు. జాన్ డ్యూయీ ప్రధానమైన పరిశోధన డెమోక్రసీ. ప్రజాస్వామ్య భావనను ఆధునికంగా ఆలోచించిన వాడు జాన్ డ్యూయీ. ప్రజాస్వామ్యాన్ని అబ్రహం

లింకన్ సహా అనేకమంది పరిపాలన సంబంధమైన విషయంగా వ్యాఖ్యానిస్తే, జాన్ మాత్రం దానిని ఒక సామాజిక అంశంగా, యావత్ సమాజానికి సంబంధించిన విషయంగా, మానవ సంబంధాలకు విస్తరింపజేశాడు.

తన 'ప్రజాస్వామ్యం – విద్య' అనే పుస్తకంలో రాసిన విధంగా, "ప్రజాస్వామ్యం కేవలం పాలనకు సంబంధించిన వ్యవహారం కాదు. ఇది ప్రజల మధ్య, ప్రజల జీవనానికి సంబంధించినది. వారి మధ్య ఉండే సంబంధాలను నిర్దేశించేది". అయితే అంబేద్కర్ తన మొత్తం ప్రయాణంలో ప్రజాస్వామ్య తాత్విక పునాదిని అర్థం చేసుకున్నాడు. బాబాసాహెబ్ అంబేద్కర్ జాన్ డ్యూయీ నుంచి ప్రేరణ పొందాడనడానికి 'కుల నిర్మూలన'లో వ్యక్తపరిచిన ప్రాథమిక అభిప్రాయమే నిదర్శనం.

అంబేద్కర్ ప్రజాస్వామ్యాన్ని అన్ని రంగాలకు వర్తించే ఒక తాత్విక శక్తిగా మలుచుకున్నాడు. అంబేద్కర్ తన నలభై ఏళ్ల చురుకైన ఉద్యమ జీవితంలో సాగించిన పరిశోధనలు, అమలు చేసిన కార్యాచరణలు దానినే బలపరుస్తున్నాయి. ఆయన 1916 లో కులాల పుట్టుక అనే అంశంపై పరిశోధన చేసి, దానిని కుల నిర్మూలనలో ఒక లక్ష్యంగా చేసుకొని, బౌద్ధాన్ని స్వీకరించడం ద్వారా ఒక సామాజిక ప్రజాస్వామ్యంగా మనకు అందించారు.

1919లో సౌత్బరో కమిటీ ముందు ప్రభుత్వ నిర్వాహణలో ప్రజల భాగస్వామ్యం ఉండాలని, అందులో అణిచివేతకు గురైన వర్గాలను ప్రత్యేకంగా గుర్తించి తగు ప్రాధాన్యత కల్పించాలని ప్రసంగించాడు. సైమన్ కమిషన్, రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ ద్వారా దానికి ఒక బలాన్ని చేకూర్చి 1950లో ఆమోదించిన రాజ్యాంగంలో అందుకు తగ్గట్టుగానే చట్టబద్ధత కల్పించాడు. ఇది రాజకీయ ప్రజాస్వామ్యం.

1918లో మొట్టమొదటి ఎకనామిక్ జర్నల్లో 'థియరీ ఆఫ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్' అనే వ్యాసంలో వ్యవసాయ, పారిశ్రామిక అభివృద్ధిపై మార్గ నిర్దేశనం చేశాడు. వ్యవసాయం మీదనే ప్రజలు ఆధారపడటం వల్ల ఆ వ్యవస్థ ఒత్తిడికి గురవుతోందని, తన 27వ ఏటనే దేశానికీ, ప్రపంచానికీ మార్గ నిర్దేశనం చేశాడు. ఇదే విషయమై పరిశోధన సాగించిన సర్ ఆర్థర్ లూయిస్కు 1954లో విషయమై పరిశోధన సాగించిన సర్ ఆర్థర్ లూయిస్కు 1954లో ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. అంటే దాదాపు 36 ఏళ్ల ముందే అంబేద్కర్ తన దార్శనికతను ప్రదర్శించాడు. 1945లో తాను రాసిన 'స్టేట్స్ అండ్ మైనారిటీస్' అన్న డాక్యుమెంటులో దేశంలోని వనరులను, ముఖ్యంగా భూమిని, భారీ పరిశ్రమలనూ, బ్యాంక్, ఇన్సూరెన్స్ సంస్థల వంటి వాటిని ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉంచకూడదని, వాటిని జాతీయం చేయాలని ప్రతిపాదించాడు. అంబేద్కర్ తన ఆదర్శ సమాజానికి ప్రజాస్వామ్యాన్ని భూమికగా ఎంచుకొని, సమానత్వాన్ని సాధించాలని భావించాడు. అందుకే తాను చేసిన రచనలు, సాగించిన వాదనలు, ఉద్యమాలన్నీ అదే మార్గంలో ఉంటాయి. ఆయన సమానత్వాన్ని లక్ష్యంగా చేసుకున్న ప్రజాస్వామ్యాన్ని మార్గంగా ఎంచుకున్నాడు. అందుకే ఆయన లక్ష్యాల్లో సమానత్వం, స్వేచ్ఛ, సోదరత్వం ముఖ్యమైనవి. వాటి సాధనకు మార్గం సుగమం చేసేదే ప్రజాస్వామ్యం. అందుకే అంబేద్కర్‌ను అర్థం చేసుకోవాలంటే మనకు అందుబాటులో ఉన్న ఆయన నలభై సంవత్సరాల రచనల్లో కొన్నిటినైనా మనం చదవాలి. ఆయన మూలసిద్ధాంతమైన ప్రజాస్వామ్య భావనను అధ్యయనం చేసి అర్థం చేసుకోవాలి. ❑

**(సాక్షి సౌజన్యంతో)**

# భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్

**(15వ పేజీ తరువాయి)**

పురుషులకంటే ఎక్కువగా వుంటుందని ఆయన అభిప్రాయపడేవారు. కానీ స్త్రీలు కులం, అంటరానితనం అనే శాపం వల్ల, పేదరికం వల్ల పురుషుల కంటే దీనమైన స్థితిలోకి నెట్టబడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేసేవారు. వారికి కనీస హక్కులు కల్పిస్తే, స్వతంత్రంగా బతకగలరని, తమ కుటుంబాలను పోషించుకోగలరని మహిళల పట్ల తన అభిప్రాయాలను అంబేద్కర్ పలు సందర్భాలలో స్పష్టం చేశారు. 'ఒక దేశం బాగుందని చెప్పడానికి, ఆ దేశంలో మహిళ లు ఎలా జీవిస్తున్నారు? అన్నదానిపై ఆధారపడి వుంటుంది!' అనేవారు. తాను సందర్శించిన అనేక దేశాల్లోని మహిళలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో వుండేవారని, తన దేశంలోనూ స్త్రీలు ఆ విధంగా ఎదిగేరోజులు ఎప్పుడు వస్తాయోనని, తదితర అంశాలు అంబేద్కర్ రాసిన అనేక వ్యాసాల్లో కనిపిస్తాయి.

### బౌద్ధ మత స్వీకరణ..

దురదృష్టవశాత్తూ తాను హిందువుగా పుట్టినప్పటికీ, హిందువుగా మరణించాలని అనుకోవడం లేదని 1936లోనే అంబేద్కర్ ప్రకటించారు. 'ఏ వస్తువు రుచి అయినా మారుతుంది. కానీ, కులం అనే విషాన్ని మాత్రం అమృతంగా మార్చలేం. నువ్వు ఎక్కడకు వెళ్లినా కులం నీ వెంట పడుతుంది. దానిని నువ్వు తప్పించుకోలేవు. మతం మారిపోవడమే ఏకైక మార్గం' అన్న అంబేద్కర్.. 1956, అక్టోబర్ 14న నాగపూర్‌లో లక్షలాది మంది అనుచరులతో బౌద్ధ మతాన్ని స్వీకరించారు. ప్రపంచ మేధావిగా, సంఘ సంస్కర్తగా కీర్తిగడించిన అంబేద్కర్.. తన చివరి రోజులలో మధుమేహంతో బాధపడుతూ 1956, డిసెంబర్ 6న మరణించారు. అణగారిన వర్గాలకు ఆయన చూపిన బాట, ఆయన నింపిన స్ఫూర్తి ఎప్పటికీ ఆచరణీయం.. అనుసరణీయం. ❑

# హిందూ రాజ్యం - అంబేడ్కర్

**భా**రతదేశాన్ని హిందూ రాజ్యంగా మార్చాలనే కల ఇటీవలి కాలానిదేమీ కాదు. కాకపోతే అది ఈ మధ్య కాలంలో ఎక్కువ ప్రాచుర్యం పొందింది. సంఘ్(ఆర్ఎస్ఎస్) అనుబంధ సంఘాలు జాతీయగీతం, బీఫ్, గోరక్షణ, రామ మందిరం వంటి వాటిపై చూపుతున్న దూకుడు, ధోరణి దానికే ముందస్తు సంకేతాలు. గోహత్యను నిషేధించే చట్టాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ వాదిస్తున్నారు. రిజర్వేషన్లపై పునస్సమీక్ష చేయాలనే ప్రకటన ఆయన గతంలో చేసి ఉన్నారు. హిందూ సంస్కృతిని భారతదేశ మంతటా ఆదర్శ జీవన నియమావళిగా మార్చాలనేది సంఘ్ ప్రకటిత లక్ష్యం. మహిళలకు డ్రెస్ కోడ్, లవ్ జిహాద్‌కు వ్యతిరేకంగా క్యాంపెయిన్ వంటి వాటిని వారు నడిపిస్తూనే ఉన్నారు. నిజానికి ఇస్లామ్ ఆధారిత ప్రత్యేక దేశం, హిందూ దేశం రెండు డిమాండ్లూ కవల పిల్లల్లాగే పుట్టాయి. ఇవి రెండూ పరస్పరం మద్దతు ఇచ్చుకున్నాయి.

### మత ఆధారిత దేశం

వాస్తవం ఏమిటంటే హిందూ మెజారిటీ పాలనా భయం నీడలోనే పాకిస్తాన్ కావాలనే డిమాండ్ పుట్టి, పెరిగి పెద్దదైంది. డాక్టర్ అంబేడ్కర్ 1940లో మత ఆధారిత పాకిస్తాన్ దేశం కోసం చేస్తున్న డిమాండ్ సందర్భంగా హెచ్చరిక చేస్తూ ఇలా అన్నారు – “ఒకవేళ హిందూ దేశం ఏర్పడినట్టయితే అది దేశానికి భారీ ప్రమాదం అవుతుందనడంలో అనుమానం లేదు. హిందువులు చెప్పేది ఏమైనా కావొచ్చు కానీ, హిందుత్వ అనేది స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం అన్న భావనలకు ప్రమాదకరం. అలా చూసినపుడు ఇది ప్రజాస్వామ్యానికి ఏ మాత్రం అనుగుణమైంది కాదు. ఎట్టి పరిస్థితిలోనైనా సరే హిందూ రాజ్యం ఏర్పాటును వ్యతిరేకించాలి.” 81ఏళ్ల క్రితం అంబేడ్కర్ ఏ ప్రమాదం గురించి హెచ్చరించారో, అది నేడు భారతదేశం ముంగిట్లోకి శక్తిమంతంగా వచ్చి నిలుచుంది. రాజ్యాంగంలో మార్పేమీ జరగనప్పటికీ, లాంఛనంగా మనది ఇంకా లౌకికవాద దేశమే అయినప్పటికీ, వాస్తవిక జీవితంలో మాత్రం హిందుత్వవాద శక్తులు సమాజం, సంస్కృతులతోపాటు అధికార పీఠంపైనా బలమైన పట్టు సాధించాయి.

### ‘హిందూ రాజ్యం హిందువులకే ఎక్కువ ప్రమాదకరం’

ఎట్టి పరిస్థితుల్లోనైనా సరే, భారత్‌ను హిందూ దేశంగా మారిపోకుండా అడ్డుకోవాలని అంబేడ్కర్ భావించారు. ఎందుకంటే హిందూ జీవన నియమావళి స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలకు పూర్తిగా విరుద్ధమైందని ఆయన భావించేవారు. హిందూ రాజ్యాన్ని ఆయన వ్యతిరేకించడానికి కారణం ముస్లింల పట్ల హిందువులు కలిగి ఉన్న ద్వేషానికే పరిమితం కాదు. వాస్తవం ఏంటంటే, ‘హిందూ రాజ్యం ముస్లింలకన్నా, హిందువులకే ఎక్కువ ప్రమాదకరం’ అని ఆయన భావించేవారు.

ఆయన హిందూ రాజ్యం దళితులకూ, మహిళలకూ వ్యతిరేకమైందని భావించా రు. కుల వ్యవస్థను నిలబెట్టి ఉంచడానికి అనివార్యమైన షరతు మహిళలు కులాంతర వివాహాలు చేసుకోకుండా వారిని అడ్డుకోవడమే అని ఆయన స్పష్టంగా చెప్పారు.

### హిందుత్వ, ప్రజాస్వామ్యం

ఈ పరిస్థితిని అడ్డుకునేందుకే ఆయన హిందూ కోడ్ బిల్లును ప్రవేశపెట్టారు. హిందూ రాజ్యాన్ని ఆయన పెను ప్రమాదంగా భావించడం వెనుక కుల వ్యవస్థ నుంచి తలెత్తిన అసమానత్వం ఒక పెద్ద కారణం. అది స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం, ప్రజాస్వామ్యం వంటి విలువకు గొడ్డలిపెట్టు అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ అసమానత్వం ఇలా ఉండడం వల్ల వాస్తవిక స్వాతంత్ర్యం మనుగడలో ఉండలేదు. సమానత్వం, స్వాతంత్ర్యం వంటివి లేనప్పుడు సామాజిక సౌభ్రాతృత్వాన్ని ఊహించనే లేం. కులవాద అసమానత్వం హిందుత్వకు ప్రాణం వంటిది. ఈ అంశం ఆధారంగానే ఆయన “హిందుత్వ, ప్రజాస్వామ్యం రెండు పరస్పర విరుద్ధమైన అంశాలు” అనే నిర్ధారణకు వచ్చారు.

కులపరమైన అసమానత్వం విషయంలోనైనా, దీనిని నిలిపి ఉంచడం కోసం మహిళలు వర్ణానికీ, కులానికీ ఆవల జీవిత భాగస్వామిని ఎంచుకోకుండా వారిని నియంత్రించే విషయంలోనైనా హిందువుల్లో మౌలికమైన మార్పేమీ రాలేదు. మొత్తంగా చూస్తే, హిందువులు దేన్నైనా వదులుకుంటారు కానీ తమ మూలాధారమైన కులాన్ని మాత్రం వదులుకోరు. దీనిని నిర్మూలించకుండా ప్రజాస్వామిక సమాజాన్ని ఊహించను కూడా ఊహించలేమని అంబేడ్కర్ ఆనాడే భావించారు. ❑

**(బి.బి.సి. సౌజన్యంతో)**

# మానవ హక్కుల మహానేత అంబేడ్కర్




- గెయిల్ ఓంవెడ్ట్

అనువాదం: ఎ.సుబ్రహ్మణ్యం

'దళిత హక్కులు కూడా మానవ హక్కులే' అన్న నినాదం దళిత ఉద్యమానికి ఒక శక్తివంతమైన నినాదంగా మాత్రమే మిగలకుండా, భారతదేశంలోని కుల అణచివేతకు అంతర్జాతీయ స్థాయిలో ఒక గుర్తింపును, మద్దతును కూడగట్టడంలో సఫలీ కృతమైంది'. వాస్తవానికి బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను ఈ శతాబ్దంలోనే అత్యంత గొప్ప మానవ హక్కుల పోరాట యోధుడుగా గుర్తించాలి. ఆయన పోరాటం చేసింది కేవలం అత్యంత అణచివేతకు గురైన దళిత వర్గాల కోసమే కాక భారత దేశంలోని రైతులు, మహిళలు, కార్మికులు, కుల బాధితులందరి కోసం. అంబేడ్కర్ కార్మికులు, రైతుల హక్కుల కోసమూ పోరాడారు. 1920వ దశకం చివరన ముఖ్యంగా 1930లలో ఆయన 'ఇండిపెండెంట్ లేబర్ పార్టీ'ని స్థాపించి మహారాష్ట్రలోని కొంకణ ప్రాంతానికి చెందిన మహర్, కున్బీ కౌలుదారుల ప్రయోజనాల కోసం కూడా పనిచేశాడు.

1938లో ఆయన కాంగ్రెస్‌లోని తీవ్రవాద కాంగ్రెస్ సోషలిస్టు సభ్యుల మద్దతుతో 20 వేల మంది రైతులతో నిర్వహించిన ఊరేగింపు, స్వతంత్రం రాక ముందు ఆ ప్రాంతంలో నిర్వహించిన అన్ని కార్యక్రమాలకంటే పెద్దది. అదే ఏడాది బ్రిటీష్ ప్రభుత్వం తీసుకు రావాలని ప్రయత్నిస్తున్న కార్మికుల సమ్మె హక్కును నిషేధించే 'నల్ల చట్టానికి' వ్యతిరేకంగా కమ్యూనిస్టులతో కలిసి బొంబాయి మిల్లు కార్మికులతో బ్రహ్మాండమైన సమ్మె చేయించాడు. అంబేడ్కర్ బొంబాయి అసెంబ్లీలోను ఈ బిల్లును వ్యతిరేకిస్తూ 'సమ్మెను నిషేధించడం అంటే స్వేచ్ఛను నిషేధించడమే' అని ప్రకటించాడు. అనంతరం లక్ష మందితో జరిగిన ఊరేగింపులో ప్రసంగిస్తూ కమ్యూనిస్టుల మద్దతు గురించి ఇలా అన్నారు..

> **"ఇక్కడ కూర్చున్న కమ్యూనిస్టుల నాయకులందరికంటే ఎక్కువ పుస్తకాలు కమ్యూనిజంపై నేను చదివాను. కమ్యూనిస్టు సిద్ధాంతం ఎంత గొప్పదైనప్పటికీ అది ఆచరణలో ఎంతగా ఉపయోగపడుతుందనేది పరిశీలించవలసి వున్నది. ఈ దృష్టితో కార్యక్రమాలు నిర్వహించగలిగితే రష్యాలో విప్లవం విజయవంతం కావడానికి పట్టినంత సమయం గాని, శ్రమ గాని భారతదేశంలో అవసరం లేదని నేను భావిస్తున్నాను. శ్రామికుల వర్గ పోరాటానికి సంబంధించి కమ్యూనిస్టుల భావాలు మాకు దగ్గరగా ఉన్నాయి".**




ఈ కాలంలో(1935-1945) అంబేడ్కర్ మార్క్సిజంచే ప్రభావితుడుయ్యాడు. బ్రాహ్మణిజం, పెట్టుబడిదారీ విధానాలను దళిత వ్యతిరేక శక్తులుగా ప్రస్తావించారు. మార్క్సిజంలో ఆయనకు వున్న అభ్యంతరమంతా కులాన్ని నిర్లక్ష్యం చేయడం. అంబేడ్కర్ వర్గం, ఆర్థిక విషయాలలో కమ్యూనిస్టులతో విభేదించాడు. ఆయన అధ్యయనం అంతా ఆర్థిక శాస్త్రంలోనే జరిగింది. 1920లలో భారత ఆర్థిక విధానంపై రెండు ఉద్గ్రంథాలను రచించాడు. వాటిని పరిశీలించిన ఒక ప్రముఖ భారతీయ ఆర్థిక శాస్త్రవేత్త అంబేడ్కర్ ఆర్థిక రంగం నుంచి రాజకీయ రంగంలోకి మారడం ఒక విషాదంగా అభివర్ణించాడు.

వర్గ పోరాటాన్ని, అణచివేతను ప్రధానంగా భావిస్తూ వాటికి సమాధానాలను వేరేచోట వెతకటం ప్రారంభించాడు. ఆయన తన జీవితమంతా పరిశోధించి నిర్ధారించుకున్న శాస్త్రీయ, సాంఘిక విలువలు ఫ్రెంచి విప్లవంలో కనిపించాయి. బౌద్ధాన్ని అధ్యయనం చేసిన కొద్దీ ఆసియా ఖండంలో స్వేచ్ఛ, సామాజిక విలువలను బోధించగల్గింది బౌద్ధమేనని ఆయనకు అర్థం అయ్యింది. ఈ విషయాన్ని 'బుద్ధుడు లేక కారల్ మార్క్స్' అనే వ్యాసంలో ఇలా ప్రస్తావించారు..

> **"ఫ్రెంచి విప్లవంలో విలువలుగా ముందుకు వచ్చిన స్వేచ్ఛ స్వతంత్రం, సహోదరత్వం అనే మూడు విలువల కోసం సమాజం కొత్త ప్రయత్నాలను ప్రారంభించింది. ఈ నినాదం వల్లనే ఫ్రెంచి విప్లవాన్ని అందరూ ఆహ్వానించారు. అయితే అది సమానత్వాన్ని సాధించడంలో విఫలమైంది. సమానత్వాన్ని లక్ష్యంగా పెట్టుకున్నందు వల్లనే రష్యా విప్లవాన్ని ఆహ్వానించాం. సమానత్వాన్ని సాధించే క్రమంలో స్వేచ్ఛను,**

**సహోదరత్వాన్ని త్యాగం చేయడానికి సమాజం సిద్ధంగా లేదు. స్వేచ్ఛ, సహోదరత్వం లేకుండా సమానత్వానికి విలువ లేదు. ఈ మూడు సహజీవనం చేయాలంటే అది బౌద్ధంలోనే సాధ్యమవుతుంది. కమ్యూనిజం వాటిలో ఒక దానిని మాత్రమే ఇవ్వగల్గుతుంది"** (అంబేద్కర్ రచనలు – ప్రసంగాలు 3వ సంపుటి 462)

అంబేద్కర్ సహోదరత్వం అనే పదాన్ని వాడడంలో ఫ్రెంచి వాళ్లు ఉపయోగించిన పితృస్వామిక పదాన్నే వాడినప్పటికీ ఆయన దృష్టిలో సహోదరత్వం అంటే మహిళలతో కూడిన విశ్వ వ్యాప్తిత సహోదరత్వం అనే అర్థం ఇమిడి ఉంది (పెటర్నటీ అనే పదానికి బదులు కమ్యూనిటీ అనే పదాన్ని నేను ఉపయోగించ టానికి ఇష్టపడతాను). స్వాతంత్ర పూర్వకాలంలో అంబేద్కర్ మహిళల హక్కుల కోసం పోరాడిన మహనీయులలో ఒకడు (ఈ విషయంలో మహారాష్ట్రలో మహిళా విముక్తి ఉద్యమానికి ఆద్యుడిగా పరిగణించబడిన జ్యోతిభా పూలేను అంబేద్కర్ అనుసరించాడు). వాస్తవానికి **రాజ్యాంగ రచన తర్వాత కేంద్ర మంత్రిగా స్వతంత్ర భారతంలో ఆయన చేపట్టిన ఆఖరి రాజకీయ కార్యక్రమం హిందూ కోడ్ బిల్లు ప్రవేశపెట్టడంలో ఆయన కృషి హర్షనీయమైంది. ఈ చర్యను హిందూ తీవ్రవాదులు వ్యతిరేకించారు. ఆశ్చర్యకరంగా నెహ్రూ వంటి ఉదారవాద లౌకికవాద నాయకుడు అంబేద్కర్‌ను సమర్థించ లేదు. ఫలితంగా అంబేద్కర్ తన మంత్రి పదవికి రాజీనామా చేశాడు. బహుశా స్వతంత్ర భారతంలో ఒక సిద్ధాంతానికి కట్టుబడి మరి ముఖ్యంగా మహిళల హక్కుల కోసం రాజీనామా చేసిన అతి కొద్ది మంది మంత్రులలో అంబేద్కర్ ముఖ్యులు.**

ఒక దళిత మానవ హక్కుల కార్యకర్తగాను, మానవ హక్కుల పోరాట యోధుడుగాను అంబేద్కర్ బౌద్ధంలో సమాధానాలు వెతకసాగాడు. ఆయన తన నిబద్ధతతోను, స్వానుభవంతోను, భారతదేశ చరిత్ర అధ్యయనం ద్వారాను హక్కుల ఉల్లంఘనకు కారణం కులమేనన్న విషయాన్ని దానికి మూలం బ్రాహ్మణిజ మేనని నిర్ధారించాడు. ఆయన అభిప్రాయంలో బ్రాహ్మణిజమే ఒక మానవ హక్కుల ఉల్లంఘన, స్వేచ్ఛ, స్వతంత్రం, సహోదరత్వాల నిరాకరణ. మరి దీనికి పరిష్కారం ఏమిటి ? సిక్కు మతాన్ని గురించి మరికొన్ని ఇతర ప్రత్యామ్నాయాల గురించి పరిశీలించిన తర్వాత ఆయన బౌద్ధం వైపు తన దృష్టిని మళ్లించారు. అది భారతీయ మతం అయినందు వల్లనే కాక సమానత్వం, హేతుబద్ధత ప్రాతిపదికగా గల సిద్ధాంతంగా మాత్రమే కాక స్వేచ్ఛ, స్వతంత్రం, సామాజిక సహోదరత్వాలను ప్రత్యేక వ్యాసాలు విలువలుగా ప్రతిపాదించిన మతం బౌద్ధమేనని అంబేద్కర్ అభిప్రాయం.

## 63వ వర్ధంతి

కులం సృష్టించిన కల్లోలం నుంచి భారతదేశాన్ని రక్షించగల్గినది బౌద్ధమేనని ఆయన నమ్మాడు. ఆధునిక భారత సమాజానికి తగిన మతం బౌద్ధమేనని అభిప్రాయపడుతూ తన 'బుద్ధుడూ – ఆయన ధమ్మం' అనే గ్రంథంలో ఇలా వాదించా డు. "సమాజం మూడు ప్రత్యామ్నాయాలలో ఒక దానిని ఎంచు కోవలసి వుంది. ప్రభుత్వ సాధనంగా ధమ్మాన్ని కాదనుకోవచ్చు. అనగా ఆ సమాజం అరాచకాన్ని కోరుకోవడమే అవుతుంది. రెండవది నియంతృత్వాన్ని, పోలీసు వ్యవస్థను ఒక సాధనంగా ఎంచుకోవడం. మూడవది ధమ్మం విఫలమైనపుడు న్యాయ విచక్షణను ఎంచుకోవడం, అరాచకంలోను, నియంతృత్వంలోను స్వేచ్ఛ వుండదు. మూడవ ప్రత్యామ్నాయంలో మాత్రమే స్వేచ్ఛ మిగులుతుంది. అందువల్ల స్వేచ్ఛను కోరుకునే వారు ధమ్మాన్ని ఎంచుకోవలసిందే".

ఆ విధంగా అంబేద్కర్ బౌద్ధ దమ్మంవైపు మళ్లడం అంటే దానిని ఒక సామాజిక నైతికసూత్రంగా అంగీకరించారన్న మాట. బుద్ధుడు లేక కారల్ మార్క్స అనే వ్యాసంలో పేదరికాన్ని నిర్మూలించడానికి, అనాథలను ఆదరించడానికి చక్రవర్తి తన రాజరికాన్ని వినియోగించే ఉదాహరణను ప్రస్తావించారు. ఈ విషయంలో రాజు విఫలమైతే అరాచకాన్ని, నేరాలను అదుపు చేయడంలో విఫలమవుతాడు. రాజ్యం కష్టాలపాలు అవుతుంది. ఆ విధంగా ఈ వ్యాసంలో అంబేద్కర్ ఒక నిర్ధారణకు వస్తాడు – "ఈ ఉదాహరణ ద్వారా నైతిక శక్తులు విఫలమైతే ఆరాచక శక్తులు విజృంభిస్తాయని, ప్రతి మనిషిని నైతిక శిక్షణకు అవకాశం కల్పించడం ద్వారా న్యాయ సామ్రాజ్యాన్ని నిలబెట్టుకోగల్గుతారు".(అంబేద్కర్, 1987, పే. 459).

అంబేద్కర్ చివరగా ప్రచురించిన పుస్తకం 'బుద్ధుడూ ఆయన ధమ్మం'లో బౌద్ధానికి ఒక సామాజిక నైతిక హేతుబద్ధమైన వివరణను ఇచ్చే ప్రయత్నం చేశాడు. అదే నవయాన బౌద్ధం. ఈ విధానంతోనే నేటి బౌద్ధానికి ఎక్కువ మంది అంగీకారం లభిస్తున్నది. ❑

నీవు ఏ దిక్కుకు తిరిగినా సరే, దారికడ్డంగా నిలబడే పెనుభూతం కుల వ్యవస్థ.
ఈ భూతాన్ని అడ్డు తొలగిస్తే తప్ప రాజకీయ సంస్కరణలు గాని,
ఆర్థిక సంస్కరణలు గాని సాధించలేం.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

# అంబేద్కర్ పోరాట వెలుగులో సామాజిక న్యాయం



- జస్టిస్ వి.ఆర్.కృష్ణయ్యరు

'శతాబ్దాల బరువును మోసీ మూసీ
అతను తన నాగలి మీదికి ఒరిగిపోయాడు
ఇక కింది చూపేగానీ పైచూపులేదు
అతని కన్నుల్లో యుగయుగాల ఖాళీతనం
వీపుపై ప్రపంచభారం
ఏ ఆశనిపాతం అతన్ని పశుప్రాయుణ్ణి చేసి
నిశ్చేష్టపర్చింది ?
అతని పైకి క్రూరపంజాల్ని విసిరి
కనుబొమ్మల్ని విరిచేసిందెవరు ?
అతని మస్తిష్కంలోని జ్ఞాన దీపాలనార్పిందెవరు ?
ఈ వికృత ఆకారంలో మానవత్వం దోచుకోబడి,
హక్కుల్ని కోల్పోయి నిర్లక్షితయై వంచింపబడింది.
ప్రపంచ న్యాయమూర్తుల ముందు
అన్నార్తుల హాహాకారాలు నిరసన తెలుపుతున్నాయి.
ఇప్పుడు నిరసన కూడా ప్రవచనమే..."
- ఎడ్విన్ మార్గం

అంబేద్కర్ శత జయంతి సంవత్సరం నుంచి "సామాజిక న్యాయం" అనే మాటను పదే పదే ఉపయోగిస్తున్నారు. నిజానికి 1950 జనవరి 26 నుంచి రాజ్యాంగంలో ఆ మాట చోటు చేసుకుంది. తమపై అన్యాయాలు, అక్రమాలు, దౌర్జన్యాలు జరుగుతున్న నేపథ్యంలో షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలుగా పిలిచే అణగారిన వర్గాల వారు న్యాయం కోసం గొంతెత్తి అరిచినప్పుడల్లా ఈ "సామాజిక న్యాయం" వారితో దాగుడుమూతల దోబూచులాటలాడుతూనే వుంది.

సామాజికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా, విద్యాపరంగా అణచివేతకు గురవుతున్న అశేష పీడిత జనాంగం ప్రధాన జీవన స్రవంతిలో భాగం కావడానికి పెనుగులాడుతున్నారు. భారత రాజ్యాంగం తమకు వాగ్దానం చేసిన అంశాలను సాధించుకో వడంలో వారు విజయం సాధించలేకపోయారు. భారతదేశంలో పరయ్యలుగా, మ్లేచ్ఛులుగా, అంత్యజులుగా ఇంకా అనేక పేర్లను మోస్తున్న వారికి సామాజిక ఆర్థిక న్యాయం కలిగించాలనీ, సమాజంలో మిగతా వారితో సమానమైన సామాజిక హోదా కల్పించాలనీ, మానవ గౌరవం, సౌభ్రాతృత్వం తదితర స్వతంత్ర ఫలాలను వారికి అందించాలనీ రాజ్యాంగంలో రాసిన అంశాల న్నీ రాష్ట్ర సచివాలయాల్లోనూ, ప్రణాళికా సంఘాల్లోను కాగి తాలకే పరిమితమైన భ్రమల వలయాలుగా మిగిలిపోయాయి. ఎంతో కాలంగా రకరకాల రంగుల రాజకీయ శ్రేణులన్నీ సామా జిక న్యాయానికి సంబంధించిన వాస్తవాలను మరుగునపర్చారు. అయితే అంబేద్కర్ శత జయంతి సంవత్సరంలో సమాజంలో అణగారిన వర్గాలు న్యాయం కోసం, హక్కుల కోసం వేస్తున్న పెను కేకల్లో తీవ్రత పెరిగింది. ఇన్ని దశాబ్దాలూ సామాజిక న్యాయం అన్నమాట ఒక మంత్రంలాగా పనిచేసి అణగారిన వర్గాల వారిని జోకొట్టి నిద్ర పుచ్చే మత్తు మందయ్యింది. అయితే గతం శైథిల్యాల నుంచి ఒక కొత్త ఆశ చిగురిస్తుంది. పోగొట్టుకున్న హక్కుల్ని సాధించడానికి అవి వర్గాలకు ఒక కొత్త శక్తి ఉద్భవిస్తుంది. ఒక గిరిజన మేధావి చెప్పు కవితా పదాలను ఈ మధ్యనే విన్నాను.

ఏదో ఒక రోజు
ఈ పొలాలు పచ్చపచ్చగా చిగురిస్తాయి.
భూమి నల్లగా.. సారభూత క్షేత్రమై వర్ధిల్లుతుంది.
ఆ భూమిపైన మా పిల్లలు..
మా పిల్లల పిల్లలు ఎత్తుగా ఎదుగుతారు
కొండ మీద పెరిగే చెట్లల్లాగా
ఎగురుతున్న పిట్టల్లాగా
వాళ్లు స్వేచ్ఛగా వుంటారు.
ఏదో ఒక రోజు...
ఆ భూమి మరొక్కసారి తమ కోసం
జయించబడుతుందన్న విశ్వాసంతో
సజీవ ఆనంద డోలికల్లో మునిగేందుకు
ప్రతి రోజూ వాళ్లు నిద్రలేస్తారు.
అందుకోసం
ఇప్పుడు మేమీ బీడు భూముల్ని దున్నుతున్నాం
ప్రతి నాగేటి చాలు నూనెత్తుటితో తడుపుతున్నాం.
- జమోరా

బాబాసాహెబ్ అని పిలిచే ఒక మనిషి రూపంలో ఉన్న చిచ్చర పిడుగును ఇప్పుడు మళ్లీ మనం సంస్మరించుకుంటున్నాం. ఆ సంస్మరణా విద్వత్తులో ఇప్పటి వరకు అన్ని బాధలను మౌనంగా భరించిన పీడిత జనాంగం ఒక్కసారిగా అపరకాళీలురయ్యాయి. తరాలుగా వెట్టిచాకిరీ చేస్తున్న వాళ్లు ఇంకే మాత్రమూ వెట్టి

వారుగా కొనసాగడానికి సిద్ధంగా లేరు. ఇప్పుడు ఈ అణగారిన వర్గాల వినిపించని ఏడుపులు కనిపించని కన్నీళ్లు బిగిసిన పిడికిళ్లగా ఎర్రబారిన నేత్రాలుగా రూపొందుతున్నాయి. నిజం.. ఈ రోజు కూడా వాళ్ల గొంతులు అణగారిపోతున్నాయి. వాళ్ళ జీవితాలు నిద్రలేని నిశిరాత్రులుగా మిగిలిపోతున్నాయి..

ఈ బడుగు బతుకుల్ని విముక్తి చేయడానికి అధికార వర్గాలు ముందుకు వస్తే భారత సమాజంలో అత్యద్భుతమైన సమతా కుసుమాలు వెల్లివిరుస్తాయి. మానవ గౌరవానికి సంబంధించి సరికొత్త చైతన్యం రెక్కలిప్పుతుంది. సరికొత్త మానవ శక్తులు వినిపించే దేశం సుసంపన్నమవుతుంది. అప్పుడు మాత్రమే అసలైన సౌభ్రాతృత్వం వర్ధిల్లి దళిత జనాంగం అగ్రవర్గాల వారితో కలగలిసి పోయే సమతో వాతావరణం నెలకొంటుంది. అయితే కేవలం చట్టాలు చేసినంత మాత్రాన అంతరాంతరాల్లో పాతుకుపోయిన సామాజిక అసమానతలు, ఆర్థిక బంధనాలు తొలగిపోవు. ఉన్న పరిస్థితిని సమూలంగా మార్చుకొనేందుకు బాధిత వర్గాలు సంసిద్ధం కావాలి. వారికి తగిన చేయూత నివ్వాలి. ఇది దళిత కార్మిక వర్గం సాగించే మరో స్వతంత్ర పోరాటం. మన భారత రాజ్యాంగంలో దళితుల అభ్యున్నతి కోసం, అసమానతలను నిర్మూలించి వారికి విద్యా ఉద్యోగవ కాశాలు కల్పించడం కోసం అనేక చట్టాలున్నాయి. వెట్టిచాకిరీ చట్టప్రకారం రద్దయ్యింది. రాజ్యాంగం ప్రకారం అస్పృశ్యత నిర్మూలనమైంది. దళితులకు జరిగే అన్యాయాలను సవరించ డానికి, నిందితులను శిక్షించడానికి పౌరహక్కుల చట్టం సంసిద్ధంగా వుంటుంది. కానీ ఎందుకో మరి ఈ అత్యద్భుత పరిష్కార మార్గాలన్నీ కాగితపు పులుల్లాగా నిద్రపోతున్నాయి. ఆర్థిక ఆరాచకత్వం, అవినీతి నిరాఘాటంగా చలామణీ అయిపోతుంది. చట్టాలు మృతప్రాయాలుగా పడివున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికలు, ఉప ప్రణాళికలు, పథకాలు రూపొందిస్తూనే వున్నాయి. కానీ అసలు నిజాలేమిటి ?

ఈ సందర్భంలో టాల్‌స్టాయ్ ఏమంటాడంటే "బానిసత్వం నిర్మూలన ఎప్పుడో జరిగిపోయింది. రోమ్ బానిసత్వాన్ని నిర్మూలించింది. అమెరికా నిషేధించింది. మేం నిర్మూలించాం. కేవలం మాటలు మాత్రమే నిషిద్ధమయ్యాయి బానిసత్వం అలాగే వుంది" లియా ఎన్.టాల్‌స్టాయ్

ఈ నాటికీ దళితులపైన వివక్ష కొనసాగుతూనే వుంది. దేశం లో కొన్ని ప్రాంతాల్లోనైనా అస్పృశ్యతా వేరం సాగుతూనే వుంది. ఈనాటికీ దళిత బతుకుల మీద వెట్టిచాకిరీ, బానిసత్వాలను రుద్దుతూనే వున్నాడు. దళిత విముక్తి చట్టాలన్నీ వైఫల్యాలుగా., బూటకపు చట్టాలుగా మిగిలిపోయాయి. దళితుల మీద జరిగే అత్యాచారం కేసుల్ని సాధారణంగా స్థానిక పోలీసులే పరిశోధిస్తారు. దళిత స్త్రీలపై సామూహిక అత్యాచార జరిగితే ఆ కేసు కోర్టు ముఖమైనా చూడదు. చూసినా తీర్పు దాకా నిలబడదు. ఆ పోలీసులకు గానీ, కోర్టులకు గానీ, 'దళిత స్త్రీలకు అన్యాయం జరిగిందే వారికి న్యాయం చేద్దాం' అన్న మానవ స్పృహ గానీ, సామాజిక బాధ్యత గానీ లేకపోవడం ఒక కారణమైతే ఇలాంటి కేసుల్లో ఒక వైపున అగ్రవర్ణ భూస్వామ్య వర్గాలుంటాయి. అవతలి వైపున దళిత సోదరుడో.. సోదరో వుంటుంది. ఇంకేం న్యాయం జరుగుతుంది ?

> **విద్యా ఉద్యోగ విషయాల్లోను పరిస్థితి అంతే వుంది. కేవలం కొద్ది మంది మాత్రమే రిజర్వేషన్ల ఫలితాలను అనుభవిస్తున్నారు. ఐ.ఎ.ఎస్.లో గానీ, ఐ.పి.ఎస్.లో గానీ ఎంత మంది దళితులు వున్నారు ? దళితుల నుంచి ఎంత మంది విద్యా మంత్రులు, ఎంత మంది ప్రధాన న్యాయమూర్తులయ్యారు ? ఎంత మంది న్యాయ శాఖ శ్రేణుల్లో అధికారులయ్యారు ? దేశంలోని వివిధ ఉన్నత ఉద్యోగాల్లో ఎంత మంది దళితులు వున్నారు ? దళితులకు కల్పించామని చెబుతున్న ప్రత్యేక సదుపాయాలన్నీ బూటకమే.. అతిశయోక్తే.**

మీకు విషయం అర్థం కావడానికి రెండు ఉదాహరణలిస్తాను. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకంలో 75 శాతం దళితుల కోసం కేటాయించారు. సాధారణంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తులను హైకోర్టు న్యాయ మూర్తుల నుండే ఎంపిక చేస్తారనే విషయం అందరికీ తెలిసిందే. మరి హైకోర్టులో ఒక్క దళిత న్యాయమూర్తి లేకపోతే అంతెక్కువ శాతం రిజర్వేషన్ వల్ల సుప్రీంకోర్టు బెంచీలోకి ఒక్క దళిత న్యాయమూర్తి రాదు కదా ! ఇలాంటిదే మరొక ఉదాహరణ. ఇది కేరళలో జరిగింది. ప్రభుత్వం నడిపే కేంద్రంలో ఏనుగులను మచ్చిక చేసి, వాటికి శిక్షణనిచ్చే 'మావటీ' ఉద్యోగాలను గిరిజనులకు రిజర్వు చేశారు. అయితే అందుకు కనీస విద్యార్హత మెట్రిక్యులేషన్ అని ప్రకటించంతో ఒక్క గిరిజనుడూ ఉద్యోగం సంపాదించలేకపోయాడు. నిజానికి వాళ్లందరూ ఏనుగులు క్రూరంగా, సంచరించే అడవుల్లో బతుకుతున్న వారే. వాళ్లకు ఏనుగులను మచ్చిక చేయడం బాగా తెలుసు. ఇట్లా ఎన్నైనా ఉదాహరణలు చెప్పుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీలు 22.5 శాతం ఉన్నారు. వారు ఆ దామాషా ప్రకారం ఉన్నత పదవుల్లో సైతం 22.5 శాతం రిజర్వేషన్ పొందుతున్నాడని ప్రచారముంది. నిజానికి 1979లో ఎస్సీలు 4.75 శాతం, ఎస్టీలు 0.94 శాతం, 1981లో ఎస్సీలు 4.62 శాతం, ఎస్టీలు 0.97 శాతం మాత్రమే క్లాస్ 1 ఉద్యోగాల్లో రిజర్వేషన్ పొందారు. 1982 మార్చి 16వ తేదీ నాటికి 870 మంది ఉన్న హైకోర్టు న్యాయమూర్తుల్లో

కేవలం నలుగురు మాత్రమే ఎస్సీ, న్యాయమూర్తులు కాగా ఒక్క ఎస్టీ న్యాయమూర్తి లేడు. న్యాయ శాఖలోనూ, మిగతా ఉద్యోగాల్లోనూ దళితులు వివక్షకు గురవుతూనే వున్నారు. ఇంకా అస్పృశ్యత కొనసాగుతూనే ఉంది. ఉన్నత విద్యా రంగంలో సైతం రిజర్వేషన్లు సరిగా అమలు కావడం లేదన్నది స్పష్టం. అంబేద్కర్ అమితంగా అభిమానించే మహాత్మాఫూలే "విద్య లేకనే అతి శూద్రులు బాధితులయ్యారు" అని పేర్కొన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ కూడా "విద్యలో నైపుణ్యత సాధించడమనేది సామాజిక దురాచారాలను రూపుమాపడానికి సాధనంగా ఉపయోగపడుతుందని నా నమ్మకం. దేశంలోని అణగారిన జనం సమస్య కేవలం ఆర్థికమే కాదు సాంస్కృతికం కూడా. కేవలం కూడు, గుడ్డ ఆర్థికమే నీడ కల్పించి ఉన్నత వర్గాల వారికి సేవ చేసే వారుగా తయారు చేయడం నాకిష్టం లేదు. తరతరాలుగా నా జనంలో జీర్ణించుకుపోయిన న్యూనతా భావాన్నీ, ఇతరులకు దాస్యం చేసే స్వభావాన్ని తొలగించి ఈ దేశంలోని ప్రస్తుత సామాజిక నిర్మాణంలో క్రూర దోపిడీకి గురవుతున్న వారిని విముక్తి చేయాలని నేననుకుంటాను. ఉన్నత స్థాయిలో విద్యావంతులు కావడం ద్వారానే అది సాధ్యమవుతుందని నా నమ్మకం". అంటారు. కాబట్టి దళితుల్ని పైకి తీసుకురావాలంటే విద్యలో రిజర్వేషన్లను నిజాయితీకి అమలు చేయాలి. దళితుల్ని అక్షరాస్యుల్ని చేయడానికి ఆకర్షణీయమైన చర్యల్ని చేపట్టారు. అవసరమైతే ఇంగ్లీషు మీడియం, కాన్వెంట్ స్కూల్లో రాయితీలిచ్చి చదివించాలి. ఈ విధంగా జరగనంత కాలం రాజ్యాంగంలో చాతుర్వర్ణం కొనసాగుతునే వుంటుంది. ప్రస్తుతం సామాజిక విప్లవం అవసరం. విద్యా విప్లవం అవసరం. ఉన్నత ఉద్యోగాల్లో పెను విప్లవం అవసరం. ఈ మాటలు చర్చకు వచ్చినప్పుడల్లా "ప్రతిభ" ప్రసక్తి వస్తుంది. నిజానికి దళితులకు సరైన వాతావరణం ఏర్పరిచి సరైన అవకాశాలు సమకూర్చి, సరైన శిక్షణనిస్తే అగ్రవర్గాలుగా కొనసాగే వారికి దీటుగా తయారవు వారు. వాళ్లు ఉత్తమోత్తమ ప్రతిభాశీలురుగా వన్నెకెక్కుతారు. ప్రాచీన భారతంలో అత్యంత మేధా సంపన్నుడుగా ప్రసిద్ధి చెందిన తిరువళ్ళువార్దళితుడేవని మీకు తెలుసా? తమిళ భక్తి గీతాలు కూర్చిన ఆళ్వారులు దళితులే. ఈ సందర్భంగా డాక్టర్ బాబాసాహెబ్ చెప్పిన విషయాన్ని ఇక్కడ క్రోడీకరించాలి.

> **"హిందువులు వేదాలు కావాలనుకున్నారు. అందుకే వ్యాసుణ్ణి పిలిచారు. వ్యాసుడు సువర్ణ హిందువు కాదు హిందువులు ఒక పురాణం కావాలనుకున్నారు. అందుకే వాల్మీకిని పిలిచారు. వాల్మీకి అస్పృశ్యుడు. హిందువులు ఒక రాజ్యాంగం కావాలనుకు న్నారు. అందుకు నన్ను పిలిచారు" -డా.అంబేద్కర్**

దళితులకు ఏ దేవుడో ఇచ్చిన శాపమేమీ లేదు. సమాజమే వారిని జ్ఞానానికి, హక్కులకూ, సామాజిక హోదాను దూరం చేసి పశుప్రాయపు బానిసలను చేసి చీకటిలోకి నెట్టివేసింది. ఇప్పుడు వారికేవో రిజర్వేషన్లు వస్తున్నాయని వారిని నిందితుల్ని చూసినట్లు చూడడం, విచిత్రమైన విషయం, మండల్ మంటల్లో, వీధుల్లో రక్తపాతం జరుగుతోంది. అసలు విషయం తెలియక అనవసరపు పోరాటం కొనసాగుతోంది. రిజర్వేషన్ లెక్కల ముసుగులు తొలగించి చూస్తే సామాజిక అణచివేతకు గురవుతున్న వారికి సమాన న్యాయం కల్పించడానికి మనం ఇంకా ఎన్ని మైళ్ల దూరం ప్రయాణించాలో తెలుస్తుంది. దళితుల్లో ఏ కొద్ది మందో కాస్తో, కూస్తో చదువుకొని అప్పటి వరకు తాము జీవించిన అట్టడగు పొరల్ని మర్చిపోతున్నారు. తమ కుటుంబాల్ని చూసుకోడానికి పరిమితమైపోతున్నారు. 1956లో బాబాసాహెబ్ చదువుకున్న దళితుల గురించి ఈ విధంగా అంటారు.

"దళితుల్లో ఉన్నత విద్యనభ్యసించిన వర్గం నాకు ద్రోహం చేసింది. వాళ్లు బాగా విద్యావంతులైన తర్వాత సమాజానికి సేవ చేస్తారని నేను భావించాను. కానీ నేనిప్పుడు తమ పొట్టల్ని నింపుకోవడంలో నిమగ్నమైన గుమస్తాల గుంపును చూస్తున్నాను" (1956 మార్చి 18న ఆగ్రాలోని రామ్ లీలా మైదానంలో ఉపన్యాసం).

అవకాశాలు వచ్చిన వారు కుటుంబాల వరకే చూసుకుంటున్నారు. మిగతా దళితులు దళితులుగానే మిగిలిపోతున్నారు. భూమి లేని నిరుపేద దళితులకు భూమి ఇవ్వకపోతే, చిల్లిగవ్వ లేని అస్పృశ్యునికి కుటీర పరిశ్రమలు కల్పించుకొనే అవకాశం కల్పించకపోతే బానిసత్వంలో మగ్గిపోతున్న స్త్రీ బంధనాలను తెగ తెంచకపోతే, సాభ్రాతృత్వం, సమానత్వం అన్న మాటలు అందని ఆకాశ కుసుమాలే అవుతాయి. దళితులకు రాజ్యాధికారం కావాలి, చట్టసభల్లో దళితులకు రిజర్వేషన్లు న్నాయి. కాబట్టి వాళ్ళ రాజ్యాధికారం సాధిస్తారన్నది వట్టి భ్రమ. అవి రాజకీయ పార్టీల మధ్యన విభజితమై ఉన్నాయి. - అవి కూడా ఆధిపత్య వర్గాల చెప్పు చేతల్లో ఉన్నాయి. దాని వలన రాజకీయ చర్యలో అనైక్యత పెరుగుతుంది. ఈ పరిస్థితికి అంబేద్కర్ చెప్పినదొకటే మందు. ఆయన "అన్ని సమస్యలకూ పరిష్కారం రాజకీయాధికారం ఒక్కటే" అంటారు. అందుకోసం ఆయన దళితులకు ఇచ్చిన "బోధించు, సమీకరించు, పోరాడు" సందేశంతో ముందుకు నడవాలి. ఆఖరి దళిత పల్లె స్వేచ్ఛా స్వాతంత్రాలను పొంది సమానతను సాధించినప్పుడే భారతదేశానికి నిజమైన స్వతంత్ర్యం సిద్ధించినట్లు, దళిత పల్లెలేవీ ఈనాడు స్వేచ్ఛగా లేవన్న సత్యాన్ని ముందు మనం గుర్తిద్దాం. "సత్యాన్ని తెలుసుకో, సత్యం నిన్ను విముక్తి చేస్తుంది" యోహాను 8.32 ❑

అనుసృజన కలేకూరి ప్రసాద్ ("దళిత రాజ్యం" నుండి)

# హిందూత్వ, సామాజిక న్యాయం ఒకే ఒరలో ఇమడవు!

- బి.వి.రాఘవులు



**ప్రధాని నరేంద్ర మోడీ, 'సనాతన ధర్మానికి' తన మద్దతును బహిరంగంగా ప్రకటించినప్పుడే అసలు రహస్యం బయటపడింది. 'సనాతన ధర్మం', సామాజిక న్యాయాన్ని, సమానత్వ భావనను వ్యతిరేకిస్తుందని తెలుపుతూ గతేడాది సెప్టెంబర్‌లో ఉదయనిధి స్టాలిన్ చాలా పదునైన, విమర్శనాత్మక వ్యాఖ్యలు చేసినప్పుడు, మోడీ దానిని గట్టిగా సమర్థించుకున్నాడు. 'సనాతన ధర్మ' వినాశనమే లక్ష్యంగా ఓ రహస్య ఎజెండాను కాపాడుతున్నారని ఆరోపిస్తూ, ఆ ధర్మాన్ని వ్యతిరేకించే వారినుద్దేశించి తీవ్రస్థాయిలో మాట్లాడాడు.**

'సనాతన ధర్మ' విరోధులకు వ్యతిరేకంగా ఎదురుదాడి చేయడానికి హిందూత్వ ప్రచారదళంలో చేరాలని మంత్రుల్ని, తన పార్టీ సభ్యుల్ని రెచ్చగొట్టాడు కూడా. సామాజిక న్యాయం, దళితుల గౌరవం గురించి పదే పదే మోడీ చేస్తున్న వాదనల వెనకున్న కపటత్వంతోపాటు అంబేద్కర్‌పై ఆయన కురిపిస్తున్న ప్రశంసలు, సంత్ రవిదాస్ విగ్రహం పట్ల ఆయన చూపిస్తున్న గౌరవంలోని డొల్లతనాన్ని ఈ సంఘటన బట్టబయలు చేసింది. 'భారతదేశాన్ని వేల ఏళ్లపాటు ఐక్యంగా ఉంచిన ఆలోచనలు, విలువలు, సాంప్రదాయాలను 'సనాతన ధర్మం' కలిగి ఉందని' మోడీ ప్రకటించాడు. అయితే 'పురాతన', 'శాశ్వత', 'సార్వత్రిక సత్యాలు లేదా చట్టాలు' లాంటి అస్పష్టమైన పదాలను తప్ప, 'సనాతన ధర్మానికి' సంబంధించిన ఆలోచనలు, విలువలు, సాంప్రదా యాలను కలిపే విషయం గురించి మోడీ గానీ, తన నేరమయ, హింసాత్మక దళం గానీ వివరించలేదు. ఈ వివరణ లేకపోవడ మనేది 'సనాతన ధర్మం' ప్రాథమిక, విశిష్ట 'వర్ణ లేదా జాతి వ్యవస్థ' లక్షణాన్ని మరుగున పడేస్తుంది. తనకు వనరుగా ఉండే దండు 'సనాతన ధర్మాన్ని' రక్షించడానికి ముందుకు వెళ్ళింది. వారు ఉత్కృష్టమైన వాక్చాతుర్యంతో దాని సారాన్ని దాచిపెట్టి, లోకజ్ఞానం, మానవ విలువలు, వ్యక్తిగత విధులు, బాధ్యతలు, ప్రవర్తనా ప్రమాణాలు, నైతిక విలువలు లాంటి మాటలతో దానిని నిర్వచిస్తున్నారు. 'సనాతన ధర్మం' నిజ స్వభావాన్ని దాచి పెట్టడానికి దాని చుట్టూ వారు అల్లుతున్న అస్పష్టమైన అధ్యాత్మిక వాదాన్ని సద్గురు వాసుదేవ్ వంటి ప్రముఖులిచ్చిన వివరణల్లో మనం చూడవచ్చు.

'మీరు సహజంగా వీటన్నింటికీ మూలాన్ని కనుగొనే విధంగా 'సనాతన ధర్మం' మొత్తం ప్రక్రియ నీలో ప్రశ్నల్ని లేవనెత్తుతుందని' ఆయన పేర్కొన్నాడు. ఇలాంటి మరొక వ్యక్తి, 'సనాతన ధర్మం' అందర్నీ ప్రేమించి, అందర్నీ కలుపుకొని పోతుందని' వ్యాఖ్యానించాడు. ఒకవేళ మనం ఈ వాదనలను 'సనాతన ధర్మం' సారంగా అంగీకరించినా, ఇలాంటి శాశ్వతమైన సత్యాలే మనకు అన్ని మతాల్లో కనిపిస్తాయి. కానీ ఈ అభిప్రాయం అమానవీయ కుల, లింగ వివక్షతను ఎదుర్కొంటున్న దళితులు, ఇతర బలహీన కులాల వారి దినచర్యలో భాగంగా ఎదుర్కొంటున్న అనుభవాలకు వ్యతిరేకంగా ఉన్నాయి. కాబట్టి వాస్తవానికి సనాతన ధర్మాన్ని వేరుగా ఉంచేదేమిటి? నిరాధారమైన వాటిని సమర్థించుకోలేని స్థితి నుండి హిందూత్వ తత్వవేత్తలు తప్పించుకోవడానికి సంక్లిష్టమైన వివరణలు, న్యాయ సమ్మతమైన ఆగ్రహంతో నిమిత్తం లేకుండా వారు సనాతన ధర్మంలో ఉన్న శాశ్వతమైన సత్యం అంటే కఠినమైన, అమానవీయ, శ్రేణీగత, వారసత్వ, పుట్టుక ఆధారిత కులవ్యవస్థను దాచి ఉంచలేరు.

అత్యంత అణచివేత, హానికరమైన 'వర్ణాశ్రమ ధర్మం' లేక 'కుల ధర్మం' కొన్ని వేల సంవత్సరాలుగా భారత దేశాన్ని కలుపుతున్న ఏకైక ముఖ్యమైన ఆలోచన, విలువ, సాంప్రదాయం అనే వాస్తవాన్ని వారెలా విస్మరిస్తారు ? కాబట్టి మోడీ, సంఘ్ పరివార్ ప్రత్యేకమైన బుద్ధి మాంద్యంతో బాధపడుతున్నట్లు కనిపిస్తున్నారు. వేదాలు, ఉపనిషత్తులు, ధర్మ సూత్రాలు, గృహ్య సూత్రాలు, పురాణాలు, భగవద్గీతలు అన్నీ వర్ణ లేదా జాతి ధర్మ వ్యవస్థను సమర్థిస్తాయని వారు నిరాకరించగలరా? వర్ణ ధర్మం నుండి పక్కకు మళ్లుతున్నందుకు కఠినమైన శిక్షను విధించడమే కాక, వర్ణధర్మ పరిరక్షణ పాలకుల ప్రాథమికమైన బాధ్యత అని చెప్పే మనుస్మృతిని మనం పట్టించుకో కూడదని వారు కోరుకుంటున్నారా ? ఒకవేళ మోడీ వర్ణ లేదా జాతి ధర్మాన్ని, సనాతన ధర్మం నుండి వేరు చెయ్యాలనుకుంటే, విమర్శకుల్ని అప్రతిష్టపాలు చేయడానికి ముందే ఆయన ప్రజలకొక విషయాన్ని స్పష్టం చేయాల్సి ఉంటుంది. అది అతనికి ఖచ్చితంగా తెలియకుంటే శ్రేణీగత, వివక్షాపూరితమైన 'వర్ణ లేదా జాతి ధర్మం' వారి పవిత్రమైన గ్రంథాల్లో భాగంగా ఉన్నాయా లేవా అనే విషయంపై అవగాహన కోసం వారు సాధువుల్ని, సంతుల్ని, శంకరాచార్యుల్ని వేడుకోవచ్చు. అయితే, మోడీ ఈ పని చెయ్యడమనేది, వాస్తవాల మీద కాక ఆశల మీద

ఆధారపడిన నమ్మకం కావచ్చు ఎందుకంటే అది అతని కపటత్వాన్ని బయటపెడుతుంది.

ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యల ఫలితంగా ఏర్పడిన వివాదం హిందూత్వ దళం అసలు రంగును బయట పెడుతుంది. మోడీ, ఆయన అనుచరగణం ప్రజల ముందు 19వ శతాబ్దానికి చెందిన సనాతన వాదులకు (మార్పును వ్యతిరేకించే) నిజమైన వారసులుగా చెప్పుకుంటున్నారు. ఈ కాలంలో బ్రాహ్మణ సమాజం, ఆర్య సమాజ్, ప్రార్థనా సమాజ్, రామకృష్ణ మిషన్, తమను తాము సనాతనవాదులుగా పిలుచుకునే వారి నాయకులు ప్రతిపాదించిన సంస్కరణవాద ఆలోచనలను ఎదుర్కొనేందుకు అనేక సంప్రదాయ సనాతన హిందూ సంస్థలు ఆవిర్భవించాయి. ఈ నాయకులే, ఆ 'సనాతన ధర్మానికి' ప్రాచుర్యం కల్పించారు. 'హిందూ' అనే పదం పర్షియన్ మూలాలు కలిగి ఉన్నందు వల్ల ఈ 'సనాతన వాద' సేవా తత్పరులు 'హిందూ' పదాన్ని ఇష్టపడక, దానికి బదులుగా 'సనాతన ధర్మం' అనే పదానికి ప్రాధాన్యత ఇవ్వడం ఆసక్తికరమైన విషయం.

దళితులు ఆరాధించే అంబేద్కర్ గౌరవం, సమానత్వ దార్శనికతను నెరవేర్చడానికి తాను కృషి చేస్తున్నట్టు చేసే నటనను గత దశాబ్ద కాలపు మోడీ పాలనా కాలం బహిర్గతం చేస్తుంది. దానికి బదులుగా మన దేశంలో పీడితులు, దోపిడీకి గురైన ప్రజలు పోరాటాల ద్వారా సాధించుకున్న కొన్ని అధికారిక హక్కులు, కొద్దిపాటి గౌరవాన్ని అతని పాలన ఒక క్రమపద్ధతిలో ధ్వంసం చేసింది. పెరిగిపోతున్న నేరాల రేటు, కుంచించుకుపోతున్న ఉద్యోగావకాశాలు, పెరిగిపోతున్న ఆర్థిక వివక్షత, దిగజారుతున్న దళితులు, గిరిజనుల జీవన స్థితిగతులపై నిర్ధారణను ధ్రువీకరిస్తాయి.

మోడీ హిందూత్వ, కార్పోరేట్ పాలనలో దళిత వ్యతిరేక, గిరిజన వ్యతిరేక నేరాల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఇది, సమాజంలో మొత్తంగా మనువాద భావజాల ప్రాబల్యాన్ని సూచిస్తుంది. 2018 నుండి నాలుగేండ్ల కాలంలో దళితులకు వ్యతిరేకంగా 1.9 లక్షలకుపైగా నేరారోపణ కేసులు నమోద య్యాయి. ఉత్తరప్రదేశ్ ఈ ఆగడాలకు, దాడులకు (మొత్తం 49,613 కేసులతో) ప్రధాన కేంద్రంగా నిలిచింది. 2022వ సంవత్సరాన్ని 2021తో పోల్చితే షెడ్యూల్డ్ కులాల వారికి వ్యతిరేకంగా 13 శాతం కేసులు పెరగ్గా, షెడ్యూల్డ్ తెగల వారికి వ్యతిరేకంగా 14.3 శాతం కేసులు పెరిగాయి. ఎస్సీలకు వ్యతి రేకంగా జరుగుతున్న నేరాల్లో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. అంటే మొత్తం కేసుల్లో 26 శాతం, రాజస్థాన్ 15 శాతం, మధ్యప్రదేశ్ 14 శాతంగా ఉంది. ఎస్టీలకు వ్యతిరేకంగా నమోదైన కేసుల విషయంలో మొత్తం కేసుల్లో 30 శాతంతో మధ్యప్రదేశ్ అగ్రస్థానంలో ఉండగా, 24 శాతంతో రాజస్థాన్, 7.6 శాతంతో ఒడిశాలున్నాయి. నేరాల సంఖ్య పెరగ డంతోపాటు, ఈ నేరాల్లోని క్రూరత్వం దిగ్భ్రాంతిని కలిగిస్తుంది. ఏడుగురు దళిత యువకులను గుజరాత్ రాష్ట్రంలో ఉనాలో బహిరంగంగా కొట్టడం, ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని హత్రాస్‌లో ఒక దళిత మహిళపై అత్యంత క్రూరంగా సామూహిక అత్యాచా రానికి పాల్పడితే, అది ఆమె మరణానికి దారి తీయడం, మధ్యప్రదేశ్ రాష్ట్రంలో సోధీ ఘటనలో ఓ బీజేపీ నాయకుడు ఓ గిరిజన వ్యక్తిపై మూత్ర విసర్జన చేయడం లాంటి సంఘటనలు దేశం యొక్క అంతరాత్మను కదిలించాయి.

సంఘ్ పరివార్, హిందూత్వ శక్తుల అండతో బీజేపీ ప్రభుత్వాలు సృష్టించిన మనువాద వాతావరణంలో దళితులు, గిరిజనులకు వ్యతిరేకంగా ఇలాంటి హేయమైన నేరాలు పాల్పడడానికి కులతత్వ శక్తులెలా ప్రోత్సాహం ఇస్తున్నాయో ఈ భయంకరమైన చర్యలు తెలియజేస్తున్నాయి. ఇవే శక్తులు, సమాజంలోని సామాజిక పీడిత వర్గాలకు సహాయ పడేందుకు ప్రభుత్వ నిశ్చయీకరణ చర్యల పట్ల ఒక శత్రుపూరిత వాతావరణాన్ని ఒక క్రమపద్ధతిలో పెంచి పోషిస్తున్నాయి. బీజేపీ పాలనలో బలహీన వర్గాలకు లభించే కొద్దిపాటి ప్రయోజనాలను కాలరాసేందుకు ప్రభుత్వమే ఈ శక్తులతో లాలూచీ పడుతుంది. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వ పనితీరు ఆమోదయోగ్యంగా లేదు. మార్చి 24,2022న పార్లమెంట్‌లో సమర్పించిన సమాచారం ప్రకారం తొమ్మిది మంత్రిత్వ శాఖలు, రైల్వేలు, ఆర్థిక, ఆటమిక్ ఎనర్జీ, రక్షణ, గృహ, హోం శాఖలతో సహా కేంద్ర ప్రభుత్వ శాఖలన్నింటిలో మొత్తం 82,022 ఖాళీలు ఎస్సీ,ఎస్టీ, ఓబీసీ లకు రిజర్వ్ చేయబడిన పోస్టులున్నాయి. కానీ వాటిలో కేవలం 43శాతం ఖాళీ పోస్టులు మాత్రమే భర్తీ చేశారు.

యూనివర్శిటీలు, ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో పరిస్థితి కూడా చాలా ఘోరంగా ఉంది. ఎస్సీలకు రిజర్వ్ చేయబడిన 42 శాతం ఖాళీ పోస్టులు, ఎస్టీలకు రిజర్వ్ చేయబడిన 39 శాతం, ఓబీసీ లకు రిజర్వ్ చేయబడిన 54 శాతం ఖాళీ పోస్టుల్ని భర్తీ చేయడంలో 45 సెంట్రల్ యూనివర్శిటీలు వైఫల్యం చెందాయి. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో ఎస్సీలకు రిజర్వ్ చేయబడిన 80 శాతం ఖాళీ పోస్టులను ఇంత వరకు భర్తీ చేయకపోవడంతో అది అధ్వాన్నమైన యదార్థ స్థితిగా నిలిచింది. మోడీ నాయకత్వంలో ప్రభుత్వరంగ సంస్థలు, ప్రభుత్వ సేవలు, ఉన్నత విద్యలో ప్రయివేటీకరణ వేగవంతం కావడానికి తోడు ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు లేకపోవడంతోపాటు రిజర్వేషన్ల విషయంలో రాజ్యాంగ ఆదేశాలను ఉల్లంఘిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి కేటాయింపుల గణనీయమైన తగ్గింపు, ఖర్చులలో కోతలు విధించడం ద్వారా వివక్షత కొనసాగింపులో మోడీ ప్రభుత్వమే స్వయంగా తోడుగా నిలిచింది. 2014-15, 2019-20 మధ్య ఆర్థిక **(మిగతా 29వ పేజీలో)**

# అంబేద్కర్ - ఒక గొప్ప ఆర్థికవేత్త

**విద్యార్థి దశలో, కేవలం 32 ఏళ్ల వయసు ఉన్నప్పుడు డాక్టర్ అంబేద్కర్ రాసిన ఓ పుస్తకం భారత ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభంగా నిలిచింది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో డాక్టరేట్ డిగ్రీ కోసం ఆయన చేసిన పరిశోధనే ఈ పుస్తక రూపంలో ఆవిష్కృతమయింది. ఆ పరిశోధన సారాంశం ఆధారంగా రాసి 1923లో లండన్‌లో వెలువరించిన "ద ప్రాబ్లమ్ ఆఫ్ రూపీ" పుస్తకం భారత, బ్రిటిష్ ఆర్థిక వ్యవస్థల బలపడడానికి సహకరించింది. దీనిపై జరిగిన చర్చలు అనంతర కాలంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటుకు బాటలు పరిచాయి.**



లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో అంబేద్కర్

భారత రాజ్యాంగ నిర్మాతగా అంబేద్కర్ అందరికీ తెలుసు. భారత సమాజంలోని కులవ్యవస్థ కారణంగా శతాబ్దాలపాటు అణగారిన దళిత వర్గాల్లో చైతన్యం నింపిన నాయకునిగానూ ఆయన పరిచయమే. ఇంతటి విప్లవాన్ని ఒంటి చేత్తో నడిపించినందుకు ఆయనను "మహా మానవ్ " అని ప్రజానీకం ఆప్యాయంగా పిలుచుకుంటుంది. అంబేద్కర్ వ్యక్తిత్వం విశ్వ వ్యాపితం. మతం, మానవ వికాసం, సామాజిక శాస్త్రాలు, రాజనీతి శాస్త్రం.. ఇలా అన్నింటిలోనూ ఆయన మేధాశక్తి అపారమైనది. ఆయన రచనలు, ప్రసంగాలను పరిశీలిస్తే ఆయన హృదయానికి, ఆలోచనలకు దగ్గరగా ఉన్నది ఆర్థిక శాస్త్రం మాత్రమేనని అర్థమవుతుంది.

రాజ్యాంగ నిర్మాత, కుల వ్యవస్థ వ్యతిరేక పోరాట యోధుడు అని చెప్పిన తరువాత మాత్రమే అంబేద్కర్‌ను ఆర్థికవేత్త అని ప్రస్తావిస్తుంటారు. కానీ, ఆర్థిక సిద్ధాంతాలే, దశాబ్దాలపాటు కొన సాగిన ఆయన రాజకీయ జీవితంపై ఎక్కువ ప్రభావం చూపాయి. ఆయన ఆలోచనలు దేశ ఆర్థిక వ్యవస్థకు మార్గదర్శనం చేశాయి. మరీ ముఖ్యంగా దేశంలో అన్ని ఆర్థిక కార్యకలాపాలను పర్యవేక్షించడానికి ఓ కేంద్రీయ బ్యాంకు ఉండాలన్న ప్రతిపాదనకు అంబేద్కర్ ఆలోచనలు, పరిశోధనలే మార్గదర్శనం చేశాయి. అయితే ఆయన పడ్డ ఈ శ్రమకు, ఆలోచనలకు ఇంత వరకు అంతగా గుర్తింపు లభించలేదు.

భారతీయ రిజర్వు బ్యాంకు ఏర్పాటుకు బ్రిటిషు పాలనలోనే పెద్ద స్థాయిలో మేధో మథనం జరిగింది. ఈ ప్రక్రియలో అంబేద్కర్‌ది క్రియాశీల పాత్ర. భారతీయ కరెన్సీపై ఆయన చేసిన సైద్ధాంతిక, ఆచరణాత్మక విశ్లేషణ రిజర్వు బ్యాంకు స్థాపన లో నిర్ణయాత్మక పాత్ర పోషించినట్టు ఆర్థిక శాస్త్రవేత్తలు విశ్వసిస్తున్నారు.

## కేంద్రీయ బ్యాంకు ఏర్పాటు పరిణామ క్రమం

భారతీయ రిజర్వు బ్యాంకు 1935 ఏప్రిల్ 1న ఏర్పాటయింది. ఇది విదేశీ కరెన్సీతోపాటు దేశంలోని కరెన్సీ నిల్వలు, నియంత్రణ, అందుకు సంబంధించిన వ్యవహారాలను చూస్తుంది. దేశంలోని మొత్తం అన్ని బ్యాంకులకు అది బ్యాంకుగా పనిచేస్తుంది. దీని ఏర్పాటు వెనుక ఉన్న చరిత్ర చాలా సుదీర్ఘమైనదే. తెలుసుకోవాలంటే ఆంగ్లేయుల పాలన కాలం నాటికి వెళ్లాల్సిందే. ఈస్ట్ ఇండియా కంపెనీ వచ్చిన దగ్గర నుంచి బ్రిటిషు ప్రభుత్వ ప్రత్యక్ష పాలన మొదలయ్యే వరకు దేశ ఆర్థిక వ్యవస్థ చాలా మార్పులకు లోనయింది. ఇందులో బ్యాంకింగ్ వ్యవస్థ ఏర్పాటు చాలా కీలకమైనది. ఓ క్రమ పరిణామంలో ఫార్మల్ బ్యాంకింగ్ రంగం వేళ్లూనుకుంది. ఈ ప్రయాణంలో ఎదురైన మలుపులను రాహుల్ బజోరియా తాను రాసిన "ద స్టోరీ ఆఫ్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా"లో వివరంగా రాశారు. ఈస్ట్ ఇండియా కంపెనీ ద్వారా దేశంలో బ్రిటిషు సామ్రాజ్యానికి పునాది వేసిన తొలితరం పాలకుల్లో వారెన్ హేస్టింగ్స్ ప్రముఖుడు. కంపెనీ లావాదేవీలు నడపడానికి బ్యాంకు ఉండాల్సిన అవసరాన్ని తొలిసారిగా గుర్తించింది ఆయనే. "జనరల్ బ్యాంక్ ఆఫ్ బెంగాల్ అండ్ బిహార్" ఏర్పాటు చేయాలని 1773లో ఆయన ప్రతిపాదించారు. అయితే అది తిరస్కరణకు గురయింది. తర్వాత రోజుల్లో కంపెనీ పరిధిలోకి

వచ్చిన ప్రాంతాలు పెరగడంతో అనుమతి లభించింది. ఆ మేరకు 1806లో "బ్యాంక్ ఆఫ్ బెంగాల్" ఏర్పాటైంది. బెంగాల్, బిహార్‌లలో సొంతంగా కరెన్సీ నోట్లను ముద్రించి, చలామణిలోకి తెచ్చే అధికారం కూడా ఆ బ్యాంకుకు ఇచ్చారు.

దేశంలో బ్రిటిష్ పాలన కిందకు మరిన్ని ప్రాంతాలు రావడంతో కొత్తగా ఇంకొన్ని బ్యాంకులు ఏర్పాటయ్యాయి. 1840లో బ్యాంక్ ఆఫ్ బాంబే, 1843లో బ్యాంక్ ఆఫ్ మద్రాస్ ల స్థాపన జరిగింది. మొత్తంగా ఈ మూడు బ్యాంకులను ప్రెసిడెన్సీ బ్యాంకులు అని పిలిచేవారు. ఆయా ప్రావిన్స్‌ల్లోని వ్యవహారాలను ఇవి పర్యవేక్షించేవి. 1857లో సిపాయిల తిరుగుబాటు అనంతరం దేశ పరిపాలన ఈస్ట్ ఇండియా కంపెనీ నుంచి బ్రిటిష్ ప్రభుత్వం చేతిలోకి వెళ్లింది. దీంతో క్రమ బద్ధ బ్యాంకింగ్ రంగాన్ని విస్తరించాల్సిన అవసరం ఏర్పడింది.

1861లో బ్రిటిష్ ప్రభుత్వం-పేపర్ కరెన్సీ యాక్ట్-ను ఆమోదించి కరెన్సీకి చెందిన అన్ని అంశాలనూ తన అధీనంలోకి తెచ్చుకొంది. ఈ దృష్ట్యా దేశంలోని అన్ని ఆర్థిక వ్యవహారాలను సమన్వయం చేయడానికి ఓ కేంద్రీయ బ్యాంకును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆ సమయంలోనే కొందరు అభిప్రాయపడ్డారు. కరెన్సీ మారకం విలువలో వచ్చిన ఒడిదుడుకులు సెంట్రల్ బ్యాంకు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను పురిగొల్పాయి. ఆ రోజుల్లో ఇండియన్ కరెన్సీ విలువను వెండి ధరను ఆధారంగా చేసుకొని లెక్కించే వారు. అంటే-సిల్వర్ స్టాండర్డ్- విధానాన్ని అనుసరించేవారు. 1892లో బంగారంతో పోల్చితే వెండి ధరలు బాగా పడిపోవడంతో కరెన్సీ మారకం విలువపై సమీక్ష చేయాల్సిన అవసరం ఏర్పడింది. దాంతో ఇండియన్ కరెన్సీపై ఏర్పాటయిన రివ్యూ కమిటీ.. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ తరహాలో కేంద్రీయ బ్యాంకు ఏర్పాటు చేయాల్సిన అవసరముందని సూచించింది. కానీ వివిధ రకాల వాణిజ్య ప్రయోజనాల దృష్ట్యా దీన్ని పక్కన పెట్టేశారు. ఈ దిశగా చాలా కాలం ఎలాంటి అడుగూ పడలేదు. అనంతరం దేశంలోని ఆర్థిక వ్యవహారాలను పరిశీలించడానికి - రాయల్ కమిషన్ ఆన్ ఇండియన్ ఫైనాన్స్ అండ్ కరెన్సీ - ఏర్పాటయింది. దీన్నే ఛాంబర్లిన్ కమిషన్ అని పిలిచేవారు. యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్‌కు చెందిన విఖ్యాత ఆర్థిక శాస్త్రవేత్త జాన్ మేనార్డ్ కీన్స్ (జేఎం కీన్స్) 1913లో ఈ కమిషన్ సభ్యుడయ్యారు. భారత ఆర్థిక వ్యవస్థ, కరెన్సీపై లోతుగా అధ్యయనం చేసిన నిపుణుడాయన.

రూపాయి విషయానికి వస్తే.. ఉప ఖండం కరెన్సీగా రూపాయి స్థిరపడే వరకు అన్ని ప్రాంతాల్లోనూ ఇతర కరెన్సీతోపాటు దాన్ని స్థానిక కరెన్సీగా గుర్తించేవారు. 1910లో ప్రభుత్వం - యూనివర్సల్ పేపర్ కరెన్సీ యాక్ట్-ను తీసుకు వచ్చింది. దాని ఆధారంగా 5, 10, 100 నోట్లను చలామణిలోకి తెచ్చింది. వీటన్నింటినీ పరిశీలించిన ఛాంబర్లిన్ కమిషన్, 1914లో నివేదిక సమర్పించింది. మూడు ప్రెసిడెన్సీ బ్యాంకులను విలీనం చేసి కేంద్రీయ బ్యాంకు ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. దానిపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలని సూచించింది. ప్రభుత్వ ఆదాయాలు, అప్పులు, కరెన్సీ ముద్రణ, నియంత్రణ అన్ని బాధ్యతలను ఆ బ్యాంకుకు అప్పగించాలని సలహా ఇచ్చింది.

మొదటి ప్రపంచ యుద్ధం అనంతరం 1921లో బ్రిటిషు ప్రభుత్వం మూడు ప్రెసిడెన్షియల్ బ్యాంకులను విలీనం చేసి ఇంపీరియల్ బ్యాంకుకు రూపకల్పన చేసింది. అయితే కరెన్సీ నోట్లపై ఎలాంటి హక్కులనూ ఈ బ్యాంకుకు కల్పించలేదు. అనంతర కాలంలో అంటే 1955లో ఈ బ్యాంకునే భారత ప్రభుత్వం జాతీయం చేసి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగా మార్చడం గమనార్హం. ఈ సమయంలోనే రూపాయి మారకం విలువ తీవ్రమైన ఆటుపోట్లకు లోనైంది. యుద్ధం కారణంగా 1917లో ప్రభుత్వం బంగారం అమ్మకాలపై నిషేధం విధించడంతో వెండి ధరలు విపరీతంగా పెరిగాయి. దాంతో రూపాయికి ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. పౌండ్ స్టెర్లింగ్‌తో పోల్చినప్పుడు రూపాయి మారకం విలువను స్థిరంగా ఉంచాలన్న డిమాండ్లు ఊపందుకున్నాయి. అయితే ఏవీ ఆచరణలోకి రాలేదు. ఈ నేపథ్యంలో భారత కరెన్సీలో తీసుకురావాల్సిన సంస్కరణలపై అధ్యయనం చేయడానికి హిల్టన్ యంగ్ కమిషన్‌ను బ్రిటిష్ ప్రభుత్వం నియమించింది. రిజర్వు బ్యాంకు ఏర్పాటులో ఇదే కీలక అడుగు. సరిగ్గా ఇదే దశలో అంబేద్కర్ రంగంలోకి దిగారు. హిల్టన్ యంగ్ కమిషన్ సభ్యులందరి చేతుల్లో అంబేద్కర్ రాసిన - ద ప్రాబ్లం ఆఫ్ రూపీ- పుస్తకం కనిపించింది. వారికి అది కరదీపికలా మారింది.

### రూపాయిని కాపాడిన ఆర్థికవేత్త అంబేద్కర్

విద్యార్థి దశ నుంచే అంబేద్కర్‌కు ఆర్థిక రంగంపై ఆసక్తి ఉండేది. దేశ చరిత్ర-వర్తమానం-భవిష్యత్తు చుట్టూ ఆయన ఆలోచనలు తిరుగుతుండేవి. 1913లో న్యూయార్క్‌లోని కొలంబియా యూనివర్సిటీలో చేరారు. అక్కడి ఎకనామిక్స్ ప్రొఫెసర్ ఎడ్విన్ సెలిగ్మాం స్ఫూర్తితో ఎం.ఎ.ఆర్థిక శాస్త్రంలో చేరారు. ఎం.ఎ.లో -అడ్మినిస్ట్రేషన్ అండ్ ఫైనాన్స్ ఆఫ్ ది ఈస్ట్ ఇండియా కంపెనీ- అనే అంశంపై అంబేద్కర్ థీసిస్ రాశారు. 1792 నుంచి 1958 వరకు అంటే దేశంలో ఆ కంపెనీ బాగా విస్తరించిన సమయంలో జరిగిన ఆర్థిక కార్యకలాపాలపై అధ్యయనం చేశారు. దేశంలోని పాలనా రంగం, ఆర్థిక వ్యవహారాలపై అది ఏ విధంగా ప్రభావం చూపిందో విశ్లేషించారు. ప్రజలను దోపిడీ చేసిన తీరునూ ధైర్యంగా వివరించి చెప్పారు.

ఒకవైపు సౌకర్యాలు మెరుగుపడి జీవన శైలిలో మార్పులు

కనిపిస్తున్నాయని, మరోవైపు భారతీయులు ఆర్థిక బానిసలుగా మారారని తన పరిశోధన వ్యాసంలో కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు అంబేద్కర్. అనంతరం లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో అంబేద్కర్ రీసెర్చ్ నిమిత్తం చేరారు. ఆ సమయంలో ఇంగ్లాండ్‌లోను, ఇండియాలోను రూపాయి మారకం విలువపైనే చర్చలు జరుగుతుండేవి. రూపాయి విలువ తరచూ పడిపోతుండడం, విలువను సుస్థిరంగా ఉంచడానికి తీసుకోవాల్సిన చర్యలు, ఇందుకు గోల్డ్ ఎక్స్ఛేంజ్ స్టాండర్డ్, గోల్డ్ కన్వర్టబుల్ స్టాండర్డ్‌లో ఏది మంచిది, ఏ విధానాన్ని అనుసరించాలి, కేంద్రీయ బ్యాంకు ఏర్పాటు తదితర అంశాలపై చర్చలు నడుస్తుండేవి. అందువల్ల పీహెచ్‌డీ పరిశోధనలో భాగంగా - రూపాయి సమస్యలపై అధ్యయనం చేయాలని నిర్ణయానికి వచ్చారు అంబేద్కర్. ఆ పరిశోధనల ఫలితమే ద ప్రాబ్లమ్స్ ఆఫ్ ద రూపీ. అప్పటికే భారతదేశ ఆర్థిక రంగంపై అధ్యయనం చేసిన ప్రొఫెసర్ జేఎం కీన్స్ భారత్‌కు మేలైన కరెన్సీ విధానం ఏదనేదానిపై కొన్ని సూచనలు చేశారు. కానీ వాటన్నంటినీ అంబేద్కర్ పూర్తిగా వ్యతిరేకించారు. కీన్స్, అంబేద్కర్ వివాదాన్నిప్రముఖ ఆర్థిక వ్యవహారాల నిపుణుడు, లోక్‌సత్తా సంపాదకుడు గిరీశ్ కుబేర్ - అర్థశాస్త్రి అంబేద్కర్ - అన్న పేరుతో రాసిన వ్యాసంలో వివరించారు.

### కుబేర్ తన వ్యాసంలో ఏం రాశారంటే..

"కరెన్సీ వ్యవహారాలపై సాధికారికంగా చెప్పే వారిలో ప్రపంచంలోనే ప్రొఫెసర్ కీన్స్ ప్రథమ స్థానంలో ఉంటారు. ఈ విషయాల్లో ఆయన అభిప్రాయం తీసుకోకుండా నిర్ణయాలు తీసుకునే అవకాశమే ఉండదు. కానీ అంబేద్కర్ ఆయన ఆలోచనా విధానాలను పూర్తిగా సవాలు చేశారు. భారత కరెన్సీకి - గోల్డ్ ఎక్స్ఛేంజ్ స్టాండర్డ్ - విధానం సరైనదని కీన్స్ సిఫార్సు చేశారు. ఈ విధానం ప్రకారం కరెన్సీని పౌండ్, డాలర్ల రేట్లతో సరిపోల్చుతారు. వాటిని కూడా బంగారంగానే పరిగణిస్తారు. వాటితో రూపాయిని సరిపోల్చి విలువను నిర్ణయిస్తారు. అదే గోల్డ్ కన్వర్టబుల్ స్టాండర్డ్‌లో అయితే బంగారం నిల్వలు, ధరకు అనుగుణంగానే రూపాయి విలువ ఉంటుంది. భారత్ వలస దేశం కావడంతో గోల్డ్ ఎక్స్ఛేంజ్ స్టాండర్డ్- విధానం సరిపోతుం దని బ్రిటిష్ ప్రభుత్వం, కీన్స్ లాంటివారు భావించారు. దీన్ని అంబేద్కర్ తీవ్రంగా వ్యతిరేకించారు. గోల్డ్ ఎక్స్ఛేంజ్ స్టాండర్డ్ విధానం వల్ల రూపాయి మారకం రేటులో స్థిరత్వం రాదని ఆయన వాదించారు. తన వాదనకు మద్దతుగా 1800-1893 మధ్య ఉన్న కరెన్సీ విలువలపై అధ్యయనం చేసి రూపాయి విలువ ఏ విధంగా మార్పులకు లోనయిందో చూపించారు. వెనుకబడిన దేశమైన ఇండియాకు ఇది సరిపోదని చెప్పారు. దీని వల్ల ద్రవ్యోల్బణం పెరుగుతుందని తెలిపారు. అంబేద్కర్ అక్కడితోనే ఆగిపోలేదు. విస్తృతంగా అధ్యయనం చేయడం ద్వారా బ్రిటిష్ ప్రభుత్వంపై తీవ్రమైన ఆరోపణలు చేయగలిగారు. భారత్‌కు ఎగుమతులు చేసే బ్రిటిష్ వ్యాపారులకు అధికంగా లాభాలు వచ్చేలా చేయడానికే కావాలని రూపాయి విలువను అధికంగా చేసి చూపిస్తున్నారని, అందుకే గోల్డ్ ఎక్స్ఛేంజ్ స్టాండర్డ్ కావాలని సిఫార్సు చేస్తున్నారని విమర్శించారు. అందువల్ల రూపాయి మారకం విలువను తగ్గించాలని డిమాండు చేశారు కూడా.

### యంగ్ కమిషన్ ఎదుట అంబేద్కర్ 'టెస్టిమొనీ'

ఆర్థిక శాస్త్రంతో సంబంధం ఉన్న వారంతా అప్పట్లో అంబేద్కర్ పుస్తకంపై విస్తృతంగా చర్చలు జరిపేవారు. ఇలాంటి పరిస్థితుల్లోనే హిల్టన్ యంగ్ ఆధ్వర్యంలో నియమించిన రాయల్ కమిషన్ 1925లో భారత్‌కు వచ్చింది. భారత కరెన్సీ ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసి, ప్రభుత్వానికి తగిన సిఫార్సులు చేయడం దాని విధి. ఈ కమిషన్ సభ్యుల్లోని ప్రతి ఒక్కరూ అంబేద్కర్ థీసిస్‌ను చదివారు. దాంతో కమిషన్ ఎదుట హాజరై 'టెస్టిమొనీ' ఇవ్వాలని ఆయన్ను కోరారు. తన పుస్తకం ఆధారంగా సమస్యలను విశ్లేషించి, ప్రాక్టికల్‌గా అమలు చేయదగ్గ చర్యలను సిఫార్సు చేశారు. భారత్‌కు గోల్డ్ ఎక్స్ఛేంజ్ స్టాండర్డ్ విధానం కాకుండా గోల్డ్ కన్వర్టబుల్ స్టాండర్డ్ విధానమే మేలైనదని వాదించారు. దాంతో మరికొన్ని సమస్యలపై సభ్యులు ఆయన అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ చర్చలన్నీ అనంతరం ప్రచురితమయ్యాయి.

### కాలాతీతమైన సందేశం

సంక్లిష్టమైన కరెన్సీ వ్యవహారాలపై తన అభిప్రాయాలను చెప్పడంతో పాటు, వీటి నియంత్రణకు కేంద్రీకృత వ్యవస్థ ఉండాలని అంబేద్కర్ నొక్కి చెప్పారు. ఆ విధంగా రిజర్వు బ్యాంకు ఏర్పాటులో ప్రముఖ పాత్ర పోషించారు. "తన పుస్తకంలో అధిక భాగాన్ని రూపాయికి సుస్థిరమైన, హేతుబద్ధమైన అంతర్గత విలువను తీసుకురావడానికే కేటాయించారు. ఆ విలువ ఉంటేనే మనీ సప్లై మీద నియంత్రణ ఉంటుంది. కరెన్సీని ఇష్యూ చేసే అధికారాన్ని ప్రభుత్వం చేతుల నుంచి తీసుకోవడం కూడా సాధ్యమవుతుంది. ప్రభుత్వం ఇష్టం వచ్చిన రీతిలో కరెన్సీని విడుదల చేస్తున్నందున దేశంలోని అంతర్గత వాణిజ్యం దెబ్బ తింటోందని ఆయన అభిప్రాయపడ్డారు. కమిషన్‌లోని మరికొందరు సభ్యులు ఇలాంటి అభిప్రాయాలే వ్యక్తం చేశారు. అప్పటికే చాలా దేశాల్లో కేంద్రీయ బ్యాంకులు ఏర్పాటు కావడంతో ఇండియాలోనూ అలాంటి దాన్ని ఏర్పాటు చేయాలనే సూచనలు వచ్చాయి. దాంతో 1926 జులైలో ఇచ్చిన కమిషన్ తుది నివేదికలో కొత్తగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. కరెన్సీ చలామణి, ఎక్స్ఛేంజి రేటు నిర్వహణపై దానికి

అధికారాలు ఉండాలని, అది ప్రభుత్వానికి బ్యాంకుగా పనిచేయాలని తెలిపింది" అని వివరించారు. ఒక ఆర్థికవేత్తగా అంబేడ్కర్ సేవలపై సీనియర్ ఆర్థిక శాస్త్రవేత్త, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ నరేంద్ర జాదవ్.. ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో వ్యాసం రాశారు. "భారత ఆర్థిక రంగం ఇప్పుడు సంపూర్ణంగా మారిపోయింది. కానీ అంబేడ్కర్ ఇచ్చిన ప్రధాన సందేశం కాలానికి అతీతంగా నిలిచింది. కరెన్సీని విడుదల చేయడానికి విచక్షణాధికారాలు ఉన్న వ్యవస్థను నియంత్రించడానికి ఓ ఏర్పాటు ఉండాలని ఆయన చెబుతుండేవారు. అది ఇప్పటికీ వర్తిస్తుంది" అని ఆయన అందులో వ్యాఖ్యానించారు. ప్రపంచీక రణతో అనుసంధానమైన దేశ ఆర్థిక వ్యవస్థలో రిజర్వ్ బ్యాంకు బాధ్యతలను పరిశీలించినప్పుడు అంబేడ్కర్ ఆలోచనలు మార్గదర్శకాలుగా నిలుస్తాయి.

**రిజర్వ్ బ్యాంక్ ఏర్పాటు**

యంగ్ కమిషన్ సిఫార్సుల మేరకు రిజర్వ్ బ్యాంకు ఏర్పాటు చేయడానికి నిర్ణయించిన బ్రిటిష్ ప్రభుత్వం 1927లో బిల్లు ప్రవేశపెట్టింది. ఆ సంస్థకు స్వయం ప్రతిపత్తి కల్పించింది. అటానమీని కాపాడడం కోసం మేనేజ్‌మెంట్ బాడీలో రాజకీయ సంబంధాలు ఉన్నవారిని నియమించకూడదని నిర్ణయించింది. అయితే ఏకాభిప్రాయం కుదరకపోవడంతో బిల్లుకు వెంటనే ఆమోదం లభించలేదు. 1928లో దాన్ని రివైజ్ చేసి మళ్లీ పెట్టినా విభేదాలు మాత్రం తొలగకపోవడంతో అప్పుడు కూడా పాస్ కాలేదు. 1930లో జరిగిన మొదటి రౌండ్ టేబుల్ కాన్ఫ రెన్స్‌లో మరోసారి దీని ప్రస్తావన వచ్చింది. రాజకీయ సంస్కరణలు, హక్కులు కల్పించడంతోపాటు, ఆర్థిక హక్కులకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలన్న డిమాండ్లు వచ్చాయి. కేంద్రీయ బ్యాంకు ఏర్పాటు అవసరాన్ని సమావేశంలో బలంగా చెప్పారు. దాంతో 1933లో ఇంకోసారి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బిల్లును ప్రవేశపెట్టారు. 1934 మార్చి 6న గవర్నర్ జనరల్ సంతకం చేయడంతో అది చట్టరూపం దాల్చింది. ఆ మేరకు 1935 ఏప్రిల్ 1న రిజర్వ్ బ్యాంకు ఏర్పాటయింది. ఈ సర్వోన్నత బ్యాంకు ఏర్పాటు కాకముందు భారత బ్యాంకింగ్ వ్యవస్థ ఎన్నో సంక్షోభాలను ఎదుర్కొంది. వివిధ దశల్లో అంబేడ్కర్ తీసుకున్న వైఖరి, చేసిన వాదనలు, ఆయన ఆర్థిక విధానాలు వీటన్నింటినీ అధిగమించేలా చేశాయి. తద్వారా నేటికీ బ్యాంకింగ్ వ్యవస్థకు వెన్నుదన్నులా ఉన్న రిజర్వ్ బ్యాంక్ ఏర్పాటుకు సహకరించాయి. ❑

**(బి.బి.సి. సౌజన్యంతో)**

# హిందూత్వ, సామాజిక న్యాయం ఒకే ఒరలో ఇమడవు!

**(25వ పేజీ తరువాయి)**

సంవత్సరాల్లో జనాభా దామాషా ఆధారంగా జరిగిన మొత్తం కేటాయింపుల్లో కేవలం 20.8 శాతం మాత్రమే వారి సంక్షేమానికి ఖర్చు చేసినట్లు కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ పత్రాలు తెలియజేస్తున్నాయి. ఇది, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు న్యాయంగా చెల్లించాల్సిన 7.51 లక్షల కోట్ల రూపాయలను నిలిపి వేయడంతో సమానం. దీనితో పాటు 2017-18లో ఎస్సీ సబ్‌ప్లాన్, ఎస్టీ సబ్‌ప్లాన్లను రద్దు చేయడం ద్వారా మోడీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ఉద్దేశించబడిన యంత్రాంగాన్ని ధ్వంసం చేసింది.

ఈ మార్పుల ఫలితంగా మోడీ రెండోసారి ప్రధాని పదవి చేపట్టిన 2019-20, 2023-24 మధ్య కాలంలో కేంద్ర, కేంద్ర రంగ ప్రాయోజిత పథకాల కేటాయింపుల మొత్తం నిధుల్లో ఎస్సీలకు కేవలం 10.6 శాతం మాత్రమే కేటాయించారు. కేటాయింపుల్లో కూడా కేవలం 3.3 శాతం మాత్రమే ఎస్సీల పథకాలకు మళ్ళించారు. మిగిలినవి సాధారణ పథకాలకు కేటాయించారు. ఎస్టీల కుద్దేశించబడిన కేటాయింపుల్లో కూడా ఇదే వైఖరిని ప్రదర్శించింది. ఎస్టీలకు కేటాయించిన మొత్తం నిధుల్లో కేవలం 2.5 శాతం మాత్రమే లక్ష్య పథకాలకు కేటాయించారు. కేటాయించిన నిధుల్ని కూడా పూర్తి స్థాయిలో వినియోగించలేదు. స్వాతంత్ర్యం సిద్ధించిన ఏడున్నర దశాబ్దాల తర్వాత కూడా దళితుల సాధారణ పరిస్థితి చాలా ఘోరంగా ఉంది. 58 శాతం దళితులకు భూమి లేదు.మోడీ పరిపాలనలో ఆదివాసీలను, దళితులను పెద్దసంఖ్యలో అభివృద్ధి పేరుతో వారి భూముల నుండి బలవంతంగా వెళ్ళగొడుతున్నారు. స్వంత భూములున్న 50 శాతం దళితులకు సాగునీటి సౌకర్యాలు లేవు. సాధారణ జనాభాలో 33.3శాతం జనాభాతో పోల్చినప్పుడు 65.8శాతం దళితులు, 81.4శాతం గిరిజనులు బహు మితీయ (మల్టీ డైమెన్షనల్) పేదరికంలో జీవిస్తున్నారు, ఇది చాలా తీవ్రమైన పరిస్థితి. ఎస్సీలలో అక్షరాస్యతా రేటు కేవలం 66 శాతంగానే ఉండగా, ఎస్టీల్లో అది 59 శాతంకన్నా తక్కువగా ఉంది, అంటే జాతీయ సగటు రేటు 73శాతం కంటే కూడా తక్కువగా ఉంది.అంతే కాకుండా 2022 నాటికి ఎస్సీలలో నిరుద్యోగ రేటు 8.4 శాతంగా చాలా ఎక్కువగా ఉంది.ఎస్సీలలో అసంఘటిత రంగ కార్మికులు చాలా ఎక్కువగా 84శాతంగా ఉన్నారు. ఈ గణాంకాలు మోడీ నాయకత్వంలోని మతతత్వ, కార్పొరేట్ ప్రభుత్వం దళిత వ్యతిరేక, పేద ప్రజల వ్యతిరేక స్వభావాన్ని తెలియజేస్తుంది. మోడీ హిందూత్వ లేక 'సనాతన ధర్మ' భావజాలంలో సామాజిక న్యాయాన్ని వెతకడం అంటే ఎండమావిలో నీటిని వెతకడం లాంటిదే. ❑ **(ప్రజాశక్తి సౌజన్యంతో)**

# దళితులు - భూమి - అంబేద్కర్



- డా॥ కత్తి పద్మారావు

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రధానంగా ఆర్థిక శాస్త్రవేత్త. 1915లో కొలంబియా యూనివర్సిటీలో 'ప్రాచీన భారత వాణిజ్యం'పై పరిశోధనా పత్రాన్ని సమర్పించి ఎంఎ డిగ్రీని పొందారు. ఆయన అత్యంత శ్రమతో పరిశోధించిన 'నేషనల్ డివిడెండ్స్ ఆఫ్ ఇండియా' అనే పరిశోధన గ్రంథాన్ని 1916 జూన్‌లో పీహెచ్‌డీ కోసం కొలంబియా యూనివర్సిటీకి సమర్పించారు. ఈ గ్రంథం 'ది ఎవల్యూషన్ ఆఫ్ ప్రిన్సిపుల్ ఫైనాన్స్ ఇన్ బ్రిటిష్ ఇండియా' అనే పేరు మీద ప్రకటించబడింది. తరువాత లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్సులో 1916 జూన్‌లో చేరారు. ఈ డిగ్రీలో ఎక్కువ భారత ఆర్థిక వాణిజ్య శాస్త్రాలకు సంబంధించినవి కావడం వల్ల భారతదేశంలో ఆయన ఆర్థికంగా ప్రతిపాదించిన అంశాలు చాలా ముఖ్యమైనవి. మానవ హక్కుల పోరాటంలోను ఆయన అద్వితీయుడు. అంబేద్కర్ తన రాజకీయ ప్రణాళికలో ప్రధానాంశాలను ఇలా చెప్పారు.

> **'భారతీయులందరికీ హక్కుల సమానత్వం ఉండాలి. ప్రతి పౌరుడూ తనను తాను అభివృద్ధి చేసుకోవడానికి ప్రభుత్వం సోపానం కావాలి. మత, ఆర్థిక, రాజకీయ స్వాతంత్ర్యాలు ప్రతి భారతీయుడి హక్కు. సమాన అవకాశాలు ప్రతి భారతీయుడి హక్కు. మనిషిని మనిషి, ఒక వర్గాన్ని మరో వర్గం, ఒక దేశాన్ని మరో దేశం దోచుకోవడం, అణచివేయడాన్ని నా రాజకీయ ప్రణాళిక వ్యతిరేకిస్తూ ఉంది.'** అంబేద్కర్ ఆలోచనల్లో ప్రధానమైంది దళితులకు చదువుతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలు కల్పించాలని ఇలా కోరారు.

**'దళితులకు చదువుతోపాటు సేవల విషయం శ్రద్ధ చూపడం ద్వారా మాత్రమే సమాజంలో వారి ఆర్థిక స్థాయి పెంచగలమని నా నమ్మకం. అయితే, షెడ్యూల్డ్ కులాల వారి ఆర్థిక స్థోమత పెంచే మార్గాలేమిటి? ఆర్థిక పురోగతి సాధింపజేయాలంటే లాభదాయకమైన వృత్తులు చేపట్టే అవకాశాలు వారికి కల్పించాలన్నది సుస్పష్టం. లాభదాయకమైన వృత్తులలో ప్రవేశించేందుకు వారికి ద్వారాలు తెరిచేదాకా వారు ఆర్థికంగా బలపడే అవకాశమే లేదు. అప్పటిదాకా వాళ్ళు బానిసలుగానే మిగిలిపోతారు లేదా గ్రామాల్లో భూస్వాముల దగ్గర వెట్టి కార్మికులుగా ఉండిపోతారు. ఇందులో అనుమానానికి తావే లేదు. ఈ లాభదాయకమైన ఆదాయ మార్గాల విషయానికొస్తే అన్నిటి కంటే ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాల వారికి భూమి ఇవ్వడం మీద ప్రభుత్వం దృష్టి సారించాలనేది నా అభిప్రాయం.'**

దళితులు కేవలం ఓటర్లుగానే కాదు వారికి భూమిని ఇవ్వడం చాలా ముఖ్యమని ఆయన ఇలా అన్నారు. **'దళితులకు భూమి మీద హక్కు కల్పిస్తే స్వతంత్ర జీవనోపాధికి అవకాశం ఏర్పడుతుంది. అప్పుడు ఎవరికీ భయపడాల్సిన అవసరం ఉండదు. తలెత్తుకుని నిర్భయంగా, ధైర్యంగా జీవించగలుగు తారు. ఈ విషయంలో మంత్రులందరూ ఏకాభిప్రాయంతో ఉన్నారనుకుంటాను. అందువలన షెడ్యూల్డ్ కులాలవారికి భూ పంపిణీ అనేది ప్రభుత్వం ముందున్న కర్తవ్యం. అయితే, ముందుగా పరిశీలించాల్సిన విషయం.. షెడ్యూల్డ్ కులాలకు పంచడానికి భూమి అందుబాటులో ఉన్నదా? పెద్ద భూస్వాముల చేతుల్లో భూమిని తీసుకొని వీరికి పంచడానికి ప్రభుత్వానికి అధికారాలున్నాయా ? అవసరమైతే భూమి కొనుగోలు చేయడానికి ప్రభుత్వమే షెడ్యూల్డ్ కులాల వారికి ఆర్థిక సాయం అందించే వీలుందా ? షెడ్యూల్డ్ కులాల వారికి భూమి ఇవ్వాలంటే ముందుగా ఈ మూడు కోణాలను మనం పరిశీలించాల్సి ఉంది. భూస్వాముల చేతుల్లో ఉన్న భూమికి ఒక పరిమితి విధించి, వారి దగ్గరున్న అదనపు భూమిని వీరు కొనుక్కొనే విధంగా ప్రభుత్వమే వీరికి ఆర్థిక సాయం అందించవచ్చు'.** భూమి ఇవ్వకపోగా వారికి తరతరాలుగా ఇచ్చిన అసైన్డ్ ల్యాండ్స్ కూడా లాక్కొంటున్నారు. షెడ్యూల్డ్ కులాల ప్రజలకు ఇవ్వడానికి భూమి అందుబాటులో లేకపోతే కొని ఇవ్వమని అంబేద్కర్ ప్రతిపాదించారు. దళితుల జీవన వ్యవస్థను ఆర్థికంగా పునరుజ్జీవం చేయాలంటే భూమి సమస్య ప్రధానమైందిగా ఆయన ముందుకు తెచ్చారు. భూమి సమస్య ఎప్పుడు ముందుకొచ్చినా భూస్వాములు ఉలిక్కిపడటం, ఆ చట్టాలను నిరోధించటం పరిపాటి. అయితే ఆయన లోతైన ఆర్థిక శాస్త్ర అధ్యయనాల వల్ల సమస్య మూలాలను తెలుసుకోగలిగారు. భూమిని కొని ఇవ్వడం అనే పథకాన్ని ఈనాడు అనేక లొసుగుల వల్ల నీరుగారుస్తున్నారు. ఎకరా భూమి రేటు పది లక్షలుగా ఉంటే ఈనాడు లక్ష రూపాయలు గానే నిర్ణయించడం వల్ల భూమిని అమ్మడానికి రైతులు ముందుకు రావడం లేదు. రైతులు దళితులకు భూములను అమ్మడానికి నిరాకరిస్తున్నారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు భూమి సమస్య ఒక ఘనీభవించిన సమస్యగా మిగిలిపోయింది.

అనేకచోట్ల ప్రభుత్వం పట్టాలు ఇచ్చినా భూమిని లబ్ధిదారులకు చూపించలేదు. పట్టా కేవలం కాగితంగా మిగిలిపోయింది. కేటాయించిన భూమిలోకి ప్రవేశించడానికి భూస్వామి ఒప్పుకోవడం లేదు. భూమిలోకి వెళ్లాక నీరు అందనివ్వడం లేదు. బెదిరింపులు, హత్యలు జరుగుతున్నాయి. ఎందరో దళితులు ఈ భూమి సమస్య మీదనే హతులయ్యారు.

చిత్తూరు జిల్లా బండ్లపల్లి గ్రామంలో అర ఎకరం భూమి కోసం ముగ్గురు తమ్ముళ్ళను, వారి అక్కను భూస్వాములు హత్య చేశారు. నలుగురూ ఒకే భూమిలో హత్యకు గురైన సంఘటనను నేను కళ్లారా చూశాను. నన్ను చూసి పిల్లలు తల్లడిల్లిపోయారు. గొర్రెలను, గేదెలను పెంచుకోవడానికి కూడా వీలులేకుండా భూస్వాములు కట్టడి చేస్తున్నారని దళితులు వాపోయారు. అస్పృశ్యత వల్ల భూమి మీద దళితులకు హక్కు లేదనే భావం అగ్రకులాల్లో బలపడింది. 'మాకు ఊడిగం చేయవలసిన వారికి భూమి మీద ఆధిపత్యం ఉండడానికి వీల్లేదు' అనే సామాజిక అణచివేత ధోరణే గ్రామాలలో వారి హత్యాకాండకు దోహదం చేస్తోంది. దీనంతటికీ వ్యవసాయ కార్మికులుగా ఉన్న ప్రజలు వ్యవసాయదారులుగా మారడం మీద పాలకవర్గానికి, భూస్వామ్య వర్గానికి తీవ్రమైన కుల ద్వేషం ఉంది. కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఒక సామాజిక వర్గానికి 80 శాతం భూమి ఉండడమేమిటి ? ఆ భూమి ఎలా వచ్చింది అని నిలదీస్తే సమాధానం లేదు.

ఈ విషయంగా పార్లమెంటులో మాట్లాడుతూ అంబేద్కర్ ఇలా అన్నారు. 'అధ్యక్షా, ఇప్పుడు నేను నా మిత్రునికి ఒక సూచన చేయబోతున్నాను. అదేమిటంటే ప్రణాళికా సంఘం నివేదికలో నేనొక విషయం చదివాను. ఈ దేశంలో వ్యవసాయానికి అనువైనప్పటికీ వృథాగా ఉన్న భూమి 9 కోట్ల 80 లక్షల ఎకరాలు వుందని ఆ నివేదికలో ఉంది. నా మిత్రునికిచ్చే సలహా ఏమిటంటే, ప్రభుత్వం నాకు తెలిసినంత వరకు రాజ్యాంగాన్ని సవరించాలని అనుకుంటోంది. వారానికోసారి సవరించటమే పనిగా పెట్టుకుంటే అసలు రాజ్యాంగం ఎందుకు ? సరే మీరు ఎలాగూ సవరించాలనుకుంటున్నారు కాబట్టి నాదొక సలహా. నిరుపయోగంగా ఉన్న భూమిని సాగులోకి తీసుకురావటమనేది మొదటి జాబితాలో చేరుస్తూ రాజ్యాంగ సవరణ చేపట్టండి. అప్పుడది కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తుంది. అప్పుడు రాష్ట్ర ప్రభుత్వాల బెడద వదులుతుంది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలు గడ్డి వామి దగ్గర కుక్కలాగా ఆ భూముల్ని అభివృద్ధి చెయ్యడం లేదు. చేసే వాళ్ళకు ఇవ్వటమూ లేదు. అందువల్ల రాజ్యాంగ సవరణ ద్వారా వృథా భూమిని మొదటి జాబితాలోకి చేర్చి స్వాధీనం చేసుకోవటం తప్పేమీ కాదని నా అభిప్రాయం' అని అన్నారు.

పాలక వర్గాలు దళితులను వ్యవసాయదారులుగా ఎదగనివ్వడం లేదు. బంజరు భూములు 15 లక్షల ఎకరాలు ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నాయి. 25 లక్షల ఎకరాలకు పైగా తెలంగాణలో ఉన్నాయి. కేసీఆర్ మూడెకరాలు దళితులకు ఇస్తానన్నారు. ఆచరణలో అమలు జరగడం లేదు. చంద్రబాబైతే ఒక అడుగు ముందుకేసి 155 జీవోతో దళితుల అసైన్డు భూములన్నీ కొల్లగొట్టాలని చూస్తున్నారు. దళితుల్లో కొందరికి నామమాత్ర పదవులిచ్చి వారి చేత భజనలు చేయించుకుంటూ వారికి బ్రిటీష్ నాటి కాలంలో ఇచ్చిన భూములు లాక్కొంటున్నారు. మరోపక్క దళితవాడల్లో ఎప్పుడో మిషనరీలు పెట్టిన స్కూళ్లను విద్యార్థుల సంఖ్య లేదనే పేరుతో ఎత్తివేస్తున్నారు. ఎలిమెంటరీ పాఠశాలల్లో, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎక్కడా పిల్లలకు బెంచీలు లేవు. వాళ్లు కటిక నేల మీద కూర్చొంటున్నారు. లక్షా ముప్పై ఆరు కోట్ల వార్షిక బడ్జెట్ ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు బెంచీలు ఇవ్వలేదా! పేద పిల్లలు చదువుకోకూడదనే అక్కసు ప్రభుత్వంలో కనిపిస్తోంది. దేవాదాయ, ధర్మాదాయ భూములు అగ్రవర్ణాలకే కౌలుకిస్తున్నారు. మిగులు భూములు ఏదో ఒక పేరుతో అగ్రవర్ణాలే చేసుకొంటున్నాయి. భూమి లేని వారు పిల్లల్ని ఏమి చదివించుకొంటారు. గేదెల్ని ఎలా మేపుకొంటారు? భూమిలేని వారికి బ్యాంకు లోన్లు ఎవరిస్తారు. అందుకే అంబేద్కర్ భూమి మీద ఎక్కువ నొక్కి పెట్టారు. ఆయన దళితులకు భూమి ప్రధానమైన వనరు అని ప్రతి సమావేశంలోనూ నొక్కి వక్కాణించారు. అంబేద్కర్ చాలా నిశితంగా ఆనాడు పార్లమెంటులో దళితుల భూమి గురించి ఇలా మాట్లాడుతూ రాష్ట్రాలు భూస్వామ్య కులాధిపత్య ధోరణిలో ఉంటాయి కాబట్టి అంబేద్కర్ ఈ విషయాన్ని కేంద్రమే నిర్వహించడం మంచిదని చెప్పారు. ఆయన తన స్టేట్స్ అండ్ మైనారిటీస్ గ్రంథంలో భూములను, పరిశ్రమలను జాతీయం చేయండి అని పిలుపునిచ్చారు. కుల సమస్య, అస్పృశ్యతా నివారణ సమస్య భూమి సమస్యతో ముడిపడి ఉందని అంబేద్కర్ బలంగా చెప్పారు. భూమి సార్వత్రికం అవడం వలన సంపద పెరుగుతుంది. శ్రామికులకు జీవన భద్రత వస్తుంది. వ్యవసాయ సంస్కృతి విస్తరిస్తుంది. క్షీర విప్లవం వర్ధిల్లుతుంది. నీలి విప్లవం పరిఢవిల్లుతుంది.

అశోకుడు, అక్బర్, కృష్ణదేవరాయలు, ప్రతాపరుద్రుడు వంటి చక్రవర్తుల్లా నీటి వనరుల కోసం చెరువులు, కుంటలు, కాల్వలు, అడవులను వర్ధిల్లజేయాలి. అంబేద్కర్ నదులను అనుసంధానం చేసినప్పుడే వ్యవసాయం పెరుగుతుందని చెప్పారు. వీటన్నింటికీ ప్రజల్లో చైతన్యం రావాల్సి ఉంది. ప్రజలు ఓట్లు అమ్ముకోవడం మానేసి దళిత, బహుజన, మైనారిటీ రాజ్యాన్ని స్థాపించుకోవడంలోనే భూ సమస్య పరిష్కారం ఉంది. ఆనాడే అంబేద్కర్ ఆశయాలు నెరవేరుతాయి. ❑

**(సీపీఐ(ఎం) వెబ్ సైట్ సౌజన్యంతో)**

# బీఆర్ అంబేడ్కర్ మార్గం : దేశంలో సామ్యవాద ఆర్థిక అభివృద్ధి

- డా కత్తి పద్మారావు



**భారతదేశం ఆర్థికంగా, సాంఘికంగా అభివృద్ధి చెందాలంటే.. ఆర్థిక ఉత్పత్తులను ఇతర దేశాలకు పంపే సామర్థ్యాన్ని పెంచుకోవాలంటే అంబేడ్కర్ ఆలోచనలు, రాజ్యాంగ సూత్రాలే ప్రధాన వాహికగా నిలుస్తాయి. భారతదేశం ఈనాడు నిరుద్యోగంలో, నిరక్షరాస్యతలో కొట్టుమిట్టాడుతోంది. కానీ బీఆర్ అంబేడ్కర్ భారత రాజ్యాంగకర్తగా గొప్ప ఆర్థిక శాస్త్రవేత్తగా ఆయన మన ముందుకు అనేక రాజ్యాంగ సూత్రాలను తెచ్చారు. వాటిని మనం ఇప్పటికైనా పాటించగలిగితే భారతదేశం ఆర్థికంగా, విద్యాపరంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతుంది. దీనివల్ల సామాజిక ఆర్థిక ఉత్పత్తులు బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్‌కు ఎగుమతి చేయగలిగిన స్థాయికి ఇంకా ఎక్కువ చేరుకుంటుందనేది చారిత్రక సత్యం.**

నిజానికి భారతదేశం సంపన్నమైనదని అంబేడ్కర్ అనేక ఉపన్యాసాలలో, రచనల్లో నిర్ధారించారు. భారతదేశంలోని నదులను ప్రక్షాళన చేసి వాటికి సరైన ప్రాజెక్టులను రూపొందించాలని ఆయన అన్నారు. త్రాగునీరు, సాగునీరు పుష్కలం చేసి వ్యవసాయ ఉత్పత్తులు పెంచాలని పిలుపునిచ్చారు. వాటిని ఇతర దేశాలకు ఉత్పత్తుల ఎగుమతి పెంచాలంటే తప్పకుండా మనం నదులను పరిశుభ్రపరిచి ఉత్పత్తికి అనుకూలంగా మలచవలసి ఉంది. నదులను పవిత్రంగా భావించి హారతులిస్తూ, నదీ స్నానాలను పుణ్యప్రదంగా భావించే దేశం మనది.

అంతేకాదు దేశంలో సుమారు 603 నదులలో 279 నదులు కాలుష్యమయంగా ఉన్నాయని 2019, 2021 సంవత్సరాలలో సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిర్ధారించింది. ఫ్యాక్టరీలు వదిలే వ్యర్థాలు, డ్రెయినేజ్‌ల ప్రవాహాలు, జంతు కళేబరాలు, ప్లాస్టిక్ వస్తువులు మొదలైన వాటితో అనేక నదులు నిండిపోతున్నాయి. విషతుల్యమౌతున్న ఈ నదీ జలాలనే సాగు, తాగు నీరుగా వినియోగిస్తూ ప్రజలు రోగాల పాలౌతున్నారు. గంగ, గోదావరి, యమున, మూసీ నదులు ఇందుకు ప్రధాన ఉదాహరణలుగా నిలుస్తాయి.

థాయ్లాండ్, మలేషియా, వియత్నాం వంటి చిన్నదేశాల నదుల ప్రక్షాళనను ఆదర్శంగా తీసుకొని మన ప్రభుత్వం మన దేశ నదులను యుద్ధప్రాతిపదికన శుద్ధి చేయించాలి. నదులను కాలుష్యమయం చేస్తున్న సంస్థలు, ఫ్యాక్టరీలు, పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలి. దేశ ప్రజలకు పరిశుభ్రమైన ఆరోగ్యకరమైన త్రాగు, సాగు నీటిని అందించాలి. ఆర్టికల్ 39(బీ) ప్రకారం సహజ వనరులపై ప్రజల హక్కును ప్రభుత్వం కాపాడుతుందని ఆశిద్దాం. నిజానికి మనదేశం నదుల సముద్రాల దేశం. అందుకే భారతదేశం అనేక దేశాల చేత ఆకర్షించబడింది. ఆక్రమించబడింది. ప్రపంచ నాగరికతల్లో అత్యున్నతమైన నదీ నాగరికత, మానవ పరిణామానికి మూల శక్తిగా నిలిచింది. భారతదేశ నదీ నాగరికత కూడా ఈజిప్ట్ నాగరికత అంత ప్రసిద్ధమైనది. నాగరికతలన్నీ నదీ తీరాల నుండే పుట్టాయి.

ప్రపంచంలోనే అత్యున్నతమైన నాగరికత కలిగిన భారతదేశం నదులకు పుట్టిల్లు. అందుకే మనం ఏ నిమిషంలోనైనా సుసంపన్నం చేసుకోవచ్చు. నిజానికి "భారతదేశంలో హిమాలయాల నుంచి కన్యాకుమారి వరకు ఎన్నో మహానదులూ, ఉపనదులూ ప్రవహిస్తున్నాయి. ఇవి రెండు రకాలు మొదటిరకం హిమాలయాల గుంపు. రెండవ రకం దక్కను గుంపు. ఎప్పుడూ తుషారంతో కప్పి వున్న హిమాలయ పర్వతాలలో జన్మించిన గంగా, యమున, సింధు, బ్రహ్మపుత్ర మొదలైన జీవనదులు మొదటి రకం. భారతదేశ మధ్య ప్రాంతంలో వింధ్య, సాత్పురా పర్వతాలు దక్షిణ ప్రాంతంలో సహ్యాద్రి పర్వతాలలో పుట్టి వర్షం మీద ఆధారపడి వర్షాకాలంలో మాత్రమే నిండుగా ప్రవహించే నర్మద, తపతి, మహానది, గోదావరి, కృష్ణా, కావేరి, మంజీరాది నదులు రెండవరకం.

దక్కను ప్రాంత నదులను పీఠభూమి నదులని తీరప్రాంతపు నదులని పునర్విభజన చేయవచ్చు. తీర వర్గానికి చెందిన నదులన్నీ చిన్నవి. భారత ప్రసిద్ధ నదులలో అధిక భాగం నదులు తూర్పుగా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తున్నాయి. సింధూ, నర్మద, తపతి మొదలైన కొన్ని నదులు మాత్రమే పడమరగా ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తున్నాయి.

భూగర్భ శాస్త్ర దృష్ట్యా హిమాలయపు నదులు దక్కను నదులకంటె తక్కువ వయస్సు కల్గినవి. అని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. భారతదేశంలోని నదులలో గంగా నది అతి ముఖ్యమైంది. ఇది హిందువులకు ఎంతో పవిత్రమైంది కూడా. ఇది హిమాలయాలలోని 'గోముఖి' అనే మంచుగుహలో పుదు

తున్నది. పుట్టిన ప్రాంతంలో ఈ నది పేరు భాగీరధి. అందుకు మన భారతపాలక వర్గం ఆయా రాష్ట్రాలు నదీ నాగరికతను ఉత్తేజం చేసి, నీటి పారుదలను పెంచి దళితులకు, బహుజనులకు, స్త్రీలకు భూమిని పంపకం చేసినట్లయితే డా బీఆర్ అంబేడ్కర్ చెప్పినట్లు వ్యవసాయక భూమి భారతదేశంలో విస్తృతమై దళిత బహుజనులు వ్యవసాయ ఉత్పత్తులను స్వయంగా చేయగలిగి వారిలో ఆత్మ గౌరవం పెరిగి స్వీయ జీవన సంపన్నులవుతారు.

మనుషుల వలసలు తగ్గిపోయి వస్తువుల ఉత్పత్తులు పెరిగి వ్యవసాయాధారిత సాంకేతిక పరిజ్ఞానం పెరిగి భారతీయ ఆర్థిక వ్యవస్థ సామాజిక సమతుల్యత పరిపుష్టమవుతాయి. వ్యవసాయ ఉత్పత్తుల వలన దేశంలో ఆకలి అవిద్య నశిస్తాయి. అంతేగాక మన దేశంలో ఆర్థిక అసమానతలను తగ్గించి పేదరికాన్ని తగ్గించి జీవన వ్యవస్థల్లో పరిపుష్టి తేవాలంటే అంబేడ్కర్ రాజ్యాంగ సూత్రాలను అనుసరించవలసిన చారిత్రక అవసరం ఉంది. ఈ క్రమంలో మనం అంబేడ్కర్ పేర్కొన్న ఆర్థిక ఉత్పత్తి క్రమాన్ని అనుసరించాలి. 38వ ఆర్టికల్ ప్రకారం ధనికుల్లో, పేరుకుపోతున్న అవినీతిని నిర్మూలించి పేదలకు ఉద్యోగ అవకాశాలు పరిపుష్టం చేసి రాజ్యాంగంలో దాగివున్న సామ్యవాద భావజాలానికి మనం పట్టం కట్టాలి.

నిజానికి డా బీఆర్ అంబేడ్కర్ పరిశోధన కృషి ఆర్థిక సామ్యవాదం మీదే వుంది. అందుకే ఆయన వ్యవసాయం తరువాత దేశాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని తన సామాజిక, రాజకీయ, ఆర్థిక ప్రణాళికల్లో నొక్కి వక్కాణించారు. అవి ఇప్పుడు మన దేశ పునరుజ్జీవన ఉద్యమానికి మూలశక్తిగా నిలబడతాయి. దేశాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాల్సి ఉందని అంబేడ్కర్ అన్నారు.

పరిశ్రమల్లో ప్రభుత్వ యాజమాన్యం, ప్రభుత్వ నిర్వహణ సిద్ధాంతాన్ని అమలు చెయ్యాలి. పరిశ్రమ అభివృద్ధి చెందడానికి సామాజిక బీమా, ఉపాధిపై అదుపు, అలాగే ఉద్యోగాల తొలగింపుపై నియంత్రణ కలిగి ఉండటం వంటి సదుపాయాలు కల్పించడం అవసరం. ఈ చర్యలు తీసుకునే సమయంలో మధ్య తరగతిలో దిగువ శ్రేణి వారి గురించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. జీవిత బీమా, బస్ రవాణా రంగాలను జాతీయం చేయాలని ఆయన సూచించారు. మనిషిని మనిషి, ఒక వర్గాన్ని మరో వర్గం, ఒక దేశాన్ని మరో దేశం అణిచివేయడం, దోపిడీ చేయడాన్ని అంతమొందించేందుకు కృషి చేయగలనని షెడ్యూల్డ్ కులాల సమాఖ్య (1952) తన ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చింది. అత్యవసరమైతే పరిశ్రమలు జాతీయీకరణకు అది మద్దతు తెలిపింది. నిధుల సేకరణకు అంబేడ్కర్ ఈ సూచనలు చేశారు. (1) సైన్యంపై వ్యయం తగ్గింపు (2) అమ్మకం పన్నుపై తిరిగి లెవీ విధించడం (3) మద్యపాన నిషేధం రద్దు చెయ్యడం, ఎక్సైజ్ ఆదాయాన్ని పొదుపు చెయ్యడం(4) బీమా రంగాన్ని జాతీయ చెయ్యడం (5) ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు నిర్బంధ బీమా, ఆర్థిక శక్తి కేంద్రీకరణ కాకుండా ఉండేందుకు అంబేడ్కర్ రెండు మార్గదర్శక సూత్రాలు ప్రతిపాదించారు. అవి (1) ఉమ్మడి ప్రయోజనం సిద్ధించేలా భౌతిక వనరుల యాజమాన్యం, నిర్వహణను పంపిణీ చెయ్యడం (2) సంపద ఒక చోట కేంద్రీకృతం కాకుండా, ఉత్పత్తికి విఘాతం కల్పించకుండా ఉండే విధంగా ఆర్థిక వ్యవస్థను నిర్వహించడం, నిర్బంధ శ్రమ, బాల కార్మిక వ్యవస్థను రాజ్యాంగం నిషేధించింది. ఆస్తి హక్కులు హామీ ఇవ్వబడ్డాయి. పని చేసేందుకు అందరికీ సమాన హక్కు సమాన పనికి సమాన వేతనం, పురుషులు, మహిళల జీవన భృతికి సమాన హక్కులు, ఇకపోతే అంబేడ్కర్ నిజమైన జాతీయవాది, దేశభక్తి గలవాడు, ఒక గొప్ప మేధావి అనేక దేశాల్లో ఖండాలలో ఆయన ఆర్జించిన జ్ఞానాన్ని అంతా భారతదేశ పునరుజ్జీవనానికి ఉపయుక్తం చేశారు. ఆయన నిక్కచ్చితనం, నిజాయితీ, మానవతా దృక్పథం సామ్యవాద భావజాలం అసమానమైనవి.

అంబేడ్కర్ కేవలం సామాజిక దార్శనికుడు కాదు. అంబేడ్కర్ ఆర్థికశాస్త్రం మీద పరిశోధన చేసిన డిఆర్ జాదవ్ తన సోషల్ ఫిలాసఫి అనే గ్రంథంలో అంబేడ్కర్ ఆర్థిక విప్లవం గురించి ఇలా విశ్లేషించారు. సమాజంలో ఆర్థిక విప్లవం తప్పనిసరిగా రాజకీయ విప్లవంతో ముడిపడి వుంది. అందుకే అంబేడ్కర్ ఆర్థిక సామాజిక రాజకీయ విప్లవాలను ఒకే కాలంలో ప్రారంభించారు. రాజకీయ విప్లవానికి ఇచ్చిన ప్రాధాన్యతను ఆయన తాత్విక విప్లవానికి యిచ్చి రెండింటిని ఏకకాలంలో నడిపించారు. బౌద్ధ విప్లవం రక్త పాత రహిత విప్లవమని, బౌద్ధ తాత్విక విప్లవం పునాదిగా చేసుకుని సమాజంలో మార్పు తీసుకురావాలనేది ఆయన దృఢనిశ్చయం. అంబేడ్కర్ భారత దేశంలో అత్యున్నతమైన సామ్యవాది, ఆయన ఈ సందర్భంగా భారతదేశం పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలంటే సమిష్టి వ్యవసాయ క్షేత్రాలు కావాలని కమ్యూనిస్టు నాయకుడు దాంగేతో చర్చించారు. సోషలిస్టులతోను, కమ్యూనిస్టులతోను, హేతువాదులతోను, హిందూ సంస్కరణ వాదులతోను అంబేడ్కర్ చర్చలు జరిపారు. అంబేడ్కర్ సామ్యవాద ప్రజాస్వామ్యవాది ఆయన కార్ల్ మార్క్స్ సిద్ధాంతంలోని కార్మికవర్గ నియంతృత్వ స్థాపనకు హింసా మార్గం, బలప్రయోగమే మూలమనే దాన్ని వ్యతిరేకించారు. సామ్యవాదాన్ని బౌద్ధ సిద్ధాంత మార్గంలో సాధించాలని నొక్కి వక్కాణించారు. అంబేడ్కర్ ఈ సందర్భంగా ఏ సిద్ధాంతామైనా ఒక దేశపు సామాజిక ఆర్థిక రాజకీయ పరిస్థితులకు సమన్వయించేటపుడు ఆ దేశ చారిత్రక, భౌతిక పరిస్థితులను శాస్త్రీయ పద్ధతుల్లో అర్థం చేసుకోవలసిన అవసరం వుంది. ఈ దేశంలో సామాజిక విప్లవాన్ని **(మిగతా 40వ పేజీలో)**

# డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దృక్పథంలో 'స్త్రీ'


అనువాదం : భవాని దేవినేని


ప్రొఫెసర్ జి.హరగోపాల్




**నన్ను ఈ ఉపన్యాసం కోసం సంప్రదించినందుకు ముందుగా డాక్టర్ అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్ వారికి నా కృతజ్ఞతలు. నిజానికి నేను అంబేద్కర్ జీవిత విషయాల మీద కానీ ఆయన ఆలోచనల గురించి కానీ ఎటువంటి పరిశోధనలు చెయ్యలేదు. ఆయన అభిప్రాయాల గురించి మాట్లాడడానికి నాకు ప్రత్యేక అర్హతలేవీ లేవు. అయినప్పటికీ నేను ఇంత ధైర్యం చెయ్యడానికి డాక్టర్ అంబేద్కర్ మహోన్నత వ్యక్తిత్వమే కారణం. ఆయన జీవన పయనం రాజకీయంగా, సామాజికంగా భారతదేశ చరిత్రలో మైలురాయిగా మిగిలిపోయింది. ఆయనపట్ల నాకున్న ఈ ఆరాధనా భావమే నన్ను ఈ సాహసానికి పురిగొల్పింది. ఈ విధి నిర్వహణలో నేను విజయం సాధించలేకపోయినట్లయితే అది నా అవగాహనా రాహిత్యమే అవుతుంది. ఒకవేళ నేను విజయం సాధిస్తే అది కచ్చితంగా అంబేద్కర్ ఆలోచనలలోని గొప్పతనం వల్ల మాత్రమే.**

డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ భారతదేశం గర్వించదగ్గ, ప్రఖ్యాతి గాంచిన సామాజికవేత్త. ఆయన తన ఆలోచనల ద్వారా ప్రపంచాన్ని ఒక విభిన్న కోణంలో చూశారు. ఆయన అప్పుడు వెలిబుచ్చిన అభిప్రాయాలు, సమస్యలు అర్థం చేసుకోవడం వల్ల ఏర్పడినవి కాదు. జీవితానుభవాల నుంచి ఏర్పరచుకున్నది. ఆయన స్వయంగా అణగారిన వర్గానికి చెందినవారు కావటం వల్ల ఆయన ప్రతి అభిప్రాయం వెనుక ఆయన స్వీయానుభవం ఉంది. సమాజంలోని అసమానతలకు, అన్యాయాలకు ఆయన ప్రత్యక్ష సాక్షి. ఆయన తన ప్రతి చేదు అనుభవం నుంచి ఎంతో కొంత నేర్చుకున్నారు. అణచివేయబడిన ప్రతిసారి ఆయనలోని మానవత్వం సమాజాన్ని పునర్నిర్మించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తూ వచ్చింది. ఆయనలోని ఈ లక్షణాలే ఆయనను సమాజ సంస్కరణ కోసం ఉద్యమించడంలో స్థిర చిత్తంతో ఉండేలా చేశాయి. ఆ లక్షణాలే ఆయనను ఆధునిక భారతదేశ అత్యంత ప్రముఖుల్లో ఒకరిగా నిలబెట్టాయి.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సత్యశోధనలో ఏ కోణాన్ని కూడా నిర్లక్ష్యం చెయ్యలేదు. ఆయన రచనలు, ఉపన్యాసాలు ఇప్పటికే 10 సంపుటాలను మించి ముద్రితమయ్యాయి సమాజానికి ఇవి



ఆయన అందించిన ఆణిముత్యాలు. ముఖ్యంగా కుల వ్యవస్థ మన దేశంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ఎంత ప్రభావాన్ని చూపుతుంది ఆయన వివరించిన తీరు మరువలేనిది. సమాజం కుల వ్యవస్థను కొనసాగించడం కాదు. కుల వ్యవస్థ సమాజాన్ని ఏ విధంగా నడిపిస్తుందో ఆయన చాలా చక్కగా వివరించారు. ఆయన ఈ ఆలోచనా ధోరణి ఆయనను స్త్రీ సమస్యల గురించి కూడా ఆలోచించేలా చేసింది. మన సమాజంలో స్త్రీ సమస్యలు కూడా కుల సమస్యలో అంతర్భాగమే అనేది ఆయన అభిప్రాయం. డా. అంబేద్కర్ అభిప్రాయాలు, ఆలోచనలను చాలా లోతుగా తెలుసుకుని ఆచరించాల్సిన అవసరం మన సమాజ శ్రేయస్సుకు ఎంతో అవసరం.

భారతీయ మహిళా సమస్యల గురించి అధ్యయనం కేవలం అంబేద్కర్ దృక్కోణంలో మాత్రమే కాదు. లింగ వివక్ష రోజు రోజుకు పెరుగుతున్న ఈ రోజుల్లో అనేక కోణాల్లో ఈ సమస్యను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. నలభై సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో మహిళాభివృద్ధి నామమాత్రంగానే జరిగిందని చెప్పాలి. తొంభైయ్యో దశకంలో మహిళల పరిస్థితి చాలా దారుణంగా దిగజారుతోంది. స్థూలంగా - పెరుగుతున్న వరకట్న మరణాలు, అత్యాచారాలు, సామూహిక అత్యాచారాలు ఈ విషయాన్ని ధృవపరుస్తున్నాయి. చీఫ్ జస్టిస్ ఆఫ్ హైకోర్ట్ ఆఫ్ ఇండియా మహిళలు కేవలం ఇంటి పనులకే పరిమితమవుతున్నట్లు అభిప్రాయపడ్డారు. రాజస్థాన్ వంటి రాష్ట్రాలలో సతి వంటి దురాచారాలు తిరిగి ఆచరణలోకి రావడం చాలా ఆందోళనకరమైన విషయం. మధ్యతరగతి కుటుంబం చాలా సంక్షోభాన్నే ఎదుర్కొంటోంది. ఇప్పుడిప్పుడే మహిళల ఆలోచనా విధానంలో మార్పులు వస్తున్న ఈ పరిస్థితుల్లో పురుషులకంటే స్త్రీలే ఎక్కువగా ఇబ్బంది పడాల్సి

ఉంటుంది. నరనరాలలో జీర్ణించుకుపోయిన పితృస్వామ్య వ్యవస్థను ప్రశ్నించడం అంత సులభమైన విషయమేమీ కాదు. ఈ క్రమంలో కొంత మంది గృహిణులు హింసను ఎదుర్కోవాల్సి వస్తే, మరికొంత మంది తమ ప్రాణాలనే పోగొట్టుకున్నారు. వసంత కన్నాభిరన్ మహిళల సమకాలీన సమస్యల గురించి తీసిన 'కఠోర షడ్జమాలు' ఎన్నో విషయాలను వివరించింది. జమీందారులు, పట్టణాల్లో చదువుకున్న వారి కొడుకులు, వారి బంధువర్గం, హరిత విప్లవ ఫలాలను అత్యధిక స్థాయిలో అనుభవిస్తున్న కుటుంబాలు, సమాజంలోని దాదాపు అన్ని ఉన్నత వర్గాల వారు స్త్రీని కేవలం విలాస వస్తువుగా మాత్రమే భావిస్తున్నారు. ఉన్నత వర్గాల వారు మాత్రమే కాదు, చదువుకున్న మధ్య తరగతి యువత కూడా ఇందుకు మినహాయింపేమీ కాదు. ఇది దిగజారుతున్న మానవతా విలువలకు పరాకాష్ట. ఈ పరిస్థితి పేద మహిళల్లో చాలా అభద్రతను పెంచుతోంది. ఆర్థిక విషయాల పరంగా చూసినప్పుడు రాజ్యాంగం లింగ వివక్షకు తావులేదని చెప్పినప్పటికీ వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్న స్త్రీలకు ఇచ్చే వేతనం పురుషుల కంటే తక్కువగా ఉంటుంది.

ఉన్నత తరగతులకు చెందిన వారైనా, నిమ్న వర్గాలకు చెందిన వారైనా మహిళలను వివక్షను ఎదుర్కొంటున్న కోణంలో చూసినప్పుడు దళితులతో పోల్చవచ్చు. దళితుల మీద జరుగుతున్న అత్యాచారాలు పెరిగాయనడంకంటే రెట్టింపయ్యాయని అనడమే సబబేమో, ఈ మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన కారంచేడు, చుండూరు ఘటనలు ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. ఇటువంటి సంఘటనలు దేశం నలుమూలలా జరుగుతూనే ఉన్నాయి.

దేశంలోని చాలా చోట్ల దళితులు భూమి, భుక్తి వంటి ఆర్థిక విషయాలకంటే కూడా తమని మనుష్యులుగా గుర్తించాలని కోరుతున్నారు. సమానత్వం కావాలన్నదే ప్రధాన డిమాండ్, అగ్రవర్ణాల వారు పెంచుకున్న తమ సంపదను, తద్వారా లభించే టెక్నాలజీని, అధికారాన్ని ఉపయోగించి దళితుల మీద వారి ఆధిపత్యాన్ని మరింత పెంచుతున్నారు. ఈ పరిస్థితులకు మహిళలు మినహాయింపు కాదు.

దళితులు, మహిళల్లో మూడు సారూప్యాలు మనం గమనించవచ్చు. ఒకటి శ్రమదోపిడీ, రెండు పేదరికం, మూడు అంటరానితనం. శ్రమ దోపిడీ విషయంలో అగ్రవర్ణాల మహిళలు కూడా మినహాయింపు కాదు, ఉత్పత్తి జరిగే చోట అయినా, ఇంటి పని విషయంలోనైనా సరే వారు చేసే పనికి గుర్తింపు కానీ, గౌరవం కానీ ఉండదు. ఈ విషయంలో దళితులు, మహిళలు ఒకే విధంగా వివక్షకు గురవుతున్నారు. ఆస్తి సంక్రమణ, విద్య నేర్పే తీరులో దళితులకు, మహిళలకు ఒకే విధంగా ఉంటుంది. ఇక అంటరానితనం విషయానికి వస్తే చాలా అగ్ర వర్ణాల కుటుంబాల్లో స్త్రీలకు అంటరానితనాన్ని నెలలో మూడు నాలుగు రోజుల వారి నెలసరి సమయంలో చాలా కఠినంగా పాటిస్తారు.

దళితులు, స్త్రీలపై వివక్ష రోజురోజుకు పెరుగుతోంది. రాజ్యం మరియు రక్షణ వ్యవస్థ పీడితుల పక్షాన నిలబడి వారికి న్యాయం జరిగేలా చూడాల్సి ఉంది. కానీ నిజానికి దీనికి వ్యతిరేకంగా జరుగుతోంది. పోనుపోను దేశం వివక్షకు నిలయంగా మారుతోంది. ఎన్నో లాకప్ మరణాలు జరుగుతున్నాయి. ఎన్నో అత్యాచారాలు జరుగుతున్నాయి. ఈ నేరాలు నిరూపించబడి శిక్షలు పడుతున్నవి నామమాత్రమే. దీన్ని బట్టి దళితులు, స్త్రీలకు రాజ్యాంగం కల్పించిన ఏ హక్కులు, భద్రతలు చేరడం లేదని నిరూపితమవుతోంది. పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేర్పులు చేస్తూ వస్తున్న రక్షణ చట్టాల ఫలితం అటు దళితులకు కానీ ఇటు మహిళలకు కానీ అందటం లేదనేది ఎవరూ కాదనలేని సత్యం. ఈ పరిస్థితి దాపురించడానికి ఒక రకంగా రాజకీయ వ్యవస్థ కారణం. అందుకే డాక్టర్ అంబేద్కర్ ప్రతిపాదించిన మానవతా విలువల గురించిన చర్చ జరగాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది.

డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ మన దేశ సంఘ సంస్కర్తల్లో మొదటి వరుసలో నిలుస్తారు. ఆయన స్త్రీ సమస్యలను తన ఉద్యమంలో ప్రధానాంశంగా తీసుకున్నారు. అంతేకాదు దళితులు, మహిళల సమస్యలలోని సారూప్యతను గుర్తించిన రాజకీయ నాయకులలో ఆద్యులు. ఆయన దళిత సమస్యలతో పాటు మహిళా సమస్యలను గురించి ఎక్కువగా ఆలోచించారు. ఆయన సమస్య మూలాలను అన్వేషించారు. లింగ వివక్షలోని ఎన్నో చీకటి కోణాలను ఆయన ఆవిష్కరించారు.

అగ్రవర్ణాల మహిళల సమస్యలను, కుల వ్యవస్థకు విడదీయరాని సంబంధాన్ని డాక్టర్ అంబేద్కర్ గుర్తించారు. అసలు ఈ కుల వ్యవస్థ ఇన్ని శతాబ్దాలుగా కొనసాగింపబడడానికి కారణం వివాహ వ్యవస్థ. మన భారతీయ వివాహాలు చాలా వరకు ఒకే కులంలో జరుగుతాయి. ఇలా ఒకే కులంలో వివాహాలు చేసుకోవడం వల్ల వారికి సామాజిక భద్రత దొరుకుతుంది. ఇలా ఒకే సమూహంలోని వ్యక్తుల మధ్య వివాహాలు జరగాలంటే ఆ సమూహాల్లో స్త్రీ పురుషుల నిష్పత్తి సమానంగా ఉండాలి. అలా జరగడం దాదాపు అసాధ్యం. స్త్రీల సంఖ్య పెరిగినా, తగ్గినా సమస్యలు అధికమవుతాయి. దంపతుల్లో ఒకరు మరణించినప్పుడు మళ్ళీ సమస్య ఏర్పడుతుంది. ఇలా స్త్రీ పురుష నిష్పత్తిని సమం చేయడానికి సమాజం అనుసరిస్తున్న దారులను అంబేద్కర్ ప్రస్తావించారు. అందులో ముఖ్యంగా 'సతీసహగమనం' అంటే మరణించిన భర్త చితి మీదే భార్యను కూడా కాల్చేయటం. దీనివల్ల సమస్య ఏముంటుంది. భర్త చనిపోయినప్పుడు ఇక భార్య బతికే

అవకాశమే లేదు. ఇక లెక్క తప్పే సమస్య ఉండనే ఉండదు. లేదంటే భర్త చనిపోయిన స్త్రీకి తప్పనిసరి వైధవ్యాన్ని పాటించాల్సి ఉంటుంది. ఇది మరింత దారుణంగా ఉంటుంది. లేదంటే ఆమె మరో కులంలోని వ్యక్తిని పెళ్ళి చేసుకోవడం వంటివి జరిగితే కుల వ్యవస్థ భ్రష్టు పడుతుందన్న భయం వారికి. ఒకవేళ వారి కులం వారిలోని మరో వ్యక్తిని పెళ్ళి చేసుకుంటే ఇతర పెళ్ళీడు అమ్మాయిలకు ఇబ్బంది ఏర్పడవచ్చు. అందుకని విధవ వివాహాన్ని పాపంగా అభివర్ణించారు. అందుకే ఒక పెళ్లయిన అమ్మాయి భర్త ఎంత చిన్న వయసులో చనిపోయినప్పటికీ ఆమె ఇక జీవితాంతం విధవగా బ్రతకవల్సిందే. ఇలా విధవగా బ్రతికే వారికి జీవితంలో ఎటువంటి మాధుర్యమూ మిగలదు. ప్రతి వారు ఒక అనుమానపు చూపుతో చూస్తుంటారు. వైధవ్యంలో ఉన్న మహిళలకు అందంగా కనిపించే అర్హత లేదు. వారు తప్పనిసరిగా అందవిహీనం చేసుకొని ఉండాల్సిందే.

ఇటువంటి పరిస్థితి పురుషులకు ఎదురైనప్పుడు మాత్రం ఇందుకు విరుద్ధంగా జరుగుతుంది. పితృస్వామ్య వ్యవస్థ పురుషుడికి ఇచ్చిన సౌకర్యాలు అన్నీ ఇన్నీ కాదు. మతంలోని ప్రతి నిషేధాజ్ఞ మహిళల కోసం ఏర్పాటు చేసిందే. అది మతపరమైనదైనా, సామాజికమైనదైనా, ఆర్థికపరమైనదైనా, వైధవ్యం ప్రాప్తించిన మహిళల కోసం నియమాలు, నిబంధనలు ఏర్పాటు చేసిన పురుషుడు, భార్య మరణించిన పురుషుడి కోసం మాత్రం కనీసం ఒక్కటంటే ఒక్క నిబంధన కానీ నిషేధం కానీ చేయలేదు. ఏ ధర్మశాస్త్రాలు చెప్పలేదు. అందుకు అంబేద్కర్ ఏమంటారంటే ఒక వేళ స్త్రీ పురుష సంఖ్యను సమం చెయ్యడం కోసమే ఈ ఏర్పాటు కనుక చేసి ఉంటే భార్య మరణించిన పురుషుడికి కూడా తప్పనిసరి బ్రహ్మచర్యాన్ని ఆపాదించి ఉంటే సమాజం అనుకున్న ఫలితాన్ని రాబట్టి ఉండేదేమో అని, కనీసం భార్య మరణించిన పురుషుడు పెళ్ళి కావాల్సిన అమ్మాయికి బదులుగా భర్త మరణించిన స్త్రీని మాత్రమే పెళ్ళి చేసుకోవాలన్న నియమాన్నైనా పెట్టి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. ఈ అభిప్రాయాలతో ఆయన స్త్రీల పట్ల జరుగుతున్న అన్యాయాలకు పితృస్వామ్య వ్యవస్థకు ఎంత వ్యతిరేకంగా ఉన్నారన్న విషయం తేటతెల్లం అవుతోంది.

అంబేద్కర్ ఈ సమాజంలో గమనించినదేమిటంటే కుల వ్యవస్థ సమాజంలో స్త్రీ పురుష నిష్పత్తిని క్రమం చేయడానికి చాలా జాగ్రత్తగా అనుసరించిన విధానం నాలుగు మార్గాలు 1. సతీసహగమనం – మరణించిన భర్తతో పాటు భార్యను కూడా చితిలో తగలబెట్టడం, 2 తప్పనిసరి వైధవ్యం– ఇది కొద్ది కొద్దిగా ఆ స్త్రీని చంపేయటం, 3. వైధవ్యం ప్రాప్తించిన స్త్రీ తప్పనిసరిగా బ్రహ్మచర్యం పాటించడం, 4. పెళ్ళీడులో ఉన్నప్పటికీ భర్త చనిపోయిన స్త్రీ వివాహం చేసుకోకూడదు. ఈ నాలుగు దురాచారాలు భారతీయ సమాజంలో భాగంగా మారిపోయాయి. ఇప్పటికీ అలా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ సంప్రదాయాలన్ని ఎలా పాటించాలో తెలపడానికి మనకు చాలా ధర్మశాస్త్రాలు ఉన్నాయి. కానీ వాటి ఉనికి ఏమిటి? అవి ఎందుకు పాటించాలో మాత్రం ఎవరూ చెప్పరు. వీటిని గౌరవించమన్నారు. కానీ ఎందుకు గౌరవించాలో మాత్రం చెప్పలేదు. నేను గమనించినంత వరకు మనం పాటిస్తూ వస్తున్నాం కాబట్టి అవి గౌరవించబడుతున్నాయి తప్ప మరే కారణం లేదు' అని డాక్టర్ అంబేద్కర్ తన అభిప్రాయాన్ని నిక్కచ్చిగా తెలిపారు.

మహిళా సమస్యలను ఆయన సహానుభూతించారు. సతీ సహగమనం, బలవంతపు వైధవ్యం, బాల్య వివాహాలు వంటి ఆధారాలన్నీ కేవలం ఒంటరి స్త్రీ పురుషుల సంఖ్యను సమం చేయడం కోసం, కుల వ్యవస్థను కాపాడడం కోసమే. వివాహాల విషయంలో కుల ప్రసక్తి లేకపోతే కుల వ్యవస్థ కొనసాగదు అని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ విధంగా ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలలో మనం మూడు విషయాలను ప్రస్ఫుటంగా అర్థం చేసుకోవచ్చు. కులానికి వివాహ వ్యవస్థకు స్త్రీ పురుషుల మధ్య ఉన్న నియమాలు, సంబంధాలను పునర్నిర్మించడానికి కావాల్సిన అర్హతలు ఆయనకు ఉన్నాయి. రెండోది ఇలాంటి దురాచారాలను నమ్మడం, సమర్థించడం, పాటించడం అనేది కేవలం కుల వ్యవస్థను సంరక్షించేందుకు మాత్రమే పనికి వస్తాయి. మూడోది అత్యంత ముఖ్యమైనది ఏమిటంటే ఈ పితృస్వామ్య వ్యవస్థ, నియమాలన్నీ కూడా పురుషులు ఏర్పాటు చేసినవి. పూర్తిగా పక్షపాతపూరితమైనవి.

భారత స్త్రీ చరిత్రను డాక్టర్ అంబేద్కర్ మౌర్యులకు ముందు, మౌర్యుల కాలంలో, మౌర్యుల తర్వాత అని విభజించారు. ఇలా చరిత్రను అధ్యయనం చేసి చూసినప్పుడు భారత సమాజంలో స్త్రీ జీవితం ఎలా దిగజారుతూ వచ్చిందో తెలుసుకోవచ్చు. మౌర్యులకు పూర్వం, మౌర్యుల కాలంలో కూడా మహిళలు సమాజంలో పురుషులతో సమానస్థాయిలో ఉన్నారు. ఆ కాలంలో స్త్రీలకు ఉపనయనానికి, మంత్రం చెప్పడానికి, వేదం చదువుకోవడానికి అర్హత ఉండేది. ఆ కాలంలో స్త్రీలు ఇప్పటి కంటే మంచి స్థాయిలో ఉన్నారనడానికి ఈ ఒక్క రుజువు చాలంటారు. ఆయన కేవలం వేదం నేర్చుకోవడమే కాదు, గురుకులంలోకి వారికి అనుమతి ఉండేది. బాలికలకు వేదం నేర్పేందుకు కూడా వారికి అనుమతి ఉండేది. మతం, వేదాంతం, అధిభౌతిక శాస్త్రం వంటి అనేక విషయ చర్చలలో పాల్గొనే అవకాశం కూడా ఉండేది. జనకుడు, సులభల మధ్య, యజ్ఞవల్క్యుడు గార్గిల మధ్య, యాజ్ఞవల్క్యుడు మైత్రిల మధ్య, శంకరాచార్య విద్యాధరి మధ్య జరిగిన వాదోపవాదాలను

అంబేద్కర్ ఉదహరిస్తారు. ఈ సందర్భాలను ఆయన అధర్వణ వేదం, అష్టాధ్యాయి మొదలైన నాటి నుంచి గ్రహించారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని ఆ రోజు అధిరోహించారని అంబేద్కర్ అభివర్ణించారు. పట్టాభిషేక సమయంలో యువరాజుతోపాటు అతని భార్యకు సమాన స్థాయి దక్కేది. రాజు సైతం రాణికి గౌరవాన్నిచ్చే వారు. ఆ రోజుల్లో మహిళలు చదువు సంధ్యల విషయంలో కానీ, పాలనాపరమైన విషయంలో కానీ, సామాజిక అంశాల్లో కానీ ఎటువంటి వివక్షను ఎదుర్కోలేదు.

"రామ గోవిందా" 1950లో గౌతమ బుద్ధుడి మీద జరిపిన పరిశోధనల తర్వాత బుద్ధుడు స్త్రీలను గురించి ఉన్నతమైన భావనలు చేయలేదని, 'మహాపరిణిబాణసుత'లో బుద్ధుడు, ఆనందంగా ఉండాలంటే స్త్రీ విషయంలో జాగ్రత్తగా ఉండాలని సలహా ఇచ్చారని వ్యాఖ్యానించారు. అంబేద్కర్ ఆయన వాదనను నిర్ద్వంద్వంగా అందించారు. ఆయన బ్రహ్మచర్యం గురించి మాత్రమే మాట్లాడారు. లైంగిక సంబంధాలు పురుషుడిని స్త్రీ బంధనంలో, స్త్రీని పురుషుడి బంధనంలో ఇరుక్కునేలా చేస్తాయని మాత్రమే గౌతమ బుద్ధుడు భావించాడని అంబేద్కర్ వివరించారు. గౌతమ బుద్ధుడికి స్త్రీ పట్ల అచంచలమైన విశ్వాసం ఉండేది, కేవలం స్త్రీలకు మాత్రమే ఆయన బోధలను పూర్తిగా పాటించగలిగే నిబద్ధత, క్రమశిక్షణ ఉన్నాయని నమ్ముతారని డాక్టర్ అంబేద్కర్ అన్నారు. అమ్మాయి పుట్టిందని తన శిష్యులలో ఒకరు బాధ పడుతున్నప్పుడు గౌతమ బుద్ధుడు, బాధ దేనికి ? ఆమె చాలా తెలివైనది, ధైర్యవంతురాలు అవుతుందేమో భవిష్యత్తులో, కేవలం ఆడపిల్ల అని బాధ పడొద్దు" అని చెప్పిన సందర్భాన్ని ఆయన గుర్తుచేశారు. ఆయనకు స్త్రీల పట్ల గౌరవమే కనుక లేకపోయి ఉంటే ఆ రోజుల్లో అత్యంత సౌందర్యవతైన ఆమ్రపాలి సేవలను ఆయన స్వీకరించేవారు కాదు కదా అని అంబేద్కర్ గుర్తు చేస్తారు. ఆయన శిష్యులలో స్త్రీలు కూడా ఉన్నారు. బౌద్ధ ధర్మాన్ని సరిగ్గా అర్థం చేసుకోని కొంతమంది భిక్షువులు స్త్రీ వ్యతిరేకులుగా మారారు. ఇటువంటి కొంతమంది ఆలోచనలను వారి అపరిపక్వతను బుద్ధుడికి ఆపాదించి – ప్రచారం చేశారనేది డాక్టర్ అంబేద్కర్ అభిప్రాయం. ఆయన ఈ అభిప్రాయం ఆయనకు బుద్ధుడి పట్ల, మహిళల పట్ల ఉన్న గౌరవాన్ని తెలుపుతోంది. బుద్ధుని కాలంలో మహిళలు అనుభవిస్తున్న సమానత్వాన్ని 'మను' ఏర్పరచిన ధర్మశాస్త్రాలు పాడు చేశాయి. ఆయన కౌటిల్యుడు, మనువుల ఉద్దేశ్యాలలోని తేడాలను చాలా దగ్గరగా అధ్యయనం చేశారు. మనువు అభిప్రాయాలు, నియమాలు సమాజంలో స్త్రీలను ఎంత క్రూరంగా వెనక్కినెట్టాయో తెలుసుకోవడానికి ఇది ఆయనకు ఎంతో ఉపయోగపడింది. కౌటిల్యుడి కాలంలో 12 సంవత్సరాల వయసు అమ్మాయిలు, 16 సంవత్సరాలు అబ్బాయిలకు పెళ్ళి వయసుగా నిర్ణయించారు. ఇవన్నీ కచ్చితంగా బాల్య వివాహాలనేది బౌద్ధయానుల గృహ్య సూత్రాల ద్వారా తేటతెల్లమైనది.

పెళ్ళికి సంబంధించిన చాలా నియమాలను కౌటిల్యుడు ప్రతిపాదించాడు. పురుషుడు ఒకరికంటే ఎక్కువ మహిళలను పెళ్లి చేసుకునే అవకాశం ఉంటుంది. కానీ దానికి కొన్ని నిబంధనలు ఉన్నాయి. పెళ్లి చేసుకున్న స్త్రీల వల్ల అతనికి సంతానం కలుగకపోయినట్టయితే అతడు ఏడు సంవత్సరాల వరకు వేచి చూసి మరో వివాహం చేసుకోవచ్చు. ప్రతిసారీ మృత శిశువుకు జన్మనిస్తున్నట్టయితే 12 సంవత్సరాల వరకు వేచి చూడాలి. అతడికి సంతాన సౌఖ్యం కావాలన్న కోరిక ఉన్నట్లయితే అతడు మరో వివాహం చేసుకోవచ్చు. ఇష్టం లేనప్పుడు, శతృత్వం ఉన్నప్పుడు, విడాకులు కూడా తీసుకోవచ్చని కౌటిల్యుడు చెప్పారు. భార్యా భర్తలిద్దరు ఏ ఒక్కరి ఇష్టానికి వ్యతిరేకంగా విడాకులు తీసుకునే అవకాశం కల్పించలేదు. కానీ ఇద్దరికి ఇష్టం లేదని అనుకున్నప్పుడు వారు చట్టబద్ధంగా విడిపోవచ్చునని చెప్పారు.

పురుషుడు కానీ, స్త్రీ కానీ తన భాగస్వామి నుంచి ప్రాణ హాని ఉందన్న కారణంతో విడాకులు అడిగే అవకాశం ఉంటుంది. అటువంటి సందర్భాల్లో స్త్రీకి తన స్త్రీ ధనం, శుల్కం తిరిగి అడిగే హక్కు ఉంటుంది. భర్త మంచివాడు కాని పక్షంలో విడాకులు కావాలని అడిగే హక్కు స్త్రీకి కౌటిల్యుడి అర్థశాస్త్రం కలిగించింది. అంతేకాదు విడాకుల సమయంలో తన జీవితకాలం మొత్తం తిండి, గుడ్డకు లోటు లేకుండా భరణం ఆశించే హక్కు కూడా ఆమెకు ఉంటుంది. ఈ నియమాలన్నీ ఉల్లంఘించిన వారు శిక్షార్హులు మాత్రమే కాదు, ప్రభుత్వానికి కూడా వారు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

మౌర్యుల కాలంలో అమలులో ఉన్న కౌటిల్యుడి అర్థశాస్త్రంలో అంబేద్కర్‌కు మరింత నచ్చిన విషయం విధవా పునర్వివాహాన్ని సమర్థించడం. భర్త మరణానంతరం కూడా స్త్రీ గౌరవప్రదమైన జీవితాన్ని గడిపే అవకాశం ఉంది. ఇందుకు గాను ఆమె తన అత్తవారింటి నుంచి స్త్రీ ధనం, శుల్కాన్ని తిరిగి తీసుకోవచ్చు. ఆమె పునర్వివాహం కూడా చేసుకోవచ్చు. పునర్వివాహం చేసుకున్నప్పటికీ మొదటి భర్త ద్వారా కలిగిన సంతానాన్ని పోషించుకోవడానికి దానిని వాడుకునే అధికారం ఆమెకు ఉంటుంది. ఆ ఆస్తిని ఆమె వారికి రాసిచ్చే అధికారం కూడా ఉంటుంది. డాక్టర్ అంబేద్కర్ స్త్రీల సామాజిక, ఆర్థిక స్థితిగతులను మౌర్యులకు ముందు, మౌర్యుల తర్వాత అని చాలా కచ్చితంగా విభజించారు. మౌర్యుల కాలంలో స్త్రీలు చాలా మెరుగైన జీవితాన్ని గడిపారని చెప్పవచ్చు అని అంటారాయన. వర్తమాన కాలంలో స్త్రీల స్థితిగతులు, ఆయనను మూలాలలోకి

వెళ్లి సమస్య పరిష్కారా అన్వేషణ చేసేందుకు ప్రేరేపించాయి. ఒకప్పుడు భారత సమాజంలో స్త్రీలు చాలా గౌరవంగా జీవించారని ఆయన అధ్యయనం చెబుతున్నది.

మనుస్మృతి మన స్త్రీలను అత్యంత దయనీయ పరిస్థితుల్లోకి తీసిపడేసిందనేది అంబేద్కర్ అభిప్రాయం. స్త్రీల పట్ల లేశమాత్రమైన గౌరవం లేకుండా మనువు తన ధర్మ శాస్త్రాలను నిర్మించాడు. ఆయన ఉద్దేశ్యంలో స్త్రీలు పుట్టిందే పురుషులను మోహింపజేయడానికి, కాబట్టి, వారు తప్పకుండా పురుషుల అధీనంలోనే ఉండాలి. వారు మూర్ఖులైన పురుషులను మాత్రమే కాదు, అత్యంత మేధావులను తప్పుదారి పట్టించగలరు. స్త్రీ ఎంత గొప్ప పురుషుడినైనా మోహానికి, కోపానికి దాసులను చెయ్యగలదు. మనుధర్మ శాస్త్రం ప్రకారం ఏ వ్యక్తి తల్లి, సోదరి, కుమార్తెతో ఒంటరిగా ఉండకూడదు. ఇంద్రియాలు ఎంతటి తెలివైన వారినైనా లోబరుచుకుంటాయనేది మనువు వాదన. పురుషుల పట్ల స్త్రీలకు కలిగే అత్యంత మోహం వల్ల, చిత్త చాంచల్యం వల్ల వారు వారి భర్తలకు ద్రోహం చేసే అవకాశం ఉంటుంది. అందువల్ల వారిని అనునిత్యం తమ పురుషుల అధీనంలో ఉంచుకోవాలి.” అని మను ధర్మసూత్రాలు చెబుతున్నాయి. దేవుడు స్త్రీలను బలహీనులుగా సృష్టించాడు కాబట్టి వారు పురుషుల అధికారానికి లోబడి ఉండాలని కూడా నిర్ణయించాడు మనువు. మనుస్మృతిలో పైన ఉదహరించిన అంశాలను గమనిస్తే మనువుకు స్త్రీల పట్ల ఎంతటి చులకన భావం ఉందో అర్థం అవుతుందని అంబేద్కర్ అంటారు.

మనువు ఇంకా ఏమంటాడంటే స్త్రీలు తప్పనిసరిగా ఎవరో ఒక పురుషుడి అధీనంలో ఉండాలి. బాల్యంలో తండ్రి అధీనంలో, యవ్వనంలో భర్త అధీనంలో, వృద్ధాప్యంలో కుమారుని అధీనంలో ఉండాలి. ‘న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి’ స్త్రీలు స్వాతంత్ర్యానికి అర్హులు కాదు, తన స్వంత ఇంట్లో సైతం స్త్రీలు ఏ వయసు వారైనా సరే పురుషుల అనుమతి లేనిదే ఏ పని చెయ్యడానికి వీలులేదు. ఆమె దారి తప్పితే అనగా తండ్రిని లేదా భర్తను లేదా కుమారుడిని వదిలేసినట్టయితే అటు పుట్టింటికి, ఇటు అత్తవారింటికి రెండు కుటుంబాలకు నష్టం జరుగుతుంది. ఒకసారి పెళ్ళైందంటే ఆమె చచ్చేంత వరకు భర్తతో కలిసి ఉండాల్సిందే. ఎట్టి పరిస్థితులలోను, విడాకులకు ఆస్కారమే లేదు. దీని గురించి అంబేద్కర్ ఏమంటారంటే ఈ నియమం పురుషుడిని ఒక అనుబంధంలో కట్టేయడం కోసం కాదు, ఎంతటి దుర్మార్గుడైనా సరే ఆమెను అతనికి కట్టిపడేసి ఉంచడానికి మాత్రమే. ఎందుకంటే “మనువు” పురుషుడు భార్యను వదిలేయకుండా కట్టడి చెయ్యలేదు మరి. అంతే కాదు భార్యను వదిలేయడం మాత్రమే కాదు. ఆమెను అమ్ముకునే హక్కు కూడా మనుధర్మ శాస్త్రం ప్రకారం భర్తకు ఉంటుంది. మను నిర్మిత ధర్మశాస్త్రం మొత్తం కూడా స్త్రీని ఎన్ని రకాలుగా బానిసగా ఉంచాలో చెప్తుంది. కేవలం అమ్మకానికి వెళ్ళడం వల్లనో లేదా అతడు ఆమెను తిరస్కరించడం వల్లనో మాత్రమే స్త్రీకి భర్త నుంచి విముక్తి లభించే అవకాశం ఉంటుంది. ఒకసారి అమ్మకానికి లేదా తిరస్కారానికి గురైన స్త్రీ ఇక ఎప్పుడూ ఎవరికీ చట్టబద్ధమైన భార్యగా ఉండే అవకాశమే లేదు. మను ధర్మశాస్త్రం ప్రతిపాదించిన ఇంతటి వివక్ష గురించి డాక్టర్ అంబేద్కర్ చాలా ఆగ్రహంతో ‘ఇంతకంటే వికృతమైన విషయం ప్రపంచంలో మరొకటి ఉండదు. ఇంతటి అన్యాయం కూడా మరొటి ఉండదు. ఆయన తన నియమాలతో స్త్రీలను స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకు దూరం చేయడం మినహా ఒరిగిందేమి లేదు’ అన్నారు.

ఈ మొత్తం వ్యవస్థ ఎందుకు ఏర్పాటు చేశారని అంబేద్కర్ భావిస్తారంటే తనకున్న స్వేచ్ఛతో అగ్రవర్ణ స్త్రీలు శూద్రులను వివాహం చేసుకుంటే వర్ణవ్యవస్థ కుప్పకూలుతుంది. ఇలా జరగకుండా ఆపడానికి మాత్రమే మనువు ఏర్పర్చిన నియమాలు ఉపకరిస్తాయి. మనువు నియమాలు ఇంటి ఇల్లాలిని బానిస స్థాయికి దిగజార్చాయి. ఆమె ఆస్తిని కబళించడానికి మనువు చెప్పిన మాట ఇది. భార్యా, కొడుకు, బానిసలకు ఆస్తి ఉండే అవకాశమే లేదు. వాళ్ళు సంపాదించిన డబ్బు కచ్చితంగా వారి యజమానికే చెందుతుంది. ఉమ్మడి కుటుంబంలో ఉన్నప్పుడు భర్త మరణించి నట్టయితే భార్యకు అతని వాటా అనుభవించే అధికారం ఉంటుంది. కానీ దాని మీద ఆమెకు ఎటువంటి హక్కు ఉండదు. అంబేద్కర్ దృష్టిలో మనువు చెప్పిన ప్రకారం స్త్రీల స్థాయి శూద్రులతో సమానం. ఎలాగంటే... శూద్రులకు, స్త్రీలకు వేదం నేర్చుకోవడం నిషిద్ధం, స్త్రీలకు మతానికి సంబంధించిన ఎటువంటి నియమ నిబంధనలు తెలియవు. ఎందుకంటే వారు వేదం నేర్చుకోలేదు కాబట్టి స్త్రీ వేదం వల్లె వేయడం వల్ల పాపాలు సంక్రమిస్తాయని హిందువులు నమ్ముతారు. స్త్రీలను వాటికి దూరంగా ఉంచారు. కాబట్టి వారు అపవిత్రులనేది వారి భావన. వేదాల్లో చెప్పిన కర్మలేవీ స్త్రీలు చెయ్యడానికి వీలులేదు. ఒకవేళ చేసినట్లయితే వాడు నరకానికి పోతారు. అటువంటి స్త్రీ చేతి నుంచి ఇచ్చే భిక్ష బ్రాహ్మలు స్వీకరించరాదు. ఇటువంటి నియమాల వల్ల బ్రాహ్మలెవరూ స్త్రీలకు సాయం చెయ్యకుండా మనువు ఆపగలిగారు. కర్మ చెయ్యడానికి స్త్రీలకు ఎటువంటి అధికారం లేదు. ఒకవేళ స్త్రీ కర్మలు ఆచరించినా అది దేవుడిని చేరవు వంటి మాటల వల్ల స్త్రీలను కర్మలకు దూరంగా ఉంచడం మినహా మనువుకు ఇంకెటువంటి లక్ష్యం లేదు. డాక్టర్ అంబేద్కర్ ఉద్దేశ్యం ప్రకారం స్త్రీలకు ఎటువంటి తెలివితేటలు ఉండడానికి కానీ, భావస్వేచ్ఛ ఉండడానికి కానీ మనువుకు ఇష్టం లేదు. చచ్చే వరకు హిందువుగా మిగిలినా స్త్రీలకు తులసి తీర్థం కూడాదక్కదు. స్త్రీలు తమ తండ్రి ఎవరికి తమను అప్పగించినా లేదా తండ్రి

అనుమతితో సోదరుడు ఎవరికి అప్పగించినా వారితో జీవితాంతం ఉండాల్సిందే. అతడు మరణిస్తే అతని జ్ఞాపకాలతో బ్రతకాల్సిందే. భార్య భర్తను ఆరాధ్య దైవంగా భావించాలి. అలా భావించిన స్త్రీ తప్పకుండా స్వర్గానికి వెళుతుంది. ఇలాంటి మనువు ప్రతిపాదనలను డాక్టర్ అంబేద్కర్ ప్రశ్నించారు. వేద మంత్రాల సాక్షిగా వివాహం జరుగుతుంది. కట్టుకున్న భార్యను ప్రతిక్షణం సంతోషంగా ఉంచాలన్నదే ఆ వేద మంత్రాల అర్థం. అంతేకాదు. భార్య ఇంటికి లక్ష్మి లాంటిది. ఆమె ఎప్పుడూ చిరునవ్వుతో ఉండాలి. ఇంటి పనులను చాలా తెలివిగా, శుభ్రంగా చెయ్యాలి, ఖర్చు తగ్గించే విషయంలో చాలా చాకచక్యంగా వ్యవహరించాలి అని మంత్రాలు చెబుతాయి. ఇవన్నీ చాలా ఉన్నతమైన విషయాలుగా హిందువులు ఎలా భావిస్తారని అంబేద్కర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

మనువు ప్రకారం కేవలం స్త్రీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను, ఆస్తిపాస్తులను హరించడం మాత్రమే కాదు. ఈ నియమాలను ఉల్లంఘించే స్త్రీలను దండించే హక్కు ఆమె భర్తకు ఉంటుంది. భార్య కుమారుడు, తమ్ముడు, బానిసలలో ఎవరు తప్పు చేసినా వెదురుబద్ద లేదా కొరడాతో కొట్టే హక్కు యజమానులుగా, భర్త, తండ్రి, అన్నలకు ఉంటుంది. మనుస్మృతి శూద్రులను, బానిసలను, స్త్రీలను ఒకే గాటన కట్టిందనేది అంబేద్కర్ వాదన. మనుస్మృతి స్త్రీ స్థితిగతులను గురించి చెప్పిన వాటిని అధ్యయనం చేసిన తర్వాతే ఆయన ఈనాటి స్త్రీల పరిస్థితిని మెరుగు పరచడానికి ఎటువంటి సంస్కరణలు చెయ్యాలో తెలియజేశారు. మౌర్యులకు పూర్వపు సమాజంలోను, మౌర్యుల కాలంలోను జీవించిన మహిళలు గౌరవప్రదంగా ఉండేవారు. తర్వాత కాలంలో సామాజికంగా, మానవ సంబంధాల రీత్యా ముందుకు నడపాల్సింది పోయి, మనుధర్మ శాస్త్రం సమాజాన్ని వెనక్కి నడిపిందనేది అంబేద్కర్ వాదన. శూద్రుల పట్ల, మహిళల పట్ల మనుస్మృతి చూపిన వివక్షకు గాను దాన్ని తగలబెట్టాలంటారు. అంబేద్కర్, ఆయన ఈ ప్రతిపాదన కొత్త విప్లవానికి నాంది.

**స్త్రీల స్థితిగతుల పట్ల అంబేద్కర్ చేసిన ఈ అధ్యయనం చరిత్ర మూలాల్లోకి వెళ్ళి అసలు సమస్య ఎక్కడుందో కనుక్కొని వాటిని బాగుచెయ్యాలన్న ఒక తాపత్రయంతో చేసిందే తప్ప ఎవరి మెప్పు కోసమూ కాదు. అయితే అదృష్టవశాత్తు ఆయన ఆ తర్వాత రాజ్యాంగ నిర్మాణ బాధ్యతలు చేపట్టారు. రాజ్యాంగ బద్ధంగా భారత పౌరులందరికి సమాన హక్కులకు ఆయన రూపకల్పన చేశారు. తర్వాత కాలంలో ఆయన న్యాయశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్నాక ఆయన మొదటి అవకాశాన్ని హిందూ కోడ్ బిల్లు ప్రవేశపెట్టడానికి వాడుకున్నారు. ఈ బిల్లు ద్వారా ఆయన స్త్రీలకు వివాహం, విడాకులు, ఆస్తి వంటి అన్ని విషయాల్లో సమాన హోదాను కల్పించారు. సమాజాన్ని తిరోగమనంలో నడిపి స్త్రీల జీవితాలను అత్యంత దీన స్థితిలోకి నెట్టిన పరిస్థితులను ఈ విధంగా రూపుమాపి వారి జీవితాల్లో విప్లవాత్మక మార్పులను తెచ్చేందుకు ప్రయత్నించారు. కానీ ఈ బిల్లు పార్లమెంటులో వీగిపోయింది. జవహర్‌లాల్ నెహ్రూ వంటి ఆధునిక భావాలు కలిగిన, ధైర్యసాహసాలు కలిగినవారు కూడా మనుధర్మానికి వ్యతిరేకంగా వెళ్లేందుకు వెనుకాడారు.**

మన సమాజంలో తరతరాలుగా పాతుకుపోయిన తిరోగమన విప్లవానికి ప్రభుత్వం కూడా ఎదురెళ్ళేందుకు జంకింది. అంబేద్కర్‌కు అప్పటికి సమస్య అధికారంతో తీర్చగలిగేది కాదని అర్థం అయ్యింది. అందువల్ల ఆయన క్యాబినెట్ నుంచి బయటికి వచ్చేశారు. రాజకీయ పరిస్థితులతో ఆయన ఏనాడూ రాజీపడలేదు. ఆయన రాజీనామా మనకు చాలా విషయాలు తెలుపుతుంది. ఆయనకు అధికారం ఒక లెక్కలోనిది కాదు. రెండోది అణచివేతకు గురైనవారి పక్షాన ఆయన పోరాట పటిమను తెలుపుతుంది. అన్నింటికంటే ముఖ్యమైన విషయం ఏమిటంటే ఆయన అధికారాన్ని వదులుకుంది అందరూ అనుకుంటున్నట్లు దళితుల కొరకు కాదు. మహిళల కోసం అనేది అంటే ప్రత్యేకంగా ఆయన ఏదో ఒక వర్గం బాగోగుల కోసం కాదు. సమాజంలో వివక్షను, అణచివేతను ఎదుర్కొంటున్న అన్ని వర్గాల పక్షాన నిలిచారని అర్థం అవుతోంది. సమకాలీన భారత సమాజం రకరకాల స్థాయిల్లో చరిత్రను పునరావృతం చేస్తుంది. బౌద్ధమతాన్ని ఆ రోజుల్లో అత్యంత మార్పులు తెచ్చిన ఉద్యమంగా తీసుకున్నట్టయితే అది సమాజాన్ని సంస్కరించడంలో తన ముందున్న సవాళ్లను దీటుగా ఎదుర్కోలేకపోయింది. చారిత్రాత్మకమైన సంస్కరణలు అమలు కాలేక పోయాయి. బౌద్ధమతం కనుక భారత దేశంలో విజయవంతమై ఉండి ఉంటే భారతదేశం ఈ రోజున మరోలా ఉండేది. ఇలా లింగ వివక్ష, కుల వివక్ష ఇంతకాలం కొనసాగి ఉండేవి కాదు. సామాజికంగా మరింత అభివృద్ధి జరిగి ఉండేది.

ఈ నలభై సంవత్సరాల్లో అనేక ఉద్యమాలు వచ్చాయి. చైతన్యం ఒక స్థాయిలో సమాజాన్ని ప్రజాస్వామ్య బద్ధం చేస్తే మరొకస్థాయిలో అణచివేస్తుంది. స్త్రీల మీద జరుగుతున్న అకృత్యాలు సమాజంలోని అమానుషత్వాన్ని మాత్రమే తెలపడం లేదు, వీటివల్ల వారిలోని చైతన్యాన్ని సమాజం

అంగీకరించడానికి మహిళలు తాము పురుషుల కంటే ఏ విషయంలోనూ తీసిపోమనే విషయాన్ని రుజువు చేస్తూనే ఉన్నారు. "గౌరవప్రదమైన జీవితం మా హక్కు" అని ఎన్నో వేదికల మీద నొక్కి చెప్తున్నారు. ఈ చైతన్యం అన్ని వర్గాల స్త్రీలలోనూ కనిపిస్తోంది. ఈ రకమైన చైతన్యం ఒక స్థాయిలో సమాజాన్ని ప్రజాస్వామ్యం బద్ధం చేస్తే మరొక స్థాయిలో అణిచి వేస్తుంది. స్త్రీల మీద జరుగుతున్న అకృత్యాలు సమాజంలోని అమానుషత్వాన్ని మాత్రమే తెలపడం లేదు వీటివల్ల వారిలోని చైతన్యాన్ని సమాజం అంగీకరించడానికి సిద్ధంగా లేదనేది కూడా తేటతెల్లం అవుతోంది. భూపోరాట ఉద్యమంలో అత్యంత ధైర్యసాహసాలతో పోరాడిన గిరిజన మహిళలు, మద్యనిషేధ ఉద్యమాన్ని లేవనెత్తిన దళిత మహిళలు, కుటుంబంలో సమాన హోదా కోసం పోరాడుతున్న ఉన్నత వర్గాల స్త్రీలు, పౌరహక్కుల సాధనలో పాలు పంచుకుంటున్న స్త్రీ వాద ఉద్యమాలు భారత సమాజ పునర్నిర్మాణ ఆవశ్యకతను తెలుపుతున్నాయి. ఇది బుద్ధుడు, ఇతర సంస్కర్తలు సమాజంలో ఆశించిన మార్పు ఇప్పుడు మనం ఒక నవతక ప్రారంభంలో ఉన్నామని అనుకోవచ్చు. ఇప్పటికీ సమాజంలో సింహ భాగం మనుధర్మాలనే ఆదర్శాలుగా భావిస్తున్నారు. హిందూ కోడ్ బిల్లును అడ్డుకుని వారు ఇంకా తమ యుద్ధాన్ని చేస్తూనే ఉన్నారు. సాధ్యమైనంత వరకు వారి ఆధిపత్యాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. బౌద్ధమతాన్ని, హిందూకోడ్ బిల్లును మరుగున పడేయడానికి వారు నిత్యం శ్రమిస్తూనే ఉన్నారు. మార్పులు జరుగుతున్న ఈ సందర్భంలో ఎటువైపు వెళ్లాలన్న నాలుగురోడ్ల కూడలిలో ఉన్న వారికి అంబేడ్కర్ తన రాజీనామాతో మార్గదర్శనం చేశారు. తన రచనలు ద్వారా అణచివేతకు గురౌతున్న వారిని చైతన్యపరిచారు.

బ్రాహ్మణ వాదం తిరోగమన విప్లవాన్ని ఇలాగే సమాజంలో కొనసాగించే ప్రయత్నం చేస్తోంది. స్త్రీల పట్ల, దళితుల పట్ల ఎటువంటి వివక్షను కొనసాగించాలని సమాజం కుట్ర చేస్తున్నదో ఆయన తన రచనలలో తేటతెల్లం చేశారు. శూద్రులు, స్త్రీలకు సంఘీభావం తెలిపి వారి బలాన్ని పెంచాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఉన్నతవర్గ స్త్రీలు కూడా అణగారిన వర్గాలేనన్న విషయాన్ని ఒప్పుకుని ఇతర అణగారిన వర్గాలతో కలిసి ఉద్యమించినప్పుడుమరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చుననేది ఆయన అభిప్రాయం. అంబేద్కర్ శతజయంతి ఉత్సవాలు జరుపుకుంటున్న ఈ సంవత్సరం మనమంతా అణగారిన వర్గాలైన దళితులు, స్త్రీల అభివృద్ధికి, వారి పైన జరుగుతున్న అకృత్యాలకు వ్యతిరేకంగా పోరాడటమే మనం ఆయనకు ఇవ్వగలిగిన ఘన నివాళి. ❑

**(1990లో హైదరాబాద్లో డా॥బి.ఆర్. అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్ కోసం చేసిన స్మారకోపన్యాసం)**

---

# బీఆర్ అంబేడ్కర్ మార్గం : దేశంలో సామ్యవాద ఆర్థిక అభివృద్ధి

**(33వ పేజీ తరువాయి)**

విజయవంతం చేయడానికి పనిచేస్తున్న మార్క్సిస్టులు, లెనినిస్టులు, అంబేద్కరిస్టులు ఈనాటి చారిత్రక పరిస్థితులను వారి దృష్టిలో వుంచుకొని ఈ సిద్ధాం తాలను సమన్వయం చేసుకోవలసిన అవసరాన్ని గుర్తించాలి. అంబేద్కర్ బౌద్ధ ధర్మాన్ని పునర్నిర్మించి ఆచరించాడు.

మార్క్సిజాన్ని శాస్త్రీయ పద్ధతిలో అవగాహన చేసుకొని ఆ రెండు సిద్ధాంతాలకు వుండే సమన్వయాన్ని, వైరుధ్యాలను మన ముందుంచాడు. ఆయన వంతుగా ఆచరణకు సంబంధించి బౌద్ధాన్ని సమర్థించాడు. తనకు తానుగా ప్రజాస్వామిక సిద్ధాంత వాదిగా ముందుకు వచ్చాడు. ఈనాడు సమసమాజం కోసం కృషి చేస్తున్న శక్తులు బుద్ధుడు, మార్క్స్ లక్ష్యసాధనలో వున్న సమన్వయాలను, వైరుధ్యాలను అవగాహనలోకి తీసుకొని అంబేద్కర్ చారిత్రక అవగాహనతో ఆ రెండు సిద్ధాంతాల మీద యిచ్చిన వివరణలు, వ్యాఖ్యలు సమన్వయాలు, వైరుధ్యాలు, ఆచరణలను అధ్యయనం చేయాలి. ఈనాటి పీడిత వర్గ విముక్తి పోరాటాన్ని ముందుకు తీసుకుపోవడానికి ఆ అధ్యయనాన్ని ఆచరణలో ఆయుధంగా చేసుకోవలసిన అవసరాన్ని గుర్తించకపోతే పోరాటంలో విజయాన్ని సాధించడం దుర్లభం.

సమసమాజ స్థాపనలో, దాని కొనసాగింపులో, నియంతృత్వంలో మృగ్యమవుతున్న ప్రజాస్వామ్యాన్ని, ప్రజాస్వామ్యం పేరుతో కొనసాగుతున్న నియంతృత్వాన్ని నిరోధించినపుడే సత్ఫలితాలు చేకూరుతాయని అంబేద్కర్ తన బుద్ధుడు– మార్క్స్ తులనాత్మక పరిశీలనలో నిగ్గు తేల్చిన చారిత్రక సత్యం. నిజానికి అంబేద్కర్ ఆర్థిక సామ్యవాద సామాజిక సిద్ధాంతాలు ఈనాడు భారతదేశానికి శిరోధార్యం, మనందరం జాతీయవాదులం, ఎన్నో పోరాటాలతో స్వాతంత్ర ఉద్యమంలో మన దేశానికి స్వాతంత్ర్యం తెచ్చుకున్నాం. దీన్ని ఆర్థిక, సామ్యవాద, సామాజిక, సమతుల్యతలను రాజ్యాంగ బద్ధంగా అంబేద్కర్ ఆలోచనల్లో సిద్ధాంతాలతో పరిపుష్టం చేసుకోవడం ద్వారా ప్రపంచంలోనే అత్యున్నత ఆర్థికాభివృద్ధి కలిగిన దేశంగా రూపొందించుకోగలుగుతాం. రాజ్యాంగకర్త ఆలోచనలలో నడుద్దాం. దేశ ప్రగతికి సోపానం నిర్మిద్దాం. అంబేద్కర్ ఆలోచన విధానమే దేశ ఆర్థికాభివృద్ధి మార్గం. ❑

# మహిళా హక్కులపై అంబేద్కర్ కృషి



మాడభూషి శ్రీధర్

ఆడ పిల్ల పుట్టుక దుఃఖమయంగా భావించకూడదని బౌద్ధం అంటుంది. బుద్ధుడు, ప్రసేనజిత్ మహారాజుల మధ్య ఓ సంఘటన జరిగింది. తనకు ఆడపిల్ల జన్మించిందనే కారణంతో ప్రసేనజిత్ మహారాజు బాధపడుతూ ఉంటే 'ఆడ బిడ్డ పుట్టిందని ఎంత మాత్రం దుఃఖించాల్సిన అవసరం లేదు. ఆడ బిడ్డ మగ బిడ్డకు ఏ మాత్రం తీసిపోదు' అని బుద్ధుడు అన్నాడని అంబేద్కర్ ఒకానొక సందర్భంలో గుర్తుచేశారు. 1951 సెప్టెంబర్ 9న కేంద్ర న్యాయ శాఖా మంత్రి పదవికి అంబేద్కర్ రాజీనామా చేశారు. ఆధునిక ప్రపంచ చరిత్రలో ఆడవారి హక్కుల కోసం ఆ పదవిని వదులుకున్న మహానేతగా ఆయన మిగిలారు. రాజ్యాంగ రచన కంటే కష్టమైన సమస్య అంబేద్కర్ నిర్మించిన మొదటి హిందూ కోడ్. డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్(1891-1956)ఒక పండితుడు, సామాజిక సంస్కర్త, దళితులు, మహిళల హక్కుల కోసం శక్తివంతమైన న్యాయవాదిగా, భారత రాజ్యాంగ సభలో రచనా సంఘం అధ్యక్షుడిగా, దేశ తొలి న్యాయమంత్రిగా పని చేశారు. అటువంటిది, రాజ్యాంగ నిర్మాణం కంటే హిందూ కోడ్ తయారీ చాలా కష్టమని రాజీనామా చేయవలసి వచ్చింది.



సమానత లేకపోతే ఆర్టికల్ 14 కానీ, పీఠిక కానీ, ప్రాథమిక హక్కులూ ఎందుకూ అక్కరకు రావు. స్వాతంత్ర్యోదమం నుంచి గణతంత్రం వరకు రాజ్యాంగ రచన (1947 - 26 జనవరి 1950 వరకు) వలస భావాల బానిసత్వం నుంచి విముక్తి కోసం పోరాడడం కూడా చాలా ప్రధానమైన అంశంగా చెప్పవచ్చు. హిందూ శాసనాలను సంస్కరించడానికి అంబేద్కర్ ఎంతో కష్టపడాల్సి వచ్చింది. వ్యతిరేకతలు, ప్రతిఘటనలు, అవమానాలను భరిస్తూ కూడా మహిళా చైతన్యాన్ని అంబేద్కర్ రగిలించారు. స్త్రీ శక్తిని తీవ్రంగా కదిలించి, సంస్కరణ ఉద్యమ సామాజిక విప్లవాన్ని ఆయనే ప్రారంభించారు.

రెండు హిందూ కోడ్‌ల మధ్య భారత దేశంలో పెద్ద పోరాటమే జరిగింది. మొదటి హిందూ కోడ్ పోరాటాన్ని అంబేద్కర్ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ప్రారంభించారు. నెహ్రూ ఆధ్వర్యంలో రాజ్యాంగ రచనలో పాల్గొన్న అనేక నాయకులకు అంబేద్కర్‌కు హిందూ కోడ్‌పై తీవ్రమైన ప్రతిఘటనలు ఎదురైయ్యాయి. ఎన్నో అభ్యంతరాలు వ్యతిరేక అభిప్రాయాలు వల్ల ఎన్నో మార్పులు చేసి మరో క్రోడీకరణ జరిగింది. వీటిని రెండు హిందూ కోడ్‌లుగా చెప్పవచ్చు.

**హిందూ సామాజిక సంస్కరణ..**

భారత రాజ్యాంగాన్ని రూపొందించడానికి 1947-1950 వరకు సమావేశమైన రాజ్యాంగ సభకు డాక్టర్ అంబేద్కర్ చేసిన సేవ మామూలు కాదు. అసాధారణం, అద్భుతం కూడా. (అంబేద్కర్ రచనలలో 14వ సంపుటిలో హిందూ చట్టాన్ని 'సవరించేందుకు, క్రోడీకరించేందుకు' ఆయన రాజ్యాంగ సభలో చేసిన ప్రసంగాలు చదవవచ్చు. 1947 ఏప్రిల్ 11న అంబేద్కర్ ప్రవేశపెట్టిన హిందూ కోడ్ బిల్లుపై పూర్తి చర్చ అందరూ చదవవలసిందే.)

బహు భార్యత్వాన్ని వ్యతిరేకించడం, విడాకుల చట్టాన్ని అమలు చేయడం వంటి అనేక ముఖ్యమైన తీర్మానాలను ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ మహిళా సమావేశం ఆమోదించింది. దురదృష్టవశాత్తు, ముఖ్యమైన మహిళా నాయకులు బిల్లుకు మద్దతు ఇవ్వడంలో ఆసక్తి చూపలేదని అంబేద్కర్ బాధపడ్డారు.

అంబేద్కర్ రాజ్యాంగానికికంటే ముందు హిందూ కోడ్‌ను నిర్మించారు. దీనిని చాలా మంది వ్యతిరేకించారు. బిల్లు మీద చర్చించారు, తిరస్కరించారు. చాలా వరకు హిందూ కోడ్‌లో ఆయన చేర్చిన అంశాలు తొలగించడం సాధ్యం కాని అంశాలు

అని అర్థమైంది.

**అందులో ముఖ్యమైన అంశాలు ఇవి :**

- ప్రధానమైన సంస్కరణ హిందూ వివాహానికి సంబంధించినది.
- దత్తత కోసం చాలా సమగ్రంగా నియమాలు తయారు చేశారు.
- పిల్లలను ఏ విధంగా సంరక్షించుకోవాలి? అంటే అమాయకులను, మతి స్థితి ఆధారంగా పెంచుకోవలసిన వారనే పోషకుల నియమాలు ముఖ్యమైనవి.
- వీలునామా, ఉమ్మడి-కుటుంబ ఆస్తి, దాని విధానం, మహిళలకు సాంప్రదాయేతర ఆస్తి కేటాయించడం కూడా చాలా వివాదాస్పదమైంది.

హిందూ శాస్త్రాల ఆధారంగా అమలులో ఉన్న మితాక్షర, దాయభాగ రకాల ఆస్తిసంక్రమణ, తదితర అంశాలను, వీలు నామాతో మార్చే ఆస్తి వివరాలు అన్నీ సమస్యలమయమైనవే. వీలునామా లేని సందర్భాలలో ఆస్తి వారసత్వం ఏ విధంగా పంచుకోవాలనేది సంక్లిష్టమైనది. (మితాక్షర అనేది 'పుట్టుక ద్వారా వారసత్వం' అనే సిద్ధాంతానికి ప్రసిద్ధి చెందిన యాజ్ఞవల్క్య స్మృతి, దయాభాగ చట్టానికి అధికారంగా ప్రబలంగా ఉంది. 'దాయభాగం' అనేదానిని ఇంగ్లీష్‌లో ఇన్హెరిటెన్స్ అంటారు.)

- మగ వారికి మహిళల ఆస్తికి సంబంధించిన విధానాలు వేరుగా ఉన్నాయి. ఇదే పెద్ద చారిత్రక వివాదం, కోర్టులో కూడా తేలవు. స్త్రీ ధన, వారసత్వ ధనం. సర్వైవర్షిప్ ఆస్తుల బదిలీ, సంక్రమించడం చిన్న విషయాలేమీ కావు. లాయర్లకు సవాలు విసిరే అంశాలు. బోలెడు డబ్బు తెచ్చే వివాదాలు కూడా అవే. ఎవరు కష్టపడి సంపాదించిన డబ్బయినా సరే, వారసులు వేరే అయినా, నిజంగా దాదాపు సగం, లేదా అంతకన్న ఎక్కువ సంపాదించేవారు న్యాయవాదులే అవుతారు.
- వీటితోపాటు వారసత్వం, ఆస్తుల సంక్రమణ విధానాలను కోడ్ తయారికి ఏర్పాటు చేశాయి.

**హిందువులు ఎవరు?**

హిందువుల నిర్వచనం, కుల వ్యవస్థను తొలిగించింది. ముస్లిం, పార్సీ, క్రైస్తవులు లేదా యూదులు కాని ఎవరికైనా హిందూ కోడ్ వర్తిస్తుంది. అందరికీ యూనిఫాం (ఉమ్మడి) కోడ్ ఇది. కానీ అందరూ ఒప్పుకుంటారా? ఈ బిల్లులోని 'కోడ్ అప్లికేషన్' గురించి చర్చించే క్లాజ్ 2తో చర్చ ప్రారంభమైంది. హిందువులెవరు అనే ప్రశ్నతో ఈ చర్చ కీలకంగా మారింది. ఈ క్లాజ్‌లో హిందువులతోపాటు బౌద్ధులు, జైనులు సిక్కులకు కూడా కోడ్ వర్తిస్తుందని పేర్కొన్నారు. ఇది ముస్లింలు, క్రైస్తవులు, పార్సీలు లేదా యూదులకు వర్తించదు. ఈ క్లాజ్‌ను పార్లమెంటులోని చాలా మంది సభ్యులు వ్యతిరేకించారు. ఇదే వివక్షకు ఆధారమనీ విమర్శించారు. అదే ఉండాలనే వారు కూడా ఎక్కువ మందే ఉన్నారు.

ఈ బిల్లును హిందువులకు మాత్రమే కాకుండా 'మన అధికార పరిధిలోని మనం చట్టం చేయగల అన్ని మతాలకు చెందిన పౌరులకు' వర్తింపజేయాలి అని మధ్య భారత్ రాష్ట్రానికి చెందిన వి.ఎస్. సర్వతే అన్నారు. బీహార్‌కు చెందిన సభ్యులు బనార్సి ప్రసాద్ జున్‌జున్‌వాలా ఈ బిల్లుకు భారతదేశంలోని అందరు పౌరులకు 'ఏ కులానికి, ఏ మతానికి చెందిన వారనే దానితో సంబంధం లేకుండా' వర్తించే సవరణను ప్రతిపాదించారు.

**స్వయం ప్రతిపత్తి..**

భారతీయ మహిళలకు స్వయం ప్రతిపత్తి, స్వాతంత్ర్యం అనే హక్కులు ఉన్నాయా లేవా అనేది అనుమానమే కదా. మగా ఆడ అనే పదాలతో సంబంధం లేకుండా వీలునామా రాయకుండా మరణించే హిందువు ఆస్తి హక్కు ఎప్పుడొస్తుంది ?

> **అంబేడ్కర్ కోడ్ మహిళలను సమాన పౌరులుగా గుర్తించింది. ఈ ప్రయత్నం వారి వ్యక్తిత్వం దెబ్బ తినకుండా చూడాలన్న కోరికగా చెప్పవచ్చు. మహిళలకు ఆస్తిపై హక్కు లేకపోవడం తీవ్రమైన లోపంగా చూడాలి. ఆస్తి హక్కు కూడా లింగ ఆధారిత అణచివేత కుల-ఆధారిత అణచివేతతో ముడిపడి ఉంది. ఈ సంబంధం అర్థం చేసుకోవాలంటే కులం, బ్రాహ్మణ పితృస్వామ్యంలాంటి అంశాలు అర్థం కావాలి. కాబట్టి సంస్కరణతోపాటుగా ఈ సంస్కరణాలన్నిటి క్రోడీకరణ అవసరమైంది. అయితే, దీంట్లో మతపరమైన పునాది ఉందని అంబేడ్కర్ పదే పదే చెప్పారు. అయినా ఇంకా చాలా మంది అర్థం చేసుకోవాల్సి ఉంది.**

**కాపురం హక్కు, వ్యక్తిగత గోప్యత హక్కు?**

భారతీయ హిందూ వివాహాల చట్టంలో కాపురం హక్కు ఉంది. రైట్ టు కాంజుగల్ లైఫ్. అసలేమిటీ హక్కు ? ఇక్కడ ఒక విచిత్రమైన విషయాన్ని ప్రస్తావించాలి. సినీ నటి సరితకు ఎప్పుడో పెళ్లయిందంటారు. ఆమె, ఆమె భర్త కూడా ఆ విషయాన్ని మరిచిపోయారు. ఆమె పెద్ద ప్రసిద్ధమైన నటి అయిన తరువాత భర్త కోర్టులో కేసు వేశాడు. అయితే దీని మీద స్పందించిన కొందరు బలవంతంగా కాపురం చేయిస్తారా అని అడిగారు. దీని గురించి జస్టిస్ పిఏ చౌదరి సంచలనమైన తీర్పు

వెలువరించారు. అది ప్రైవసీ హక్కు అని మొదట చెప్పి, కొన్ని దశాబ్దాల తరువాత ఇది అన్యాయమని అన్నారు. అప్పటి వరకు పోలీసులతో కాపలా పెట్టి కాపురాలను రక్షిస్తారా? ఇది విచిత్రం కాదు, పిచ్చి అనకూడదా..!

### రాజ్యాంగం సరే, విడాకుల పోరాటం ఏమిటి?

ఓసారి పెళ్లయిన తరువాత ఆ బంధానికి మోక్షం అసలు దొరికే అవకాశమే లేదనే స్థితి వచ్చింది. హిందూ సనాతన ధర్మంలో పెళ్లయిన భార్యకు ఎటువంటి పరిస్థితుల్లోనూ మరో జీవితం లేదు. న్యాయం కోసం, రాజ్యాంగం కోసం కూడా సమానత హక్కులు అవసరం. సమానత లేకుండా భారత రాజ్యంగం రాసుకోవడం ఒక వృథా.

ఓ సారి పెళ్లయిన తర్వాత బంధం ఎంత నరకమైనా కొనసాగించాలా ? ఆడ వారా మగవారని కాదు. ఎవరైనా సరే విడాకులు అవసరమని ఎన్నాళ్ల తరువాత తెలుస్తుంది? వివాహం రద్దు చేసే అవకాశాలు ఉండి తీరాలనేది అంబేద్కర్ తీవ్రమైన ప్రతిపాదన అంటారు. కులం దుర్మార్గాన్నే కాదు, స్త్రీ మీద అణచివేత ధోరణులను అంబేద్కర్ తీవ్రంగా వ్యతిరేకించారు. భర్తతో తేడాలు వస్తే విడాకుల ద్వారా పెళ్లిని రద్దు చేసుకునే అవకాశాన్ని హిందూ కోడ్ బిల్లుతో అంబేద్కర్ కల్పించారు. విడాకులు ఉండనే ఉండవంటారు. విడిపోయి కూడా బతకనివ్వరు. కోర్టులో అడిగినా విడాకులు ఇవ్వరు. విడాకులు ఉండాలని, వాటికి అనుమతించాలని సంస్కరణలు కోరుతున్నాయి. తప్పనిసరి విడాకుల స్వేచ్ఛ నిబంధన కోసం అంబేద్కర్ వాదించారు.

అంతేకాకుండా భారతదేశంలో చట్టాల బ్రాహ్మణీకరణతో భారతీయ సంస్కృతి విచ్ఛిన్నం అవుతందంటూ దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. భారతీయ సంస్కృతిలో 90% ఉన్న శూద్రులలో విడాకులు ఒక అలవాటు. చట్టం కాబట్టి మెజారిటీపై మైనారిటీ పాలన విధించడాన్ని ఆయన ప్రశ్నించారు. సాంప్రదాయ హిందూ మతం రక్షణ కోసం ధర్మ సంఘం అనే సాంస్కృతిక సంస్థ హిందూ కోడ్ బిల్‌కు వ్యతిరేకంగా అనేక ఆందోళనలను నిర్వహించింది.

### విడాకులు రావడానికి ఎన్నేళ్లు ?

మరో ప్రశ్నేంటంటే విడాకులు సులభం చేయలేరా? విడాకులు ఇవ్వరు, వదలరు. చంపేస్తారే గాని బతకనివ్వరు. కోర్టుకు వెళ్తే పదేళ్లు ఇరవై ఏళ్లు దాటినా సుప్రీంకోర్టుకు ఆ కేసు చేరదు. అయినా ఎంత ఆశ్చర్యపోయినా సుప్రీంకోర్టు మందలింపులు మాత్రం పత్రికల్లో ప్రచురిస్తుందే కాని వారికి ఏం లాభం. విడాకులు సులభం చేస్తే కోట్ల కేసులు ఓ వారంలో రద్దైపోతాయి.

### ఏకపత్నీ వ్రతం ఎక్కడ ?

వివాహం తప్పనిసరి, కానీ ఏకపత్నీ వ్రతం ఎవరు చేస్తారు? ఒక భర్త ఒక భార్య అనే మాటే గొప్ప విప్లవకరమైన సంస్కరణగా చెప్పుకోవాలి. భార్యలకు రకరకాల పేర్లు ఉంటాయి. కొన్ని మాటలు దారుణంగా ఉంటాయి. స్త్రీని హీనంగా బలహీనం చేసే నియయాలే అన్నీ. విడాకులు, మహిళలకు సమాన ఆస్తి హక్కులను సాకారం చేసుకోవడానికి కుల ఆధారిత పరిమితుల తొలిగింపు ముఖ్యమని అంబేద్కర్ అంటే విన్నదెవరు? వాటిని వ్యతిరేకించినందుకు ఎన్నో సమస్యలు, వివాదాలు వచ్చాయి. భారత రాజ్యాంగ సభ ఛైర్మన్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, ఉన్నత విద్యావంతులైన మహిళలు మాత్రమే బిల్లుకు మద్దతు ఇస్తారని అతని భార్య విడాకుల నిబంధనను ఎప్పటికీ సమర్థించదని అన్నారు. అదే పరిస్థితి. బహు భార్యత్వాన్ని సమర్థించడం చాలా పాశ్చాత్యమని బిల్లు విమర్శకులకు ప్రతిస్పందిస్తూ అంబేద్కర్ హిందూ స్మృతి శాస్త్రాలను ఉదహరణగా చూపారు. చాలా వరకు బహు భార్యత్వాన్ని పరోక్షంగా సమర్థిస్తున్నాయి.

### బహు భార్యత్వం, స్త్రీకి శాశ్వత బానిసత్వం

రాజ్యాంగ సభలోని కొంత మంది సభ్యులు సమర్థించిన వివాహం అనే భావన 'స్వేచ్ఛ లేదా సమానత్వం ఆదర్శానికి' అనుగుణంగా లేదని అంబేద్కర్ పేర్కొన్నారు. హిందూ చట్టాల ప్రకారం వివాహాన్ని 'పురుషుడికి బహు భార్యత్వం, స్త్రీకి శాశ్వత బానిసత్వం' అని ఆయన తీవ్రగా విమర్శించారు. ఈ బిల్లులో విడాకుల నిబంధనను ఆయన గట్టిగా సమర్థించారు.

### ఒకే బాణమూ ఒకటే మాట ఒక్క భామకే ఈ ప్రేమ..

లవకుశ సినిమాలో అద్భుతమైన పాట 'ఒకే బాణమూ ఒకటే మాట ఒక్క భామకే ఈ ప్రేమ' చాలా మంది ఒక భర్తకు ఒక భార్య అనే నియమాలు పాటిస్తున్నారు. కాని పాటించని వారు ఉన్నారు కదా. అది లేకుండా రామరాజ్యం సాధ్యమా? రాముడి తండ్రికే బోలెడు మంది భార్యలు, దశరథుడికి ముగ్గురు భార్యల నుంచి నలుగురు సంతానం జన్మించారు కదా.. రామరాజ్యం గురించి చెప్పేవారు కనీసం భార్యల సంఖ్యను ఒకటికి తగ్గించడం సాధ్యం కాదా ? పేదరికం భయంకరంగా ఉన్నా చదువు సంధ్యలు లేకపోయినా ముస్లింలు నలుగురు భార్యలను చేసుకోవడాన్ని సంస్కృతి, సంస్కరణ అనుకోవడం న్యాయమా? తలాక్ తలాక్‌తో విడాకులను చట్టం ఇప్పుడు వింటున్నాం కాని దాన్ని ఆపగలరా?

### కొడుకులకు కుమార్తెల వారసత్వం ఎందుకు ఇవ్వరు ?

సమానతలో రెండు అవసరాలు ఉంటాయి. ఒకటి అబ్బాయిలకు ఆడ బిడ్డలకు ఎందుకు సమానత ఇవ్వడం లేదు?

రెండు బహు భార్యత్వం కొనసాగితే సమస్యలు ఉండి తీరతాయి. బాల్య వివాహాలు, వితంతువు తంతు, ముసలి వాళ్లకు పెళ్లిళ్లు తీవ్ర సమస్యలుగా మారుతాయి. అంబేడ్కర్ కోడ్‌లో కుమార్తెలకు వారసత్వ భాగాలను కేటాయించింది, వితంతువులకు గతంలో పరిమితం చేయబడిన పూర్తి ఆస్తి హక్కులను ఇవ్వాలని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలను కాంగ్రెస్, హిందూ మహాసభ, ఇతర హిందూ మత అధికారులు తీవ్రంగా వ్యతిరేకించారు.

**హెచ్‌యూఎఫ్...**

హిందూ యునైటెడ్ ఫ్యామిలీ అనేమాట ఒక జోక్ అయిపోయింది. హిందూ అవునో కాదో కానీ యునైటెడ్ మాత్రం కాదు. ఇక ఫ్యామిలీ అన్నా, వసుధైక కుటుంబమని కవిత్వం చెప్పడమన్నా అది ఉందా లేదా ? హెచ్‌యూఎఫ్ కేవలం పన్ను ఎగొట్టడానికి, లాయర్లు డబ్బు సంపాదించడానికే కాక ఇంకెక్కడైనా అమలులో ఉందా ? అన్నదమ్ములు కొట్టుకు చావడానికి కాక ఇంకెందుకు ? బ్రహ్మ పదార్థమా ? ఒక పెద్ద పత్రిక యజమాని హెచ్‌యూఎఫ్‌ను బ్రహ్మాండంగా వాడుకుంటున్నారు. కానీ హిందూ కోడ్ సంస్కరణ సాంప్రదాయ హిందూ వ్యక్తిగత చట్టంతో విభేదించింది. అర్థం కాని సంగతి ఉమ్మడి కుటుంబాలు. 'అన్ని హిందువులకు ఆస్తి యాజమాన్యం ఒక ఉమ్మడి కుటుంబ వ్యవస్థను స్థాపించింది' అంటారు. కొన్నాళ్ల కిందట ఉండవచ్చు. కాని ఇప్పటి సంగతేంటి?

**దత్తత హక్కు కూడా లేదా !**

ఆర్టికల్ 14 మాట చెబుతూ ఉంటారు. కానీ మహిళలకు సమాన హక్కులు మాత్రం ఇవ్వరు. పిల్లలను కనే స్త్రీలకు కనీసం పిల్లలను దత్తత తీసుకునే అధికారం కూడా ఇవ్వరు. ఇదెంత దారుణం కదా. ఆడ వారికి ఆత్మగౌరవం అవసరం లేదా! ఒక భర్త అనేకమైన భార్యలనే బహుభార్యత్వాన్ని రద్దు చేయాలని, ఇది అసమానతని పెద్దవారు ఆలోచించకపోవడం అన్యాయం కూడా.

**ది రైజ్ అండ్ ఫాల్ ఆఫ్ హిందూ ఉమెన్**

'ది రైజ్ అండ్ ఫాల్ ఆఫ్ హిందూ ఉమెన్' పేరుతో రాసిన వ్యాసంలో స్త్రీని చీకటి అగాధంలోకి నెట్టే వేసిన సామాజిక పరిస్థితుల గురించి లోతుగా చర్చించారు. ఆడబిడ్డ పుట్టుకను బౌద్ధ సంప్రదాయం దుఃఖమయ ఘటనగా భావించదని బుద్ధుడికి, ప్రసేన్‌జిత్ మహారాజుకు మధ్య జరిగిన సంఘటన వివరిస్తుందని అంటారు. ఇప్పటికీ పుట్టేది ఆడపిల్లని తెలిస్తే ముందే గర్భం తీయించుకునే టెక్నాలజీని వాడుకుంటున్నారు.

**అంబేడ్కర్ హిందూ కోడ్**

139 ఆర్టికల్స్‌తో ఉన్నటువంటి హిందూ కోడ్ బిల్లు భారతదేశంలోని హిందూ చట్టాలను సంస్కరించడాన్ని క్రోడీకరించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది బహుభార్యత్వం, కులాంతర వివాహాలు, విడాకులు, దత్తత వారసత్వం వంటి అంశాలను పరిశీలించింది. ఈ బిల్లుపై ప్రారంభ చర్చ 1947 నవంబర్ 17- 1948 ఏప్రిల్ 9 మధ్య జరిగింది. దీని తర్వాత, బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపారు. కమిటీ సవరణలను సూచించి, బిల్లును తిరిగి పంపిన తర్వాత 1949 ఫిబ్రవరి 11- 1950 డిసెంబర్ 14 మధ్య రాజ్యాంగ సభలో దీనిపై మరింతగా చర్చ జరిగింది. 1951 ఫిబ్రవరి 5న డాక్టర్ అంబేడ్కర్ పార్లమెంటులో బిల్లుపై నిబంధనల వారీగా చర్చను కోరారు.

ఓ వైపు రాజ్యాంగ నిర్మాణం ముగుస్తున్న దశలో అంబేడ్కర్ బిల్లును ప్రవేశపెట్టారు. మనస్థాపానికి గురై 1951 సెప్టెంబర్ 9న రాజీనామా చేయక తప్పలేదు. హిందూ కోడ్ బిల్లుపై చర్చ ప్రారంభించాలనే ప్రతిపాదనపై యాభై గంటలకు పైగా చర్చ జరిగింది. ఆ తర్వాత చర్చ ఒక సంవత్సరం పాటు వాయిదా కూడా పడింది.

**బిల్లును చంపేశారు, ఏడవకుండా నోరుమూశారు..**

ఈ కోడ్ రాజ్యాంగ చెల్లుబాటుపై కూడా వాదనలు జరిగాయి. పండిత్ ఠంకూర్ దాస్ భార్గవ, జెఆర్ కపూర్ వంటి సభ్యులు, బిల్లులోని నిబంధనలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(1), 25(1) కింద వివక్ష లేకుండా ఏ మతాన్ని అయినా ఆచరించే స్వేచ్ఛకు హామీ ఇచ్చే ప్రాథమిక హక్కులను తగ్గించాయని పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వానికి మతపరమైన ఆచారాలలో జోక్యం చేసుకునే హక్కు లేదు. దీనికి ప్రతిస్పందనగా, పార్లమెంటు వారి మతం తప్ప అన్ని వర్గాల వ్యక్తిగత చట్టాలపై అధికారాన్ని ఉపయోగించిందని డాక్టర్ అంబేడ్కర్ నొక్కి చెప్పారు. 'పార్లమెంటు సార్వభౌమ అధికారం నుండి తమకు మినహాయింపు ఉంటుందని ఏ సమాజమూ భావించకూడదు' అని ఆయన అన్నారు. చివరకు 'బిల్లు చంపబడింది, ఏడవకుండా నోరు మూసింది' అని అంబేడ్కర్ బాధ పడ్డారు.

**అంబేడ్కర్ రాజీనామా..**

మళ్లీ మితాక్షర ఉమ్మడి కుటుంబ వ్యవస్థను తిరిగి స్థాపించడం, సోదరులు కుమార్తెల వారసత్వ వాటాను కొనుగోలు చేయడానికి అనుమతించే సవరణ, వివాహమైన మూడు సంవత్సరాల తర్వాత మాత్రమే విడాకులను అనుమతించే నిబంధన వంటి విమర్శకుల డిమాండ్లకు అనుగుణంగా ఉన్న కొత్త ముసాయిదాను నెహ్రూ అంబేడ్కర్ కమిటీతో పంపిణీ చేయించారు. ఆ బిల్లులు మళ్ళీ అసెంబ్లీలో

ఓడిపోయిన తరువాత, అంబేడ్కర్ రాజీనామా చేశారు.

### ప్రభుత్వం - హిందూ కోడ్..

ఇప్పుడు హిందూ బిల్లు అంబేడ్కర్ బిల్లు కాదు. అది నెహ్రూ కోడ్ బిల్లు. దానికి 4 భాగాలు : హిందూ వివాహ చట్టం, హిందూ వారసత్వ చట్టం, హిందూ మైనారిటీ సంరక్షణ చట్టం, హిందూ దత్తత నిర్వహణ చట్టాలు. దీని పట్ల ఎదురైనా వ్యతిరేకత తక్కువే. ఆ మాత్రం మార్పులు, సంస్కరణలు చేయడానికి కూడా నెహ్రూ నానా తంటాలు పడ్డారు. ఆయనే ఎన్నోసార్లు ఇందులో మార్పులు చేర్పులు చేయాల్సి వచ్చింది. 1952, తరువాత 1956 సంవత్సరాల మధ్య, ప్రతి ఒక్కటి పార్లమెంటులో ప్రవేశ పెట్టారు. ఆమోదించారు కూడా.

### అంబేడ్కర్ అసంతృప్తి..

ఈ నేపథ్యంలో అంబేడ్కర్‌కు అసంతృప్తి, బాధ ఎక్కువగానే ఉంది. హిందూవులకు ఇతరులకు మధ్య తేడా తరువాత చర్చించాలి. కానీ హిందువుల మగ, ఆడవారి మధ్య తేడా సంగతేంటో చర్చించాలనీ, వారసత్వ క్రమం ఎవరు నిర్ణయిస్తున్నారన్నది మార్చకుండా రాజ్యాంగంలో సమానత ఏ విధంగా సాధ్యమవుతుంది అనేది ఆయన ప్రశ్న.

10 శాతం జనాభాకు వర్తించే చట్టం 90 శాతం జనాభా జీవితాల్ని కట్టి పడేస్తుంది. తన ప్రసంగాల్లో, పార్లమెంట్‌లో అంబేడ్కర్ 'హిందువులలో 90 శాతం మంది శూద్రులు ఉంటారనడంలో సందేహం లేదు. ద్విజులు 10 శాతం మంది జనాభాలో ఉంటారు. 90 శాతం మంది అనుసరించే చట్టాన్ని అందరి శాసనంగా చేద్దామా లేక కేవలం 10 శాతం మంది అనుసరించే చట్టాన్ని వంద శాతం మంది మీద రుద్దుదామా?' అని అంబేడ్కర్ ప్రశ్న

### ధర్మశాస్త్రాలలో విడాకులు..

హిందూ ధర్మశాస్త్రాలలో నారదస్మృతి పరాశరస్మృతిలో కూడా విడాకులు ఉన్నాయని ఉంది. కాని ఆమాట చెప్పడం లేదు. విడాకులు ఉండే పరిస్థితులు ఇవి : భర్తలు వదిలినపుడు, మరణించినపుడు, పరివ్రజం(సన్యాసం) తీసుకున్నపుడు వివాహ బంధం నుంచి బయటపడవచ్చు. ఎంతో మంది మతం మారతారు. భర్త మతం మారితే భార్య విడాకులు తీసుకోవచ్చని చాలాకాలం నుంచి ఓ నియమం అమలులో ఉంది. ఎవరికీ తెలియదు. తెలిసినా ఏదో ఒకటి పోనీ అని సర్దుకుంటూ ఉంటారు. చట్టంలో సివిల్ డెత్ అని ఒక నియమం ఉంది. మూడు సందర్భాలలో ఈ పౌరత్వ మరణం ఉంటుంది. భర్త విడాకులు తీసుకున్నా అది భార్యకు సివిల్ డెత్‌గా ఉంటుంది. రెండోసారి సన్యాసం తీసుకున్నవారు, వివాహం తెగిపోయిచ భార్య వేరే పెళ్లి చేసుకోవచ్చు. ఇవన్నీ ఎవరికీ చెప్పరు అర్థం కాదు. లాయర్లకు కూడా తెలుసో లేదో చెప్పలేం. ఇక మూడో పరిస్థితి. ఎక్కువగా భర్తలు చెప్పా పెట్టకుండా ఏదోదేశానికి వెళ్లిపోతారు, వాళ్ల గొంతు వినబడదు. వాళ్లు కనబడరు. మొత్తం ఏడేళ్లు ఎదురుచూసినా రాకపోతే వేరే పెళ్లి చేసుకోవచ్చు. (Civil Death, Divorce, Renouncing, Unheard of 7 years)

### కౌటిల్యుడి అర్థశాస్త్రం

కౌటిల్యుడు రచించింది మొదటి రాజ్యాంగం. Practical Constitution is his creation. ఒక ప్రభుత్వాన్ని యుద్ధం లేకుండానే కూలగొట్టిన వాడు కౌటిల్యుడు. చాణుక్యుని అర్థ శాస్త్రంలో ప్రపంచమంతా ఒకే వివాహ ప్రశస్తమైన నియమాన్ని పాటిస్తున్నారు. మరుముక్కతాయం అలియ సంతానం చట్టాలు ఏక వివాహాల నియమాలు రూపొందించాయి. కౌటిల్యుడు రెండో పెళ్లి హక్కుపైన చాలా పరిమితులు విధించారు. ఒకరు మొదటి 10, 12 సంవత్సరాల వరకు రెండో పెళ్లి చేసుకోవద్దు. పిల్లలు కనడానికి అవకాశం ఉందో లేదో వేచి చూడాలి. ఇదో ప్రధాన పరిమితి. రెండో పెళ్లి చేసుకోదలచుకున్న వ్యక్తి మొదటి భార్యకు ఆమెతో పెళ్లికి వచ్చిన సొమ్మంతా తిరిగి ఇవ్వాలని కౌటిల్యుడు నిర్దేశించాడు. ఇదీ కౌటిల్యుడి అర్థశాస్త్రం.

### స్త్రీ చైతన్యానికి నాంది అంబేడ్కర్..

అంబేడ్కర్ బిల్లు పోతే పోయింది కాని, ఒక ఉద్యమ విత్తనాన్ని నాటింది. స్త్రీ చైతన్యం కోసం అంబేడ్కర్ ఆ విత్తనాన్ని నాటారు. మారుతున్న సమాజంతోపాటు మారాలని, మూఢాచారాలను వదిలి వేయాలని, అనవసర ఆర్భాటాలకు దూరంగా ఉండాలని చెప్పేవారు. ఇప్పుడు చూస్తే విపరీతమైన డబ్బు వెదజల్లుతూ ఆర్భాటాల కోసం దారుణంగా ఖర్చు చేస్తున్నారు. వేశ్య వృత్తిలో ఉన్న కొందరు మహర్ మహిళలు, ఆ నరక చీకట్లో నుంచి వెలుగులోకి రావడానికి, కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి అంబేడ్కర్ ప్రసంగాలు, నినాదాలు, వివాదాల మాటలు అన్నీ ఎంతో దోహదపడ్డాయి.

### రాజ్యాంగం - మహిళా సాధికారత..

మహిళా సాధికారత కోసం రాజ్యాంగంలో ఎన్నో నియమాలు అంబేడ్కర్ చేర్చారు. మహిళల పట్ల వివక్షను అంతం చేస్తూ రూపొందించిందే ఆర్టికల్ 15(3). (Article 15(3) of the Constitution of India allows the state to make special provisions for women and children. It also states that these provisions cannot be challenged on the basis of discrimination.)

ఆడ, మగ అనే వివక్ష లేకుండా అందరూ జీవనోపాధి పద్ధతులను కలిగి ఉండటానికి 39(ఎ) ఆర్టికల్‌ను రచించారు. (Articles 36 to 51 are Directive Principles of State Policy. Article 39A of the Constitution of India states that the state must ensure equal justice and provide free legal aid to all citizens. This article was added to the Constitution in 1976 through the 42th Amendment. Citizens should not be denied justice due to economic or other disabilities. It ensures that legal services are available to women, children, elderly, and people with disabilities)

భారతదేశంలో చాలా కాలంపాటు ఒకే పనిని ఆడ, మగ ఇద్దరూ చేసినా వేతనం విషయంలో మాత్రం వివక్ష ఉండేది. మగవాళ్లకు ఎక్కువ వేతనం, ఆడ వారికి తక్కువ వేతనం ఇచ్చే వాళ్లు. ఈ దుర్మార్గానికి అంబేడ్కర్ ముగింపు పలికారు. సమాన పనికి సమానం వేతనం ఇచ్చే ఆర్టికల్ 39(డి)ను రూపొందించారు. (Article 39(d) of the Constitution of India states that men and women should be paid equally for the same work. It is a Directive Principle of State Policy.) మగవాళ్లతో పోలిస్తే మహిళలు తక్కువ అనే అన్యాయపు ఆలోచనల ఆధారంగా అనేక దురాచారాలు ఉండేవి.

మహిళల గౌరవాన్ని తగ్గించే పాతకాలపు ఆచారాలను చట్ట విరుద్ధమని పేర్కొంటూ ఆర్టికల్ 51(ఎ)(ఇ)ను రాజ్యాంగంలో అంబేడ్కర్ ప్రవేశపెట్టారు. (Article 51A(e) directs the citizens to renounce practices derogatory to the dignity of women) తమ వ్యక్తిగత(మత) చట్టాలలో కానీ, ఏ ఇతర చట్టాలలో కానీ జోక్యం చేసుకోవద్దని చెప్పే హక్కు పార్లమెంట్‌కు లేదనే వాదన కరెక్ట్ కాదు. అప్పుడిక రాజ్యాంగం ఎందుకు?

### అంబేడ్కర్ - నెహ్రూ ప్రభుత్వం..

ఈ బిల్లును వ్యతిరేకిస్తే తన ప్రభుత్వం కూలిపోతుందని నెహ్రూ మొదట బెదిరించినప్పటికీ, బిల్లు ప్రవేశ పెట్టడం వాయిదా పడింది. ఈ బిల్లు మంచిదే అని నెహ్రూ ముందు ఒప్పుకున్నా సామాజిక, చారిత్రక, రాజకీయ కారణాలతో ఈ ఆలోచన వెనుకబడింది. రాజ్యాంగ నిర్మాణంలో సాధ్యమైనా హిందూ బిల్లు గెలవడం కష్టం అని నెహ్రూకు తెలిసింది. బిల్లు ఆమోదం పొందాలంటే గణనీయమైన రాయితీలు ఇవ్వాలని నెహ్రూకు అర్థమైంది. అనేక విభాగాలుగా విభజించాలని సూచించారు. వివాహం విడాకులకు సంబంధించిన మొదటి 55 నిబంధనలతో మాత్రమే తాము పోటీ చేస్తామని, మిగిలిన వాటిని మొదటి సార్వత్రిక ఎన్నికల తర్వాత భారత పార్లమెంట్ పరిశీలిస్తుందని నెహ్రూ రాజ్యాంగ సభకు చెప్పారు. రాజీ మార్గాలు ఎన్ని ప్రయత్నాలు చేసినా అవి నిలువలేదు. సంప్రదాయవాదులను ఒప్పించడంలో రాజీ పెద్దగా ప్రభావం చూపలేదు. మరో వారం రోజుల చర్చ తర్వాత 55 నిబంధనలలో మూడింటిని మాత్రమే ఆమోదించారు.

సామాజిక పితృస్వామ్య సోపానక్రమానికి వ్యతిరేకంగా మహిళల హక్కుల కోసం జరిగిన ప్రజాస్వామ్య పోరాటాల చరిత్రలో, హిందూ కోడ్ బిల్లుకు అనుకూలంగా డాక్టర్ అంబేడ్కర్ చేసిన వాదనలు తర్వాత మంత్రివర్గం నుంచి రాజీనామా తప్పలేదు. ప్రస్తుతం భారత రాజ్యాంగానికి చాలా కీలకమైన అంశం సమానత. రాజ్యాంగ రచన చాలా క్లిష్టమైన పని. కాని హిందూ కోడ్ నిర్మాణం అంతకన్న కష్టమైంది. డాక్టర్ అంబేడ్కర్ రాజీనామా, భారతదేశ మహిళా హక్కుల చరిత్రలో ఒక మలుపుగా నిలిచింది.

### 2005లో సమాన హక్కులు..

2005లో హిందూ చట్టాలను సవరించిన సమాన హక్కులు కూడా గొప్ప మార్పుగా చూడాలి. అంతకుముందు తమిళనాడులో మగ వారికి మహిళలకు సమాన హక్కులను కల్పించారు. తరువాత ఎన్‌టి రామారావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈ మార్పును తెచ్చారు. ఆ తరువాత దేశవ్యాప్తంగా సమాన హక్కులను తేవడం 2005లో మాత్రమే సాధ్యమయింది. 2005లో సమాచార హక్కును తెచ్చినా, అది నీరసించి హాస్పిటల్ ఐసియులో ఎప్పుడో చేరింది. ఈ సమానత హక్కు ఉంచుతారో లేదో తెలియదు. కొన్ని మంచి మార్పులు వచ్చినప్పటికీ అంబేడ్కర్ హిందూ కోడ్‌లో ఇప్పటికీ సవరణల, సంస్కరణల అవసరం ఎంతైనా ఉంది.

హిందువులకు, ఇతరులకు కూడా వర్తించే యూనిఫాం సివిల్ కోడ్‌ను చేయగలరా? అనే ప్రశ్న ఇప్పటికీ మిగిలిపోయి ఉంది. సతి, బాల్య వివాహాలు, వితంతుల వివాహం చాలావరకు ఆగిపోయినా, ఒకే భర్త ఒకే భార్య అనే సమానత అందరికీ సమానంగా సాధ్యమా? హిందూ చట్టాలు బోలెడు. స్పెషల్ వివాహ చట్టాలు, ముస్లిం, క్రైస్తవ వివాహ సమస్యలు ఎన్నెన్నో ఉంటాయి. 'మనం నా నుంచి ఇంకా మా దాకా రాలేదు. మనం అన్నపుడు కదా మన అన్నది ప్రగతి' కాళోజీ అన్నట్టు ఇంకా 'మన' అనే నాగరికత ఎప్పుడు వికసిస్తుంది ? ❑

**(ది వైర్ సౌజన్యంతో)**

# అంబేడ్కర్ అస్తిత్వవాది కాదు అచ్చమైన దేశీయ ఆధునికతా వాది



మెట్టు రవీందర్

**భారతదేశంలో కుల సమస్యకు, స్త్రీ సమస్యకు సంబంధించి చాలా ఆధునికంగా ఆలోచించిన వాళ్ళల్లో అంబేద్కర్ చాలా ముఖ్యుడు. అందుకే ఆయన దేశీయ చరిత్రలోకి వెళ్ల లోతుగా పరిశోధించి కుల వ్యవస్థ మూలాలను కనుగొన్నాడు. అంత మాత్రమే కాదు, కులం పనితీరును, చారిత్రక గమనంలో దాని మార్పు క్రమాన్ని పరిశీలించి వివరించాడు. అయితే ఆధునికత వైపుగా జరగాల్సిన సామాజిక మార్పు క్రమానికి సంబంధించిన నిర్దిష్టత పట్ల అత్యంత సీరియస్‌గా, మౌలికంగా ఆలోచించిన ప్రజా మేధావి అంబేద్కర్.**



భారత సమాజాన్ని ఆదిమ యుగపు అవశేషాలను నిలుపుకుంటూ వస్తున్న ఒక 'నాగరిక' సమాజం అని అంబేద్కర్ నిర్వచించాడు. అలాంటి ఆటవిక అవశేషాలలో బహిర్ వివాహ పద్ధతి (exogamy) ఒకానొక కీలకమైన మారని కట్టుబాటు (rigid norm) అన్నాడు. అందుకే భారత సమాజం సపిండ (రక్త బంధువుల) వివాహాన్ని, సగోత్ర (ఒకే మూల పురుషుని వారసుల) వివాహాన్ని మహా పాపంగా భావిస్తుంది. అయితే ఇటువంటి వేర్వేరు సాంఘిక సముదాయాల మధ్య జరిగే బహిర్వివాహ పద్ధతి (exogamy) పైన ఒకే సాంఘిక సముదాయంలో పెళ్లి అనే అంతర్ వివాహ నియమాన్ని (endogamy) ప్రవేశపెట్టడం అనేది కులాల పుట్టుకకు దారి తీసిన ఒక కీలక పరిణామమని ఆయన పేర్కొన్నాడు. అందుకే 'బహిర్ వివాహంపై అంతర్ వివాహ ఆపాదనమే కులం పుట్టుక' అని అంబేద్కర్ ప్రతిపాదించాడు. ఇలా ఒకే కుల సముదాయంలో జరిగే వివాహాల వల్లనే కులాల నిరంతర పునరుత్పత్తి జరుగుతుందని మనం అర్థం చేసుకోవాలి. అయితే ఈ అంతర్ వివాహ పునాది బీటలు వారకుండా కాపాడబడాలంటే ఒకే సాంఘిక (కుల) సముదాయంలోని స్త్రీ పురుషులందరికీ పెళ్ళికి అవసరమైన జోడి లభించి తీరాలి. అంటే, కులం పుట్టుకకు, కుల వ్యవస్థ నిరంతరాయతకు వివాహ యోగ్యులైన స్త్రీ పురుషుల సంఖ్య సమానంగా ఉండితీరాలి. అయితే అనేక చారిత్రక, ఆకస్మిక పరిస్థితుల కారణంగా వివాహ యోగ్యత గల స్త్రీ పురుషుల సమానతా నియమానికి భంగం వాటిల్లే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు-యుద్ధాలు, ప్రకృతి వైపరీత్యాలు, అనుకోని వ్యాధుల కారణంగా వివిధ కుల సముదాయాలలో స్త్రీ,పురుషులు మరణించడం వల్ల అదనపు స్త్రీల (surplus women), అదనపు పురుషుల (surplus men) సమస్య తలెత్తుతుంది. ఆ అదనపు స్త్రీ, పురుషుల సమస్యను పరిష్కరించనట్లయితే వారు వేరే కులం (బయటివారి)తో సంబంధాలు పెట్టుకుని, సంతానాన్ని కూడా పొంది (స్వ) కులం లోపలికి తీసుకువచ్చే ప్రమాదం ఉంటుంది. తత్ఫలితంగా అంతర్ వివాహ పద్ధతే విచ్ఛిన్నమై పోయే ప్రమాదం ఏర్పడుతుంది.

కాబట్టి కులం లోపల అంతర్ వివాహ పద్ధతిని కాపాడడానికి అదనపు స్త్రీ (వితంతువు)ని వదిలించుకోవాల్సిన అనివార్యత ఏర్పడింది. ఆ అనివార్యత లోంచే ఆనాటి కులవ్యవస్థ నిర్మాతలు సతీసహగమనాన్ని ఒక మార్గంగా ముందుకు తెచ్చారు. దానికి ఎక్కడా లేని పవిత్రతను, పాతివ్రత్యాన్ని ఆపాదించారు. కాని మరణించిన భర్త చితిమంటల్లో అదనపు స్త్రీని కాల్చేసి వదిలించుకోవడం ఎల్లకాలం ఆచరణ సాధ్యం కాని మార్గం. కనుక ఈ అదనపు స్త్రీని జీవితాంతం వితంతువు గానే ఉండేలా చేసే బలవంతపు వైధవ్యం రెండో మార్గంగా ముందుకు వచ్చింది. అయితే ఈ బలవంతపు వైధవ్యంలో స్త్రీ సక్రమమైన భార్యగా బతికే సహజమైన హక్కును కోల్పోవడం వల్ల ఎవరో ఒక పురుషునితో అక్రమ సంబంధంలోకి వెళ్లే అవకాశం ఉండడం వల్ల కుల(సముదాయ) నైతికతకు ప్రమాదం ఏర్పడుతుంది. కాబట్టి ఏ పురుషునికీ ఆమెపై వ్యామోహం కలగని విధంగా ఆమెకు శిరోముండనం చేయడం, తెల్లని వస్త్రాలు ధరించాలని, బొట్టు, గాజులు వగైరాలను తొలగించి ఆమె పరిస్థితిని దిగజార్చే అమానవీయ

కట్టుబాట్లను విధించడం అనేవి ముందుకొచ్చిన (అప)మార్గాలు.

మరి అదనపు స్త్రీ సమస్యను వదిలించు కున్నట్లుగా చనిపోయిన భార్యతో పాటే భర్తను కాల్చేయడం ద్వారా అదనపు పురుషుని సమస్యను వదిలించుకోవడం సాధ్యంగాని పని. ఎందుకంటే, అతడు మగవాడు కావడం (పితృస్వామ్యం) ఒక ప్రధాన కారణం. రెండవది, అదనపు పురుషున్ని ఆజన్మాంతం బ్రహ్మచారిగా ఉండాలని కట్టడి చేయడం కూడా కుదరని పని. ఎందుకంటే పురుషుడు కులానికి ఒక బలమైన సభ్యుడు, అతి ముఖ్యమైన వాడు. అతడు వివిధ సాంఘిక కార్యకలాపాలలో పాల్గొంటూ నిత్యం చురుకుగా ఉండి కుల సముదాయాన్ని కాపాడాలి. కనుక అతని ఇష్టాయిష్టాలకు ఎక్కువ విలువ ఉండడం పితృ స్వామిక సమాజంలో సహజమైన విషయం. అతని అస్తిత్వం పితృస్వామ్యానికి చాలా విలువైనది.

అయితే భార్య మరణించడం ఫలితంగా ఏర్పడ్డ అదనపు పురుషుని ఉనికి వల్ల కూడా అతని కుల సముదాయ నైతికత ప్రమాదంలో పడుతుంది. కాబట్టి ఇహలోక సుఖాలను త్యజించి విరాగులుగా ఉండాలని కట్టడి విధించడం కూడా అదనపు పురుషుని సమస్యా పరిష్కారానికి నిరుపయోగం. ఇక మిగిలింది అతన్ని గృహస్థుగా ఉంచడమే కుల సముదాయానికి ప్రయోజనకరమైన మార్గం. అదీ కుల సముదాయంలోని పెళ్లీడు రాని బాలికను అతనికి భార్యగా సమకూర్చాలి. ఈ బాలికా వివాహంతో అతడు (అదనపు పురుషుడు) కులం లోపలే ఉండి కుల కార్యకలాపాలలో మునుపటిలాగే పాల్గొంటాడు. ఫలితంగా అంతర్ వివాహ నియమం, కుల సముదాయపు నైతికతా పరిరక్షించబడతాయి. కనుక భారత సమాజంలో అంతర్ వివాహ పద్ధతి అనేది కులవ్యవస్థను నిరంతరం పునరుత్పత్తి చేస్తుందని,కుల వ్యవస్థ పనితీరులో పితృస్వామిక స్త్రీ,పురుష సంబంధాలు ఒక ప్రముఖ పాత్ర వహిస్తాయని మనం సులభంగానే గ్రహించవచ్చు. పైగా పితృస్వామిక కుటుంబ వ్యవస్థను కొనసాగించడంలో పాతివ్రత్యం, మాతృత్వం లాంటి భావనలపై అనేకానేక ఆచారాలు సృష్టించి, నైతిక ఆదర్శాలను ప్రచారం చేసి కీర్తిస్తూ వాటికి సమాజంలో ఎప్పటికప్పుడు ఆమోదనీయతను సృష్టించడం పితృస్వామిక కులవ్యవస్థ పునర్ నిర్మాణానికి అవసరం అయ్యింది.

అందుకే 'కుల నిర్మూలన' అనే పుస్తకంలో 16వ చాప్టర్‌లో అంబేద్కర్ చాతుర్వర్ణ వ్యవస్థలో స్త్రీల స్థానం గురించి చర్చించాడు. చాతుర్వర్ణ సిద్ధాంతం స్త్రీలకు కూడా వర్తించి ఉండినట్లైతే స్త్రీలలో పురోహితురాళ్లు,సైనికురాళ్లు ఉండి ఉండాలి కదా. కానీ ఆలా లేరు. ఎందుకంటే, చరిత్రలో స్త్రీ లను సైనిక, (వేద) విద్యా శిక్షణల నుండి, తత్సంబధిత విజ్ఞానాల నుండి దూరం చేశారు. స్త్రీల ఆస్తిత్వాన్ని లుప్తం చేసి, వారిని పురుషులకు నీడలుగా మార్చివేసి విభజించింది పితృస్వామిక బ్రాహ్మనిజం అనంటాడు.

ఆర్యుల కాలంలో స్త్రీలను శూద్రులలాగే అథమ స్థానంలో ఉంచారు. వారిని మోక్షానికి కూడా అనర్హులుగా పరిగణించారు. కాని బౌద్ధం ఆ ఆర్య నియమాలను సాంతం ఉల్లంఘించి శూద్రులను భిక్షుకులుగా నియమించినట్లే, స్త్రీలను కూడా పరివ్రాజికలుగా చేసింది. అలా బౌద్ధం శూద్రుల,కడజాతి వారి, స్త్రీల స్థాయిలను అత్యున్నతంగా పెంచింది. అయితే తర్వాతి కాలంలో బ్రాహ్మనిజం మనుస్మృతి రూపంలో బౌద్ధంపై విజయం సాధించింది. బ్రాహ్మణిజం శూద్రులపైనా, స్త్రీలపైనా విరుచుకు పడి, తిరిగి వారిని బానిసలుగా చేయడంలో సఫలమైంది. ఫలితంగా శూద్రులు బ్రాహ్మణ,క్షత్రియ, వైశ్య వర్ణాలకు బానిసలైతే, స్త్రీలు వారి వారి భర్తలకు బానిసలయ్యారు. ఇలా మెజారిటీ ప్రజలుగా ఉన్న శూద్రులను, స్త్రీలను శాశ్వతమైన బానిసత్వానికి, భ్రష్టత్వానికి గురిచేసి చరిత్రలో బ్రాహ్మనిజం పరమ అకృత్యానికి పాల్పడింది.

> **ముఖ్యంగా మనువు చేసిందేమిటంటే, అంతకు మునుపు సామాజిక సిద్ధాంతంగా ఉన్న దాన్ని రాజ్యాంగ చట్టాలుగా రూపొందించాడు. చాతుర్వర్ణ వ్యవస్థలో ముఖ్య సమూహాలుగా ఉన్న స్త్రీలను, శూద్రులను బౌద్ధం ప్రభావం నుండి మళ్ళించాలనేదే మనువు కోరిక. ఒకరకంగా ఆనాటి బౌద్ధం ప్రభావం వల్ల పితృస్వామిక కౌటుంబిక వ్యవస్థ కొంత మేరకు బీటలు వారింది. దానిని నిలువరించడానికే మనువు స్త్రీలపై అనేక రకాలైన అసమానతలను, అనర్హతలను విధిస్తూ మనుస్మృతిని రూపొందించాడు. ఈ విషయాలన్నింటినీ అంబేద్కర్ 'హిందూ స్త్రీ ఉత్తాన పతనాలు : అందుకు బాధ్యులెవరు?' అనే శీర్షికన రాసిన తన వ్యాసంలో వివరించాడు. ఇలా పితృస్వామ్యం, కుల వ్యవస్థ రెండూ పడుగూ, పేకల్లా అల్లుకుపోయిన ఫలితంగానే భారతీయ కుటుంబ వ్యవస్థ ఏర్పడి కొనసాగుతుందనేది స్పష్టాతిస్పష్టం.**

అయితే ఈ 'ఫెమినిస్టు అంబేద్కర్' అనే పుస్తకం గురించి రాద్దామని కూర్చున్నప్పుడు, అంబేద్కర్ నాకు అస్తిత్వ వాదిగా కనబడలేదు. కనుక అంబేద్కర్ కేవలం దళితవాదీ కాదు, స్త్రీవాదీ కాదు. భారతదేశపు అట్టడుగు మట్టి పొరల్లోంచి చిగురించిన మొక్కలా సహజాతి సహజంగా పైకి ఎదిగివచ్చిన ఈ నేల కన్న బిడ్డడు, అచ్చమైన దేశీయ ఆధునికతావాది.

అందుకే వలస పాలనా కాలంలోనూ, వలస పాలనానంతర కాలంలోనూ ప్రజల స్వాతంత్ర్యం పట్ల దృఢమైన అభిప్రాయాలు, ఖచ్చితమైన ఆధునిక దృక్పథం గలవాడుగా డా.బి. ఆర్.అంబేద్కర్‌ని చరిత్రలో నిలుస్తాడు. ఈ దేశపు నిర్దిష్ట సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన పోరాటాలు నిర్దిష్టంగానే జరగాలని ఆయన భావించాడు. దానికి కట్టుబడే ఆయన ఆనాటి కమ్యూనిస్టులతో విభేదించాడు. ఒక్క కుల సమస్య విషయంలోనే కాదు, స్త్రీ సమస్య (పితృస్వామ్యం) విషయంలో కూడా ప్రత్యేక మహిళా పోరాటం అవసరమని ఆనాడే గుర్తించిన ప్రథముడు అంబేద్కర్. అలాగే ఆయన చారిత్రకంగా అందివచ్చిన అన్ని అవకాశాలను అందిపుచ్చుకొని ఎప్పటికప్పుడు తన వాదనలను ముందుకు తెచ్చి, ఆయా సమస్యలకు తగిన పరిష్కార మార్గాలను ప్రతిపాదించినవాడు అంబేద్కర్.

బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగ రచనా కమిటీకి ఛైర్మన్‌గా ఉన్న కాలంలో రావ్ కమిటీ రూపొందించిన హిందూ కోడ్ బిల్ ఆయన ముందుకు వచ్చింది. ఆయన దానిలో మౌలిక మార్పులు చేసి హిందూ కోడ్ బిల్లును తిరగరాసి 1948లో శాసన సభా కమిటీ ముందు ప్రవేశ పెట్టాడు. ఈ బిల్లులో అంబేద్కర్ కున్న ప్రగతిశీల భావనలన్నీ కనిపిస్తాయి. ముఖ్యంగా ఈ బిల్లు పితృస్వామిక సంబంధాల పొందికను సవాల్ చేసింది. పురుషునితో సమాన హోదాను కల్పించి స్త్రీని గౌరవించింది. హిందూ స్త్రీకి పురుషులతో సమానంగా వివిధ హక్కుల్ని కల్పించింది. స్త్రీకి విడాకులు ఇచ్చే హక్కును, మగ /ఆడ పిల్లలను దత్తత తీసుకునే హక్కును, తండ్రి ఆస్తిపై స్త్రీకి కూడా సమాన హక్కును, స్త్రీకి తన సొంత ఆస్తిని అమ్ముకునే హక్కును కల్పించింది. ఇష్టం లేకపోతే స్త్రీకి కూడా భర్తకు విడాకులు ఇచ్చే హక్కును, ఒకవేళ భర్త విడాకులు ఇస్తే భార్యకు భరణం పొందే హక్కును, కులాంతర, మతాంతర, రిజిస్టర్డ్ వివాహాలను చట్టబద్ధం చేసింది. ఒక్క మాటలో చెప్పాలంటే హిందూ కోడ్ బిల్లుపై ప్రగతిశీల శక్తులకు, ప్రతీఘాతుక సాంప్రదాయిక శక్తుల మధ్య భీకర యుద్ధం లాంటి భావ సంఘర్షణ జరిగింది. సనాతన హిందూమత నియమాలను ఒక అంటరానివాడు ధ్వంసం చేస్తున్నాడని సాంప్రదాయ వాదులందరూ హిందూ కోడ్ బిల్లు ను వ్యతిరేకించారు. ప్రప్రథమ ప్రధాని పండిట్ నెహ్రూ సైతం ఈ బిల్లు విషయంలో మౌనం వహించాడు. అలా అనేక వాయిదాల తర్వాత ఈ బిల్లు చివరకు 1951లో సస్పెండ్ అయింది. అందుకు నిరసనగా అంబేద్కర్ తన న్యాయశాఖ మంత్రి పదవికే రాజీనామా చేశాడు. ఈ విధంగా అంబేద్కర్ జెండర్ సమానత్వం కోసం ఆనాడే పోరాడాడు.

ఇలా అంబేద్కర్ రాజ్యాన్ని సామాజిక మార్పుకు ఒక బలమైన సాధనంగా భావించాడు. అలాగే (నియత) విద్య కూడా ప్రజలకు ఒక ఆయుధంగా ఉపయోగపడుతుందని, విద్యను పొందే హక్కు అందరికీ ఉందని అన్నాడు. కాని రాను రానూ భారత పాలకవర్గాలు సామ్రాజ్యవాదానికి దాసోహమై పోయి రాజ్యాంగంలోని ప్రజానుకూల చట్టాలను నిర్వీర్యం చేస్తూ వస్తున్నారు. కొత్త కొత్త అప్రజాస్వామిక నల్ల చట్టాలను రూపొందించి ప్రజలను హింసిస్తూ సామ్రాజ్యవాద దోపిడీకి సహకరిస్తున్నారు. దేశీయంగా బ్రాహ్మణీయ, పితృస్వామిక భూస్వామ్య సంబంధాలను బలోపేతం చేస్తూ వస్తున్నారు. ఆ క్రమంలో రాజ్యపు స్వభావం మారిపోతూ వస్తున్నది. నానాటికీ (నియత) ప్రభుత్వ విద్యా వ్యవస్థలోని ప్రజాస్వామిక అంశాలు హరించి వేయబడుతూ సామాజిక మార్పుకు అది ఇంకెంత మాత్రము ఒక సాధనంగా ఉండలేని స్థితి వచ్చింది.

ఎందుకంటే యూరప్‌లో తొలిసారిగా ఆవిర్భవించిన పెట్టుబడి తనకుండిన ప్రగతిశీల స్వభావాన్ని రానురానూ కోల్పోతూ 1920ల నాటికే సామ్రాజ్యవాదంగా విశ్వరూపమెత్తింది. అది మొదలు ప్రపంచంలోని ఏదేశపు పెట్టుబడికైనా ఇంకెంతమాత్రం ప్రగతిశీల పాత్ర పోషించడానికి చారిత్రకంగా అవకాశం లేకుండా పోయింది. అందువల్ల మన దేశీయ పెట్టుబడికి సైతం ప్రగతిశీల పాత్ర పోషించే స్వతంత్రత గాని, సామర్థ్యం గాని లేదు. అది కింద మారిన భూస్వామ్యంతో, బ్రాహ్మణీయ పితృస్వామ్యంతో మిలాఖతై, రెండూ కల్సి పైన సామ్రాజ్యవాదానికి లోబడి వుండాల్సిన పరాధీన స్థితిలో ఉండడం వల్ల ఉత్పత్తి శక్తులకు, ఉత్పత్తి సంబంధాలకు మధ్య వైరుధ్యం పరిష్కారం కాకుండా పోతున్నది. ఫలితంగా రాజకీయ పాలనలో ప్రజాస్వామ్యాన్ని, సమాజంలో సమానత్వాన్ని ఆశించలేం.

చివరగా– అంబేద్కర్‌ను మనం సరిగ్గా అర్థం చేసుకోవాలంటే ఆయనకు ఉండిన ఆధునికతా దృక్పథంలో రాజ్యం, రాజ్యాంగ చట్టాల పాత్ర ఏమిటి ? రాజ్యం, చట్టాలపై ఆనాటి సామ్రాజ్య వాదం పట్టు ఎలా ఉండింది ? ఆనాటి దేశీయ పాలక వర్గాల దృక్పథ స్వభావాలేమిటి ? స్వాతంత్ర్య ఉద్యమ ఆకాంక్షలకు, తర్వాతికాలం నాటి ప్రజాకాంక్షలకు మధ్య ఎలాంటి సారూప్యత ఉండింది? కుల సమస్యపై ఆనాటి భారత కమ్యూనిస్టుల దృక్పథం ఏమిటి? పూలే, అంబేద్కర్ లాంటి వాళ్ల పోరాటాలపై ఆనాటి కమ్యూనిస్టుల వైఖరి ఏమిటి ? ఇలాంటి ప్రశ్నలెన్నింటినో వేసుకొని, జవాబులు వెతుక్కోవాలి. అప్పుడే అంబేద్కర్ ఆలోచనలను, ఆచరణను మనం అర్థం చేసుకొనగలం. లేకపోతే అంబేద్కర్ రాజకీయ దృక్పథంలోని పరిధి, పరిమితులను మనం శాస్త్రీయంగా అర్థం చేసుకోలేము. సామ్రాజ్యవాదంతోపాటు బ్రాహ్మణీయ, పితృస్వామిక భూస్వామ్యపు పట్టు ఇంకా భారత సమాజంపై బలంగానే ఉన్నందువల్ల, దాన్ని దెబ్బ కొట్టి బలహీనపరచడానికి జ్యోతిబా పూలే, అంబేద్కర్‌ల భావ జాలాన్ని ఎత్తిపట్టి, వారి పోరాటాలను మరింత ఉదృతంగా కొన సాగించాల్సిన అవసరం నేటికీ ఉంది. ❑ **(వసంతమేఘం సౌజన్యంతో)**

# అంబేడ్కర్ బౌద్ధ దీక్ష - నైతికత, సమానత



- మోకా సత్తిబాబు

**డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 1956 అక్టోబర్ 14న ఐదున్నర లక్షల మంది అనుచరులతో బౌద్ధమతాన్ని స్వీకరించారు. నాగ్‌పూర్‌లో జరిగిన ఈ గొప్ప సంఘటన కేవలం మత మార్పిడి కాదు. దేశానికి నైతికత, సమానత్వం, సామాజిక న్యాయం అందించాలనే అంబేడ్కర్ సంకల్పానికి ఆచరణాత్మక రూపం. ప్రపంచ చరిత్రలో అతి పెద్ద మత మార్పిడి కార్యక్రమం. దీనికి సంబంధించిన మరికొన్ని అంశాలను పరిశీలించడం ఆసక్తికరంగా ఉంటుంది.**




## అంబేడ్కర్ హిందూ మతాన్ని ఎందుకు విడిచిపెట్టారు?

హిందూ మతంలోని సామాజిక అంశం యొక్క ప్రాథమిక సూత్రం 'కుల వ్యవస్థ'. అంబేద్కర్ హిందూ మతంలో జన్మించాడు. కానీ మహర్ కులంలో జన్మించడం వల్ల బాల్యం నుండి అడుగడుగునా అస్పృశ్యతను ఆయన అనుభవించాల్సి వచ్చింది. 1901లో అంబేద్కర్ తన సోదరునితో కలసి తండ్రి వద్దకు వెళ్లడానికి సతారా నుండి కోరెగావ్ బయలుదేరారు. కోరెగావ్ రైల్వేస్టేషన్ నుండి, తండ్రి ఉంటున్న ప్రాంతానికి వాళ్ళని తీసుకుని వెళ్లడానికి ఒక్కరు కూడా ముందుకు రాలేదు. దానికి కారణం అంటరానితనం. చివరికి, వారు ఒక రాత్రంతా తిండి, మంచినీళ్లు లేకుండా ప్రయాణించవలసి వచ్చింది. పదేళ్ల అంబేద్కర్ పసిహృదయాన్ని ఈ సంఘటన ఎంతో ప్రభావితం చేసింది. ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్ళిన అంబేద్కర్ జీవితంలో తొలిసారి స్వేచ్ఛనూ, సమానత్వాన్ని అనుభవించాడు. అయితే, అది కొంత కాలమే ! ఎప్పుడైతే తిరిగి భారతదేశంలో అడుగుపెట్టాడో ఆ వెంటనే 'మనువు' వెంటాడడం ప్రారంభించాడు. బరోడా మహారాజు శాయాజీరావు గైక్వాడ్ దగ్గర మిలటరీ కార్యదర్శిగా అంబేద్కర్ ఉద్యోగంలో చేరాడు. పేరుకు పెద్ద ఉద్యోగం. కానీ ప్రతి ఒక్కరి చేతిలో అవమానం ఎదుర్కోవాల్సి వచ్చింది. బరోడా రాజ్యంలో ఉండడానికి చిన్న జాగా కూడా ఆయనకు దొరకలేదు. చివరకు ఒక సత్రంలో ఉంటే, కులం తెలిసిన తరువాత అక్కడ నుంచి బయటికి గెంటివేశారు. ఇటువంటి భయంకరమైన చేదు అనుభవాలు అంబేద్కర్ జీవితంలో కోకొల్లలు. హిందూమతంలోని కుల వ్యవస్థ వలన తాను ఎదుర్కొన్న అవమానాలే మత మార్పిడి ఆలోచనలకు బీజం వేశాయి. దీనికితోడు కొలంబియా విశ్వ విద్యాలయంలో చదువుతున్నపుడు అమెరికన్ తత్వవేత్త జాన్ డ్యూయి ప్రాగ్మాటిజం (ఆలోచనలు, చర్యల యొక్క ఆచరణాత్మకతను వివరించే తాత్విక ఆలోచన విధానం)తో ప్రభావితమయ్యాడు. స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం అనే మూడు విలువలు మానవ సంక్షేమానికి మూల స్తంభాలుగా గ్రహించాడు. హెన్రీ క్లార్క్ వారన్ రాసిన 'బుద్ధిజం అనువాదం' అశోక శిలా శాసనాలు అధ్యయనం ద్వారా భారతీయ బౌద్ధంలోనే ఈ విలువలు పురుడు పోసుకున్నాయని అర్థం చేసుకున్నాడు. తన నిజ జీవితంలో ఎదుర్కొన్న అవమానాలు, విదేశాలలో ఉన్నప్పుడు తాను అభ్యసించిన ఆధునిక ప్రజాస్వామ్య భావనలు అంబేద్కర్‌ను ప్రభావితం చేశాయి. దీంతో హిందూ మతాన్ని వీడాలని ఆయన నిర్ణయించుకున్నారు. అలా నిర్ణయించుకున్న తరువాత 1935 యోలా మహాసభలో 'నేను హిందువుగా పుట్టాను. కానీ హిందువుగా మాత్రం మరణించను' అంటూ సంచలనాత్మక ప్రకటన చేశారు. 1936లో కుల నిర్మూలన గ్రంథంలో "కులం పునాదుల మీద మీరు దేనినీ నిర్మించలేరు. ఒక జాతిని, నీతిని నిర్మించలేరు" అంటూ ఆయన శంఖారావం పూరించారు.

## ఏయే మతాలు ఆహ్వానించాయి ? ఎందుకు తిరస్కరించారు!

యోలా డిక్లరేషన్(1935) తర్వాత, అంబేద్కర్ తన ఆలోచనలకు, ఆశయాలకు తగిన మతం కోసం అన్వేషణ చేయడం ప్రారంభించాడు. అన్ని మతాలను కూలంకషంగా అధ్యయనం చేశాడు. ఈ క్రమంలో హిందూ మత పెద్దలతోబాటు ఇస్లాం, క్రైస్తవ, సిక్కు మతాల పెద్దలు అంబేద్కర్‌ను సంప్రదించారు. వారు ఆయనను తమ మతంలో చేరమని ఆహ్వానించారు. ఆర్య సమాజం, ప్రార్థన సమాజం నాయకులు ఆయనను హిందూ సంస్కరణ ఉద్యమానికి నాయకుడిగా ఉండాలని, హిందూ మతంలో కొనసాగాలని కోరారు. హిందూ మతానికి కులం పునాది అయినప్పుడు, అక్కడ సమానత్వానికి స్థానం లేదని చెబుతూ ఆయన తిరస్కరించాడు. అగాఖాన్ వంటి నాయకులు ఇస్లాంలో చేరమని ఆహ్వానించారు. దళితులకు సముచిత స్థానం కల్పిస్తామని, సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తామని హామీ వారు ఇచ్చారు. కానీ విభజన రాజకీయాలకు ఇస్లాం గుర్తింపుగా మారిందంటూ తిరస్కరించారు. చర్చి మిషన్ సొసైటీతో పాటు కొంతమంది క్రైస్తవ పెద్దలు అంబేద్కర్‌ను క్రైస్తవ మతంలోకి ఆహ్వానించారు. అయితే, భారతీయ క్రైస్తవం లో కూడా కుల ఆధారిత విభజన ఉండడంతోపాటు విశ్వాసం ఆధారంగా ఉన్న మతంలో తార్కికత ఉండదని చెబుతూ ఆయన ఈ ఆహ్వానాన్ని తిరస్కరించాడు. సిక్కు మతం ఒక మార్గంగా అనిపించినా, దానికి భౌగోళిక పరిమితులు ఉండడం వలన తిరస్కరించాడు.

## బౌద్ధమతమే ఎందుకు ?

**కొలంబియా విశ్వ విద్యాలయంలో ఉన్నప్పుడే అనేక బౌద్ధ గ్రం థాలను అంబేద్కర్ అధ్యయనం చేశాడు. కొలంబియా యూని వర్సిటీ గ్రంథాలయంలోని పాళీ భాష నుండి ఇంగ్లీషులోకి అను వదించిన బౌద్ధ సాహిత్యాన్ని విస్తృతంగా చదివాడు. హిందూ మతంలోని కుల వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా ఒక తార్కిక, నైతిక, మానవతా ధర్మంగా బౌద్ధాన్ని అంబేద్కర్ గుర్తించాడు. టి.డబ్ల్యు.రైస్ డేవిడ్స్ రాసిన 'డైలాగ్స్ ఆఫ్ బుద్ధ' 'బుద్ధిజం, ఇట్స్ హిస్టరీ అండ్ లిటరేచర్' పుస్తకాలు బుద్ధుడిని ఒక మానవతా మూర్తిగా, సామాజిక విప్లవకారుడిగా పరిచయం చేశాయి. ఆ తరువాత, హెర్మన్ ఓల్డెన్ బర్గ్, ఇ.జె.థామస్, డైసట్జ్.టి.సుజుకి వంటి వారు రాసిన పుస్తకాలను అధ్యయనం చేసిన తర్వాత, భారతదేశ ప్రజలకు అవసరమైన చైతన్యపూరిత, నైతిక, ప్రజాస్వామ్య ధర్మంగా బౌద్ధాన్ని గుర్తించారు. అందునా బౌద్ధం పూర్తి భారతీయ మూలాలున్న మతం కావడం గమనార్హ ం.**

## ధర్మ చక్ర ప్రవర్తనం

1955లో బౌద్ధ మహాసభ (బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా)ను నెలకొల్పి సామూహిక మత మార్పిడి ఏర్పాట్లను అప్పగించారు. నాగపూర్‌లోని 'దీక్షా భూమి'లో 1956 అక్టోబర్ 14న లక్షలాది మంది అనుచరులతో కలిసి 'భిక్కు చంద్రమణి మనోస్థవీర' ద్వారా బౌద్ధాన్ని స్వీకరించారు. త్రిశరణాలు (బుద్ధం, సంఘం, ధమ్మం), పంచశీలను పఠించడం ద్వారా బౌద్ధంలో అడుగు పెట్టారు. తరువాత '22 ప్రతిజ్ఞలను' చదివి, అనుచరుల చేత చెప్పించారు. 'అసమానతలకు ప్రతీకగా ఉన్న హిందూ మతాన్ని విడనాడి, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావంతో కూడిన బౌద్ధ ధర్మం లోనికి వచ్చాను. నా మత మార్పిడి ధనం, అధికారం కోసం కాదు. మానవ గౌరవం, స్వాభిమానం కోసం' అని తన ప్రసంగంలో ప్రకటించారు. ఆ తరువాత ఒక సంవత్సరంలో అంబేద్కర్ స్ఫూర్తితో 50 లక్షల మందికి పైగా బౌద్ధ ధర్మాన్ని స్వీకరించారు. 1956, డిసెంబర్ 6న అంబేద్కర్ మహా పరి నిర్యాణం చెందారు.

## అంబేద్కర్ బౌద్ధ ధర్మ స్వీకారం వెనుక ఇమిడి ఉన్న అంశాలు

- దేవునికి బదులుగా మనిషిని కేంద్ర బిందువుగా చేసిన మతం బౌద్ధం. అంధ విశ్వాసాలు, ఆచారాలకు బదులుగా హేతుబద్ధత, నైతికత, శాస్త్రీయ సూత్రాలపై ఆధారపడిన మతం అని భావించి అంబేద్కర్ బౌద్ధాన్ని స్వీకరించారు.
- బౌద్ధమతం కుల వ్యవస్థను వ్యతిరేకిస్తుంది. రాజులు, వ్యాపారులు, ధనవంతులు, పేదలు అందరూ కుల భేదాలు లేకుండా బౌద్ధ సంఘంలో సభ్యులు, బౌద్ధ మతం సమానత్వం, సోదరభావాన్ని ప్రబోధిస్తుంది
- ఇది దురాశ, దోపిడీకి వ్యతిరేకం. న్యాయబద్ధమైన ఆర్థిక పంపిణీ సూత్రాన్ని, సరైన జీవనోపాధిని ప్రబోధించడం ద్వారా ఆర్థిక న్యాయం సుగమమైనది. ఇది అంబేద్కర్‌ను ప్రభావితం చేసింది.
- స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, ప్రజాస్వామ్య భావనలను ప్రపంచానికి పరిచయం చేసింది బౌద్ధం. హక్కులు, అవకాశాలు లేని సమాజానికి బౌద్ధం సరైనదని అంబేద్కర్ భావించాడు. అందుకే అంబేద్కర్ బౌద్ధాన్ని స్వీకరించడం. అవమానాలు, అసమానతలతో జీవిస్తున్న కోట్లాది మంది దళితులకు గౌరవం, స్వాభిమానంతో కూడిన జీవన గమనాన్ని ప్రసాదించింది. ❑


(ప్రజాశక్తి సౌజన్యంతో)

# రెండూ సామాజిక విప్లవ సిద్ధాంతాలే..



- మల్లేపల్లి లక్ష్మయ్య

భారతదేశ సామాజిక నేపథ్యం నుంచి కారల్ మార్క్స్ సిద్ధాంతాన్ని అంబేద్కర్ తులనాత్మకంగా పరిశీలించారు. బుద్ధుడినీ, మార్క్స్‌నూ ఒకేస్థాయిలో పోల్చారు. ప్రపంచ ఆవిర్భావంలో దేవుడి ప్రమేయాన్ని బౌద్ధం, మార్క్సిజం.. రెండూ నిర్ద్వంద్వంగా తిరస్కరించాయి. ఈ ప్రపంచంలో ఏవీ శాశ్వతం కాదనీ, ఇవి నిత్యం మారుతుంటాయనీ బుద్ధుడు, మార్క్స్ ఇరువురూ చెప్పారు. దాన్ని మార్క్స్ గతి తర్కం అంటే, బుద్ధుడు అనిత్త(అనిత్య) అని పేర్కొన్నారు. ఇక సమాజంలో ఉన్న దుఃఖానికి నివారణా మార్గం బౌద్ధం అన్వేషిస్తే, పేదరికం.. దానికి కారణమైన దోపిడీ, దాన్ని నిర్మూలించే మార్గాన్ని మార్క్సిజం చూపెట్టింది. మార్క్స్ అన్ని విషయాల్లో ఏకీభవిస్తూనే, కార్మిక వర్గ నియంతృత్వాన్ని మాత్రం తీవ్రంగా ఆక్షేపించారు అంబేద్కర్.



'ఆధునిక సోషలిజం, కమ్యూనిజంలకు కారల్ మార్క్స్ తండ్రి లాంటి వాడు. ఊహా జనిత సోషలిజాన్ని ఎండగట్టి ఆయన శాస్త్రీయ సోషలిజానికి పునాదులు వేశారు. పెట్టుబడిదారులతో పాటు, ఊహాజనిత సోషలిస్టులకు వ్యతిరేకంగా సిద్ధాంత పోరాటాలు చేశారు. ఈ రెండూ సమాజ ప్రమాదకారులేనని కారల్ మార్క్స్ తేల్చి చెప్పారు. అందుకే కారల్ మార్క్స్ సోషలిస్టు వ్యవస్థను శాస్త్రీయంగా నిర్వచించడంలో ఆద్యుడిగా నిలిచారు" అని బాబాసాహెబ్ అంబేద్కర్ తన 'బుద్ధ లేదా కారల్ మార్క్స్' రచనలో పేర్కొన్నారు.

1956 నవంబర్ 20వ తేదీన నేపాల్ లోని ఖాట్మండులో జరిగిన అంతర్జాతీయ బౌద్ధ సమ్మేళనంలో పాల్గొని ఇదే విషయమై విశ్లేషణాత్మక ప్రసంగం చేశారు. అంటే అంబేద్కర్ మహాపరినిర్వాణం పొందడానికి సరిగ్గా పదిహేను రోజుల ముందు ఈ సమావేశం జరిగింది. భారతదేశ చారిత్రక పరిస్థితులు, సామాజిక నేపథ్యం నుంచి ప్రపంచ శ్రామిక వర్గ మహానేత, కమ్యూనిస్టు వ్యవస్థ నిర్మాత కారల్ మార్క్స్ సిద్ధాంతాన్ని తులనాత్మకంగా అధ్యయనం చేసిన రచనగానీ, ప్రసంగం గానీ మరొకటి లేదని భావిస్తున్నాను. 'కారల్ మార్క్స్, గౌతమ బుద్ధుని పోల్చి చూపడం చాలా మందికి హాస్యాస్పదంగానే అనిపించవచ్చు. దీనికి ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. మార్క్స్, బుద్ధునికి మధ్య 2,381 సంవత్సరాల వ్యత్యాసం ఉంది. బుద్ధుడు జన్మించింది క్రీ.పూ.563 కాగా, మార్క్స్ పుట్టింది క్రీ.శ.1818 సంవత్సరం. బుద్ధుడినీ, కారల్ మార్క్స్‌ను ఒకే స్థాయిలో పోలుస్తుంటే, మార్క్సిస్టులకు అపహాస్యంగా అనిపిస్తుంటుంది. ఈ పోలిక చాలా తొందరపాటుగా భావిస్తుండవచ్చు. అయితే మార్క్సిస్టులు తమ అపోహలను పక్కన పెట్టి, కారల్ మార్క్స్‌పాటు బుద్ధుని బోధనలనూ, బౌద్ధం ప్రాధాన్యతనూ అధ్యయనం చేస్తే వాళ్ళ ఆలోచనల్లో తప్పనిసరిగా మార్పు వస్తుంది" అంటూ బాబా సాహెబ్ తన రచనను మొదలుపెట్టారు. బౌద్ధాన్నీ, మార్క్సిజాన్నీ విడివిడిగా వివరించి, మళ్ళీ పోలికలను, వ్యత్యాసాలను విడదీసి చూపెట్టారు. వీటిని మూడు భాగాలుగా చూడవచ్చు.

మొదటిది, తాత్విక విషయాలు, రెండవది, ఆర్థిక-సామాజిక అంశాలు. మూడవది, రాజకీయ వ్యవస్థల నిర్మాణం. మొదటి అంశమైన తాత్వికతను చూస్తే, కొన్ని విషయాలు మనకు అర్థమవుతాయి. అందులో ఈ ప్రపంచ ఆవిర్భావం గురించి చెబుతూ, అందులో దేవుడి ప్రమేయాన్ని ఈ రెండు సిద్ధాంతాలూ నిర్ద్వంద్వంగా తిరస్కరించాయి. మార్క్స్ మానవ పరిణామ క్రమాన్ని డార్విన్, ఇతర శాస్త్రీయ పరిశోధనల ద్వారా ఉదహరిస్తే, అంతకన్నా 2,300 ఏళ్ల క్రితమే, ఈ విశ్వం తనంతట తానే ఉద్భవించిందనీ, ఇందులో ఎటువంటి

అతీంద్రియ శక్తుల ప్రమేయం లేదనీ తన 'అగ్గన్న సుత్త' ప్రసంగంలో గౌతమ బుద్ధుడు పేర్కొన్నారు. ఈ ప్రపంచం ఆవిర్భవించడం గురించి తెలిపిన విషయం డార్విన్ సిద్ధాంతానికి పునాదిగా కనిపిస్తుంది. ఇక రెండో సామ్యం, ఈ ప్రపంచంలోని వస్తువులు ఏవీ కూడా శాశ్వతం కాదు అనేది. ఇవి నిత్యం మారుతుంటాయి. దీనిని మార్క్స్ గతి తర్కం అంటే, గౌతమ బుద్ధుడు అనిత్త(అనిత్య) అని పేర్కొన్నారు. అంటే అశాశ్వతం అని అర్థం. వస్తువుకు పుట్టుక, నాశనం ఉండదనీ, అది పాత రూపం మార్చుకొని, కొత్తదానిలోకి మారుతుందనీ మార్క్స్ భావం అభావం చెందడంగా భావిస్తే.. బుద్ధుడు దానిని పునబ్భవ అని పేర్కొన్నారు. అదేవిధంగా ఇద్దరూ ప్రతి సంఘటనకు కార్యకారణ సంబంధముంటుందని తేల్చారు. బౌద్ధంలో దానిని 'ప్రతీత్య సముత్పాద' అంటారు.

ఒక సంఘటన జరగడం ఏదో యాదృచ్ఛికం కాదనీ, దానికి కారణాలు ఉంటాయనీ భావం. అంటే సమాజాన్ని గతి తార్కిక దృష్టితో చూడటం అనేది రెండు సిద్ధాంతాలలోనూ ఉంది. సమాజంలోని కష్టాలకూ, సమస్యలకూ రెండు తాత్విక మార్గాలూ పరిష్కారాన్ని కనిపెట్టాయి. సమాజంలో ఉన్న దుఃఖానికి నివారణా మార్గం బౌద్ధం అన్వేషిస్తే, పేదరికం.. దానికి కారణమైన దోపిడీ, దాన్ని నిర్మూలించే మార్గాన్ని మార్క్సిజం చూపెట్టింది. ఈ రెండింటిలోనూ సొంత ఆస్తి అనేది ప్రధాన కారణంగా పనిచేసింది. అందుకే బౌద్ధ భిక్కులు ఎవ్వరూ కూడా ఆస్తులనే కాదు, అనవసర వస్తువులను కూడా కలిగి ఉండకూడదనే నిబంధనలు పెట్టారు. సొంత ఆస్తి వ్యవస్థ దోపిడీకీ, పేదరికానికీ కారణమనీ... అందువల్ల సొంత ఆస్తిని నిర్మూలించే కమ్యూన్లను ఏర్పాటు చేయాలనీ మార్క్స్ భావించారు. దానినే గౌతమ బుద్ధుడు బౌద్ధ సంఘాల ద్వారా ఒక నూతన వ్యవస్థను నిర్మించాలని ప్రతిపాదించారు. కమ్యూనిస్టు దేశాల్లో కమ్యూన్లు, సహకార వ్యవస్థలు ప్రజల సామాజిక అభి వృద్ధికి నేతృత్వం వహించాయి. ఆర్థిక, సామాజిక, నైతిక మద్దతును రైతులకూ, కార్మికులకూ అందించాయి. బౌద్ధ సంఘాలు, బౌద్ధారామాలు ఆర్థిక సహకార సంస్థలను నడిపాయి. దానికి సంబంధించిన ఆధారాలు మనకు బౌద్ధ సాహిత్యంలో దర్శనమిస్తాయి.

అయితే సమాజ మార్పునకు వర్గ పోరాటాలే మార్గమని మార్క్సిజం భావిస్తే, బౌద్ధం మాత్రం అనివార్యమైతే తప్ప యుద్ధాలు వద్దని తేల్చి చెప్పింది. చాలా మంది బౌద్ధం అనగానే అహింసను ప్రబోధించే మానవ సిద్ధాంతంగా భావిస్తారు. కానీ బౌద్ధం న్యాయం కోసం, ప్రజల రక్షణ కోసం యుద్ధం చేయాల్సి వస్తే వెనుకాడకూడదని తేల్చి చెప్పింది. ఒకదేశ సేనాధిపతి సింహసేనాపతితో బుద్ధుడు జరిపిన సంభాషణలో ఈ విషయం తేల్చి చెప్పారు. ఇది అంగుత్తర నికాయలోని 'సింహసేనాపతి సుత్త'లో ఉంది. మార్క్సిజం లాగానే బౌద్ధం ఆనాటి వైరుధ్యాన్ని కనిపెట్టి మహా విప్లవాన్ని నడిపింది. యజ్ఞయాగాలలో సమాజాన్ని నిట్టనిలువునా దోపిడీ చేస్తూ, ఆనాటి సామాజిక ప్రగతికి అడ్డుగోడలుగా నిలిచిన పురోహిత, వైదిక వ్యవస్థను ఎదుర్కొని సామాజిక విప్లవాన్ని సాధించింది. అందుకే బౌద్ధం భారత దేశ తొలి సామాజిక విప్లవం. అదే విధంగా మార్క్సిజం ఆధునిక ప్రపంచ విప్లవ సిద్ధాంతం.

అయితే అంబేడ్కర్ మార్క్సిజంతో తీవ్రంగా విభేదించిన అంశం 'కార్మిక వర్గ నియంతృత్వ' వ్యవస్థ. దీన్ని ప్రాథమికంగా మార్క్స్ నిర్వచిస్తే, దానిని రష్యా విప్లవనేత లెనిన్ ఆచరణలో చూపెట్టారు. మార్క్స్ ని అన్ని విషయాల్లో ఏకీభవిస్తూనే, కార్మిక వర్గ నియంతృత్వాన్ని మాత్రం చాలా తీవ్రంగా ఆక్షేపించారు అంబేడ్కర్. బౌద్ధం లోనే తన అభిప్రాయానికి పునాది ఉందని అంబేడ్కర్ పేర్కొన్నారు.

**గౌతమ బుద్ధుడు ఆనాటి మహాజనపదాల ప్రజాస్వామ్య విలువలను విశ్వసించాడనీ, వాటిని తన విధానంగా ప్రతిపాదించాడనీ అంబేడ్కర్ స్పష్టం చేశారు. ఆనాటి కన్నా ఈనాడు సమాజం ఎంతో ముందుకు పోయిందనీ, ఇటువంటి పరిస్థితుల్లో ఎటువంటి నియంతృత్వమైనా సరియైనది కాదనీ, అది ప్రజలను స్వేచ్ఛకు దూరం చేస్తుందనీ అంబేడ్కర్ భావించారు. మార్క్స్ సిద్ధాంతం ద్వారా ఆర్థిక సమానత్వం వస్తుందనీ, కానీ భారతదేశంలో అంతరాలకి ముఖ్యమైన కులవ్యవస్థ సృష్టించిన కుల వ్యత్యాసాలు సోదరత్వాన్ని అడ్డుకుంటున్నాయనీ అంబేడ్కర్ అభిప్రాయపడ్డారు. ఆ విధంగా ఆ ఒక్క విషయం మినహా భారతదేశ విప్లవ సిద్ధాంతమైన బౌద్ధానికీ, మార్క్సిజానికీ చాలా సామ్యాలున్నాయని అంబేడ్కర్ స్పష్టం చేశారు. భారతదేశ ప్రజలు సామాజిక, రాజకీయ ఆర్థిక సమానతల కోసం జరుపుతున్న పోరాటంలో బౌద్ధం, మార్క్సిజం సిద్ధాంతాల అవసరముందనే విషయాన్ని మనం గమనించాలి.**

మార్క్సిజం ప్రకారమే, ప్రతి దేశంలో ఉన్న చారిత్రక, సామాజిక పరిస్థితుల దృష్ట్యా వాటికి అనుగుణంగానే చారిత్రక భౌతిక వాదాన్ని రూపొందించుకోవాలని ప్రముఖ మార్క్సిస్టు తత్వవేత్త మార్తా హర్నేకర్ అన్న మాటలు ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. ❑ **(సాక్షి సౌజన్యంతో)**

# మార్క్స్, అంబేడ్కర్లవి కుల, వర్గ జమిలి సిద్ధాంతాలే



- అబ్దుల్ నూర్ బాషా

భారతదేశ సామాజిక విముక్తి కోసం కారల్ మార్క్స్ సిద్ధాంతంతోపాటు బాబాసాహెబ్ అంబేడ్కర్ కుల నిర్మూలన సిద్ధాంతపు జమిలీ అవసరమేనన్న అవగాహన జనంలో రోజు రోజుకీ బలపడుతోంది. కారణం, వారి గమనంలో తేడాలున్నా, ఇద్దరూ లక్షించిన గమ్యం మాత్రం ఒక్కటే. అదే కులరహిత, వర్గ రహిత సమాజం. ఆ మాటకొస్తే, ఎలాంటి పీడనలూ లేని సమ సమాజం. అయితే, కొందరు కమ్యూనిస్ట్, దళిత నేతలే కుల, వర్గ పీడితుల్ని రెండు పాయలుగా విడదీసి, ఏక తాటిపైకి రాకుండా ఎంతగానో కావలి కాస్తున్నారు. భుజం భుజం కలిపి ఆధిపత్య శక్తులపై కొట్లాడవలసిన ఈ రెండు మిత్ర శిబిరాలను కనీస ఐక్య కార్యాచరణ దిశ వైపు కూడా కన్నెత్తి చూడనివ్వడం లేదు. ఇక తమలో తామే విభేదాలు కల్పించుకొని విడగొట్టుకొనే ధోరణి ఎప్పటి నుంచో ఉండనే ఉంది. కమ్యూనిస్టు, దళిత శక్తులు రెండూ కలిసి పోరాడలేక పోవటానికి ఎవరి సాకులు వారికి సిద్ధంగానే ఉన్నాయ్. ముఖ్యంగా, మార్క్స్‌కి కులం గురించి అంతగా అవగాహన లేదని అంబేద్కర్ శిబిరం దబాయిస్తుంటే, అసలు అంబేద్కర్‌కి వర్గం అంటేనే అర్థం తెలియదని కమ్యూనిస్ట్ దళం బల్ల గుద్ది మరీ వాదిస్తోంది. "అలాంటప్పుడు ఈ రెండు శక్తులు కలిసి ఎలా పోరాటం చేస్తాయి?" అంటూ, మైత్రి కోసం తపన పడి మాట్లాడే వారినీ నిగ్గదీస్తున్నాయి కూడా.

వాస్తవానికి, మార్క్స్, అంబేద్కర్ సిద్ధాంతాలు రెండూ ఒకటేనన్న అపోహల్లో ఎవరూ లేరు. అలాగే, ఆ రెండు విరుద్ధ సిద్ధాంతాలను కలిపి మరేదైనా కొత్త తరహా సిద్ధాంతాన్ని ఆవిష్కరించాలనీ ఎవరూ ఉబలాట పడడం లేదు కూడా. ఎవరి సిద్ధాంతాలు వారు ఉంచుకొంటూనే వీలున్నంత మేరకు అయినా మైత్రి పోరాటాలు చేయడంలో ఎంతో గొప్ప శక్తి దాగున్నదనేదే అసలు ఉద్దేశం. లాల్ నీల్ మైత్రి అంటే ఇంతకుమించి మరేమి లేదు. అలా కాకుండా అలవాటు ప్రకారం ఎవరికి వారే దడి కట్టుకు కూసుంటే ఏదో సామెత చెపినట్లు "చేటలో సంసారం దోసిట్లో కొచ్చినట్టు"గానే ఉంటది మరి. ఎవరో శత్రు శక్తులైన మనువాద, కార్పొరేట్ ఫాసిస్టులతో చెలిమి చేసే కన్నా, సోదర శక్తులైన కమ్యూనిస్టులు, అంబేద్కరైట్లు ఐక్య కార్యాచరణ చేస్తే పీడిత జాతులకు పండుగ కాక మరేం ఉంటుంది? అయితే, ప్రస్తుతం ఆ మైత్రి గురించి, ఐక్య పోరాటాల గురించీ కాసేపు అలా పక్కన పెడితే, అసలు మార్క్స్, అంబేద్కర్ల సిద్ధాంతాలు ఎంత గాఢమైన భావ సారూప్యత కలిగినవో, సమకాలీన ప్రాసంగికత కలిగినవో పరిశీలించడమే ఈ వ్యాసం ఉద్దేశం.

### మార్క్స్‌కి కుల వ్యవస్థపై స్పష్టత ఉంది

కారల్ మార్క్స్ అనగానే వెంటనే మనసుకి తట్టేది పెట్టుబడి దారి వ్యవస్థ, శ్రామికుల దోపిడీ, అదనపు విలువ, వర్గ పోరాటం ఇత్యాది అంశాలు. అంటే అంతా ఆర్థిక అంశాలేనని తోస్తుంది. కుల వ్యవస్థ, కుల దోపిడీ, సాంఘిక అణచివేత ఇత్యాది సామాజిక పదాలు అసలు కనిపించవు. అందువల్ల మార్క్స్‌కు కులం పట్ల లేశ మాత్రమైనా అవగాహన లేదనే ఒక అసంకల్పిత భావన కొందరు మేధావుల్లో సైతం ఏర్పడింది. అయితే వాస్తవం ఏమిటంటే, భారత దేశ కుల వ్యవస్థపై మహాత్మా జోతిబా పూలే, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌లకంటే ఎంతో ముందే లోతుగా అధ్యయనం చేసిన మేధావి కార్ల్ మార్క్స్. ఆయన కులంపై ఎన్నో గ్రంథాలు రాయలేదు. కానీ భారత దేశ కులవ్యవస్థపై కీలక సూత్రీకరణలు చేశాడు. కులం ఎలా పుట్టింది ? ఎలా బలపడింది ? మానవాళికి ఎలాంటి దుష్పరిణామాలు కొని తెచ్చింది? అసలు కుల వ్యవస్థకి అంతం ఎప్పుడు ? వంటి ప్రశ్నలకు నిక్కచ్చి సమాధానాలు ఆయన విశ్లేషణలోనే కనిపిస్తాయి.

### కులం పుట్టుక గురించి

తొలిసారిగా మార్క్స్ ఇండియాలో కులం పుట్టుక, ఆరంభంపై ఎంగిల్స్‌తో కలిసి రాసిన the German Ideology (1845) లో వివరించారు. భారతదేశంలో కులం పుట్టడానికి కారణం పెట్టుబడి దారి విధానపు పూర్వ దశలోనే చోటు చేసుకున్న మొరటు శ్రమ విభజనే (crude division of labour) అంటారు. అంటే అన్ని దేశాలలో లాగానే భారతదేశంలో కూడా తొలుత ఆర్థిక వర్గాలే ఏర్పాటయ్యాయని, ఆ తరువాత దశలో మాత్రమే ఆయా వృత్తులు ఏర్పడి, అవి క్రమేణా అనువంశికమై, ఆ వృత్తి సమూహాలే వర్ణాలుగా, ఆపై కులాలుగా ఏర్పాటు అయినాయనీ అంటారు. ఆ కులాలను స్థిరంగా కొనసాగించడానికి దోపిడీ శక్తుల ద్వారా స్మృతులు పురాణాలూ ప్రజలపై రుద్దబడ్డాయనీ ఆ విధంగా కుల వ్యవస్థ ఘనీభవించిదనీ స్పష్టంగా విశ్లేషిస్తారు మార్క్స్. అదే విధంగా, కొందరు భావ వాదులైన చరిత్రకారులు కులమే ముందు పుట్టిందని. ఆ తరువాతనే వర్గం పుట్టినట్లు రాస్తున్నారని, అలాంటి భావనను తాను అంగీకరించబోననీ కొట్టి పారేస్తాడు మార్క్స్. ఆయన మాటల్లో చెప్పాలంటే.. when the crude form of the

division of labor, which is to be found among the Indians and Egyptians calls forth the caste system in the state and religion, the historian believes that the caste system is the power which has produced this crude social form. అంతేగాక కులాలు అనేవి ఎలాంటి బలవంతపు శాసనాల ఫలితంగా పుట్టుకు రాలేదంటారు మార్క్స్. తన Poverty of Philosophy(1847)లో ఇలా అంటాడు. under the caste system, there was division of Labour, in the whole of this society, according to fixed rules. Were these rules established by a legislator ? No. originally these laws were born of the conditions of material production. They were raised to the status of laws only much later. (Marx, Engles, Collected works, Vol. 6,page 184.)

కారల్ మార్క్స్ ఈ అన్యాయ, పక్షపాత కుల వ్యవస్థ జరిపిన మోసకారి శ్రమవిభజననూ వ్యతిరేకించాడు.. కులం అనేది "the most decisive impediment to Indias progress and power" అంటాడు తాను 1853లో రాసిన ఒక వ్యాసంలో. అంటే కులం సృష్టించిన పక్షపాత శ్రమ విభజన, క్రింద కులాల శ్రామికుల ఆర్థిక స్థోమతను దారుణంగా దెబ్బ తీస్తుందని మార్క్స్ అభిప్రాయం. అంటే కులానికి ఆర్థిక నిర్ణయక శక్తీ, స్వభావం ఉందని మార్క్స్ అభిప్రాయం. మార్క్స్ విశ్లేషణతో ఏకిభవిస్తూ ప్రసిద్ధ మార్కుసిస్టు మేధావి డి.డి.కోశాంబీ కులం అనేది ఉత్పత్తి సంబంధాలతో నేరుగా ముడిబడినదని వివరించారు. సూటిగా చెప్పాలంటే, తొలి ఉత్పత్తి సమాజంలో నైతే కులము, వర్గము ఒకటేననీ అంటారు.

Caste is an important reflection of the actual relations of production, particularly at the time of its formation.Caste is class at a primitive level of production, a religious method of forming social consciousness in such a manner that the primary producer is deprived of Surplus with the minimum coersion (quoted from the Economic and Political weekly, 26, july, 2008).

మార్క్స్ ఎంగేల్స్ రూపొందించిన కమ్యూనిస్ట్ ప్రణాళిక (1848)లో 'వర్గపోరాటం' అనే పదజాలాన్ని అన్నిరకాల పీడనలు, దోపిడీలు(ఆర్థిక, ఆర్థికేతర) కలిసే ఉన్నాయనే భావం లోనే వాడారు. ప్రణాళిక ప్రారంభంలోనే వాడిన ఈ మాటల్ని బట్టి అదే తెలుస్తోంది. The history of all hitherto existing society, is the history of class struggles. Free man and slave, patrician and plebeian, Lord and serf, guild master and journeyman, in a word, OPPRESSOR AND OPPRESSED, stood in constant opposition to one another.. అనే ఈ ప్రకటనలో కుల, మత, జాతి, తెగ, లింగ తదితర పీడనలన్నీ కలిసే ఉన్నట్లు అవగతం అవుతోంది. అయితే దేశీయ మార్క్స్ వాదులు ఆ స్పిరిట్‌తో దాన్ని ఆచరించకపోవడం, కులాన్ని కూడా వర్గ పోరాటంలో భాగంగా సమ్మిలితం చేసుకోలేకపోవడం, అది వేరే ముచ్చట, వేరేచర్చ. పైవిశ్లేషణ అంతా రెండు ముఖ్య విషయాలు వెల్లడిస్తుంది. ఒకటి, భారత దేశంలో కులాలు, కులం పుట్టుక, మానవ ప్రగతిపై ప్రతికూల ప్రభావం చూపినట్లు మార్క్స్‌కి మంచి స్పష్టతే ఉందని. రెండు, భారతదేశంలో వర్గ వ్యవస్థతో కులవ్యవస్థ కూడా బలంగానే ముడిబడి ఉందని.

### మార్క్స్ ప్రకారం కుల నిర్మూలన ఎలా?

ఇక కుల వ్యవస్థ ఎలా నిర్మూలన అవుతుంది? అనే ప్రాముఖ్యత గల ప్రశ్నకు కూడా మార్క్సిజం సమాధానాన్ని దాచలేదు. దాటవేయనూ లేదు. కుల నిర్మూలన అనేది పెట్టుబడిదారి వ్యవస్థ పూర్తిస్థాయి అభివృద్ధితోనూ, ఆ పై కార్మికవర్గ నేతృత్వం లో జరిగే వర్గ పోరాట విజయంతోను ముడివడి ఉంటుందం టారు. రైల్వే వ్యవస్థ బాగా అభివృద్ధి చెందినపుడు, దీంతోపాటు ఆధునిక పరిశ్రమలు అభివృద్ధి చెందినపుడు, శ్రామికులు ఎలాంటి ఆటంకాలు లేకుండా దేశమంతా స్వేచ్ఛగా తిరగడం, విస్తృతంగా పారిశ్రామిక రంగంలో శ్రామికులు పాల్గొనడం వల్ల ప్రాచీన కులము, కుల వృత్తి విభజన బలహీన పడుతాయని మార్క్స్ అంటారు. మరి భారతదేశంలో రైల్వే వ్యవస్థ అభివృద్ధి చెందినా కులం ఇంకా నిలిచే ఉంది కదా అంటే అది ఒక అపరిపక్వ పెట్టుబడిదారి సమాజం గురించి వచ్చే ప్రశ్నగానే భావించాలి. అలాగే, ఏ అన్యాయ శ్రమ విభజన అయితే కుల వ్యవస్థకు మూలమైందో, అలాంటి పక్షపాత కుల వృత్తి ధర్మం తొలగిపోయి, కులాతీతంగా అందరూ అన్ని రకాల వృత్తులను స్వేచ్ఛగా ఎంచుకునే సౌలభ్యం కేవలం ఒక్క కమ్యూనిస్ట్ సమాజంలో మాత్రమే సాధ్యం అవుతుంది అంటుంది కమ్యూనిజం. చివరిగా, "బూర్జువా వర్గం ఉత్పత్తి చేసే వాటిలోకెల్లా అతి ముఖ్యమైనది ఏదంటే, దానికి గోరీ కట్టే బలమైన కార్మిక వర్గాన్ని. కాబట్టి అది తన మరణ శాసనంని తానే రాసుకుంటుంది. అంతిమ విజయం కార్మిక వర్గానిదే" అంటారు మార్క్స్ కమ్యూనిస్ట్ ప్రణాళికలో. అంటే వర్గము, కులము తదితర దోపిడీ వ్యవస్థలకు అంతిమ పరిష్కారం వర్గం పోరాటమే అంటారు కారల్ మార్క్స్. ఇక మార్క్స్, ఎంగెల్స్ చెప్పిన పునాది–ఉపరి తలం సిద్దాంతం, మొత్తం భారత కమ్యూనిస్టు శ్రేణుల్లో చాలా కాలంగానే వక్రీకరణలకు, అపార్థాలకు బలైపోయినట్లు స్వయనా వారిలోనే ఎందరో అంగీకరిస్తారు. పునాది(ఆర్థికం) ఉపరి తలాన్ని (ఆర్థికేతర, సాంఘిక, సాంస్కృతిక అంశాలు) ఎలా ప్రభావితం చేస్తుందో. ఉపరితలం పునాదిని అలాగే ప్రభావితం చేస్తుందని గుర్తించడానికి వీరు చాలా కాలం శ్రమ పడాల్సి

వచ్చింది. ఇప్పుడిప్పుడే కొందరు భారత కమ్యూనిస్టు నేతలు కులంని పునాది అంశంగానే చూడాలనీ, అదీ ఉత్పత్తి సంబంధాలను నిర్దేశిస్తుందని గుర్తించడం ఆహ్వానించ దగ్గ పరిణామమే. వాస్తవానికి కమ్యూనిస్టులతో అంబేద్కర్ విభేధించడానికి ఒక బలమైన కారణం వారి యాంత్రిక సైద్ధాంతిక ఆచరణే అని విపులీకరిస్తారు తేల్ తుంబిడే (Anand Teltumbde, The Republic of Caste, Navayana publications, p. 114).

కులం విషయంలో కమ్యూనిస్టులవైపు సాగుతున్న అనాసక్తిని కొందరు సీనియర్ నేతలు, కమ్యూనిస్ట్ సిద్ధాంతకర్తలు ఆనాడే గుర్తించకపోలేదు. ఉదాహరణకు ఈఎమ్ఎస్ నంబూద్రిపాద్ ఇలా రాస్తారు.. **"కులం ఆధారిత, హిందూ మత వ్యవస్థపై రాజీ లేని పోరాటం అవసరం. కుల వ్యవస్థను ధ్వంసం చేయకుండా, సామ్య వాదాన్ని కాదు కదా, కనీసం లౌకిక ప్రజాస్వామ్యం కూడా సాధించలేం. సోషలిజంపై సాగే పోరాటాల్ని కులవ్యవస్థపై పోరు నుంచి విడదీసి చూడలేం"** అంటారు. అలాగే బిటి రణదివే కూడా "హిందూ మతం నిర్దేశించిన భూస్వామ్య విష భావజాలం పైనా పోరాడకపోతే సంస్కరణ వాదంలోనే కూరుకుపోయే ప్రమాదం ఉంది" అంటారు. (Economic and political weekly 26,july 2008) ఈ విధంగా, భూస్వామ్య వ్యతిరేఖ వర్గ పోరాటబాటలో కుల వ్యతిరేఖ సాంస్కృతిక ఉద్యమాలను జోడించి నడపాలని అప్పుడే అన్ని రకాల దోపిడీలకు పరిష్కారం దొరుకుతుందని భారత కమ్యూనిస్టుల విధానంగా ఉంది. ఈ పందాతో కొందరికి ఏకిభావం ఉండడం, లేకపోవడం గురించి విశ్లేషించడం ఈ వ్యాసం పరిధిలో లేనీ అంశం.

### అంబేద్కర్‌కీ వర్గంపై అవగాహన ఉంది

డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌కి వర్గంపై కూడా తగిన అవగాహన ఉందనే విషయం చెప్పుకొనే ముందు, అసలు కుల వ్యవస్థ పుట్టుక గురించి మహాత్మా జోతిరావ్ పూలే, అంబేద్కర్ కీ గల అభిప్రాయాల గురించి మాట్లాడుకొందాం. పూలే అభిప్రాయం మార్క్స్ విశ్లేషణకి కొంచెం భిన్నంగానే ఉన్నట్లు కనిపిస్తుంది. భారతదేశంలో కులాన్ని, విదేశాల నుండి దేశంలోకి చొరబడి, దేశ ప్రజలపై యుద్ధం చేసి విజేతలైన ఆర్యులు రుద్దారని, ఆపై బ్రాహ్మణులైన వారే స్మృతులు పురాణాల బంధకాల్లో బిగించడం ద్వారా కులాన్ని దైవ దత్తమైనదిగా మార్చారని అంటాడు. తన విశేషమైన రచన "గులాంగిరి" కి రాసిన పీఠికలో ఈ మాటలు కనిపిస్తాయి. "శూద్రుడు, మహరీ, అంత్యజ, ఛండాలవగైరా అవమానకరమైన విశేషణాలతో ఆర్యులు వారిని పిలిచేవారు. కొన్నిచోట్ల ఆదివాసుల్ని నిర్బందంగా వలస పోయేట్లు చేశారు. మరికొన్నిచోట్ల ఒకే దెబ్బన నరికేశారు". అంటూ ఆగ్రహం వెలిబుచ్చుతాడు పూలే. (హైదరాబాద్ బుక్ ట్రస్ట్ తెలుగు ప్రచురణలో) అయితే ఇలా కులం అనేదాన్ని నాటి బ్రాహ్మలు ప్రజలపై రుద్దారని నిర్ధారించినా, ఆ కులం ద్వారా శుద్రాతిసూద్రుల శ్రమనూ, ఉత్పత్తిని బ్రాహ్మణవర్గం కొల్లగొట్టేదని చెప్పడం ద్వారా, ఆచరణలో కులమే వర్గంగా ఉందనే భావం పూలేకి ఉన్నట్టు అర్థం అవుతోంది. అంటే మార్క్స్ చెప్పినట్టు కులం ఉత్పత్తి సంబంధాలతోనే ముడిబడి ఉన్నదని చెప్పకనే చెప్పినట్లే అవుతుంది. ఇక డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పూలే లాగా ఆర్య సిద్ధంతాన్ని అంగీకరించడు. ఆయన ప్రకారం మార్క్స్ ముందే చెప్పినట్లు, మొదట వృత్తి విభజన జరగడం. ఆ వృత్తి అనువంశికమై వర్ణ విభజనకు, అవి కాలక్రమేణా అంతర వివాహ విధానంతోడు అవడం చేత కులం ఏర్పడినట్లు విశ్లేషిస్తారు. అలాగే 'Classes have become castes through imitation and excommunication అంటూ వర్గాలే అనుకరణలు, బహిష్కరణల ద్వారా కులాలుగా మారి పోయాయి అంటాడు. ఇక ఆపై, యధావిధిగా స్మృతులు, పురాణాలూ ఆ వ్యవస్థ ఘనీభవించడానికి దోహద పడ్డాయంటారు. ( writings & speeches Vol.1) అయితే సామాజిక హితమైన శ్రమ విభజనను బందీఖానా లాంటి కుల వృత్తులతో సమానం చేసి చూడడం ఘోరమైన తప్పిదం అవుతుందని అంబేద్కర్ తన "కుల నిర్మూలన" గ్రంథంలో హెచ్చరించడం గమనార్హం. అందుకే "కుల వ్యవస్థ శ్రమ విభజన మాత్రమే కాదు. అది శ్రామికుల విభజన కూడా" అని సూత్రీకరిస్తాడు.

"నాగరిక సమాజానికి శ్రమ విభజన అవసరమే. అయితే శ్రమ విభజనతోబాటు శ్రామికుల విభజన జరగడం, వారి నడుమ అసహజమైన దాటడానికి వీలులేని అడ్డుగోడలు కట్టడం ఏ నాగరిక సమాజంలోనూ లేదు. ఈ కార్మిక విభజన స్వచ్ఛంద మైనట్టిది కాదు. వారి వారి సహజ స్వభావాలను, అభిరుచులను బట్టి చేయబడ్డది కాదు" అంటూ కుల దౌష్ట్యంపై న్యాయమైన ఏవగింపును, వ్యతిరేఖతను వ్యక్తీకరిస్తారు అంబేద్కర్. అందుకే, "మనం కేవలం రాజకీయ సమానత్వంని మాత్రమే కలిగి ఉండరాదు. సాంఘిక, ఆర్థిక సమానతలు పునాదులుగా లేని రాజకీయ సమానత మనలేదు" అంటారు అంబేద్కర్. దీన్నొక ఆలోచన చేయవలసిన విషయంగా అన్ని శిబిరాలూ గమనించాలి. అయితే మార్క్స్ వర్గంపై రాసినంత విశదంగా కులంపై రాయడం అప్పటికున్న పరిస్థితుల్లో ఆయనకు సహజంగానే కుదరలేదు. కారణం స్పష్టమే. కుల నైచ్యాన్నీ, దురహంకారాన్నీ, పీడితులను నిలువునా విభజించే తత్వాన్ని, మార్క్స్ దగ్గరగా చూడడానికి గానీ, అనుభవంలోకి తెచ్చుకోడానికి గానీ సాధ్యం కాని పరిస్థితే ఆనాడు ఉంది. వర్గం అనేది పీడితుల ఐక్యతకు ఆలంబన శక్తి అయితే, కులం అనేది ఐక్య సాధనం కాకపోగా, పీడితులను విడదీసే ఒక విచ్చిన్న శక్తిగా అవతరించింది. సరిగ్గా ఈ అంశాన్ని, అవగాహనా పటిమతో వివరమైన రీతిలో పూరించిన మేధావి, తాత్వికుడు, కుల పీడితుడు, సాంస్కృతిక ఉద్యమ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఒక్కడే. అందుకే

అంబేద్కర్ కులాలు సంఘటితం కావడాన్ని కోరలేదు. కులాల నిర్మూలనే కోరాడు. అందరికి తారక మంత్రంలా ఒంటబట్టిన అంబేద్కర్ హితోక్తి "కులం పునాదులపై ఒక జాతిని నిర్మించలేరు. ఒక నీతిని నిర్మించలేరు" అనేదాన్ని ఇక్కడ అందరూ స్మరించుకోవాలి. ఈ కీలక విశేషాల్ని బట్టే భారతదేశంలో సామాజిక విముక్తికి మార్క్స్ తోపాటు అంబేద్కర్ అవసరం కూడా తోడు కావాల్సి ఉందని నిర్ధారించుకోవాలి.

### అంబేద్కరికి వర్గంపై స్పష్టత ఉంది

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఎంతసేపూ కులవ్యవస్థ, కుల నిర్మూలనపై మాత్రమే ఎంతో రాశారని, అయితే ఆయనకు వర్గమన్నా, వర్గ పోరాటమన్నా అసలు సరిపడని మాటలు అంటూ కొందరు కమ్యూనిస్టులు ఇప్పటికీ గట్టిగానే వాదిస్తారు. అందుకే ఆయనతో కలిసి పోరాటం చేయడం తమకు కుదిరే పనికాదని కూడా తెగేసి చెబుతున్నారు. వాస్తవం ఏమంటే, అంబేద్కర్ భారత సమాజంలో గల వివిధ వర్గాల్ని గుర్తించడమే గాక, ఎన్నో కార్మిక. రైతాంగ పోరాటాల్ని నడిపిన చరిత్ర గల వాడు. దోపిడీ వర్గ వ్యవస్థ నిర్మూలన ఎలా అనే అంశంపై కూడా తన దృక్పథం వివరించిన సందర్భాలూ ఉన్నాయ్.. వాస్తవం ఏమంటే, అంబేద్కర్ గొప్ప అర్థ శాస్త్రవేత్త. ఆయన పిహెచ్‌డి గ్రంథమే THE PROBLEM OF RUPEE అనే ఒక క్లిష్టమైన ఆర్థిక శాస్త్ర అంశం మీద. ఇంతకీ భారతదేశంలోని ఆర్థిక వర్గ వ్యవస్థపై అంబేద్కర్ ఏమన్నాడో వివరంగా చూద్దాం.

### 1. కులము వర్గము జమిలి వ్యవస్థలే

అంబేద్కర్ దృష్టిలో వర్గాన్ని కులం నుండి వేరు పరచలేం. ఎందుకంటే కుల వ్యవస్థ అనేదే దోపిడీ కోసం కనిపెట్టబడింది. 1916లోనే అయన కొలంబియా యూనివర్సిటీకి సమర్పించిన CASTES IN INDIA అనే పరిశోధన పత్రంలో "class and castes are next door neighbors" అని చాలా స్పష్టంగా పేర్కొంటాడు. అంటే కులము వర్గం అనేవి ఈడూ జోడుగా నడిచే మిత్రుశక్తులేనని చెప్పారు. అంటే, గొప్ప కుల పోడికి వీర భోజ్యం, కులం తక్కువోడికి ముష్టి కూడేనని తెలిపోయినట్లే గదా? అంటే ఉత్పత్తి వనరులు అన్నీ పెద్ద కులపోడికీ, రెక్కల కష్టం మాత్రమే శుద్రాతి శూద్రులకన్నమాట. అది కూడా ఒక తరానికి కాదు. తరతరాలకు కూడా. సరిగ్గా ఈ నేపథ్యంలోనే అంబేద్కర్ కులంకి బేషయిన నిర్వచనం చెప్పాడు. A caste is an enclosed class అని. అంటే కులం అంటే కేవలం ఏదో ఒక సాంస్కృతిక అంశం మాత్రమే కాదు. కులానికి వర్గ స్వభావం ఉంది అని స్పష్టం చేశాడు. అందుకే కులం అనేది తన చుట్టూ తాను దడి కట్టుకున్న వర్గమేనయ్యా అన్నాడు. పైగా కులం అనే ఈ బలవంతపు దడులు, తలుపులు ఎలాంటివి అంటే 'పెద్ద' కులాలకి ఆయుధాలుగానూ ఉపయోగపడితే, నిమ్న కులాలకి తమ మొఖం మీదే వేసిన గెంటివేతలుగా అభివర్ణించాడు. some closed the door; others found it closed against them అని కులం పై సూటైన వాస్తవం విప్పి చెప్పాడు అంబేద్కర్. (అంబేద్కర్ రచనలు, సంపుటి 1, పుట 18). అందుకే భారత కార్మిక వర్గానికి ఇద్దరు శత్రువులు ఉన్నారనీ, ఒకరు పెట్టుబడిదారి వ్యవస్థ అనీ మరొకరు బ్రాహ్మనిజం అని స్పష్టపరుస్తాడు అంబేద్కర్.

### 2.కుల-వర్గ పోరాటాలకు అంబేద్కర్ సారధ్యం

ఇంత విశాల అవగాహనను ఒంట పట్టించుకున్న వాడే కాబట్టి, అంబేద్కర్ కులం వర్గ పోరాటాలను అంటే capitalism and brahminismలకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు నడిపాడు. వాటిని కమ్యూనిస్టులు బలపరిచారు. కలిసే పోరాడారు. స్వాతంత్ర ఉద్యమ తొలినాళ్ల నుండి 1940ల దాకా ఇలాంటి లాల్ నీల్ మైత్రి అనుబంధం ఆనాడే కొనసాగింద నటంలో అతిశయోక్తి లేదు. (కొన్ని పోరాటల్లో అప్పుడప్పుడు బేదాభిప్రాయాలు వచ్చినా) 1927లో మహద్ చెరువులో దళి తులు నీళ్లు తోడుకోవడం కోసం పోరాటం మొదలు, మనుధర్మ శాస్త్రాన్ని బహిరంగా తగలబెట్టడం, అంతకుముందే 1930 లోనే నాసిక్‌లో దళితులు దేవాలయ ప్రవేశం కోసం నిరసన చేసే వరకు కూడా కమ్యూనిస్టులు అంబేద్కరితోనే కలిసి నడిచారు. అలాగే 1938లో కార్మిక ఉద్యమాలపై ప్రభుత్వ దమనకాండ, పారిశ్రామిక వివాదాల చట్టంపైనా, కార్మిక సంఘాల గుర్తింపుకీ కఠిన నిబంధనలు రుద్దడంపైనా అంబేద్కర్‌తో కమ్యూనిస్టులు కలిసే పోరాడడం జరిగిన చరిత్రే కదా ? అప్పుడే వస్త్ర పరిశ్రమ లో దళితులపై చూపుతున్న వివక్షకి వ్యతిరేకంగా అంబేద్కర్ గొప్ప పోరాటం నడిపాడు.(అయితే కమ్యూనిస్టులు కొంతవరకే కలిసి పోరాటంలో పాల్గొన్నారు.) రైతులు, కౌలుదార్లనీ హింసించే విధంగా, బలవంతపు శిస్తు వసూళ్లు, వెట్టి చాకిరీని అమలు చేసే ఖోటీ వ్యవస్థ(1920–49)కి వ్యతిరేకంగా మహారాష్ట్రలోని కొంకణ్ ప్రాంతంలో కూడా, 10,000 మందికి పైగా రైతులతో అంబేద్కర్ నేతృత్వంలో జరిగిన అసెంబ్లీ యాత్రలో సైతం కమ్యూనిస్టులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంకీ మద్దతుగా కామ్రేడ్ రణదివే నాయకత్వంలో బొంబాయి కార్మిక సంఘాలు సంఘీభావం తెలియచేసాయి. ఇలాంటి పోరాటాలన్నీ అంబేద్కర్–కమ్యూనిస్ట్‌లు కలిసి చేయడం ఒక చారిత్రక వాస్తవం కాగా, రెండవది, అంబేద్కర్ బ్రాహ్మినిజంతోబాటు కాపిటలిజంపై కూడా గట్టి పోరాటాలే నడిపినట్లు అర్థం అవుతోంది. అన్నిటికన్నా ముఖ్యంగా దళితులకు భూమి లేకుండా అసలు ఆత్మ గౌరవమే ఉండదన్నాడు అంబేద్కర్. అందుకే ఆయన దళితులందరికి భూమితోబాటు, విద్య, ఉపాధి, రిజర్వేషన్లు ఖచ్చితంగా ఉండాలన్నారు. పబ్లిక్ రంగాన్ని కాపాడుకోవాలి

అన్నారు. అన్నిటికిమించి ఆయన రాజీ లేని సోషలిస్టు. అందుకే ఆయన స్పష్టంగా స్టేట్ సోషలిజంని ప్రతిపాదించాడు. తాను రాసిన STATES AND MINORITIES(1946) గ్రంథంలో రాజ్యం నాయకత్వంలోనే సోషలిజం ఎలా సాధించాలో వివరించాడు. భూమితో బాటు కీలక పరిశ్రమలన్ని ప్రభుత్వ యాజమాన్యంలోనే నడవాలని, అందరికి ప్రభుత్వమే బీమా సదుపాయాలు కల్పించాలని, భారత రాజ్యాంగంలో కూడా ఇవి ప్రాథమిక హక్కులుగా చోటు చేసుకోవాలని ప్రతిపాదించాడు. ప్రాకులాడాడు. అటు రాజ్యాంగ సభలోని శ్రీమంతులైన సభ్యులకు ఈ సూచన ఎంతో ఇరకాటం కలిగిస్తే, ఇటు కమ్యూనిస్టులకు రాజ్యం నాయకత్వంలో జరిగే సోషలిజం పక్కా పరిహాసాస్పదమైనదని అనిపించింది. ఈ రెండు శిబిరా లూ తన సోషలిస్ట్ ఆలోచనలను అంగీకరించ నిరాకరించాయి. అందుకే తాను సారధ్యం వహించిన భారత రాజ్యాంగంపై ఒక ప్రసంగంలో తానే అయిష్టత, అసంతృప్తిని వ్యక్తపరిచాడు. అంటే అంబేద్కర్‌కు భారత సమాజాన్ని సమస్త దోపిడీ శక్తుల నుంచి విముక్తి చేయాలనే ఒక సంకల్పం, గొప్ప సోషలిస్ట్ సమాజాన్ని, దళిత బహుజనులను ఆత్మ గౌరవంతో జీవించే వ్యవస్థను సాధించాలనే గొప్ప దీక్ష ఉన్నట్లు బోధపడడం లేదా? ఆయన ఆలోచనలు బుట్టదాఖలా కావచ్చు, కమ్యూనిస్టు సిద్ధాంతంతో విభేదించనూ వచ్చు కూడా. అయినా అంబేద్కర్ సోషలిస్ట్ భావాలు లేనివాడు కాకపోడు కదా? అంబేద్కర్ వర్గ పోరాటంకి దూరంగా, ఆర్థిక పోరాటాలకు వ్యతిరేకంగా కాలక్షేపం చేసిన వాడు వాడు కాదు కదా? అసలు అంబేద్కర్‌కి తామే వారసులం అనీ గొప్పలు పలికే కొందరు నాయకాగ్రేసరులే అంబేద్కర్ మార్గాన్ని బొత్తిగా పక్కన పడేసి, కార్పొరేట్, మనువాద శక్తులతో జత కట్టి హోదాలు పొందడం, వారితో పెట్టుబడులు, ప్రభుత్వ అధికారం పంచుకోడాని కోసం వెంపర్లాడడం.. ఇదే నేటి నిక్క మైన నిజం కావడం ఎంతో అపచారం కదా? ఇది అంబేద్కర్ని అవమానించడమే గానీ అభిమానించడం ఎలా అవుతుంది? అభిమానించడమే నిజమైతే, ఈ దేశంలో నిత్య కళ్యాణంగా సాగే ప్రభుత్వ రంగ నిర్వీర్యం, ప్రైవేటీకరణ దుమారాన్ని అడ్డుకొనే ఆందోళనలు దళిత సారధ్యంలో ఎంతమేరకు కనిపిస్తున్నాయి? కార్మిక, రైతాంగ సంక్షోభాలపై దళిత పోరాటాలు ఎక్కడ బద్దలవుతున్నాయి? కాబట్టి అంబేద్కర్ చాలా గొప్పవాడనో, ఆయనకు వర్గ జ్ఞానం సమృద్ధిగానే ఉందనో వ్యక్తి పూజ చేయడం ఒక్కటే గొప్పకాదు. ఆయన సిద్ధాంత అడుగు జాడల్లో నడవడమూ, వర్గ కుల స్పృహతో పోరాడడమూ ముఖ్యమేనని ఎందరో మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నమాటలూ ఒంట పట్టించుకోవాలి.

**3.అంబేద్కర్ ప్రకారం వర్గ రహిత సమాజం ఎలా ఏర్పడుతుంది?**

కులంని రద్దు పరచుకోకుండా ఏ విప్లవమూ వర్ధిల్లదని అంబేద్కర్ దృఢ అభిప్రాయం. ఒకవేళ అలాంటి విప్లవం సాకారమైనా, విప్లవం తర్వాతనైనా కులభూతం మీకు అడ్డుగానే నిలుస్తుంది గదా? అంటారు అంబేద్కర్. అంటే భారత దేశంలో సామాజిక విప్లవం విజయవంతం కాకుండా, రాజకీయ విప్లవాలేవి వర్ధిల్లవనేది ఆయన బలమైన సూత్రీకరణ. అంటే విప్లవానికి అవసరమైన కార్మికవర్గ ఐక్యత కులం రద్దుతో మాత్రమే సాధ్యపడుతుంది అనేది అంబేద్కర్ విశ్లేషణ సారం.

అంత మాత్రాన అంబేద్కర్‌కి ఆర్థిక దోపిడీ శక్తులపై పోరాటం అవసరం లేదని చెప్పడం అస్సలు కాదు. పైగా, ఆర్థిక దోపిడీ శక్తుల్ని ఓడించడం ద్వారా మాత్రమే నిజమైన కార్మికవర్గ విముక్తి లభిస్తుంది అనేది అంబేద్కర్ అభిప్రాయం. ఆయన ఒక ప్రసంగంలో “దేశ శ్రామిక వర్గం నేడు సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారి, భూస్వామ్య వ్యవస్థల చేతిలో బందీ అయింది. ఈ పరిస్థితి నుంచి శ్రామిక వర్గం విముక్తి అయితేనే, భారత జాతికి నిజమైన స్వాతంత్ర్యం సిద్ధించినట్లు“అంటారు. (డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రసంగాలు vol1) . కాబట్టి వర్గవ్యవస్థ నిర్మూలన పట్ల అంబేద్కర్‌కి కమ్యూనిస్టులకు ఏమాత్రం తీసిపోనంత విశాల అవగాహన ఉన్నట్లే గదా? (అయనకు మార్క్సిజం సిద్ధాంతం పట్ల, పోరాట రూపాల పట్ల తేడాలు ఉండవచ్చు గాక). నిజమే. అంబేద్కర్ ఏనాడూ మార్క్స్ వాదంకి బద్ధుడు కాడు. పైగా అది స్వేచ్ఛా జీవన విధానానికి ఆటంకమని భావించాడు కూడా. అప్పటి బ్రాహ్మణ భారత కమ్యూనిస్టు నేతలు అగ్రకుల, మనువాదులే అన్నాడు. అందుకే వారు పునాది–ఉపరితలం సిద్ధాంతంలోనూ ఆర్థికవాదంలోనూ కూరుకుపోయారని ఆరోపించాడు. అంతకుమించి సోషలిజాన్ని హింసా మార్గంలోనూ, శ్రామికవర్గ నియంతృత్వం ద్వారానూ సాధించాలనే కమ్యూనిస్టుల సిద్ధాంతానికి తాను వ్యతిరేకినని చెప్పాడు.

తాను మార్క్స్‌కి బదులుగా బుద్ధిజం మార్గాన్ని, సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం అనే దృష్టిని స్వాగతిస్తున్నానని చెప్పారు. బహుజన హితాయా, బహుజన సుఖాయ అనే నిర్మలమైన, నిష్పాక్షిక మార్గంని మానవాళికి నిర్దేశించిన బౌద్ధ ధర్మమే నా మార్గం అని ప్రకటించారు అంబేద్కర్ తన మలి దశ విశేష ప్రసంగం/రచన BUDHA OR KARL MARX (1956)లో. అయితే, విశేషం ఏమిటంటే, అంబేద్కర్‌కి పూర్తిగా మార్క్స్ భావాల పట్ల ఏహ్య భావమే మిగిలిపోయిందనీ చెప్పలేం. ఆయన ఒక సందర్భంలో మాట్లాడుతూ ఎవరు ఏమి చెప్పినా పరిశీలించి అంగీకరించాలి అంటారు. ఆ దిశలో భాగంగానే కావచ్చు, రష్యాలో మార్క్సిజం విజయాన్ని కీర్తిస్తూ తన సొంత పత్రికలు, మూకనాయక్, జనతా లలో, గొప్ప వ్యాసాలు రాసారు అంబేద్కర్. అలాగే, మార్క్స్ రాసిన పెట్టుబడి గ్రంథం ఇంకా మరాఠిలోకి అనువాదం జరగకముందే, (1960దాకా జరగలేదు) 1930ల్లోనే అంబేద్కర్ తన జనతా పత్రికలో ‘మోల్, మజూరి, బంధ్వల్’ (వేతనాలు, **(మిగతా 64వ పేజీలో)**

# కుల నిర్మూలన సాధించే మార్గం

(స్వేచ్ఛానుసరణ ఎం.వి.ఎస్.శర్మ)

- ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్



**ప్రాచీన కాలం నుంచి భారతదేశంలో ఉనికిలో ఉన్న నాలుగు వర్ణాల వ్యవస్థలో కుల వ్యవస్థ మూలాలు ఉన్నాయి. ఆ వ్యవస్థ మరింతగా విస్తరించే క్రమం కొనసాగుతోంది. నాలుగు వర్ణాల వ్యవస్థలో ప్రధానంగా బ్రాహ్మణులు (పురోహిత వర్గం), క్షత్రియులు (యుద్ధాలు చేసేవారు) మిగిలిన రెండు శ్రామిక తరగతులకు చెందిన వారు. వీరిలో ప్రధానంగా లొంగదీసుకున్న స్థానిక తెగలకు చెందిన వైశ్యులు (చేతివృత్తుల వారు, ఇతర ఉత్పత్తిదారులు), శూద్రులు (తక్కువ స్థాయి పనులు చేసే శ్రామికులు) ఉన్నారు.**

రక్త సంబంధీకుల గుంపులతో, పుట్టుకను బట్టి అమలు జరిగే ఒక నిచ్చెన మెట్ల మాదిరి వ్యవస్థగా ఇది ఉంది. ఒక్కో గుంపు ఒక్కో ప్రత్యేకమైన వృత్తిని నిర్వహిస్తుంది. అది వంశపారం పర్యంగా సంక్రమిస్తుంది. ఈ వ్యవస్థలో అంతర్భాగంగా అంట రానితనం, కంటబడకూడని ఆచారం అనే సహించరాని ఆచారాలు ఉన్నాయి. తక్కువ కులపు వ్యక్తిని ముట్టుకున్నా, లేక చూసినా అగ్రకులానికి చెందిన వ్యక్తి మైల పడిపోతాడనే ఊహ ప్రాతిపదికన ఈ ఆచారాలు ఏర్పడ్డాయి. ఈ తక్కువ కులాలకు చెందిన వారు ఎటువంటి స్వంత భూమినీ కలిగి వుండకూడదనీ, వారు తమ గ్రామాన్ని విడిచిపెట్టి పోరాదని ఆచారాలు ఆంక్షలు విధించాయి. తద్వారా అగ్ర కుల భూయజమానులకు అవసరమైన కూలి మనుషులు ఎప్పుడు కావాలన్నా లభించే ఏర్పాటు జరిగింది. వ్యవసాయ భూములు సాధారణంగా గ్రామాలకు పరిసరాల్లో ఉంటాయి. ఆ రోజుల్లో కూలీలు వేరే ప్రదేశాలకు తరలిపోయి స్వంతంగా, స్వతంత్రంగా జీవించే అవకాశాలు మెండుగా ఉన్నాయి గనుక ఆ విధంగా జరగకుండా ఈ ఆంక్షలు వచ్చాయి. సామాజిక, ఆర్థిక అసమానతలు ఈ విధంగా వ్యవస్థీకృతమైన ఈ సమాజంలో వలస పాలన ఫలితంగా చట్టం ముందు అందరూ సమానులే అన్న సూత్రం(మొక్కుబడిగానే) ప్రవేశించింది. ఐతే అదే వలస పాలన భౌతిక జీవితంలో అసమానతలను మరింత పెంచింది పారిశ్రామిక ఉత్పత్తులను పెద్ద ఎత్తున దిగుమతి చేసి ఇక్కడి చేతి వృత్తులను నాశనం చేయడం, పన్నుల పేరుతో రైతుల నుండి భారీగా వసూళ్ళు చేసి ఆ ధనంతోనే ఇక్కడి వ్యవసాయోత్పత్తులను చేజిక్కించుకోవడం జరిగింది. దీనివలన తక్కువ కులాల ప్రజల భౌతిక జీవన పరిస్థితులు మరింత దిగజారాయి.

సామాజిక న్యాయం కోసం, విముక్తి కోసం 19, 20 శతాబ్దాలలో సాంఘిక ఉద్యమాలు జరిగాయి. వాటితోబాటు సమాంతరంగా సామ్రాజ్యవాద వలస పాలనకు వ్యతిరేకంగా పోరాటం జరిగింది. స్వాతంత్ర్యం వచ్చాక, ఒక రాజ్యాంగాన్ని రూపొందించడం జరిగింది. చట్టం ముందు అందరూ సమానులే అన్న మొక్కుబడి సూత్రం స్థానంలో ప్రజాతంత్ర పాలన, వయోజనులందరికీ ఓటు హక్కు ఎన్నికల ద్వారా ప్రభుత్వం ఏర్పాటు, షెడ్యూల్డ్ కులాలకు, షెడ్యూల్డ్ తెగలకు చట్ట సభలలో, ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లు వచ్చాయి. ఆ తర్వాత కాలంలో ఈ రిజర్వేషన్లను కొన్ని బిసి కులాలకు కూడా వర్తింపజేశారు. ఐతే, స్వాతంత్ర్యానంతర కాలపు అనుభవాన్ని బట్టి, ప్రజలను పుట్టుకను బట్టే ఎక్కువ, తక్కువ స్థాయిలకు చెందిన వారిగా విడదీసే కులవ్యవస్థ ఉనికిలో ఉన్నంత కాలం, రాజ్యాంగవరంగా కుల అణచివేతను నిర్మూలించడానికి రూపొందించిన చర్యలు ఏవీ తమ లక్ష్యాన్ని నెరవేర్చలేవు అన్నది స్పష్టమైంది. ఈ నిచ్చెనమెట్ల మాదిరి అసమానతలతో కూడిన కుల వ్యవస్థే అణచివేతతో కూడివుంది. రిజర్వేషన్ల ఫలితంగా అన్ని వృత్తులలోనూ, ఉద్యోగాలలోనూ అణగారిన కులాలవారికి కూడా తమ జనాభా నిష్పత్తి ప్రకారం అవకాశాలు లభించాయని మాట వరసకు అనుకున్నా, సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న కుల వ్యవస్థ, దానిని బలపరిచే సిద్ధాంతం, భావజాలం ఉన్నంత కాలమూ ఈ సిద్ధాంతానికి, భావజాలానికి అటు అణచివేసే తరగతులు, ఇటు అణచి వేయబడుతున్న తరగతులు రెండూ తలొగ్గాయి. సమాజంలో సామాజిక అణచివేత కొనసాగుతూనే వుంటుంది. ఆర్థికవ్యవస్థలో అణచి వేతను తొలగించినంత మాత్రాన కుల వ్యవస్థ ఈ సమాజంలో అంతరించదు. కుల పరంగా మనుషుల్ని గుర్తించే విధానమే మొత్తంగా - అంతం కావాలి. అంబేద్కర్ చెప్పినట్టు కుల నిర్మూలన సాంతం జరగాలి. గాంధీ దీనికి భిన్నంగా ఎక్కువ తక్కువలు లేని, అణచివేత లేని కుల వ్యవస్థ కొనసాగవచ్చునని అందులో చేసే పనికి కులానికి ఉన్న సంబంధాన్ని తెగతెంచి అందరూ అన్ని రకాల పనులనూ - పంచుకునేలా మార్పు చేయవచ్చునని భావించాడు. (ఆ

మేరకు గాంధీ ఆశ్రమాల్లో మరుగుదొడ్ల శుభ్రం చేయడంతో సహా అన్ని పనులనూ అందరూ పంచుకునేవారు.) ఇక్కడే సంబంధాల చర్చ తలెత్తుతుంది. సమాజంలో ప్రతీ ఒక్కరికీ ఏదో ఒక సమూహంతో సంబంధం ఉంటుంది. ఇది నా స్వంత సమూహం అనే విధంగా ఆ సంబంధం ఉంటుంది. అది సాధారణంగా కుల సంబంధంగా ఉంటుంది. సమాజంలో వివిధ సమూహాల(కులాల) ప్రజలు పాదార్థిక జీవితంలో సమానత్వాన్ని సాధించినప్పటికీ, కుల వ్యవస్థ కొనసాగుతున్నందున, ఒక కులం పట్ల మరొక కులానికి చిన్నచూపు ఉండడం అనేది కొనసాగుతూనే వుంటుంది. అందువల్ల అణచివేత కొనసాగుతూనే వుంటుంది. ఫలితంగా సామాజిక అభివృద్ధి అసంపూర్ణంగా ఉండిపోతుంది. ఈ పరిస్థితి సహించరానిది. అణచివేతను భరిస్తున్న తరగతుల ప్రజలు తమ పరిస్థితి ఆ విధంగా ఉండడం మామూలేనని భావించి సర్దుకుపోయేటట్టు వారిని భావజాలపరంగా సంసిద్ధం చేసినా, (ఇది దైవ నిర్ణయం అనో, తలరాత అనో, కట్టుబాట్లు అతిక్రమించకూడదనో భావించేలా చేయడం) వారిని అణచివేయడం అనేది జరుగుతూనే వుంటుంది. తమ కుల సమూహంతో వారికి ఉన్న సంబంధం రీత్యా వారు ఆ విధంగా అణచివేతకు తలొగ్గవచ్చు. ఆ విధంగా వారు అణచివేతను ఆమోదించడం లేదా సహించడం బట్టి అణచివేత సమర్ధనీయం ఎంతమాత్రమూ కాదు. తమ మీద అణచివేత సాగుతోందన్న వాస్తవాన్ని ఆ సమూహం గుర్తించకపోయినా, లేక అణచివేతను వారు ఆమోదిస్తున్నా, కుల అణచివేత సాగుతోందంటూ చెప్పడం అంటే ఆ సమూహాల మీద (అణగారిన కులాల ప్రజల మీద) బలవంతంగా మన అభిప్రాయాన్ని రుద్దడమే అని వాదించే వారున్నారు. కాని ప్రస్తుతం తమ మీద అణచివేత సాగడం లేదంటూ వారు తిరస్కరించినా, వారి సమస్య ఎప్పుడో ఒకప్పుడు స్పష్టమైన రూపు తీసుకుంటుంది. అప్పుడు తరతరాలుగా సాగుతున్న అణచివేత మీద ఆగ్రహం పెల్లుబుకుతుంది. ప్రస్తుతం వారు మౌనంగా ఉన్నారనో, లేక ఆధిపత్య కుల వ్యవస్థ కట్టుబాట్లకు వారు లోబడి వున్నారనో వాదించడం అంటే వివక్ష పూరితమైన కుల వ్యవస్థ కొనసాగడం మామూలేనన్న వైఖరి తీసుకోవడమే. అంతే గాక వివక్షతను భరించాలన్న తప్పుడు భావనను సమర్థించడమే అవుతుంది. పైగా కుల ప్రాతిపదిక మీదనే సామూహిక సంబంధాలు కొనసాగడంలో తప్పు లేదని, అలా కొనసాగుతూనే వుంటాయని, కులవ్యవస్థ ఉనికితో సామాజికాభివృద్ధికి ఏ సంబంధమూ లేదని వాదించడమే అవుతుంది. మరొక్కసారి మననం చేసుకోవాలంటే, ఇప్పుడు కావలసింది ఈ వివక్ష పూరితమైన, అణచివేతతో కూడిన వ్యవస్థను వదిలించుకుని ముందుకుపోవడం. దాంతోబాటు కులపరంగా ఏర్పడిన సామూహిక సంబంధాలను, ఆ సంబంధాలను సమర్థించే సైద్ధాంతిక భావజాలాన్ని కూడా వదిలించుకుని ముందుకుపోవాలి. కావలసినది కుల నిర్మూలన. అది జరగనంత కాలం, ప్రజలు తాము ఏదో ఒక కులానికి చెందిన వారమేనన్న భావనతో ఉండి ఆ సంబంధాలను కొనసాగిస్తున్నంత కాలం నిజమైన సామాజిక పురోగతి అనేది సాధ్యం కాకుండాపోతుంది.

స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో కుల సమస్య పరిష్కారానికి రకరకాల ప్రయత్నాలు జరిగాయి. ప్రభుత్వ ఉద్యోగాలలో, ప్రభుత్వ విద్యాసంస్థలలో రిజర్వేషన్ విధానాన్ని ప్రవేశపెట్టి సామాజిక న్యాయం కోసం గట్టి జోక్యం చేసుకున్నారు. అదే సమయంలో అణచివేతకు గురౌతున్న కులాల ప్రజల్లో అస్థిత్వ రాజకీయాలు తలెత్తాయి. ముఖ్యంగా ఇవి ఎన్నికల రంగంలో వ్యక్తం అయాయి. ఒక వ్యక్తి–ఒక ఓటు అన్న విధానం ఉంది గనుక, అణచివేతకు గురవుతున్న కులాల ప్రజలు సంఖ్య రీత్యా అధికంగా ఉన్నారు గనుక, ఆ తరగతుల పాదార్థిక, సామాజిక, సాంస్కృతిక ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే రాజకీయ పార్టీలను అధికారంలోకి తేవాలనే దిశగా ఇవి వ్యక్తమయ్యాయి. ఇటువంటివే మరికొన్ని వ్యూహాలు అమలు చేయడానికి ప్రయత్నాలు జరిగాయి. కులాల దొంతరలకు, వర్గపరమైన దొంతరలకు సంబంధం తెగ్గొట్టడానికి తోడ్పడుతుందన్న భావనతో దళిత పెట్టుబడిదారుల సంఖ్యను బాగా పెంచడానికి ప్రయత్నాలు జరిగాయి. ఈ ప్రయత్నాలన్నీ ఆయా కుల సమూహాల సామాజిక సంబంధాల చట్రానికి లోబడే జరిగాయి. కుల అణచివేతకు ముగింపు పలకాలన్న ప్రయత్నంలో భాగంగా జరిగే ఈ మాదిరి ప్రయత్నాలను బలపరచవలసిందే. కాని ఈ ప్రయత్నాలతోటే గమ్యం సిద్ధించదు. ఈ ప్రయత్నాలేవీ కుల నిర్మూలనకు దారి తీయవు.

**జనాభాలో కులాల వారీగా ఏయే నిష్పత్తిలో ఉన్నారో, వివిధ వృత్తులు, ఉద్యోగాలు, వ్యాపకాల్లో ఆ కులాల భాగస్వామ్యం అదే నిష్పత్తిలో లేదు. ఈ పరిస్థితిని సరిచేయాలి. ఐతే అలా సరి చేసినంత మాత్రాన కుల అణచివేత అంతం కాదు. పైగా ఫక్తు అస్థిత్వ రాజకీయాలను అనుసరించడం ద్వారా గానీ, అస్థిత్వ ప్రాతిపదికన డిమాండ్లు లేవనెత్తి వాటిని సాధించుకోడానికి ప్రయత్నించడం ద్వారా గానీ నిష్పత్తిని సరి చేయడం సాధ్యం కాదు. ప్రస్తుతం సమాజంలో రాజకీయ, సామాజిక అధికారం అగ్రకులాలకు అనుకూలంగా సాగుతోంది. అందువలన అస్థిత్వ ప్రాతిపదికన లేవనెత్తిన డిమాండ్లను పరిష్కరించడానికి ఈ పరిస్థితి ఎంత**

**మాత్రమూ ఒప్పుకోదు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో అంగీకరించినా, ఆ తర్వాత ఆచరణలో వాటిని తిరస్కరించడం జరుగుతుంది. అంతేకాదు, ఇప్పుడు అమలులో ఉన్నవాటిని సైతం తిరగదోడడం జరుగుతుంది.**

ప్రస్తుతం భారతదేశంలో దళితులకు, ఓబీసీలకు అమలులో ఉన్న రిజర్వేషన్లను రెండు వ్యూహాలతో దెబ్బ తీస్తున్నారు. **మొదటిది :** రిజర్వేషన్లు వర్తించే ప్రభుత్వ రంగాన్ని కుదించి వేస్తున్నారు. ఇది ప్రభుత్వమే అమలు జరపడానికి పూనుకున్న, నయా-ఉదారవాద విధానాలు నిర్దేశించిన ప్రకారం జరుగుతోంది. మరోపక్క రిజర్వేషన్లను జాట్, పటేల్ వంటి వెనుకబడని కులాల వారికి కూడా వర్తింపజేయాలన్న డిమాండ్లు ముందుకు వస్తున్నాయి. ఆ కులాలకు చెందిన వారు అనుసరిస్తున్న అస్థిత్వ రాజకీయాలలో భాగం ఇది. ఈ తరహా డిమాండ్లు నిజంగా అణచి వేతకు గురౌతూ రిజర్వేషన్ సదుపాయాన్ని పొందుతున్న తరగతుల పరిస్థితిని బలహీన పరుస్తుంది. (ఈ తరగతుల వారికి రిజర్వేషన్లు కల్పించేటప్పుడు ఆర్థిక కొలబద్దను ప్రవేశ పెట్టాలన్న డిమాండ్ ఇందుకు ఒక ఉదాహరణ) **ఇక రెండవది :** ఒక కులానికి ఇంకొక కులానికి మధ్య ఘర్షణను పెంచేది. ఈ ఘర్షణల వెనుక కేవలం ఆయా సమూహాలుగా కలిగివున్న సంబంధాలే ప్రాతిపదికగా ఉంటాయి. అందుచేత అస్థిత్వ రాజకీయాలు ఆర్థిక పరంగా కుల అణచివేతను తగ్గించడానికి దోహదపడవు. ఇక కుల నిర్మూలనకు తోడ్పడవని వేరే చెప్పనక్కరలేదు. ఇప్పుడు కావలసింది కులం అనే ఒక ప్రాతిపదికన సామూహిక సంబంధాలను కలిగి వుండే పరిస్థితిని మొత్తంగా అధిగమించడం. అణచివేతకు గురవుతున్న కులాల వారు, ఇతర కులాలకు చెందిన వారితో కలిసి కుల సంబంధాలను అధిగమించి ఉమ్మడి అంశం ప్రాతిపదికన ఉన్నతస్థాయిలో సామూహిక సంబంధాలను పెంపొందించుకోవడం. కులాంతర వివాహాలు జరగడం, పేరులో కులాన్ని సూచించే భాగాన్ని విసర్జించడం వంటి సాంస్కృతికపరమైన చర్యల ద్వారా ఈ లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యం అని ఒకప్పుడు భావించారు.

ఇప్పటికీ ఆ విధమైన చర్యలు తోడ్పడతాయి. కాని వాటి ప్రభావం చాలా పరిమితంగా మాత్రమే ఉంటుంది. కుల సంబంధాలను అధిగమించగల సంఘీభావాన్ని పెంపొందించ గల ఉమ్మడి పోరాటాలు చేపడితేనే కుల సంబంధాలను అధిగమించగలం. యూరప్ ఖండంలోని అనుభవాలను చూసిన అనంతరం మన దేశంలో ఏర్పరచుకున్న మార్క్సిస్టు అవగాహన ప్రకారం పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందే కొద్దీ పెరిగే వర్గ పోరాటాలు కులాలకు అతీతంగా కొత్త సంఘీభావాన్ని సాధించడానికి దారితీస్తాయి. యూరప్‌లో పెట్టుబడిదారీ విధానం పాత ఫ్యూడల్ సమాజపు సామూహిక సంబంధాలను పూర్తిగా నాశనం చేసింది. ఆ క్రమంలో చెల్లాచెదురైన వారందరినీ తన చట్రంలో శ్రామికులుగా ఇముడ్చుకుంది. ఆ విధంగా ఒక దగ్గరకు చేరిన శ్రామికులు కొత్త సమూహాలుగా సంఘటితం కావడం ప్రారంభించారు. అటువంటి అనుభవమే భారతదేశంలో ఎదురౌతుందని మార్క్సిస్టులు భావించారు. కాని ఆ విధంగా జరిగే అవకాశాలు కనిపించడం లేదు. యూరప్ పరిస్థితులకీ, ఇక్కడి పరిస్థితులకీ తేడా ఉంది. యూరప్‌లో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి జరిగే క్రమంలో అక్కడి పాత ఫ్యూడల్ సంబంధాలు నాశనమయ్యాయి. బతుకుతెరువు కోల్పోయిన వారు అమెరికా, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా తదితర ప్రాంతాలకు వలసలు పోయారు. అక్కడ వారు కొత్త జీవితాలను ప్రారంభించారు. దీనివలన ఇటు యూరప్‌లోను, అటు కొత్తగా స్థిరపడిన ప్రాంతాలలోను పనులకు అవసరమైనంత మంది కార్మికులు లేకుండాపోయారు. నిరుద్యోగం చాలా పరిమితంగా ఉండేది. ఈ పరిస్థితుల్లో శ్రామిక జనం తమను తాము సంఘటితం చేసుకోవడం ప్రారంభించారు. తద్వారా ఇటు యూరప్ ఫాక్టరీలలోను, అటు కొత్తగా స్థిరపడే ప్రాంతాలలోను వారు మెరుగైన జీవితాలను సాధించుకునే అవకాశాలు వచ్చాయి. భారతదేశం నుండి అటువంటి వలసలు పోగలిగిన పరిస్థితులు లేవు. పెట్టుబడిదారీ వ్యవస్థలో అందరికీ ఉపాధి కల్పించగల సామర్థ్యం లేదు. పాత సమాజంలో సాంప్రదాయ వృత్తులలో జీవిస్తూ ఇప్పుడు పారిశ్రామికీకరణ కారణంగా ఉపాధి కోల్పోయిన వారితో బాటు జనాభా పెరుగుదల రీత్యా కార్మికవర్గ కుటుంబాలలో కొత్తగా వచ్చే నిరుద్యోగులను కలిపితే వారందరికీ పెట్టుబడిదారీ వ్యవస్థ ఉపాధి కల్పించలేదు. ఐతే నిరుద్యోగం బాహాటంగా కనిపించదు. శాశ్వత ఉద్యోగాలను మెరుగైన జీతాలను కలిగివుండే కార్మికులతోబాటు తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసే శ్రామికులు, కొన్ని రోజులు పనులు దొరికి, తక్కిన రోజుల్లో పనులు దొరకని కార్మికులు, స్వయం ఉపాధి వెతుక్కునే కార్మికులు - ఇలా ప్రచ్ఛన్నంగా నిరుద్యోగం విపరీతంగా పెరుగుతుంది. గౌరవప్రదమైన ఉపాధికి కొరత తీవ్రంగా ఉందని ఐఎల్ఒ స్వయంగా ఒప్పుకుంది. అటు గ్రామసీమల్లో దారిద్ర్యంతో సతమతమౌతున్న ప్రజానీకం, ఇటు పట్టణాల్లో ముక్కముక్కలుగా చెదిరిపోయిన శ్రామికజనం ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. ఈ కారణం చేత వారిలో బలంగా సంఘటితం అయ్యే శక్తి కొరవడింది.

అందరూ ఐక్యమై ఒకరికొకరు తోడుగా నిలిచే స్ఫూర్తి పెంపొందే అవకాశాలు లేవు. ఈ పరిస్థితులు వారిలో అస్థిత్వ రాజకీయాలు బలపడడానికి, అందునా కుల ప్రాతిపదికన రాజకీయాలు బలపడడానికి దారితీశాయి. పెట్టుబడిదారీ సరుకుల ఉత్పత్తి విధానం కార్మికులను ముక్కముక్కలుగా చీల్చి,

ఒకరికి వ్యతిరేకంగా ఇంకొకరు నిలిచి ఘర్షించే పరిస్థితులు కల్పిస్తుంది. సంఘటితం కావడానికి పూర్తి వ్యతిరేక దిశలో ఈ చీలికలు ఉంటాయి. అటువంటి చీలికలను నివారించడానికే సంఘటితం కావడం అవసరం అవుతుంది. కాని అటువంటి సంఘటనలను నిర్మించడం కష్టం ఔతుంది. ముఖ్యంగా ఉద్యోగాలు తాత్కాలిక స్వభావంతో ఉండడం, రకరకాల పద్ధతులలో కార్మికులను పనుల్లో నియోగించడం వలన వారిని సంఘటితం చేయడం దుర్లభం ఔతుంది. ముక్కముక్కలుగా చీలిన కార్మికవర్గపు పరిస్థితికి రెండో ముఖంగా అస్థిత్వ రాజకీయాలు ముందుకొస్తాయి. నయా-ఉదారవాద శకంలో భారతదేశంలో స్థూల జాతీయోత్పత్తి ఎంత వేగంగా పెరిగినా, అది కార్మికులను ఆర్థికంగా ముక్కముక్కలుగా చీల్చివేస్తోంది. తగినంత సంఖ్యలో ఉపాధి కల్పించే సామర్థ్యం ఈ వ్యవస్థకు లేకపోవడమే ఇందుకు కారణం. అదే సమయంలో ఈ నయా-ఉదారవాద విధానాలు కార్మికవర్గ చీలికలకు రాజకీయ రూపంగా అస్థిత్వ రాజకీయాలను ముందుకు తెస్తున్నాయి. కార్మికులను ఆర్థికంగా ముక్కముక్కలుగా చీల్చడం ఒకవైపు జరుగుతూంటే, అటు గ్రామసీమల్లో వ్యవసాయ రంగంలోని శ్రామికులను సంఘటితం చేయడానికి కులం ఒక పెద్ద ఆటంకంగా ఉంటోంది. అటువంటి పరిస్థితి కార్మికోద్యమం తొలిరోజుల్లో పట్టణాలలో సైతం ఎదుర్కొంది. (కమ్యూనిస్టుల నాయకత్వంలోని కార్మిక సంఘాలతో సహకరించడానికి అంబేద్కర్ దళిత కార్మికుల సంఘాన్ని ఏర్పాటుచేశారు. ఈ రెండు సంఘాల సభ్యులూ ఫాక్టరీ ఆవరణలోని ఒకే మంచినీటి కొళాయి నుండి నీరు తాగాలన్న షరతు పెట్టారు) అందుచేత కార్మికవర్గం సంఘటితమై కుల సమూహాల సంబంధాలను అధిగమించే స్థాయికి చేరుకోవడం కష్టసాధ్యం అవుతుంది. పైగా చిన్న ఉత్పత్తిదారులు, చిన్న రైతులు, వ్యవసాయ కూలీలు కలిపితే చాలా పెద్ద సంఖ్యలో ఉంటారు. వారితో పోల్చితే కార్మికుల సంఖ్య చాలా తక్కువ. అందుచేత కులబంధాలను అధిగమించగలిగేంత బలంగా శ్రామికవర్గ బంధాలు రూపొందడం చాలా కష్టం.

మరి కుల బంధాలను అధిగమించ గలిగేంత బలమైన బంధాలు శ్రామిక ప్రజానీకం నడుమ ఏర్పడి నిజమైన సామాజిక పురోగతిని సాధించడం ఎలా ? మన రాజ్యాంగం ప్రకారం ఈ దేశంలో పౌరులందరూ సమానులే. ఆ ప్రాతిపదికన ప్రజల మధ్య ఒక విశాలమైన బంధం ఏర్పడడానికి ఆటంకంగా ఉపాధి అవకాశాల కొరత ఉంది. నయా ఉదారవాద విధానాలు అమలయ్యే క్రమంలోనే ఈ కొరత పెరుగుతూ వచ్చింది. కొన్ని సార్వత్రిక స్వభావం కల న్యాయమైన హక్కుల సాధన కోసం ప్రజలం దరినీ సమీకరించి సంఘటితం చేయగలిగితే ఆ హక్కుల కోసం జరిగే పోరాటం ప్రజలను కులబంధాలను అధిగమించగలిగేలా చేయగలుగు తుంది. ఇప్పుడు ప్రజలందరికీ సార్వత్రికంగా ఓటు హక్కు ఒకేలా ఉంది. మరికొన్ని న్యాయమైన ఆర్థిక కోర్కెల కోసం పౌరులను సంఘటితం చేయగలిగితే అప్పుడు వారంతా కుల బంధంకన్నా ఉన్నతమైన, విశాలమైన బంధం ఏర్పరచుకుం టారు. అటువంటి సార్వత్రిక ఆర్థిక హక్కుల సాధన కోసం జరిగే కృషి అస్థిత్వ రాజకీయాల అడ్డుగోడలను అధిగమిం చగలుగుతుంది. అప్పుడు కులబంధాలు వెనక్కిపోతాయి. అదే సమయంలో సాంఘిక అసమానతలను తొలగించేందుకు ప్రస్తుతం అమలు జరుగుతున్న రిజర్వేషన్లు వంటి ప్రత్యేక ఏర్పాట్లను ఆ కృషి ఏ మాత్రమూ ఆటంకపరచదు. అటువంటి సార్వత్రిక హక్కులను, తక్షణం ఆచరించగలిగినవిగా ఉండే వాటిని కొన్నింటిని ఇక్కడ పేర్కొనవచ్చు. ఆహార హక్కు ఉపాధి హక్కు, ప్రభుత్వం ద్వారా ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు పొందే హక్కు ప్రభుత్వం ద్వారా ఉచితంగా నాణ్యమైన విద్య పొందే హక్కు, వృద్ధాప్యంలోను, అంగ వైకల్యంతో ఉన్నప్పుడు పెన్షన్ పొందే హక్కు - ఈ హక్కులను అందరికీ వర్తించేలా చేయడం కోసం తగిన ఆచరణ చేపట్టాలి. ఈ డిమాండ్లు వివిధ కుల సమూహాలకు చెందిన ప్రజలందరినీ ఒక దగ్గరకు చేర్చి వారు కుల బంధాలను అధిగమించగలిగే చైతన్యాన్ని పొందేట్లు చేయ గలవు. ఐతే, అందరికీ ఉపాధి హక్కు కల్పించినంత మాత్రాన, హీనమైన పనుల్లో, ఎక్కువ కష్టం ఇమిడివున్న పనుల్లో తక్కువ కులాలవారే ఎక్కువ మంది కుదురుకునే పరిస్థితి మారిపోదు. ఆ సమస్యను పరిష్కరించడానికి అన్ని స్థాయిలలోనూ రిజర్వేషన్లు అమలు చేయడం ఉపాధి హక్కు అందరికీ కల్పించిన అనంతరం అవశ్యం అవుతుంది. అంటే సార్వత్రిక హక్కుల సాధన కోసం జరిగే కృషి రిజర్వేషన్ల అవసరాన్ని ఏ మాత్రమూ నిరాకరించదు. పైగా అటువంటి సార్వత్రిక హక్కుల కోసం జరిగే కృషి వలన అగ్ర కులాలలోని సామాన్యులు సైతం రిజర్వే షన్ల విషయంలో తమ ప్రతికూలతను అధిగమించగలుగుతారు. ఆ క్రమంలో కుల బంధాలను అధిగమించగలిగే ఐక్యత ప్రజల్లో ఏర్పడుతుంది.

అక్కడి నుంచి కుల నిర్మూలన దిశగా సాగిపోవడం తేలిక అవుతుంది. అదే అస్థిత్వ రాజకీయాలనే అనుసరించితే అవి కులాల నడుమ శతృత్వాన్ని పెంచి కుల నిర్మూలనను అసాధ్యం చేస్తాయి. ఇక్కడ ఇంకొక ముఖ్యమైన విషయాన్ని పరిశీలించాలి. భారతీయ సమాజంలో కేవలం కులం అనేదే లోపం అని అనుకోరాదు. మతపరమైన చీలికలు ఉన్నాయి. ముఖ్యంగా ఇవి హిందువులు, ముస్లింల నడుమ పెరుగుతున్నాయి. ఈ మధ్య కాలంలో ఇవి ముఖ్య భూమికను పోషిస్తున్నాయి. ఈ మత విభేదాలు, కుల సమస్య రెండూ ముడిపడి వున్నవే. భారత ఉప ఖండంలో ముస్లింలుగా మారిన వారిలో అత్యధికులు తక్కువ

కులాల నుండి వచ్చిన వారే. మతం మారినప్పటికీ వారింకా చాలా అథమస్థాయిలోనే కొనసాగుతున్నారు. వేరుగా చూడబడుతున్నారు. పైగా, హిందువులలోని తక్కువ కులాల వారికి ఉన్న మాదిరిగా రిజర్వేషన్లు వారికి లేవు. ఇస్లాం మతం కులాన్ని అధికారికంగా గుర్తించదు కనుకనే ఈ పరిస్థితి ఉంది. అందువల్లనే, విద్యాస్థాయి వంటి సామాజిక ప్రమాణాలను చూసినప్పుడు ముస్లింలు దళితులకన్నా దిగువ స్థాయిలోనే ఉన్నారు. ఇటీవల కాలంలో కొన్ని రాష్ట్రాలలో వెనుకబడ్డ కులాల కోటాలో అంతర్భాగంగా ముస్లింలకు కూడా రిజర్వేషన్లు కల్పించారు. (మొత్తం అన్ని రకాల రిజర్వేషన్ కోటాలూ కలిపి ఒక శాతాన్ని మించి ఉండకూడదని సుప్రీంకోర్టు ఆదేశించింది) కాని హిందూత్వవాదులు నిరంతరం హిందువులలో ముస్లిం-వ్యతిరేకతను రెచ్చగొడుతున్నందు వలన ముస్లింలకు ఉద్దేశించిన రిజర్వేషన్లు అమలు కాకుండా మిగిలిపోయాయి. పౌరులు అనే భావనను, ఆ పౌరులందరికీ కులం, మతంతో నిమిత్తం లేకుండా కొన్ని హక్కులు – ఓటు హక్కు ఉన్నట్టే –సార్వత్రికంగా ఉండాలన్న డిమాండ్ను ముందుకు తెచ్చినట్టైతే మనం ముందుకు పురోగమించడానికి దారి ఏర్పడుతుంది.

ఇదంతా చర్చించడం అంటే ఒకానొక 'పౌరుల పోరాటం' అనేదానిని తెచ్చి దానిని వర్గ పోరాటానికి ప్రత్యామ్నాయంగా చూడమని చెప్పడం ఎంతమాత్రమూ కాదు. అసలు వర్గ పోరాటం అనేదే ప్రతీ పౌరుడికీ కొన్ని కనీస ప్రమాణాలతో కూడిన పాదార్థిక, సాంస్కృతిక జీవితం గ్యారంటీ చేయడం లక్ష్యంగా ముందుకు సాగాలి అని మాత్రమే సూచిస్తున్నాను.

ఇక్కడ ఒక ప్రశ్న తలెత్తుతుంది. ఈ సార్వత్రిక హక్కులు అనేవి ఆచరణ సాధ్యమేనా ? దీనికి సమాధానం ఒక్కటే. ఇప్పుడున్న పరిస్థితుల్లో మనం వేటిని మార్చగలం, ఏవి కొనసాగాలని భావిస్తున్నాం అన్నది ముందు మనం తేల్చుకోవాలి. ప్రస్తుత పరిస్థితుల్లో వేటినీ మార్చలేము అని అనుకుంటే అప్పుడు మనం ప్రస్తుత పరిస్థితులలోనే సర్దుకుని పోవలసి వుంటుంది. కుల బంధాలను, మతపరమైన బంధాలను అధిగమించి ఒక విశాలమైన ఐక్యత ప్రాతిపదికన సంబంధాలను పెంపొందించాలి అనుకున్నప్పుడు మనకి ఆటంకాల గురించిన భావన మారుతుంది. ఒక ఉదాహరణతో ఇక్కడ స్పష్టత వస్తుంది. మనం పైన సూచించిన సార్వత్రిక ఆర్థిక హక్కులను అమలు చేయడానికి అదనంగా ప్రజాధనం అవసరం అవుతుంది. అదే సమయంలో కొన్ని హక్కుల అమలు మొదలైతే మరికొన్ని హక్కుల అమలుకు దారి ఏర్పడుతుంది.

ఉదాహరణకు : అందరికీ ఉచితంగా నాణ్యత కల విద్యను పొందే హక్కు అమలైతే అప్పుడు అందుకోసం ఉపాధ్యాయులను పెద్ద సంఖ్యలో నియమించడం అనివార్యం. వారితోబాటు పాఠశాలల నిర్వహణకు, స్కూలు భవనాల నిర్మాణానికి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, కార్మికులు అవసరం. ఐతే ఇందు కోసం మన జీడీపీలో 8 నుండి 10 శాతం వరకూ ఖర్చు చేయాలి. మన జీడీపీతో పోలిస్తే వసూలయే పన్ను నిష్పత్తి ప్రపంచంలోని ఇతర దేశాలకన్నా చాలా తక్కువ. అందుచేత పన్నులను పెంచడం పెద్ద సమస్య కాబోదు. ఐతే, పన్నులను పెంచితే మదుపుదారుల విశ్వాసం దెబ్బ తింటుంది వంటి వాదనలు తెచ్చి పన్నులను పెంచకుండా అడ్డుకోవడం నయా-ఉదారవాద వ్యవస్థలో జరుగుతోంది. అందుచేత మనకి పైన చెప్పుకున్న సార్వత్రిక హక్కుల సాధనలో ప్రధాన ఆటంకంగా ఈ నయా-ఉదారవాద విధానాలు ఉంటాయి. ఈ విధంగా పన్నుల పెంపును అడ్డుకోవడం అన్యాయం. అందరికీ వర్తించే కొన్ని సార్వత్రిక హక్కులను అమలు చేయడానికి తగిన వనరులు ఈ వ్యవస్థలో లభిస్తున్నప్పుడు ఆ హక్కుల అమలుకు ప్రాధాన్యత ఇవ్వడంకన్నా, ప్రస్తుత ఆర్థిక విధానాల కొనసాగింపుకే ప్రాధాన్యతనివ్వడం ఏ మాత్రమూ న్యాయం కాదు. అందుచేత ప్రస్తుత ఆర్థిక విధానాల చట్రం లోపలే మనం ఏ హక్కు కోసమైనా కృషి చేయాలి అని అనుకుంటే మనం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేం.

ఇంకో విషయం కూడా చెప్పాలి. నయా ఉదారవాదం.. ప్రభుత్వం ఒక్క మదుపుదారుల విశ్వాసాన్ని పరిరక్షించే విషయంలో తప్ప వేరే దేనిలోనూ జోక్యం చేసుకోకూడదని నిర్దేశిస్తుంది. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో స్వత: సిద్ధంగానే ఒక ప్రాప్తకాలజ్ఞత ఉంటుంది. ప్రభుత్వం జోక్యం చేసుకోకూడదని నియంత్రించడంతో ఆ ప్రాప్తకాలజ్ఞత పూర్తి స్థాయిలో విజృంభిస్తుంది. దాని ఫలితంగా అసమానతలు తీవ్రంగా పెరుగుతాయి. కార్మికుల వేతనాలు కనీస అవసరాలను తీర్చగలస్థాయి కన్నా తక్కువకే కుదించబడతాయి. నిరుద్యోగసైన్యం సైజు అంతకంతకూ పెరిగిపోతూవుంటుంది. మరొక వైపు కార్మికుల ఉత్పాదకత పెరుగుతూవుంటుంది. దాని వలన ఉత్పత్తి అయిన సంపదలో పెట్టుబడిదారుల వాటా అంతకంతకూ పెరిగిపోతూవుంటుంది.

ఇప్పటికే అనేక సామాజిక, ఆర్థిక అసమానతలతో ఉన్న మన దేశంలో ఆ అసమానతలను మరింతగా పెంచే విధానాలను అదనంగా తెచ్చి బలవంతంగా అమలు చేయడం జరుగుతోంది. దాని ఫలితంగా కులపరంగా, మతపరంగా అసమానతలు పెరిగిపోతాయి. అన్ని రకాల అసమానతలకూ వ్యతిరేకంగా నిలిచి అంతరాలను తగ్గించాలనుకున్నప్పుడు అటువంటి కృషిలో భాగస్వాములయ్యే వారు నయా-ఉదారవాద వ్యవస్థను మనం అధిగమించలేమని భావించరాదు. అలా భావిస్తే కష్టజీవుల మధ్య ఎటువంటి విశాల ఐక్యతనూ నిర్మించడం సాధ్యం కాదు. అది సామాజిక ఘర్షణలు మరింత తీవ్రం కావడానికే దారితీస్తుంది. ❑

# మహా కుంభమేళాలో హిందూ రాష్ట్ర రాజ్యాంగం

- సంజయ్ పాండే

'హిందూ రాష్ట్ర రాజ్యాంగం' కింద సనాతన ధర్మ అనుయాయులకు మాత్రమే ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ఉంటుంది. 'రాజ్యాంగం' 'హిందూ' న్యాయ వ్యవస్థను అమలు చేయడానికి వీలు కల్పిస్తుంది. 'అఖండ హిందూ రాష్ట్రం' యొక్క 'రాజ్యాంగం' 'సిద్ధంగా' ఉంది. ఫిబ్రవరి 3న ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో 'బసంత్ పంచమి' సందర్భంగా ప్రజలకు నివేదన చేయబడుతుంది. ప్రతి పౌరుడికి సైనిక సేవను తప్పనిసరి చేస్తూ 'ఏకసభ్య' శాసనసభను 'రాజ్యాంగం' అందిస్తుంది. వ్యవసాయ ఆదాయాన్ని 'రాజ్యాంగం'లో పూర్తిగా పన్ను నుండి మినహాయిం చారు. సనాతన ధర్మ అనుచరులకు మాత్రమే 'హిందూ రాష్ట్ర' యొక్క 'రాజ్యాంగం' కింద ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ఉంటుంది మరియు భారత ఉపఖండంలోని మతాల అనుచరులు-జైన మతం, సిక్కు మతం, బౌద్ధమతం-మాత్రమే ఎన్నికలలో ఓటు వేయడానికి అనుమతి ఉంటుంది. 'ధర్మ సంసద్'(పార్లమెంట్) సభ్యులకు నియోజకవర్గ భత్యం, సాధారణ భద్రత మరియు వాహనం మాత్రమే లభిస్తాయి. 'ధర్మ సంసద్ అభ్యర్థులు వేద గురుకుల (పాఠశాల) విద్యార్థి అయి ఉండాలి' అని 'రాజ్యాంగం'ను రూపొందించిన కమిటీతో సంబంధం ఉన్న సాధువులలో ఒకరు అన్నారు. 'హిందూ రాష్ట్ర' యొక్క 'రాజ్యాంగం'లో వెనకకు పిలిచే హక్కు' కూడా ఉంది. దీనికోసం ధర్మ సంసద్ నియోజకవర్గంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహి స్తుంది. నియోజకవర్గం నుండి కనీసం 50 వేల మంది సంతకం చేసిన ప్రతిపాదనను వారి ప్రతినిధిని తిరిగి పిలిపించడం కోసం పంపితే 'రాజ్యాంగం' 'హిందూ' న్యాయ వ్యవస్థను అమలు చేయడానికి వీలు కల్పిస్తుంది. 'ప్రతి ఒక్కరికీ త్వరిత న్యాయం హామీ ఇవ్వబడుతుంది. శిక్ష వ్యక్తిని సంస్కరించే లక్ష్యంతో ఉంటుంది. తప్పుడు ఆరోపణలు చేసే వారికి శిక్ష విధించబడు తుంది' అని ఆ సాధువు అన్నారు. దేశంలో ప్రాచీన వేద గురుకుల విద్యా విధానాన్ని అనుసరిస్తారు మరియు అన్ని ఆంగ్ల మాధ్యమ పాఠశాలలను గురుకులాలుగా మారుస్తారు. 'రాష్ట్ర ఆర్థిక సహాయంతో నిర్వహిస్తున్న అన్ని మదర్సాలు (ఇస్లామిక్ పాఠశాలలు) మూసివేయబడతాయి' అని ఆయన జోడించారు. 'రాజ్యాంగం' ఏకపత్నీ వ్రతత్వాన్ని అమలుచేస్తుంది. కుల వ్యవస్థ ను రద్దు చేస్తుంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థను ప్రోత్సహిస్తుంది. 'హిందూ రాష్ట్రం' ఏర్పాటుకు సహాయం చేయాలని ప్రపంచం లోని ఇతర దేశాలకు సాధువులు విజ్ఞప్తి చేస్తారని శాంభవి పీఠాధీశ్వర్ ఆనంద్ స్వరూప్ అన్నారు. 'క్రైస్తవులు, ముస్లిలు మరియు యూదుల దేశాలు ఉన్నాయి. కానీ హిందువుల దేశం లేదు' అని ఆయన అన్నారు. ఈ 'రాజ్యాంగం' మరే ఇతర మతానికి వ్యతిరేకం కాదని, అన్ని మతాల ప్రజలు దేశంలో స్వేచ్ఛగా జీవించగలరని ఆయన స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న నిపుణులచే 'హిందూ రాష్ట్ర' యొక్క 'రాజ్యాంగం' రూపొందించబడిందని అన్నారు. 501 పేజీల 'రాజ్యాంగం' నాలుగు పీఠాల శంకరాచార్యుల ఆమోదం పొందిన తర్వాత కేంద్రానికి పంపబడుతుంది. 'రామ రాజ్యం, మను స్మృతి మరియు చాణక్యుడి అర్థశాస్త్రం' నుండి స్వీకరించబడిన సూత్రాలపై 'రాజ్యాంగం' ఆధారపడి ఉంటుంది. ❑

# మార్క్స్, అంబేద్కర్లవి కుల, వర్గ జమిలి సిద్ధాంతాలే

**(58వ పేజీ తరువాయి)** శ్రమ, పెట్టుబడి) పేరిట ప్రముఖంగా ప్రచురించారు. (ఆనంద్ తెలతుంబడే పుస్తకం నుండి). పైవిశ్లేషణ రెండు విషయాలు తెలియచేస్తుంది. ఒకటి, అంబేద్క ర్‌కి భారతదేశంలోని వర్గ వ్యవస్థపై మంచి అవగాహన ఉందని, రెండు, భారత దేశంలో కులము వర్గము కలిసే ఉన్నాయని, అం దుకే జమిలి పోరాటాలే శరణ్యమని అంబేద్కర్ ఉద్దేశమని, కాబ ట్టి, మార్క్స్ గానీ అంబేద్కర్ గానీ ఏదో ఒక ఇరుకు మార్గంని ఎంచుకొని తమ చుట్టూ గిరులు గీసుకోలేదు. గిరులు గీస్తున్న వారు ఆయా మహా వృక్షాల పేర్లు చెప్పుకొని స్వార్థ రాజకీయాలు నడిపే కొందరు దళారీలు మాత్రమే. ఈ దళారీ, స్వప్రయోజన రాజకీయాల ఉచ్చులో పడి పీడిత ప్రజలు శాశ్వత బంధీలు కారా దు. ఇప్పటికైనా లాల్ నీల్ ప్రజాస్వామిక శక్తులు ఐక్యకార్యా చరణ వైపు, మైత్రి భావంతో ముందుకు కదిలితేనే, ప్రస్తుత ఫాసిస్టు మనువాద వ్యవస్థకు ముకుతాడు వేయగలరు. అంతి మంగా దోపిడీ రాజ్యానికి సమాధి కట్టగలరు. అలాగే, లాల్ నీల్ మైత్రి అనేది కేవలం భావజాలం, ప్రచారాలకే పరిమితం అయితే ఎలాంటి ఉపయోగం లేదు. అది కార్యరూపం కూడా దాల్చాలి. ఉభయ శిబిరాలూ పోరాటాల్లోకి దిగితేనే అనుభవాల్లోంచి మైత్రి సాధ్యం అవుతుందనేది గమనించడం అవసరం. లాల్ నీల్ మైత్రి వర్ధిల్లాలి. ❑

# భారత ప్రప్రథమ సామాజిక తత్వవేత్త



కులం పేరుతో తరతరాలుగా, అన్నిరకాలుగా అణచివేతకు గురైన బడుగు, బలహీనవర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడి, సాధికారత కల్పనకు కృషి చేసిన మహనీయుడు మహాత్మ జోతిరావ్ గోవిందరావు పూలే. సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘ సేవకుడైన పూలే మహారాష్ట్రకు చెందినవాడు. ఆయన భారతదేశంలో కుల వివక్షకు వ్యతిరేకంగా కోట్లాది ప్రజానీకం కోసం, పేద, అణగారిన, అంటరాని ప్రజల హక్కుల కోసం పోరాడాడు. మహారాష్ట్రలోని పూణే జిల్లాలో ఖానవలి ప్రాంతంలో 1827 ఏప్రిల్ 11న జ్యోతిరావ్ పూలే జన్మించాడు. ఆయన తండ్రి గోవిందరావు మొదట్లో కూరగాయలు అమ్మేవాడు. కాలక్రమేణా పీష్వా పరిపాలనా కాలంలో పూల వ్యాపారం చేయడం వల్ల వారి ఇంటి పేరు పూలేగా మార్పు చెందింది. జ్యోతిరావ్‌కి సంవత్సరం వయస్సు రాకుండానే తల్లి తనువు చాలించింది. ఏడేళ్ల వయస్సులో పూలే ఒక మరాఠీ పాఠశాలలో ప్రాథమిక విద్యనభ్యసించాడు. తరువాత చదువు మానివేసి వ్యవసాయంలో తండ్రికి సాయంగా ఉండేవాడు.

అతి తక్కువ కాలం పాఠశాలకు వెళ్లినప్పటికీ పూలేకి పుస్తక పఠనం పట్ల ఆసక్తి ఎక్కువ. ప్రతిరోజూ నిద్రకు ఉపక్రమించే ముందు లాంతరు వెలుతురులో చదువుకునేవాడు. జ్యోతిరావ్‌కు చదువుపట్ల ఆసక్తిని గమనించిన ఒక ముస్లిం టీచర్, ఇంటి ప్రక్కనే ఉండే ఒక క్రైస్తవ పెద్దమనిషి జ్యోతిరావ్ తండ్రిని

## జ్యోతీరావ్ పూలే భారతమాత సేవలో..

జ్యోతీరావ్ పులే లేదా జ్యోతీబా గోవిందరావ్ పులే, మహారాష్ట్రకు చెందిన సంఘ సంస్కర్త. థామస్ పెయిన్ రాసిన రైట్స్ ఆఫ్ మాన్ ఆయన్ని చాలా ప్రభావితం చేసింది. ఇతడు స్త్రీలకు విద్య నిషేధమని ప్రవచించిన మనుస్మృతిని తిరస్కరించాడు. మానసిక బానిసత్వం నుండి శూద్రులను కాపాడాలని త్రితీయ రత్న అనే నాటకాన్ని రచించాడు. ప్రీస్ట్ క్రాఫ్ట్ ఎక్స్పోజ్ అనే గ్రంధాన్ని సమాజంలో పాతుకుపోయిన ఆచారాలను, మూఢ నమ్మకాలను ఖండించాడు. 1872లో గులాంగిరి అనే గ్రంధాన్ని ప్రచురించాడు. ఈయన స్థాపించిన సంస్థ – సత్య శోధక్ సమాజ్. జ్యోతీరావ్ గోవిందరావ్ పులే మహారాష్ట్ర లోని సతారా జిల్లాలోని యాదవ కులానికి చెందిన కుటుంబంలో జన్మించాడు. ఈయన తండ్రి గోవిందరావు ఒక కూరగాయల వ్యాపారి. తల్లి ఇతనికి 9 నెలల పసిప్రాయంలోనే చనిపోయింది. ప్రాథమిక విద్య పూర్తి చేసుకున్న వెంటనే పులే చదువు మానేసి తన తండ్రికి వ్యవసాయ పనుల్లో సహాయపడాల్సి వచ్చింది. 12 సంవత్సరాల వయసులోనే వివాహం చేశారు. ఇతని భార్య సావిత్రి పులే.

గాంధీజీకంటే ముందే మహాత్మునిగా జన నీరాజనాలందుకున్న జోతీరావు పూలే దంపతులు నివసించిన భవనం నేటికీ పుణేలో నిలిచి ఉంది. ఆ భవనంలోని హాలులో పూలే, సావిత్రిబాయి పూలే, సాహూ మహారాజ్‌ల సరసన మరో నిలువెత్తు చిత్రపటం కనబడుతుంది. ఆయన పూలే సామాజిక సంస్కరణోద్యమానికి తుదిశ్వాస వరకు చేదోడువాదోడై నిలిచిన జాయా కారాడీ లింగు తెలంగాణం కన్న తెలుగుబిడ్డ. నైజాం సంస్థానంలో న్యాయమూర్తి పదవిని కాదనుకొని తండ్రిలా భవన నిర్మాణవృత్తిని చేపట్టారు. పుణే, ముంబైలలో సామాజిక ఉద్యమకారునిగా సుప్రసిద్ధులైన ఆయన పుణే మునిసిపాలిటీకి ఎన్నికై, 12 ఏళ్ల ప్రజాప్రతినిధిగా పనిచేశారు. కారాడీ లింగువంటి సహచరుడు దొరకడం పూలే అదృష్టమని చరిత్రకారులు అంటారు. కారాడి లింగు తండ్రి జాయా ఎల్లప్ప లింగు ముంబైలో భవన

ఒప్పించి ఆయన విద్యాభ్యాసం కొనసాగేలా చేశారు. ఆయన 1841లో స్కాటిష్ మిషన్ పూణేలో నడుపుతున్న పాఠశాలలో చేర్పించాడు. సదాశివ భిల్లాల్ గోవింద్ అనే బ్రాహ్మణునితో పూలే పరిచయం జీవిత కాల స్నేహంగా మారింది. చిన్నప్పుడే మానవ హక్కుల ప్రాథమిక సూత్రాలపట్ల జ్ఞానాన్ని సంపాదించాడు పూలే. జ్యోతిరావ్‌కు చిన్నప్పటి నుంచే శివాజీ అంటే అభిమానం ఎక్కువ. శివాజి, జార్జ్ వాషింగ్టన్‌ల జీవిత చరిత్రలు ప్రభావితం చేయడం వల్ల దేశభక్తి, నాయకత్వ గుణాలు అలవాటయ్యాయి. థామస్ రచించిన 'మానవ హక్కులు' పుస్తకం అతని ఆలోచనలను ప్రభావితం చేసింది.

అమెరికా స్వాతంత్ర్య పోరాటం ఆయనను ప్రభావితం చేయడమే కాకుండా మానవత్వపు విలువలటైన స్వేచ్ఛ, సమానత్వం గురించి లోతుగా ఆలోచింపచేసింది. గులాంగిరి, పూణే సత్య సోధక సమాజ నివేదిక, తృతీయ రత్న, ఛత్రపతి శివాజీ, రాజ్‌భోంస్లే యాంఛ, విద్యాకాథాతిల్, బ్రాహ్మణ్ పంతోజి మొదలటైనవి మహాత్మ పూలే ముఖ్య రచనలు. 13 ఏళ్ళ ప్రాయంలో జోతిరావ్‌కి 9 సంవత్సరాల సావిత్రితో వివాహం జరిగింది. విద్యాభ్యాసం పూర్తయినతర్వాత ఆయన తన కుటుంబ వ్యాపారమైన పూలవ్యాపారం ప్రారంభించాడు. 1848లో జరిగిన తన బ్రాహ్మణ స్నేహితుడి వివాహంలో పూలే, బిసి 'మాలి' కులానికి చెందిన వాడవడం వల్ల కులవివక్షకు గురయ్యాడు. ఆ క్షణం నుండి కుల వివక్షపై పోరాడాలని నిశ్చయించుకున్నాడు. కుల విధానంలో ఆయన బ్రాహ్మ ణులను విమర్శించడమే కాకుండా సమాజంలో వారి ఆధిపత్యాన్ని వ్యతిరేకించాడు. జ్ఞాన సంపదకు అందరికీ అవకాశం ఇవ్వ పోవడానికి ఆయన అభ్యంతరం తెలిపాడు.

బ్రాహ్మణాధిపత్యాన్ని వ్యతిరేకించవలసినదిగా సామాన్యుల్ని ప్రోత్సహించాడు. సమాజంలో సగభాగంగా ఉన్న స్త్రీలు అభివృద్ధి చెందకపోతే సమాజం అభివృద్ధి చెందదని పూలే భావించాడు. అందువల్ల స్త్రీలు విద్యావంతులు కావాలని నమ్మాడు. ఇతరులకు ఆదర్శంగా ఉండాలని ముందుగా తన భార్య సావిత్రిని పాఠశాలకు పంపాడు. 1948 ఆగస్టులో బాలికలకు పాఠశాల స్థాపించాడు. ఈ పాఠశాలలో అన్ని కులాలకు ప్రవేశం కల్పించడం, అస్పృశ్యులకు బోధించవలసి రావడంతో ఉపాధ్యాయులు ఎవరూ ముందుకు రాలేదు. చివరకు జ్యోతిరావ్‌పూలే తనభార్య సావిత్రి సహాయంతో పిల్లలకు పాఠాలు బోధించేలా చేశాడు. పాఠశాల నిర్వహణలో అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నాడు. కొంతకాలం పాఠశాలను నిర్వహించలేక మూసివేశాడు. అయినా పట్టు వదలక తన మిత్రులైన గోవింద్, వల్వేకర్‌ల సహాయంతో పాఠశాలను పునఃప్రారంభించాడు. క్రమంగా ఆదరణ పెరగడంతో 1851-52లో మరో రెండు పాఠశాలలు స్థాపించాడు. బ్రిటిష్ ప్రభుత్వం ప్రాథమిక విద్యను నిర్లక్ష్యం చేయడాన్ని పూలే విమర్శించేవాడు.

ఆనాడు సమాజంలో బాల్య వివాహాలు సర్వసాధారణంగా జరిగేవి. ముసలి వారికి ఇచ్చి పెళ్లి చేయడంవల్ల చిన్నతనంలోనే మహిళలు వితంతువులయ్యేవారు. వీరు మళ్లీ వివాహం చేసుకోవడానికి సమాజం అంగీకరించేది కాదు. అందువల్ల వితంతు పునర్వివాహాలను గురించి పూలే ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చాడు. స్వయంగా వితంతువులకు వివాహాలు జరిపించాడు. 1864లో గర్భస్రావ వ్యతిరేక కేంద్రాన్ని స్థాపించి, వితంతువులైన గర్భిణీ స్త్రీలకు అండగా నిలిచాడు. దేశంలోనే ఇటువంటి కేంద్రం స్థాపించడం ఇదే మొదటిసారి. 1872లో ఈ కేంద్రంలో జన్మించిన ఒక బ్రాహ్మణ వితంతువు కుమారుణ్ణి పూలే దత్తత తీసుకున్నాడు. 1873 సెప్టెంబర్ 24న సత్య శోధక

నిర్మాణ కాంట్రాక్టరు. పూలే కొంత కాలం భవన నిర్మాణ కాంట్రాక్టరుగా పనిచేశారు. అప్పుడే ఆయనకు ముంబై తెలుగు ప్రజల పితామహునిగా ప్రసిద్ధులైన కాంట్రాక్టరు రామయ్య వెంకయ్య అయ్యవారితో పరిచయమైంది. వెంకయ్య పూలేను ముంబైకి ఆహ్వానించి, తోటి కాంట్రాక్టర్లతో కలిసి సత్యశోధక సమాజాన్ని విస్తరింపజేయడానికి, పాఠశాలలను ఏర్పాటు చేసి నడపడానికి ఆర్థిక, హార్దిక సహాయాలను అందించారు. సత్యశోధక సమాజానికి తెలుగువారి విరాళాలే ప్రధాన ఆర్థిక వనరుగా ఉండేవి. వెంకయ్య ఇల్లే అనాథ బాలల ఆశ్రమంగా ఉండేది. వారిని గొప్పవిద్యావంతులుగా, సత్యశోధకులుగా చేసిన ఘనత వెంకయ్యదే. ఆయన రచించిన 'ఈశ్వరునికి ప్రార్థన'ను మరాఠీలోని తొలి వ్యంగ్యరచనగా గుర్తించాలని సాహిత్య చరిత్రకారులు కోరుతున్నారు. పూలే ప్రసిద్ధ గ్రంథం 'గులాంగిరి'ని ఆయనే ప్రచురించారు.

వెంకయ్య కుటుంబ సభ్యులు సావిత్రీబాయి జీవిత చరిత్రను కూర్చి, మూడుమార్లు ప్రచురించారు. సాహు మహారాజ్‌కు ఆంతరంగిక సలహాదారుగా పనిచేసిన భాస్కర్‌రావ్ జాదవ్, రామయ్య తీర్చిదిద్దిన ఆణిముత్యాలలో ఒకరు మాత్రమే. జాదవ్ సత్యశోధక ఉద్యమ నాయకునిగా అన్ని వర్గాల గుర్తింపును పొందారు. పూలే ఆలోచనల వ్యాప్తికి, కార్మిక సమస్యలను వెలుగులోకి తేవడానికి కృషిచేసిన 'దీనబంధు' పత్రికకు ఆయనే వెన్నెముకై నిలిచారు. పూలేకు అడుగడుగునా అండదండగా నిలిచి, ఆయన తర్వాత కూడా సత్య శోధక సమాజ ఉద్యమాన్ని కొనసాగించిన వారిలో తెలుగు వారి పాత్ర అద్వితీయమైనది. మరుగున పడిపోయిన వారి చరిత్రను వెలుగులోకి తేవడం ద్వారానే పూలే ఆలోచనాధారతో మనకున్న వారసత్వ బంధాన్ని పునరుద్ధరించుకోగలం. ఆ ప్రయత్నానికి పూలే జయంతే నాంది కావాలి.

సమాజాన్ని ఫూలే స్థాపించాడు. దేశంలోనే ఇది మొట్టమొదట సంస్కరణోద్యమం. శూద్రులను బ్రాహ్మణ చెర నుండి కాపాడటమే ఈ ఉద్యమ ముఖ్య ఉద్దేశ్యం. ఈ సంస్థ సభ్యులు పురోహితుల అవసరం లేకుండానే దేవుణ్ణి పూజించేవారు. కుల, మత వివక్ష లేకుండా ప్రతి ఒక్కరికి సభ్యత్వం కల్పించేవారు. వేదాలను పవిత్రంగా భావించడాన్ని ఫూలే వ్యతిరేకించాడు. విగ్రహారాధనను ఖండించాడు.

1891లో ప్రచురించిన సార్వ జనిక్ ధర్మపుస్తక్ మత, సాంఘిక విషాయలపట్లై ఫూలే అభిప్రాయాలను తెలియచేస్తుంది. స్త్రీ, పురుషుల మధ్య లింగ వివక్షను ఫూలే విమర్శించాడు. సమానత్వం, స్వేచ్ఛ, ఐకమత్యంతో కూడిన సమసమాజాన్ని కాంక్షించాడు. 1853లో వితంతు మహిళల అనాథ శిశువుల కోసం సేవాసదనం ప్రారంభించాడు. ఈ తరహాలో ఒక భారతీయ హిందువు ఒక సంస్థను ప్రారంభించడం అదే మొదటిసారి. 1968లో తన ఇంటి దగ్గరున్న స్నానాల తొట్టి వద్ద స్నానం చేసేందుకు అంటరాని వారికి కూడా అనుమతి ఇచ్చాడు. 1869లో 'పౌరోహిత్యం యొక్క బండారం' పుస్తక రచన చేశాడు. 1871 సత్యశోధక సమాజం తరపున 'దీనబంధు' వార పత్రిక ప్రారంభించాడు. 1880లో భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమ పితామహుడు లొఖాండేతో కలసి రటైతులను, కార్మికులను సంఘటితం చేసేందుకు ప్రయత్నించాడు. 1873లో 'గులాంగిరి'(బానిసత్వం) పుస్తకం ప్రచురించాడు.

దీనిలో బ్రాహ్మణీయ అమానుష సూత్రాలను, శూద్రులు– అతి శూద్రులపై బ్రాహ్మణీయుల క్రూర వైఖరిని ఫూలే తులనాత్మకంగా పరిశీలించాడు. సహపంక్తి భోజనానికి సంసిద్ధత ప్రకటించాడు. 1883 కల్టివేటర్స్ విప్‌కార్డ్ (సేద్యగాడిపై చెర్నకోల) పుస్తక రచన పూర్తిచేశాడు. ఏప్రిల్‌లో బొంబాయిలో జరిగిన ఒక సమావేశంలో పుస్తకాన్ని వినిపించాడు. 1885లో సత్యసారాంశం ప్రచురించాడు. ఇదే సయంలో ప్రచురితమైన తన హెచ్చరిక(వార్నింగ్) బుక్‌లెట్‌లో ప్రార్థనా సమాజం, బ్రహ్మ సమాజం తదితర బ్రాహ్మణీయ సంస్థల మీద తీవ్ర విమర్శలు చేశాడు. 1891లో ఫూలే రచించిన 'సార్వజనిక్ సత్యధర్మ పుస్తకం' ఆయన మరణాంతరం ప్రచురితమైంది. ఇందులో చాతుర్వర్ణ వ్యవస్థను దుయ్యబట్టాడు. మధ్యపానాన్ని వ్యతిరేకించి, 1888లో మున్సిపాలిటీ అధ్యక్షునికి మద్యం షాపులను మూసి వేయవలసిందిగా ఉత్తరం వ్రాశాడు. ఆయన వ్రాసిన 33 ఆర్టికల్స్ గల సార్వజనిక్ సత్యధర్మ పుస్తకంలో కుటుంబ సృష్టి నియమాల గురించి వివరిస్తూ ప్రపంచం మొత్తాన్ని ఒక కుటుంబంగా వ్యక్తీకరించాడు.

ప్రతి ఒక్కరికి సమాన స్వేచ్ఛ హక్కును తీర్మానించాడు. 1879 చివర్లో 'దీనబంధు' వారపత్రికను ముంబయిలో స్థాపించాడు. దీనిలో రైతులు, కార్మికుల సమస్యలు, బాధలు వివరించేవాడు. భారతదేశంలో కులం గురించిన సిద్ధాంతాన్ని శాస్త్రీయంగా రూపొందించిన తొలి దార్శనికుడు ఫూలే. దుర్మార్గమైన కుల వ్యవస్థ సమూలంగా నిర్మూలన కావాలని ఆయన కోరుకున్నాడు. ఆయన ఆలోచనలరి, విశ్లేషణకి 'గులాంగిరి' అద్దం పడుతుంది. మనుషుల చుట్టూ బ్రాహ్మణులు చుట్టిన దాస్యపు సంకెళ్ళ నుండి వాళ్ళు విముక్తికావడం, తోటి శూద్రుల నిజపరిస్థితిని బహిర్గతం చేయడం, ఇవి ఏకాస్త విద్యనటైనా నేర్చిన శూద్రసహోదరుల కర్తవ్యాలు. ప్రతిగ్రామంలోనూ శూద్రులకు పాఠశాలలు కావాలి. కానీ వాటిలో బ్రాహ్మణ ఉపాధ్యాయులు మాత్రం వద్దన్నాడు.

దేశమనే దేహానికి శూద్రులు ప్రాణం, రక్తనాళాలు వంటి వారు అని చెప్పాడు. మహాత్మాఫూలే ఆధునిక భారతదేశ సమాజంలో అందరికంటే గొప్ప శూద్రుడు. హిందూ సమాజంలో అగ్రకులాల వారి బానిసలుగా బతుకుతున్న కిందికులాల వారిలో తమ బానిసత్వంపట్ల ఆయన చైతన్యం రగిలించారు. సామాజిక ప్రజాస్వామ్యం సాధించటం భారత దేశానికి ముఖ్యమనే మహత్తర సందేశాన్ని అందించిన మహాత్మ ఫూలే తన గురువు అని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రకటించారు. దక్షిణాఫ్రికా జాతీయోద్యమ నాయకుడు నెల్సన్ మండేలా భారతదేశ పర్యటనకు వస్తున్న సందర్భంలో ఆ మహనీయునికి సమర్పించాలని నిర్ణయించుకొన్న గౌరవ కానుక మహాత్మ ఫూలే రచించిన మహత్తర గ్రంథం 'గులాంగిరి'.

సమాజంలో వెనుకబడిన వర్గాల ప్రజలు, మహిళల అభ్యున్నతి కోసం చేసిన కృషికి ఆయనకు 'మహాత్మ' బిరుదు ఇచ్చారు. దీర్ఘకాల జబ్బుతో బాధపడుతూ నిరంతరం సమ సమాజ స్థాపన కోసం పరితపించిన మహాత్మ ఫూలే 1890 నవంబరు 28న కన్నుమూశాడు. కుల వివక్షను ఎదిరించి బడుగు వర్గాల హక్కుల కోసం కృషి చేసిన మహనీయునిగా ఫూలే పేరు చరిత్రలో నిలిచిపోతుంది. ఆ మహనీయ సామాజిక తత్వవేత్తకు నిజమైన నివాళి అర్పించడమంటే– ఫూలే రచనలను ప్రాథమిక విద్యా స్థాయి నుండి విశ్వవిద్యాల యస్థాయివరకు పాఠ్యాంశాలుగా చేర్చాలి. విశ్వ విద్యాలయాల్లో మహాత్మ ఫూలే విద్యా పీఠాన్ని ఏర్పాటు చేయాలి. ఫూలే జయంతి, వర్ధంతుల నాడు (ఏప్రిల్ 11, నవంబరు 28) సెలవుదినాలుగా ప్రకటించాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో, హాస్టళ్లల్లో మహాత్మఫూలే చిత్రపటాలను అలంకరించాలి. ప్రతి జిల్లాలో ఫూలే బిసిభవనాలను నిర్మించాలి. విగ్రహాలను ఆవిష్కరించాలి. బిసి రిజర్వే షన్లను జనాభా దామాషా ప్రకారం 50 శాతానికి పెంచాలి. చట్టసభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి. దేశ జనగణనలో బిసి కులాల లెక్కలు విడివిడిగా సేకరించాలి. సామాజిక న్యాయం, సామాజిక ప్రజాస్వామ్యాలను స్థాపించాలి. ❑

**(సాక్షి సౌజన్యంతో)**

# సమన్యాయ సత్యశోధకుడు

విప్లవ ప్రతిబంధకమైన ఈ కుల వ్యవస్థ, వర్గ వ్యవస్థను తనలో అంతర్భాగంగా ఇముడ్చుకుంది. కనుక ఈ దేశంలో కుల-వర్గ వ్యవస్థలు ఉన్నాయన్న సత్యాన్ని శోధించిన పూలే-అంబేద్కర్‌లను విమర్శించడం గుడ్డితనమే అవుతుంది. పూలే-అంబేద్కర్ అవగాహనతో నూతన ప్రత్యామ్నాయ సమన్యాయ పోరాటాల్ని నిర్మించడమే పూలేకి అర్పించే నిజమైన నివాళి.

మహాత్మ జ్యోతిరావు పూలే ఈ దేశ ఆధునిక యుగ వైతాళికుడు, నిజమైన పునరుజ్జీవనోద్యమ పితామహుడు. పూలేను పునరుజ్జీవనోద్యమ పితామహుడిగా, ఆధునిక యుగ వైతాళికుడిగా మనం ఎందుకు చెప్పుకోవాల్సి వస్తుందో ఆయన జీవిత చరిత్రను పరిశీలిస్తే అర్థమవుతుంది. భారతదేశంలోని శూద్రాతి శూద్రులు (దళిత బహుజన, ఆదివాసీ గిరిజన, ముస్లిం మైనార్టీలు) బ్రాహ్మణీయ కుల వ్యవస్థలో బానిసలుగా ఉన్నారనీ, వీరు, అమెరికాలోని నల్లజాతి బానిసల్లాగా ఉన్నారని చెప్పిన మొట్టమొదటి వ్యక్తి పూలే. అందుకే బ్రాహ్మణీయ కుల వ్యవస్థలోని బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడడమొక్కటే మన ముందున్న ప్రథమ కర్తవ్యంగా పూలే ప్రకటించారు.

బడుగులు బానిసలుగా ఉండడానికి బ్రాహ్మణీయ దోపిడీ, అణచివేత, వివక్షలను అర్థం చేసుకోకపోవడం, అందుకు చదువు లేకపోవడమే మూలమని పూలే గ్రహించాడు. 1834-38 కాలంలో పూలే మరాఠీ పాఠశాలలో చేరి విద్యాభ్యాసం ప్రారంభించారు. శూద్రులు, అగ్రవర్ణాలకు సేవలు చేయాలేగానీ విద్య నేర్చుకోకూడదని బ్రాహ్మణులు ఆయన తండ్రి గోవిందరావును బెదిరించి పూలే చదువు (బడి) మాన్పిస్తారు. బ్రాహ్మణుల కుటిలోపాయాల్ని గ్రహించిన పూలే తన తండ్రి స్నేహితులైన ముస్లిం, క్రిస్టియన్ మతస్థులైన వారి ద్వారా లహుజీబువామాంగ్ వద్ద క్రిస్టియన్ మిషనరీ (ఇంగ్లీష్) పాఠశాలలో మళ్లీ విద్యాభ్యాసం ప్రారంభిస్తారు. బ్రాహ్మణ విద్యార్థులకన్నా ప్రతిభావంతుడవుతాడు.

తరగతి గదిలో స్నేహం ఏర్పడ్డ ఓ బ్రాహ్మణ విద్యార్థి పూలేను తన వివాహానికి ఆహ్వానిస్తాడు. ఆ వివాహానికి హాజరైన పూలేను బ్రాహ్మణులు, మాలి కులస్తుడని తెలుసుకొని బ్రాహ్మణులతో పెళ్లిలో సమానంగా నడవడమా? అంటూ, శూద్రుడంటూ పూలే ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తారు. అలా అవమానించిన బ్రాహ్మణుల దోపిడీ, అణిచివేతల్ని బహిర్గతపర్చాలని కంకణం కట్టుకొని 1848లో పూణేలో మొట్టమొదటగా దళిత (అస్పృశ్యులకు) బాలికలకు పాఠశాల నెలకొల్పారు. ఆ తదనంతరం 1851లో మరో రెండు పాఠశాలల్ని నెలకొల్పారు. శ్రామిక ప్రజల కోసం 1855లో 'రాత్రి బడి'ని స్థాపించారు. ఇలా బ్రాహ్మణ వ్యతిరేకతతో శూద్ర వర్గంలోని అతిశూద్రులకు విద్యావ్యాప్తి చేయడంతో బెంబేలెత్తిన బ్రాహ్మణులు 1849లో పూలేను ఆయన తండ్రి చేత కుటుంబం నుంచి బహిష్కరింపజేస్తారు. అయినా కలత చెందక మొక్కవోని ధైర్యంతో, పట్టుదలతో మరింత ముందుకు పోతాడు. జీవిత భాగస్వామి సావిత్రీభాయి సహకారంతో బ్రాహ్మణ వ్యతిరేక సాంస్కృతిక పోరాటాల్ని నిర్మిస్తారు పూలే.

పూలే కేవలం శూద్ర వర్ణాల్లో అణిచివేతకు గురౌతున్న కులాల ప్రజల పక్షాన పోరాడటమే కాకుండా, అగ్రవర్ణ వితంతువుల పునర్వివాహానికి గొప్ప కృషి చేశారు. 1873లో 'గులాంగిరి' 'సేద్యగాని చర్మకోల' అనే గ్రంథాల్ని రచించారు. 'దీనబంధు' అనే పత్రికను స్థాపించి పురోహితులు చేసే దోపిడీలపై భావజాల ప్రచారాన్ని మరింత ప్రచారం చేశారు. భావజాల ప్రచారాన్ని కార్యాచరణగా మార్చడానికి 1870లో 'సార్వజనిక్ సభ', 1873 సెప్టెంబర్ 24న 'సత్యశోధక సమాజం సంస్థ'ను స్థాపించారు. దీనికన్నా ముందు బ్రిటిష్ వలస వాదులకు '1882లో హంటర్ కమిషన్‌కు' శూద్రాతి శూద్రులకు చదువు చెప్పించాల్సిన అవసరం ఉందని నివేదికలిచ్చి, అస్పృశ్యుల కోసం బ్రిటిష్ వారితో పాఠశాలల్ని ఏర్పాటు చేయించారు. సామ్రాజ్యవాద కోణంలోనైతే ఇది మనకు వ్యతిరేకమైనది. భారతదేశంలో కులం కోణంలో చూస్తే అస్పృశ్యులు వేల సంవత్సరాలుగా విద్యకు, విజ్ఞానానికి దూరం చేయబడుతున్నారు కనుక కులం కోణంలో అనుకూలమైనది. 1873-75 సంవత్సరాలలో బ్రాహ్మణ పురోహితులు లేకుండా జున్నార్ పరిసర ప్రాంతాల్లో సుమారు 40 గ్రామాల్లో పెళ్లిళ్లు నిర్వహించి, ప్రత్యామ్నాయ వివాహ సంస్కృతికి బీజం వేశారు.

బ్రాహ్మణీయ కుల వ్యవస్థ వ్యతిరేక కార్యక్రమాలే కాకుండా బ్రిటీష్ వలసవాదులకు వ్యతిరేకంగానూ, శూద్ర వర్గంలోని రైతాంగంపై బ్రాహ్మణ-వైశ్య (బాట్‌జీ-షేట్‌జీ)ల వడ్డీ దోపిడీ, శ్రమ దోపిడీల రూపాల్ని, వారి బండారాన్ని బయటపెట్టారు. అంతేకాదు, తను ఏర్పాటు చేసిన సత్యశోధక సమాజ్ సంస్థ సారథ్యంలో తన సహచరుడు ఎన్.ఎమ్.లోఖండేతో బొంబాయి నూలు మిల్లులలోని శూద్రాతిశూద్ర **(మిగతా 76వ పేజీలో)**

# క్రాంతి జ్యోతి సావిత్రిబాయి ఫూలే

కనీస హక్కులకైనా నోచుకోకుండా బానిసలుగా బతుకుతున్న మహిళా లోకానికి బాసటగా నిలిచింది క్రాంతి జ్యోతి సావిత్రిబాయి ఫూలే. 1848లో మొదటి బాలిక పాఠశాలను ఏర్పాటు చేసి అఖండ భారతదేశంలో ఫస్ట్ టీచర్ అయింది. ఆనాటి సమాజంలో దళితులకు, స్త్రీలకు విద్య నేర్పడం ధర్మవిరుద్ధం. బాలికలు పాఠశాలకు రావడాన్ని తిరుగుబాటు చర్యగా భావించేవారు. అలాంటి సనాతన కట్టుబాట్లను ఎదిరించి పట్టువదలక దళితులకు, బాలికలకు విద్యనందించిన చదువుల తల్లి సావిత్రిబాయి. ప్రతి మనిషి గౌరవంగా, సాధికారికంగా విద్య ఒక ఆవశ్యకవనరు అని బలంగా నమ్మింది. కనుకనే కింది కులాల వారికి, మహిళలకు చదువు ఎంత ముఖ్యమో నొక్కి చెప్పింది. చెప్పడమే కాదు 18 పాఠశాలలు స్థాపించి విద్యావ్యాప్తికి విశేషంగా కృషి చేసింది.

ఉపాధ్యాయురాలిగా సావిత్రి బాయి చేపట్టిన కార్యక్రమాలు ఈనాటికి ఆచరణీయం. మధ్యాహ్న భోజన పథకం, అందరికీ విద్య, పేరెంట్స్ మీటింగ్‌లు, సంక్షేమ హాస్టళ్లు, బోర్డింగ్ స్కూళ్లు వంటివి 170 ఏళ్లకు పూర్వమే ఆమె విజయవంతంగా అమలు చేసింది. దళితవాడల్లో గుడిసె గుడిసెకు తిరిగి విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించే ఈనాటి 'బడి బాట' కార్యక్రమాన్ని ఆనాడే చేసింది. డ్రాపవుట్లను తగ్గించడం కోసం బడికి రాని విద్యార్థుల కుటుంబాలతో మాట్లాడేది. విద్యార్థుల గైర్హాజరీకి కారణాలు తెలుసుకునేది. ఒక వేళ పిల్లలు అనారోగ్యానికి గురయితే ఆసుపత్రికి తీసుకెళ్లేది. పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు స్కూళ్లల్లో మధ్యాహ్న భోజనం నిర్వహించేది. ఆమె స్థాపించిన సూళ్లు హాస్టళ్ల మాదిరిగా పనిచేసేవి.

### తొలి తరం స్త్రీవాది

సమాజంలోని పాతకాలపు భావజాలంపై తీవ్ర పోరాటం చేసింది సావిత్రిబాయి. బ్రాహ్మణ విధవరాండ్లకు గుండు కొట్టించి చీకటి గదుల్లో బంధించే అనాచారానికి వ్యతిరేకంగా ఉద్యమించింది. వితంతు పునర్వివాహాలు జరిపించింది. పూజారులు లేకుండా వివాహాలు జరిపించింది. దేశంలో మొట్టమొదటిసారి ఉమెన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఏర్పాటు ఆమెదే. మహిళా సేవా మండలి ఏర్పాటు చేసి, కులాలకతీతంగా మహిళలకు స్థానం కల్పించింది. స్త్రీల అస్తిత్వాన్ని ఉనికిని ప్రశ్నార్థకం చేస్తున్న సమస్యలపై బాధిత మహిళలకు అండగా నిలబడింది. బాల్య, యవ్వన వితంతువులపై జరిగే సెక్సువల్ హెరాస్మెంట్‌ను ఖండించింది. అత్యాచారాలతో గర్భవతులైన వారు అబార్షన్లకు, ఆత్మహత్యలకు పాల్పడేవారు. అలాంటివారిని చూసి చలించిన సావిత్రిబాయి 'బాల్యహత్య ప్రతిబంధక గృహ'ను స్థాపించి ఆశ్రయం కల్పించింది. కాశీబాయి అనే వితంతువు కుమారుడిని దత్తత తీసుకొని యశ్వం తరావుగా పేరుపెట్టి పెంచుకుంది. అతడు డాక్టరయిన తర్వాత మాలి కులానికి చెందిన యువతిని కులాంతర వివాహం చేసుకున్నాడు.

అంటరానితనంలో మగ్గే బడుగుల కోసం తన ఇంట్లోనే బావిని తవ్వించి మంచినీళ్లు అందించింది. పుణే నగరం తీవ్ర కరువు బారినపడి తిండి గింజలకు కటకటలాడుతుంటే, 52 ఆహార కేంద్రాల ద్వారా వేలాది మందిని ఆదుకున్న అన్నపూర్ణ. ఈ ఆహార కేంద్రాలు హాస్టళ్లుగా పనిచేశాయి. సావిత్రిబాయిని చాలామంది మహాత్మ జ్యోతిరావు పూలే భార్యగానే గుర్తిస్తారు. కాని, ఆమె భర్త అడుగుజాడల్లో నడుస్తూనే స్వతంత్ర వ్యక్తిత్వం కలిగిన మహిళ. భర్త మరణానంతరం ఆయన ఆశయాలను అన్నీ తానై కొనసాగించింది. సత్యశోధక్ సమాజ్‌కి తొలి విరాళం ఇచ్చిన మొదటి వ్యక్తి.

సావిత్రిబాయి తొలి తరం రచయిత్రి, కవయిత్రి. ఈమె రచించిన కవితల సంపుటి 'కావ్యఫూల్', 'బవన్న కాశి', 'సంబోధి రత్నాకరం'. వంటివి, జ్యోతిబాకి రాసిన లేఖలు చదివినట్లయితే విద్యపట్ల, సమాజం పట్లగల నిబద్ధతకు అద్దం పడతాయి. జ్యోతిబా పూలే రాసిన అనేక వ్యాసాలను ప్రచురించి సంపాదకు రాలిగా కూడా తన ప్రతిభను చాటుకుంది. భర్త మరణించిన ప్పుడు సనాతన ఆచారాలకు విరుద్ధంగా ఆయన చితికి నిప్పు పెట్టి నిజమైన అభ్యుదయ భావాలు కలిగిన సంస్కరణ వాదిగా సావిత్రిబాయి చరిత్రలో స్థిరస్థాయిగా నిలిచిపోయింది. చివరకు మహారాష్ట్రలో ప్లేగు వ్యాధి ప్రబలినపుడు తన కొడుకుతో కలిసి పేదలకు వైద్య సహాయం అందించింది. ❑

**(వెలుగు సౌజన్యంతో)**

# తొలి ఆధునిక కవయిత్రి సావిత్రి బాయి ఫూలే



- కాత్యాయనీ విద్మహే

ఆత్మగౌరవ చేతన సావిత్రిబాయి జీవిత చోదక శక్తి. కుల అస్తిత్వ చేతన స్త్రీ అస్తిత్వ చేతన రెండూ ఆమెలో సంపూర్ణ వికాసనం పొందాయి. భారతదేశ సంఘ సంస్కరణ ఉద్యమ చరిత్రలో రాజరామమోహన్ రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, కందుకూరి వీరేశలింగం పంతులు వంటి వాళ్ల పేర్లతోపాటు జ్యోతిరావ్ ఫూలే వినబడటానికి, కనబడటానికి చాలా కాలమే పట్టింది. దానికి కారణం ఆయన కులం ఒక్కటే కాదు. కుల వ్యవస్థనే ప్రశ్నిస్తూ ఆయన చేపట్టిన సంస్కరణోద్యమ స్వభావం మౌలికంగా భిన్నమైనది కావటం మరొక ముఖ్య కారణం. ఇక మహా పురుషుల భార్యలుగా స్త్రీలు ఎప్పుడూ చరిత్ర నీడలలో మిగిలిపోయే వాళ్లే. ఫూలే భార్య సావిత్రిబాయి గురించి చాలాకాలం తెలియకపోవటానికి అది అదనపు కారణం.

స్త్రీల, దళిత బహుజనుల అస్తిత్వ ఉద్యమాలు ఊపందుకొన్న 1980ల నుంచి సమాజపు చివరి అంచులకు నెట్టివేయబడిన వర్గాల ఆలోచనా విధానాలతో, ఆచరణ కార్యకలాపాలతో దేశీయ సామాజిక రాజకీయార్థిక చరిత్రను, సంస్కృతిని సమగ్రం చేయటం, సరిచేయటం అన్న లక్ష్యాలతో సాగుతున్న కృషిలో భాగంగానే జ్యోతిరావ్ ఫూలే గురించి, ఆయన భార్య సావిత్రి బాయి ఫూలే గురించి మనకు తెలిసి వచ్చింది. సావిత్రి బాయి ఫూలేది జ్యోతిరావ్ ఫూలే భార్యగా అతని సంస్కరణోద్యమ కార్యకలాపాలకు సహాయకారి పాత్ర మాత్రమే కాదు. అన్నిం టిలో ఆమె సహ భాగస్వామి. భారతదేశంలో మహిళా ఉద్యమ చరిత్రకు తాత్విక భూమికను ఏర్పరచిన క్రియాశీల శక్తి. ఆలోచ న, ఆచరణ మనిషి మౌలిక లక్షణాలు అని ఆమె నమ్మింది. ఆమె ఆలోచనలు కవిత్వ రూపంలో ఆవిష్కృతం అయ్యాయి. ఆచరణ ఆమె జీవితం. సావిత్రిబాయి జీవితం, కవిత్వం రెండూ వర్తమా నాన్ని అర్థం చేసుకొనటానికి, భవిష్యత్తును నిర్మించుకొనటానికి ఉత్ప్రేరకాలు. 2018 జనవరి 3 సావిత్రి బాయి ఫూలే 187వ జయంతి. తల్లి లక్ష్మి. తండ్రి ఖండోజి నెవేష్ పాటిల్. 1831లో పుట్టిన సావిత్రికి 9 ఏళ్ల వయసులో అంటే 1940లో జ్యోతిరావ్ ఫూలేతో పెళ్లి అయింది. స్త్రీలకు పెళ్లే విద్య, భర్తే గురువు, ఇంటి పనులే అభ్యసన విషయాలు అని మనుస్మృతి చెప్పింది. పెళ్లితో భర్త ఆమెకు గురువు అయిన మాట నిజమే కానీ ఆయన చెప్పిన విద్య పతివ్రతా ధర్మాలను, గృహిణీ ధర్మాలను బోధించి స్త్రీలను ఇంటికి కట్టి పడవేయటానికి మనుస్మృతి ఉద్దేశించిన విద్య మాత్రం కాదు. స్త్రీకి ఏ జ్ఞాన విద్యనైతే మనుస్మృతి



నిరాకరించిందో దానిని ఆమె పొందటానికి తొలి విద్యా గురువు అయ్యాడు ఆయన. తరువాత మిత్రులు సఖరం యాశ్వంత్ పరాంజపే, కేశవ్ శివరాం భావేల్కర్ల సహాయ సహకారాలతో అహమ్మద్ నగర్‌లో ఫరార్స్ సంస్థలోను, పూనాలో ఎం.ఎస్ మిచెల్ నిర్మల్ స్కూల్‌లోనూ సావిత్రి బాయి చదువుకొనటానికి, టీచర్స్ ట్రైనింగ్ పూర్తి చేయటానికి అవకాశాలను కల్పించాడు జ్యోతిరావ్ ఫూలే. ఆ రకంగా 1848లో ఆయన పూనాలో భీడే వాడాలో ఆడ పిల్లల బడి ప్రారంభించే నాటికి అతని సంస్కరణ భావాలకు తగిన చైతన్యంతో సామాజిక కార్యాచరణలో చేదోడు వాదోడుగా నిలబడగల వ్యక్తిగా ఆమె ఎదిగింది.

1870లో ఏ స్త్రీ విద్య కోసం అయితే ఆంధ్రదేశంలో వీరేశ లింగం పంతులు ఒక మహోద్యమాన్ని నడిపాడో, కాలక్రమంలో బాలికా పాఠశాలలో బోధకులుగా స్త్రీలు ఉండాలని గుర్తించాడో, ఆ మేరకు వితంతు మహిళలు విద్యావంతులై, ఉద్యోగాలలోకి రావాలని ఆశించాడో దానికి మూడు దశాబ్దాలకు ముందే అంత కంటే ఉన్నత రూపంలో జ్యోతిరావ్ ఫూలే ఇంట ప్రారంభమైన 'నిశ్శబ్ద విప్లవం' సావిత్రీ బాయి అనే శక్తిగా ఆవిష్కృతమైంది. మహారాష్ట్ర సంస్కరణోద్యమంలో ఆమెది కీలక పాత్ర. కుల లింగ వివక్షలకు వ్యతిరేకంగా పనిచేసే పురుషులనే సహించని సంప్రదాయ సమాజం కుటుంబ పరిధిని దాటి సమాజాన్ని మరమ్మతు చేయటానికి బయటకు వచ్చే స్త్రీలను అసలే సహించ లేదు. అనేక రంగాలలో స్త్రీల కృషిని నిరోధించటానికి, నియం త్రించటానికి వ్యతిరేక ప్రచారాలకు, భౌతిక దాడులకు, అత్యాచా రాలకు పాల్పడుతున్న పితృస్వామిక అధికార వికృతి మనకు తెలిసిన వర్తమానమే. కొదురుపాక రాజవ్వ నుండి, భన్వారీ బాయి, సోనె సోరీ వరకు ఎందరో అందుకు ఉదాహరణలు.

అలాంటప్పుడు నూటా యాభై సంవత్సరాల క్రితం ఆడ పిల్లలకు చదువు చెప్పటానికి, అందులోనూ శూద్ర, అతి శూద్ర బాలికల కు చదువు చెప్పటానికి బయటకు వచ్చిన సావిత్రీ బాయిని రాళ్లు రువ్వి, కుళ్లిన కూరగాయలు, పేడ విసిరి వేధించారంటే ఆశ్చర్య పడవలసినది ఏమీ లేదు. వాటిని తన పనికి అభినందనగా విసరబడే పూలగా భావిస్తూ, వాళ్ల చర్యల వల్ల పాడై పోయిన చీరను మార్చుకొనటానికి మరొక చీర కూడా వెంట తీసుకువెడుతూ ఆమె కనబరచిన, నిబద్ధత, సంసిద్ధత గొప్ప విలువలు. సంప్రదాయ సమాజ నియమాలను తిరగరా యాలని జ్యోతిరావ్ పూలే ప్రారంభించిన ఉద్యమం తండ్రికే భరించరానిదై ఇంట్లో స్థానం లేదని బెదిరిస్తే సావిత్రి బాయి పూలే భర్త మార్గమే తన మార్గమని అతని తో కలిసి అడుగు బయటపెట్టింది. అప్పటికి ఆమె వయసు పద్దెనిమిది. అప్పటి నుండి 1897లో 66 ఏళ్ల వయసులో మరణించే వరకు సావిత్రీ బాయిది సమాజ జీవితమే. ఆడ పిల్లలకు, మహర్, మాంగ్ వంటి అతిశూద్ర పిల్లలకు మాత్రమే కాదు, వయోజనులకు పాఠశాలలు ఏర్పరచటం నుండి, వ్యవసాయ కార్మికులకు (1855) రాత్రి బడి నడపటం వరకు మహారాష్ట్రలో ఆధునిక విద్యా వ్యాప్తికి ఆమె చేసిన కృషి గణనీయమైంది.

బాలికల చదువుకు బడులు పెడితే సరిపోదని, ఆడపిల్లలను బడికి పంపటానికి ఇంటి నుండి బడికి ఉండే దూరం ఒక అవరోధం అని గుర్తించి, దానిని అధిగమించటానికి ఇంట్లోనే ఒక వసతి ఏర్పాటు చేసి స్వయంగా వాళ్ల ఆలనా పాలనా చూసుకొన్న వ్యక్తి సావిత్రి బాయి. దయ, ప్రేమ గల తల్లిగా ఆమె ఆ పిల్లల హృదయాలలో చోటు సంపాదించుకొన్నది. అంటరా నివారిగా బహిష్కృతులు అయిన వారి కోసం తన ఇంటి ఆవరణలో బావి తవ్వించినా (1868) కరువు పీడితులకు ఉచిత భోజన శాలలు ఏర్పరచి (1877) ఆకలి తీర్చినా, ప్రాణాలనే బలిపెట్టి ప్లేగు వ్యాధిగ్రస్తుల స్వస్థతకు పాటు పడినా అన్నీ ఆ దయ, ప్రేమ గల తల్లి లక్షణం వల్లనే. ఆ స్వభావానికి అద్భుత మైన వ్యక్తీకరణ 2017 జనవరిలో సావిత్రీ బాయి పూలే 186వ జయంతికి గూగుల్ హోం పేజీకి తల మీదనుండి కప్పు కున్న చీర ఉయ్యాలగా చేసి విశాలంగా విస్తరించిన రెండు చేతుల మధ్య ప్రపంచాన్నంతా పొదువు కొని లాలిస్తున్నట్లుగా రూపొందించిన స్త్రీ మూర్తి.

సావిత్రి బాయి పూలే శూద్ర అతిశూద్ర బాలబాలికల విద్యకు ఎంత పాటుపడిందో, అంతగానూ స్త్రీల సమస్యలపై పని చేసింది. సర్వ మానవ హక్కులు అనుభవిస్తూ స్త్రీలు ఆత్మ గౌరవంతో జీవించటాన్ని గురించి కలకంటూ 1852లో మహిళా సేవా మండల్ స్థాపించింది. ఆనాడు సమాజంలో ఉన్న అతి తీవ్ర సమస్య వితంతు స్త్రీల దుర్భర జీవితం. అదీ బ్రాహ్మ ణులలోనే ఎక్కువ. సావిత్రీ బాయి చేపట్టిన సంస్కరణోద్యమం లో తొలుత సంబోధించ బడింది అదే. వితంతువులకు తల గొరిగించటం అమానుష ఆచారంగా ఆమె భావించింది. బాధిత స్త్రీలను దానికి వ్యతిరేకంగా సమీకరించటం తక్షణం జరిగే పని కాదు అని ఆమెకు తెలుసు. కానీ తమ శరీరం మీద స్త్రీల హక్కులను ఖబ్జా చేసిన సంప్రదాయం పట్ల అవసరమైన అసహనం ఆమెను నిలువ నీయలేదు. మంగలి వారిని ఏకం చేసి 'వితంతు స్త్రీల తలలు గొరగము' అనే నినాదంతో సమ్మె కట్టించి తన నిరసనను ఆ రకంగా ప్రకటించింది.

'తలలు బోడులైన తలపులు బోడులౌనా' అని వేమన అన్నట్లుగా వితంతు స్త్రీల తల వెంట్రుకలు తీసేసినంత మాత్రాన వాళ్లలో వయో సహజ వాంఛలను అరికట్టడం ఎవరివల్లా సాధ్యం కాదు. అది వాళ్లను చాటు మాటు లైంగిక సంబంధాలకు ప్రేరేపిస్తుంది. యవ్వనానికి వచ్చి పుట్టింటినో అత్తింటినో ఆశ్రయం పొందిన వితంతువులు ఇంట్లోని పురుషులో, తరచు ఇంటికి వచ్చిపోయే బంధుమిత్ర పురుషులో పెట్టె ప్రలోభాలకులోనై గర్భవతులు కూడా అవుతుంటారు. బిడ్డలను కనాలని ఉన్నా పరువు ప్రతిష్ఠలకు లోబడి, లోక నిందకు వెరచి గర్భస్రావాలకు పాల్పడతారు. నాటు మందులతో అధిక రక్తస్రావంతో మంచాన పడి యాతన అనుభవిస్తుంటారు. గర్భస్రావ ప్రయత్నాలు ఫలించకపోతే నవమాసాలు మోసి కన్న బిడ్డలను అక్రమ సంతానంగా అవమానించే సామాజిక పరిస్థి తులలో పెంచి పోషించుకొనే స్థోమత లేక వదిలించుకొనటమో వధించటమో వాళ్లకు అనివార్యమవుతుంది. శిశు హత్య నేరం నిరూపితమై శిక్షించబడే స్త్రీలు కూడా ఉంటారు.

1881లో సూరత్‌లో ఉరి శిక్ష విధించబడిన విజయలక్ష్మి అనే బ్రాహ్మణ స్త్రీ అలాంటి స్త్రీలలో ఒకరు. ఆ కోర్టు తీర్పును తప్పు పడుతూ స్త్రీకి ఒక రకంగా, పురుషుడికి ఒక రకంగా అమలవు తున్న నీతిని, న్యాయాన్ని తీవ్రంగా విమర్శిస్తూ 1882 లో తారాబాయి షిండే 'స్త్రీ పురుష తులన' అనే వ్యాసం రాసింది. అది ఆనాడు గొప్ప సంచలనం కలిగించిన విప్లవాత్మక చారిత్రక పత్రం. అయితే అప్పటికి 19 ఏళ్లకు పూర్వమే ఈ సమస్య తీవ్రతను గుర్తించి సావిత్రిబాయి కార్యరంగంలోకి దిగటం గమనించదగినది. కాశీబాయి అనే బ్రాహ్మణ వితంతువు బిడ్డను కని లోకానికి భయపడి చంపి బావిలో వేసిన నేరానికి జీవిత ఖైదు శిక్ష విధించబడగా అందుకు కలవర పడిన జ్యోతిరావ్ పూలే దంపతులు అలాంటి ఒంటరి స్త్రీలకు ఆశ్రయం కల్పించి పురుళ్లు పోసి నైతిక మద్దతు ఇయ్యటానికి 1863లోనే 'బాలహత్యా ప్రబంధక్ గృహ్' ఏర్పాటు చేయటం విశేషం.

'అండమానులో జీవిత ఖైదు తప్పించుకొనటానికి మార్గం' అంటూ ఆ సంస్థ ను గురించి ప్రచారం చేసిన తీరులో స్త్రీల పట్ల వాళ్ళ ఆర్తి కనబడుతుంది. ఈ ప్రసవాలయంలో వదిలి వేయబడిన శిశువుల కోసమా అన్నట్లుగా ఆ సంవత్సరమే

అనాథ శరణాలయం వాళ్లు ఏర్పాటు చేశారు. జ్యోతిబా పూలే సాహచర్యంలోనూ, ఆయన మరణానం తరం అలుపెరుగని, ఆడంబరం లేని కార్యనిర్వహణాదక్షురాలుగా సావిత్రి బాయి సార్ధక జీవితం గడిపింది. నిజమైన అర్థంలో ఆమె 'జాతిమాత'. సావిత్రిబాయి ఆధునిక ఇంగ్లీష్ విద్యను అందుకున్న తొలి మహిళ, తొలి ఉపాధ్యాయురాలు, తొలి మహిళా సంఘ సంస్కర్త మాత్రమే కాదు తొలి ఆధునిక కవయిత్రి కూడా. 1854లో ఆమె కవితా సంపుటి 'కావ్యపూలే' ప్రచురించబడింది. అంటే అధ్యాప కురాలిగా, సంస్కరణోద్యమ కార్యకర్తగా జీవితం ప్రారంభించిన తొలి నాళ్ల నుంచే ఆమె కవితా వ్యవసాయమూ ప్రారంభం అయిందని అనుకోవచ్చు. కావ్య పూలేలో పూలే అన్న మాటకు పూలు అన్న అర్థం ఉన్నా పూలే కుటుంబానికి సంబంధించిన కావ్యంగా కూడా దీనిని గుర్తించవచ్చు.పూలే కుటుంబం అంటే జ్యోతిరావ్ పూలే, సావిత్రి బాయి పూలే. ఇద్దరి జీవితాలు ఒకటిగా పెనవేసుకున్న చరిత్ర. సావిత్రీ బాయి 'ఆత్మ కథనం'గా ప్రారంభమై 'సావిత్రి జ్యోతిబా పూలే సంభాషణ'గా ముగిసిన కావ్యం ఇది ఇరవై ఇరవై రెండేళ్ల వయసుకే కుల లింగ వివక్షతల గురించి, మత తాత్వికత గురించి, చరిత్ర గురించి, విద్య గురించి సావిత్రీబాయి ఆలోచనలలో వచ్చిన పరిణతకి అవగాహనలోని స్పష్టతకు సంస్కరణ ఉద్యమ నిబద్ధతకు నిదర్శనం ఈ కావ్య సంపుటి.

కావ్య పూలేలో 38 కవితలు ఉన్నాయి. మొదటి కవిత ఆత్మ కథనం. సావిత్రిబాయి బొంబాయి ప్రెసిడెన్సీలో సతారా జిల్లాలోని నయా అనే గ్రామంలో పుట్టింది. ఆ గ్రామ గౌరవ గీతం ఈ కవిత. ఆ గ్రామ వ్యవస్థను గొప్పగా తీర్చిదిద్దిన పాటిల్ కుటుంబంలో పుట్టానని గర్వపడుతుంది. పాడి పంటల, తోట బావుల, తీరొక్క ఫల పుష్ప వృక్షాల సౌందర్య గానంగా సాగు తుంది ఈ కవిత. 'జ్యోతిబాకు వందనాలు' వంటి మరి కొన్ని కవితలు ఈ 'ఆత్మకథనం' కవితకు అనుబంధం అనుకోవచ్చు.

ఇవన్నీ కలిస్తే అది జ్యోతిబా తోటి ఆమె సాగించిన సహ జీవన యానం. జ్యోతిబా సావిత్రిబాయికి ఆరాధ్యుడే కానీ అది సంప్రదాయార్థంలో కాదు. జ్యోతిబాకు ఆమె నమస్కరిస్తుంది. 'పతిదేవుడు' అయినందు వల్ల మాత్రం కాదు. ఆయన సామాజిక జ్ఞాన చైతన్యాల ఔన్నత్యం కారణంగా నమస్కరిస్తుంది. "దీనులు శూద్రులు అతి శూద్రులు / నీ వైపే చూస్తున్నారు / జ్ఞానంతో / మా మనస్సులను నింపండి" అని వేడుకొనటంలో ఆయనతోటి సహ జీవన స్వీయ సంబంధం వల్ల ఆత్మాశ్రయం కావటానికి అవకాశం ఉన్న వస్తువును పరాశ్రయంగా పరివర్తింపచేసిన పరిణత వాణి వినబడుతుంది. 'సుబోధ రత్నాకరం' కవితలోనూ జ్యోతిబాకు నిండు మనస్సుతో నమస్కరిస్తాను అంటుంది సావిత్రి బాయి. భర్త అయినందుకు కాదు, తన కవితకు ప్రేరణ అయినందుకు, పరమానందమైన స్నేహం పంచినందుకు, సద్బుద్ధిని ప్రసాదించినందుకు, చదవటం రాయటం నేర్పినందుకు.. ఆ నమస్కారం.

'జ్యోతిబా' కవిత ఒక రకంగా ఆయన జీవిత చరిత్ర, ఆయనతోటి సహజీవన సంబంధంలో సాగించిన ఉద్యమ యానం. దాని పరమోన్నత స్థాయి 'సావిత్రి-జ్యోతిబా సంభాషణ' అనే కవిత. రాత్రి గడిచి సూర్యోదయం అవుతున్న వేళ కలిగిన ఆనందాన్ని సావిత్రి జ్యోతిబాతో పంచుకొనటం ఈ కవితా వస్తువు. రాత్రి, చీకటి మార్పును సహించని మూర్ఖపు లోకానికి గుర్తు. సూర్యోదయం బాధితుల ఎద మెదడులలో మేల్కొన్న జ్ఞాన చైతన్యాల ప్రతీక. ఆ చీకటి కరిగిపోతూ ఈ వెలుతురు వ్యాపిస్తున్న వేళ అచ్చమైన మనిషి పొందే వెచ్చటి అనుభూతికి వ్యక్తీకరణ సావిత్రి పొందిన ఆనందం. "ఎల్ల కాలం చీకటిగానే ఉండాలని / రాత్రి కోరుకుంటుంది / సూర్యుడి మీద శాపాల వర్షం కురవాలని / మూర్ఖులు కోరుకుంటారు / విష పూరిత కాళరాత్రి గడచిపోయింది. / సూర్య తేజస్సుతో సృష్టి సమస్తం / ప్రకాశవంతమైంది" అంటూ సావిత్రి వైతాళిక గీతం ఆలపిస్తుంది. జ్యోతిబా ముఖంగా దీనమాంగులు మహర్లు అజ్ఞానంతో దుఃఖాన్ని సహించాలి / పశువుల మాదిరి జీవించాలి అని మూర్ఖ సమాజం ఎంత ఒత్తిడి పెట్టినా కొత్త ఆశలతో మేల్కొంటున్న శూద్రుల స్థితిని "గంప క్రింద కమ్మినప్పటికీ / కోడి కూస్తుంది/తెల్లారుతుందనే సంకేతం / జనులకు ఇస్తుంది" అంటూ ఒక గ్రామీణ సందర్భం నుండి వ్యాఖ్యానిస్తుంది. కవిత ముగింపు దగ్గరకు వచ్చే సరికి "శూద్రజనుల ఆకాశంలో జ్యోతిబా ఓ సూర్యుడు" అని ప్రకటిస్తుంది. మనుషులమనే సర్వోన్నత స్థానం పొందటానికి మునుముందుకు సాగాలంటూ ఆ వెలుగులో ఒక ఊరేగింపుకు నాయకత్వం వహిస్తూ రెపరెపలాడే జెండా వలె సావిత్రి బాయి కనిపిస్తుంది.

సావిత్రిబాయి కవిత్వంలో పౌరాణిక పాత్ర బలి చక్రవర్తి ప్రస్తావన తరచు వస్తుంది. ఆత్మ కథనం కవితలో బలి చక్రవర్తిని మహనీయుడిగా పేర్కొని 'ఆ మహాదాత యోద్ధాకు నిజమైన వారసులం' అని సగర్వంగా చెప్పుకొన్నది. 'యోధులు – మహా చక్రవర్తి గౌరవగాథ' అనే కవితలో బలిరాజ్య సిరి సంపదలు, బలి చక్రవర్తి దానధర్మ గుణమూ ప్రశంసిస్తూ బలిని దాన వీరుడుగా పేర్కొన్నది. సాధారణంగా రామరాజ్యం కీర్తనీయ విషయం కాగా సావిత్రి దానికి ప్రత్యామ్నాయంగా బలి రాజ్యాన్ని నిలబెట్టింది. ఎందువల్ల ? పౌరాణిక చరిత్ర దేవతల ప్రయోజ నాల కోసం దానవులను దుర్మార్గులుగా చిత్రించి అణచివేసింది. అణచివేయబడిన వాళ్ల పక్షం ఆమె తీసుకున్నది. దేవ దానవులు ఒకే తండ్రి బిడ్డలు. కశ్యప ప్రజాపతి వాళ్ళ తండ్రి. తల్లులు మాత్రమే వేరు వేరు. అదితి సంతానం దేవతలు. దితి సంతానం దానవులు. ఇంద్ర సింహాసనం మాత్రం ఎప్పుడూ దేవతలదే. దానికోసం సంఘర్షించిన ప్రతి సందర్భంలో దేవతల పక్షాన

విష్ణువు ఏదో ఒక పద్ధతిలో దానవులను అణచివేస్తూ వచ్చాడు. గెలిచినవాళ్లు రాసిన చరిత్రలో దానవులు ప్రతినాయకులు అయినారు. ఈ పౌరాణిక చరిత్రను తిరగరాయటం భారతీయ సమాజంలో సమాన న్యాయం నిరాకరించి బడిన వర్గాల సహజ ఆకాంక్ష అయింది. ఆ క్రమంలోనే సావిత్రి బాయి బలిని దానవీరుడిగా నిలబెట్టి ఉంటుంది. దానధర్మ గుణాలు ఉండి, రాజ్యాన్ని సుసంపన్నం చేసి పాలిస్తున్న బలి తన పదవికి పోటీ అవుతాడని భయపడిన ఇంద్రుడి ప్రయోజనాల కోసం విష్ణువు వామనావతారం ఎత్తాడు. మూడడుగుల నేల దానమడిగి పాతాళానికి అణచివేశాడు. ఆ విష్ణువే రావణాసురుడిని అణచ టానికి రామావతారం ఎత్తాడు. రామరాజ్యం దేవతల ప్రయో జనాలకు ఏర్పడినది కనుక శూద్ర అతిశూద్ర ప్రయోజ నాల కోసం ఆలోచించే సావిత్రి దానికి ప్రత్యామ్నాయంగా బలిచక్రవర్తి రాజ్యాన్ని నిలబెట్టినట్లయింది. సావిత్రి బాయి కవిత్వంలో చరిత్ర గురించిన పదునైన రాజకీయ దృక్పథం కనిపిస్తుంది.

ఛత్రపతి శివాజీ నుండి పీష్వాల మీదుగా బ్రిటిష్ వలస పాలకుల వరకు ఎవరిని గౌరవించినా, ఎవరిని నిరాకరించినా శూద్ర అతిశూద్ర ప్రయోజనాల కోణమే ప్రధానం. 'ఛత్రపతి శివాజీ' అనే కవితను రాసిందామె. 'సుబోధ రత్నాకరం' అనే దీర్ఘ కవితలోనూ అతనిని ప్రస్తావించింది. తాను పుట్టిన సతారా జిల్లాలోనే తనకన్నా రెండు వందల సంవత్సరాల ముందు ఆయనా పుట్టాడన్న అభిమానం, స్వతంత్ర మహారాష్ట్ర రాజ్య నిర్మాత అన్న గౌరవం అందుకు కొంత వరకు కారణం కావచ్చు కానీ అంతకన్నా అతని పాలనా కాలంలో శూద్రులకు, అతిశూద్రులకు దక్కిన గుర్తిపు గురించిన స్పృహ అందుకు ప్రధాన కారణం అనాలి. 1630–1680 మధ్యకాలంలో జీవించి మొఘలులను ఎదిరించి నిలిచిన శివాజీ అతిశూద్ర కులాలుగా సమాజంలో చిన్న చూపుకు గురి అయిన మహర్ మాంగ్‌ల సైనిక శక్తి సామర్థ్యాలను గుర్తించి విస్తృతంగా సైన్యంలో చేర్చుకొన్నాడు. కోటల పైకి యుద్ధానికి వెళ్లే సైన్య నాయకులుగా వాళ్లు ఎన్నో విజయాలు సాధించారు. అది వాళ్లు ఒక ఐక్య శక్తిగా బలపడటానికి కారణం అయింది. ఈ చరిత్ర తెలిసి రాసిన కవితలు సావిత్రి బాయి పూలేవి. "పొద్దు పొద్దునే / ఛత్రపతి శివాజీని స్మరించాలి / శూద్రులు, అతిశూద్రుల ఉద్ధారకుడు" అంటుంది. శివాజీ పాలనలో వాళ్లు పొందిన గౌరవాదరాలు ఆయన తరువాత మరాఠా రాజ్య పతనంతో అంతరించి పోయాయని కలత పడింది.

తదనంతరం అధికారానికి వచ్చిన పేష్వాల రాజ్యాన్ని ఆమె ఏవగించుకొన్నది శూద్ర అతి శూద్రుల జీవితాలను చీకటి యుగంలోకి నెట్టిన కారణంగానే. 'పేష్వాల రాజ్యం' కవిత ఇందుకు నిలువెత్తు సాక్ష్యం. శూద్రులను భయభీతులను చేసిన రాజ్యం అది. "ఉమ్మి కోసం / మెడలో ముంత / దారులలో నడవడం నిషిద్ధం /దుమ్ముతో నిండిన కాలిబాటలలో నడక / అడుగులను తుడిచి వేయటానికి / నడుముకు చీపురు కట్ట"-- ఈ దుర్భర వివక్షపై ఆందోళన ఈ కవితలో ప్రధానం. స్త్రీలను భోగ వస్తువులుగా యథేచ్ఛగా వాడుకొనే పీష్వాల పద్ధతిని చీదరించుకొంది. ఈ విధమైన పేష్వాల అత్యాచార మూర్ఖ పాలన అంతమైనందుకు ఆనందమే కానీ విషాదం, విలాపం ఎక్కడా లేదని అంటుంది సావిత్రి.

'పేష్వాల రాజ్యం' కవిత ముగింపులో "స్త్రీలను, శూద్రులను / పేష్వాల నుంచి విముక్త మొనర్చ" ఆంగ్లేయుల రాజ్యం ఏర్ప డిందని ఒక ఊరట పొందింది సావిత్రి. దానికి కొన సాగింపుగా ఆంగ్లేయుల రాజ్యం ఏర్పడే క్రమంలో శూద్రులు నిర్వహించిన పాత్ర గురించి ఆమె ఈ కవితలో ప్రస్తావించిన విషయం ఆసక్తికరమైనది. "శూద్ర జాతులు సమస్తం/ ఆంగ్లేయుల పాలన ను సమర్ధిస్తాయి/ఆంగ్లేయుల పక్షాన పోరాడటానికి / అన్న దమ్ములవలే అన్నీ జాతుల వారు / సంతోషంగా ముందుకు వచ్చారు/శూద్రులు అత్యాచారి పేష్వాల రాజ్యాన్ని / అంతమొందించి దాని స్థానంలో /తెలివైన ఆంగ్లేయుల అధికారాన్ని స్థాపించారు"– అని ఆ కవితను ముగించింది.

సావిత్రి రాసిన ఈ మాటలు 1818 జనవరి 1వ తేదీనాడు భీమా నది ఒడ్డున కోరే గావ్ అనే వూళ్లో జరిగిన యుద్ధంలో రెండవ పేష్వా బాజీరావు మీద తూర్పు ఇండియా కంపెనీ సాధించిన విజయానికి సంబంధించినవే కావాలి. ఆంగ్లేయుల పక్షాన పోరాడిన సైనిక బెటాలియన్‌లో మహర్లు మరాఠాలు, రాజపుత్రులు వున్నారు. ఆంగ్లేయుల పక్షాన స్వదేశీ రాజుపై యుద్ధానికి వాళ్లు సంతోషంగా సంసిద్ధులు కావటానికి కారణం పేష్వాల కుల వివక్షాపూరిత అణచివేత అత్యాచారాల పాలనలో నిత్యం అనుభవిస్తున్న అంతులేని కష్టాలే. ఆ యుద్ధం పేష్వాల రాజ్యాన్ని కూలదోసి భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్య విస్తరణకు, స్థిరీకరణకు దారితీసింది కనుక అది జాతీయ వాదులకు బాధాకరం కావచ్చు కానీ ఆ భారత జాతిలోనే కుల వివక్షకు గురవుతూ హీనంగా బతకాల్సిన స్థితిలో ఉన్నవారికి అందుకు బలమైన మద్దతుగా ఉన్న రాజ్యం కూలి పోవటం సంతోషాన్ని కలిగించటం సహజమే. అందువల్లనే అది ఆంగ్లేయుల పక్షాన ఆ యుద్ధంలో పాల్గొన్న శూద్రులకు, అతి శూద్రులకు తాము స్వయంగా పేష్వాల మీద సాధించిన విజ యంగా అనిపించి ఉంటుంది. ఆ ఘటన సావిత్రి బాయికి అం త్యంత సమీప గతం. ఆనాడే ఆమె దానిని అట్లా సంభావిం చగలిగింది. అత్యాచారి పేష్వాల రాజ్యాన్ని అంతమొం దించి ఆంగ్లేయుల అధికారాన్ని స్థాపించిన వాళ్లుగా శూద్రుల ఆధిక్యాన్ని నిలబెట్టింది తన కవితలో ఆ తరువాత అరవై ఐదేళ్లకు 1927లో అంబేద్కర్ కోరేగావ్ యుద్ధ స్మారక స్థూపాన్ని సందర్శించి వచ్చినప్పటి నుండి అది దళితుల ఆత్మగౌరవ ప్రకటనకు ఒక

సంకేతం, సందర్శన స్థలం అయింది. ఇప్పుడు 200 ఏళ్లకు అక్కడకు చేరుకొనే దళితుల మీద దాడులు జరిగాయంటే, మహారాష్ట్ర అంతటా హింసాకాండ పెచ్చరిల్లింది అంటే చరిత్ర నుంచి మనం ఏమి నేర్చుకొన్నట్లు ? అణచబడిన వర్గాల ఆంకాంక్షలను ఎంత గౌరవించినట్లు ? ప్రత్యామ్నాయ ప్రజా సంస్కృతి పట్ల ఎంత సహనంతో ఉన్నట్లు ? రాజ్యంగ బద్ధమైన హక్కులుగా స్వేఛ్ఛా స్వాతంత్ర్యాలకు ఏమి విలువ ఇస్తున్నట్లు ?

ఆగ్లేయ పాలనను కీర్తిస్తూ కవితలు రాయటానికి సావిత్రిని ఆకర్షించినది అందులోని ఉదారవాద విలువలు. 'మానవులందరు / చదువుకొనుటకు, రాయుటకు అర్హులు' అన్న ఆంగ్లేయుల ప్రకటన విప్లవాత్మకమైనది అంటుంది 'ఆంగ్లేయ పాలన' అన్న కవితలో. లింగ కుల మినహాయింపు లేవీ లేకుండా అందరికీ విద్య అందుబాటులోకి తెచ్చిన పాలన కనుక దానిని ఆమె ఆహ్వానించింది. "జ్యోతిబా చరిత్ర మాదిరి / ఆంగ్లేయుల పాలన ఉత్సాహ వంతం, ప్రేరణాదాయకం" అంటూ తనకు అత్యంత ప్రీతి పాత్రమైన వ్యక్తితో పోలిక చెప్పేంతగా ఆంగ్ల పాలనను ఆమె అభిమానించటం గమనిచ దగినది. ఇంగ్లీషు తల్లి, ఇంగ్లీషు నేర్చుకో – అనే రెండు కవితలలోనూ శూద్రుల పట్ల కనబరచిన స్నేహ భావం కారణంగానే ఇంగ్లీష్ పాలనను ఆమె అభిమానించటం కనిపిస్తుంది. శూద్రుల, అతిశూద్రుల దుఃఖాన్ని దూరం చేసే విద్య ఇంగ్లీషు విద్య అంటుంది. "ఇంగ్లీషు చదివి కుల భేదాల/గోడలను కూల గొట్టు/భట్ బ్రాహ్మణులు రచించిన కుతంత్రాల/శాస్త్ర పురాణాలను పడ గొట్టు" అంటూ గురిచూసిన లక్ష్యంతో ఇంగ్లీషు నేర్చుకొనటానికి పిలుపును ఇచ్చింది.

ఇంగ్లీషు చదవటమంటే ఇంగ్లీషు భాష నేర్చుకొనటం కాదు. ఇంగ్లీషు విద్య నేర్చుకొనటం ఇంగ్లీషు విద్య అంటే లౌకిక విద్య. లౌకిక ప్రపంచంలో జ్ఞాన చైతన్యాలతో జీవించటానికి కావలసిన ఎరుక కలిగిచే విద్య. భౌతిక జీవితంలో సంప్రదాయ సంకెళ్లను తెంపుకొని ఆధునికత వైపు పయనించడానికి అవసరమైన వివేకాన్ని ఇచ్చే విద్య. ఆర్థిక స్వావలంబనకు ఆసరా అయ్యే విద్య. అటువంటి విద్యను నేర్చుకొనటానికి పిలుపునిస్తూ కవిత్వం రాసింది సావిత్రిబాయి. విద్య విలువ తెలిసిన వ్యక్తిగా మనుషులలో విద్యాసక్తిని అభివృద్ధి చేయటానికి ఒక ఉద్యమంగా పని చేసింది. 'చదువు కోసం చైతన్యులు కండి' అనే కవితలో అతి శూద్ర సోదరులను, 'గొప్ప ఆస్తి' అనే కవితలో పిల్లలను సంబోధించి విద్యా సముపార్జనకు ప్రోత్సహించింది. 'అన్ని ఆస్తి పాస్తులకన్న/విద్యయే నిజమైన ఆస్తి, సర్వోన్నత శక్తి అని ప్రతిపాదించి చెప్పింది. 'బృంద కవిత్వం'లో ఆడపిల్లల చదువు గురించిన ఆరాటం కనబడుతుంది. సంగీత నృత్య రూపకంగా ప్రదర్శింప చెయ్యాలన్న ఆలోచన తో రాసిన గీతం ఏమో ఇది అనిపిస్తుంది. కవిత ప్రారంభంలో వున్న 'ప్రతి బృందంలో అయిదుగురు చెలి కత్తెలు' అన్న సూచనను బట్టి అలా అనుకోవలసి వస్తుంది. నాలుగు బృందాల మధ్య సంవాదంగా నడుస్తుంది. మొదటి బృందం జ్ఞాన దర్బారు తెరుచుకుంది పదండి బడిలో చదువుకొని జ్ఞానాన్ని పొందుదాం అని తోటి వాళ్ళను పిలుస్తుంది. రెండవ బృందం చదువేమిటి !? ఆడుకుందాం పదమంటుంది. మూడవ బృందం ఇంటి పనిలో అమ్మకు సహాయం చేద్దాం పదమంటుంది. నాలుగవ బృందం చదువా, ఆట పాటలా, అమ్మకు పనిలో సాయమా అమ్మనడిగే తేల్చుకుందాం పదమంటుంది. తల్లి ఏమి చెప్పింది పిల్లలకు? "ఆత్మాభిమానంతో జీవించడం కోసం / బడిలో చదువుకోవాలి" అంటుందామె. మొదట చదువు, తరువాత ఆటపాటలు ,ఖాళీ వేళలలో ఇంటిపని–ఇదీ ఆ తల్లి ప్రాధాన్యక్రమం. ఆ తల్లి సావిత్రి బాయి కాక మరెవరు ? ఆ తల్లి ఇచ్చిన ప్రేరణ ఆ పిల్లలందరినీ 'అజ్ఞానాన్ని, పేదరికపు బానిసత్వాన్ని తుదముట్టించగా, శతాబ్దాల ఆశయ జీవితానికి అంతం పలుకగ' చదువు కోసం సంకల్పించేట్లు చేశాయి. బానిస సంకెళ్లను త్రెంచి స్వతంత్రులు కావటం గమ్యంగా బడిబాట పట్టేట్లు చేశాయి.

ఆత్మగౌరవ చేతన సావిత్రిబాయి జీవిత చోదక శక్తి. కుల అస్తిత్వ చేతన స్త్రీ అస్తిత్వ చేతన రెండూ ఆమెలో సంపూర్ణ వికాసనం పొందాయి. శూద్రుల పరావలంబనం ఆమెకు ఖేద హేతువు. 'శూద్రులు, అతి శూద్రులు అజ్ఞానం చేత వెనుక బడ్డారు' పుట్టుకకు కారణం తల రాత అనుకొనటం ఫలాన్ని ఆశించ కుండ చాకిరీ చేస్తే స్వర్గంలో పుణ్యం లభిస్తుందన్న బోధనలను నమ్మటం ఆ అజ్ఞానానికి కారణం అని ఆమెకు తెలుసు. అజ్ఞానంలో మగ్గిపోతున్న వాళ్ళ పట్ల ఆర్తి 'శూద్రుల పరావలంబనం' కవితలో కనిపిస్తుంది. 'శూద్రులంటే' అన్న కవిత శూద్రుల ఆత్మభిమాన ప్రకటన. శూద్రులంటే నేటివ్ లు అని నిర్వచించింది. నేటివ్‌లు అంటే స్థానికులు. మూల వాసులు. అధికారులు. దండెత్తివచ్చిన వారి చేత రచించబడిన చరిత్రలో పరాజితులు శూద్రులుగా ముద్రవేయబడి బానిసలుగా చేయ బడి సమాజపు చివరి అంచులకు నెట్టివేయ బడ్డారు. ఈ దశకు ఈడవబడిన వారి పూర్వ శౌర్య ఘన చరిత్రను గుర్తు చేయటం శూద్రులలో ఆత్మ విశ్వాసాన్ని ప్రోది చేసేందుకే.

సావిత్రి బాయి కవిత్వంలో స్త్రీల పరావలంబనం గురించిన ఆందోళన పెద్దగా కనబడదు కానీ లింగ వివక్ష గురించిన స్పృహ స్పష్టంగా కనబడుతుంది. అంతకన్నా స్త్రీల శక్తి మీద అపారమైన నమ్మకం, గౌరవం కనబడతాయి. మనుషులను మనుషులు అనటానికి కొన్ని లక్షణాలు వుండాలని ప్రతిపాదిస్తూ ఆ లక్షణాలు లేని వాళ్ళను మనుషులని ఎలా అనను అన్న ప్రశ్నతో వాళ్ళు మనుషులు కాదని అత్యంత తిరస్కృత వాచ్యంగా చెప్పే శిల్పంతో 'వారిని మనుషులని ఎలా అనను' అనే కవిత రాసింది సావిత్రిబాయి. ఆలోచన,ఆచరణ లేని వాళ్ళను, మూఢనమ్మకాలలో కూరుకుపోయిన వాళ్లను,

బానిసత్వం గురించి బాధపడని వాళ్లను, అభివృద్ధి సంకల్పం లేని వాళ్లను ఇలాంటి మరికొందరిని మనుషులని అనలేనని నిక్కచ్చిగానే చెప్పింది. ఆ కవితలో ఒక భాగం ఇలా ఉంటుంది. “పాపం భార్య పనిచేస్తూనే ఉంటుంది. ఏ కష్టం లేకుండా భర్త నిస్సిగ్గుతో ఆరగిస్తూనే ఉంటాడు. పశువులలో లేదు ఇలాంటి వింత వారిని మనుషులని ఎలా అనను ?”

నిరంతరం విసుగు కలిగించే ఇంటి పనిలో స్త్రీలు మగ్గిపోతుంటే, ఆ కష్టంలో భాగం పంచుకోకుండా తిని కూర్చొనటం పురుషుల హక్కుగా చేసిన పితృస్వామిక సమాజం ఇది. ఆ సామాజిక నీతిని నిర్ద్వంద్వంగా తిరస్కరించింది సావిత్రి. ఇంట్లో పని చెయ్యకుండా తినటం సిగ్గులేని తనమని పురుషుల ప్రవర్తనను తప్పు పెట్టటమే కాదు, ఆ విషయంలో పశువులకన్నా హీనమైన మనుషుల ప్రవృత్తుల గురించి ఆందోళన పడింది. మగవాళ్లు. మనుషులుగా మారటం గురించిన హెచ్చరిక ఇందులో అంతర్లీనంగా వుంది.

‘మా అమ్మ’, మహారాణి ఛత్రపతి తారాబాయి అనే రెండు కవితలు స్త్రీ శక్తి ఆవిష్కరణలు. మా అమ్మ కవితలో అమ్మకు నెమలితో పోలిక. నెమలి ఈకల రంగులు, మెరుపులు, విప్పుకున్న సౌందర్యం అన్నీ అమ్మలో ఉన్నాయి. “ఆమె ముందు సముద్రం కూడా / చిన్న బుచ్చుకుంటుంది / ఆమె ముందు ఆకాశం తలదించుకుంటుంది” అని అమ్మ ఔన్నత్యాన్ని స్థాపించింది. విద్యా శక్తిగా తల్లిని సంభావిచగలగటం సావిత్రి బాయికే సాధ్యం. ఛత్రపతి తారాబాయి సావిత్రి ఎంతగానో అభిమానించే ఛత్రపతి శివాజీ కోడలు. రెండవ శివాజీ తల్లి. భర్త మరణానంతరం మైనర్ బాలుడి సంరక్షకురా లిగా 1700-1708 మధ్య కాలంలో మొఘలులను నిలవరించ టంలో ప్రధాన పాత్ర వహించింది. ఆమె రాజకీయ క్రియా సౌందర్య సంస్తుతి ‘మహా రాణి ఛత్రపతి తారాబాయి’ కవిత. శూద్ర అతిశూద్ర మానవుల దైన్యానికి ,స్త్రీల దౌర్భాగ్యానికి మూలమైన కుల వ్యవస్థను, పితృస్వామ్యాన్ని స్థిరీకరించిన మనుస్మృతిపై సావిత్రి కవిత్వంలో తీవ్రమైన విమర్శ కనబడుతుంది. ‘కుటిల మనువు చెప్పెను’ అనే కవిత ఇందుకు తగిన ఉదాహరణ.


“నాగలి పట్టేవారు, వ్యవసాయం చేసేవారు
మూర్ఖులని కుటిల మనువు చెప్పెను
వ్యవసాయం చేయవద్దని బ్రాహ్మణులను
ఆజ్ఞాపిస్తుంది మనుధర్మ శాస్త్రం
శూద్రుల పుట్టుక
పూర్వజన్మ పాపాల ఫలం
అనుభవిస్తారు ఈ జన్మలో శూద్రులు సమస్తం
సమాజంలో వైషమ్యాల
కుటిల ఆచారవ్యవహారాలు రచిస్తారు
ధూర్తులకే చెల్లు ఈ అమానవీయ సిద్దాంతం”

ఈ చిన్న కవిత ఉత్పత్తి వర్గాలను, శ్రమజీవులు శూద్రులు గాను, శ్రమకు దూరమైన బ్రాహ్మణ వర్గాన్ని అధికులుగానూ చెప్పిన మనువుకు కుటిలత్వాన్ని ఇంటిపేరుగా చేసింది సావిత్రి బాయి. శూద్రుల దైన్య హైన్య జీవనానికి, జీవితానికి పూర్వ జన్మల పాప కర్మఫలమే కారణమని చెప్తూ ఈ జన్మలో అనుభవిస్తున్న సమస్యలకు పరిష్కారాలు వెతుక్కోకుండా వారి బుద్ధిని నియంత్రిస్తూ చేతులను కట్టేసిన మనుస్మృతి ఒక అమానవీయ సిద్ధాంతమని, సామాజిక వైషమ్యాల కొనసాగింపు కు ఉపయోగపడదని నిర్ద్వంద్వంగా చెప్పింది ఈ కవితలో.

“బైరాగీ భట బ్రాహ్మణులు/శ్రమను త్యజించి బిచ్చమెత్తుకుం టూ తిరుగుతారు/ ఫలాన్ని ఆశించకుండ చాకిరి చేస్తే /స్వర్గంలో పుణ్యం లభిస్తుందని చెప్పే తత్వశాస్త్రం/పెద్ద బూటకం” (శూద్రుల పరావలంబనం) అన్న కవితా భాగం కూడా మనుస్మృతి న్యాయంలోని అన్యాయాన్ని తిరస్కరించేదే. ఇందులో రెండు అంశాలు ఉన్నాయి. ఒకటి - శ్రమ చేయకుండానే సామాజిక స్థాయి వల్ల సర్వం పొందుతున్న వర్గాల ఆధిక్యతను హేళన చేస్తూ వాళ్లను బిచ్చ మెత్తుకుంటున్న వాళ్లుగా తక్కువ చేసి చెప్పటం. రెండవది శ్రమ చేసే వాళ్లకు భౌతిక ఫలితం ఆశించక పోవటమే గొప్పవిలువగా చెప్పటంలోని బోలుతనాన్ని పారలౌకిక స్వర్గ సుఖాన్ని ఆశ పెట్టటంలోని కుటిల నీతిని బయటపెట్టటం. శ్రమ దోపిడీ, శ్రమ ఫలితాలకు పరాయీకరణ ఈ రెండూ పరస్పర సంబంధం ఉన్నవేనన్న అవగాహన, వీటిని వర్ణాశ్రమ ధర్మంగా స్థిరీకరించిన మనుస్మృతి పట్ల నిరసన ఆ రకంగా వ్యక్తమయ్యాయి ఈ పంక్తులలో. బ్రాహ్మణీయ మత తాత్వికతలోని బూటకాన్ని బయటపెట్టటం, చాతుర్వర్ణ వ్యవస్థ లోని విషపూరిత సంస్కృతిని ఎండగట్టడం ‘సన్నద్ధం’ కవితలో నూ కనబడుతుంది. నిష్ఠుర సామాజిక వాస్తవికతలనే కాదు, నిసర్గ సౌదర్య భరిత ప్రకృతిలోని మట్టిని, చెట్టును పిట్టను పువ్వులను చూచి స్పందించే సున్నితత్వం సావిత్రి బాయిలో పుష్కలంగా ఉంది. ప్రకృతి-భూమి పాట, సంపెంగ, మల్లె పువ్వులు, సీతాకోక చిలుకలు-పూమొగ్గలు వంటి కవితలు అందువల్లనే రాయగలిగింది. దేశమంటే మనుషులు, పీడిత దుఃఖిత మానవులు అని నమ్మి వాళ్ళ కోసం ఎంత తపించిందో, ఉత్పత్తి వనరు అయిన భూమిని కూడా అంతగా ప్రేమించింది. ‘పొలము కళ్లము లాంటిది /మట్టితో మన అనుబంధం’ అని అనగలిగిన స్థాయి ఆమెది. భూమి -మనిషి శ్రమ -- పంట ఈ మూడింటి మధ్య సంబంధాన్ని అలవోకగా చెప్పగలిగిన మట్టిమనిషి ,ప్రజల మనిషి సావిత్రిబాయి పూలే. ‘ఆధునిక మహిళ చరిత్రను తిరగ రాస్తుంది’ అని గురజాడ ప్రకటించ గలగటానికి నమ్మకం ఇచ్చినది సమీప గతం లోని చైతన్య స్ఫూర్తి దాతలైన సావిత్రిబాయి పూలే వంటి స్త్రీల జీవితం సాహిత్యమే అయివుంటాయని భావించవచ్చు. ❑

# తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్

- ఇక్బాల్ యంజీ



**తొ**లి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు అనగానే ఏమను కుంటున్నారు మీరు. ఇప్పుడు మన ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం స్కూళ్ళలో టెన్త్, ఇంటర్ చదివిన వాళ్ళతో lkg, ukg పిల్లలకు, అక్షరాలు దిద్దించే వాళ్ళు అనుకుంటున్నారా.. ఆ ఏముందిలే... ఆ మాత్రం ఉపాధ్యాయురాళ్లు ఇవాళ చాలా మందే ఉన్నారని భావిస్తున్నారా. పొరపాటున కూడా తొందర పడి అలాంటి నిర్ణయానికి వచ్చేయకండి. ఫాతిమా షేక్ అలాంటి అశిక్షిత ఉపాధ్యాయురాలు కాదు. ఒక స్కూలు విద్యార్థులకు ప్రామాణికంగా విద్యను బోధించడానికి అవసరమైన శిక్షణ పొంది అర్హత సాధించిన ఉపాధ్యాయురాలు. అట్టడుగు, నిమ్న కులాల బాలికల కోసం చైతన్య 'జ్యోతి'రావు పూలే స్థాపించిన పాఠశాలల్లో బోధించడానికి తానే స్వయంగా సావిత్రి బాయితో పాటు ఫాతిమా షేక్‌కు కూడా శిక్షణ ఇచ్చారు. అది సరిపోదని గ్రహించి అహ్మదాబాద్ లోని ఆంగ్ల మిషనరీ ఉపాధ్యాయ శిక్షణ శాలలో ఇద్దరినీ చేర్పించి శిక్షణ ఇప్పించారు. అనంతరం పూణే లోని ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణశాలలో శిక్షణ తీసుకుని వారు పూర్తి స్థాయి అర్హత పత్రం(సర్టిఫికేట్) పొందారు. ఇదంతా.. ఇప్పటిలా ముస్లిం ఆడపిల్లలు కొంతవరకు స్వేచ్ఛగా చదువు కుంటున్న కాలం కాదు. సుమారు 180 ఏళ్ల కిందట అత్యంత దుర్భర ఆంక్షల కాలంలో. అసలు ఆడపిల్లల్ని బయటకు ఒంటరిగా పంపడమే గగనమైన అలాంటి కాలంలో ఒక మహిళ, అందునా ముస్లిం తాను చదువుకోవడమే సాహసం అయితే, మరికొందరికి చదువు చెప్పేందుకు పూర్తి స్థాయిలో అర్హత శిక్షణ పొందడం అంటే దానిని మాటల్లో కొలవలేం. అలా ఫాతిమా షేక్ భారతీయ తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలుగా చరిత్రలో నిలిచారు. అయితే అదంతా హఠాత్తుగానో యాదృచ్ఛికంగానో జరిగింది కాదు. మాహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రీ బాయి పూలే సహచర్యం, ఆదరంతోనే ఆమెకు ఆస్థానం దక్కింది. అయితే అంతకు ముందు జరిగిన పరిణామాలు స్పృశించాలి.

జ్యోతిరావు పూలే ప్రాథమిక విద్య చదువుతుండగానే ఒక అగ్రకుల బ్రాహ్మణుడి చెప్పుడు మాటలకు లోబడి తండ్రి చదువు మాన్పించారు. ఆ తరువాత ఆయనలో చదువు పట్ల కాంక్ష తీర లేదు. ఈ లోపే సావిత్రీ బాయి పూలేతో వివాహం కూడా జరిగి పోయింది. అయినప్పటికీ తను చదువుకోవడమే కాకుండా అట్టడుగు నిమ్న కులాల వారికి చదువు చెప్పాలని దృఢంగా




నిశ్చయించుకున్నారు. ఈ విషయంలో ఆయన తండ్రిని సైతం ఎదిరించారు. దీని ఫలితంగా ఆయన భార్య సమేతంగా కట్టు బట్టలతో వీధుల్లో నిలిచారు. ఆ సమయంలో తండ్రి స్నేహితుడు మున్షీ గఫార్ బేగ్ పూలే దంపతులను ఉస్మాన్ షేక్, అతని సోదరి ఫాతిమా షేక్ దగ్గరకు తీసుకెళ్ళి పరిస్థితి వివరించి ఆశ్రయం కల్పించాల్సిందిగా కోరాడు. అప్పటికే పూలే దంప తుల గురించి అక్కడక్కడ వింటూ.. ఎలాగైనా వారిని కలవాలని చూస్తున్న ఆ అన్న చెల్లెళ్ళకు మహదానందం కలిగింది. ఎలాంటి భేషజాలకు పోకుండా వెంటనే అందుకు అంగీకరించి వారిని లోనికి తీసుకెళ్ళి అవసరమైన వసతి కల్పించారు. అనంతరం పూలే దంపతులు అట్టడుగు నిమ్న కులాల వారి పిల్లలు, ముఖ్యంగా బాలికల కోసం పాఠశాల పెట్టాలను కుంటున్న విషయం తెలుసుకుని వారి నివాసాన్ని అందుకు అనువుగా మార్చి ఇచ్చారు. అప్పటి నుండి వారి మధ్య అనుబంధం బలపడింది. సోదరికి చదువు విషయంలో ఉస్మాన్ షేక్ ఎలాంటి అభ్యంతరాలు చెప్పలేదు. ఆడ పిల్లల పట్ల సామాజిక కట్టుబాట్లను పట్టించుకోకుండా ప్రోత్సహించి ఆదర్శవంతంగా నిలిచాడు. అన్న అండ, పూలే దంపతుల ప్రోత్సాహంతో ఫాతిమా షేక్ సావిత్రీ బాయి పూలే తో సమానంగా ఉపాధ్యాయురాలుగా అర్హత సాధించారు. సుమారు 180 ఏళ్ల కిందట అన్ని కట్టుబాట్లను తెంచుకుని సరిసమానంగా ఈ ఘనత సాధించిన ఇరువురు మహిళల్లో కేవలం ఒకరినే గుర్తిస్తూ

మరొకరిని ఉపేక్షిస్తూ రావడం విచారకరం. ముఖ్యంగా పూలే దంపతుల కృషికి తాము బలీయమైన మద్దతు ఇవ్వకపోతే.. పరిస్థితి ఊహించడం కష్టం. దళిత, బహుజన అంబెడ్కర్ వాదులు, ఫాతిమా విస్మరించడం విస్మయకరం. పూలే దంపతుల ఆదర్శనీయ ఔన్నత్యాన్ని కీర్తించిన ఆయన వారి ఉన్నతికి, కృషికి వెన్నుముకలా నిలిచిన ఉస్మాన్, ఫాతిమా షేక్‌ల గురించి కనీస ప్రస్తావన తీసుకురాక పోవడం అర్థం కాదు.

**అదలా ఉంచితే**

కనీసం ముస్లిం మైనార్టీ లైనా గుర్తించి దివిటీలు పడతారేమో అని చూస్తే అదీ లేదు. దేశం గర్వించదగ్గ స్థాయిలో ఒక ముస్లిం సామాజిక వర్గంలో ప్రథమ ఉపాధ్యాయురాలుగా కీర్తి ప్రతిష్టలను సాధిస్తే దానిని అత్యున్నత స్థాయిలో నిలపాల్సిన వాళ్ళు నిమ్మకు నీరెత్తినట్లు ముసుగేశారు. కనీసం కొంత సమాచారం తెలిసిన తరువాత అయినా ఫాతిమా షేక్ ఉనికిని గుర్తిస్తూ అయినా కార్యక్రమాలు చేయలేకపోవడం దురదృష్టకరం. ఈ రోజు (జనవరి 3 న) సావిత్రీ బాయి పూలే జయంతి వేడుకల కార్యక్రమాల జోరు కొనసాగుతోంది. ఆమె అందుకు సంపూర్ణంగా అర్హురాలే. సందేహం లేదు. అయితే ఇదే సందర్భంలో పూలే దంపతులకు ఆలంబనగా, కొండంత అండగా నిలిచిన ఫాతిమా షేక్‌ను కూడా స్మరించుకోగలిగితేనే వారి స్మృతికి అసలైన గౌరవం లభిస్తుంది. ❑

**(సయ్యద్ నశీర్ అహ్మద్ రచించిన 'ఆధునిక భారత తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు - ఫాతిమా షేక్' పుస్తకం ఆధారంగా..)**

---

# సమన్యాయ సత్యశోధకుడు

**(68వ పేజీ తరువాయి)**

కార్మికుల హక్కుల కోసం, 12 గంటల పనిదినం, ఆదివారం సెలవుకై ట్రేడ్ యూనియన్‌ను నెలకొల్పి పోరాటాలు చేశారు. పూలేకి కేవలం కుల వ్యవస్థ వ్యతిరేకతే కాదు, సామ్రాజ్యవాద వ్యతిరేకత, కార్మికవర్గ, రైతాంగ పక్షంగా పోరాడే అవగాహన, కార్యాచరణ ఉంది. పూలే-లోఖండే నిర్మించిన కార్మికవర్గ పోరాటాల్ని చరిత్ర పుటల్లో చేర్చకపోవడంలోనే బ్రాహ్మణీయ కుట్ర ఉంది. బాట్‌జీ, సేట్‌జీల దోపిడీ, వివక్షలతో శూద్రవర్ణ ప్రజలు మనుషులుగా గుర్తించ నిరాకరిస్తున్న మూలంగా శూద్రులు వడ్డీకి అప్పులు తీసుకోవడం, మంగలి కులస్తులు క్షవరాలు చేయడం మానేస్తారు. అంతేకాదు పూలే ఒక అడుగు ముందుకేసి శూద్ర వర్ణాల ప్రజలకు పాలకులకన్నా బ్యూరో క్రాట్స్ ప్రమాదకారులని ప్రకటిస్తారు. ఇలా బ్రాహ్మణీయ వ్యవస్థపై స్పష్టంగా యుద్ధాన్ని చేయడంలో పూలేకు మరెవరూ సాటిలేరు.

బ్రాహ్మణీయ కుల వ్యతిరేక పోరాట చారిత్రక అంశాల్ని పరిశీలించి స్వీకరించడంలో పూలే తీసుకున్న అవగాహనను భారతదేశ విప్లవ మార్క్సిస్టులు తీసుకోకపోవడం విచారకరం. పైగా విప్లవానికి అడ్డంకిగా మారుతుందని చిత్రీకరించడం విడ్డూరం. పూలే వారసులుగా పిలువబడేవారు బ్రాహ్మణీయ కుల వ్యవస్థ వ్యతిరేక, స్వయం గౌరవ సమన్యాయ పోరాట అవగాహనను వదిలి అగ్రకుల పాలకవర్గాలకు ఉపయోగపడే కులస్థిరీకరణకై బారులు తీరడం, బడుగు ప్రజల్ని ఆధునిక బానిసలుగా మార్చే ప్రయత్నం చేయడమే అవుతుంది. ఇది విచారకరం, ప్రమాదకరం కూడా. ఇది పూలే-అంబేద్కరిస్టుల అవగాహనకు విరుద్ధం. విప్లవ ప్రతిబంధకమైన ఈ కుల వ్యవస్థ, వర్గ వ్యవస్థను తనలో అంతర్భాగంగా ఇముడ్చుకుంది. కనుక ఈ దేశంలో కుల-వర్గ వ్యవస్థలు ఉన్నాయన్న సత్యాన్ని శోధించిన పూలే-అంబేద్కర్‌లను విమర్శించడం గుడ్డితనమే అవుతుంది. పూలే-అంబేద్కర్ అవగాహనతో నూతన ప్రత్యామ్నాయ సమన్యాయ పోరాటాల్ని నిర్మించడమే పూలేకి అర్పించే నిజమైన నివాళి. ❑

**సూర్య సౌజన్యంతో**

## డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మాటల్లో..

- నేను కోరేది ధర్మం మీద ఆధారితమైన శాంతినే గాని, శ్మశాన వాటికలో తాండవించే శాంతి కాదు. ధర్మాన్ని మన్నించనంత కాలం ఈ ప్రపంచంలో శాంతిలేదు.
- రాజ్యాంగం దుర్వినియోగం చేయబడిందని నేను కనుగొంటే, దాన్ని కాల్చే మొదటి వ్యక్తి నేను.
- స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం నేర్పించే మతాన్ని నేను ఇష్టపడుతున్నాను.
- దేశం అభివృద్ధి చెందడమంటే, అద్దాల మేడలు, రంగుల గోడలు కాదు.. పౌరుని నైతికాభివృద్ధే నిజమైన దేశాభివృద్ధి.
- ఎంత ఎక్కువ కాలం బతికామన్నది కాదు. ఎంత గొప్పగా జీవించామన్నదే ముఖ్యం.
- మేకల్ని బలి ఇస్తారు.. కానీ, పులుల్ని బలి ఇవ్వరు.

# వివక్షపై తిరుగుబాటు జెండా బాబూజీ



- కృపాకర్ పొనుగోటి

**భా**రతీయ దళిత వర్గాల పెన్నిధి, పరిపాలనాదక్షుడు డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలను ఏప్రిల్ 5వ తేదీన యావత్ భారతదేశం ఉత్సాహంగా జరుపుకుంటోంది. స్వాభిమానానికి, కార్యదీక్షకు, పోరాట పటిమకు, గొప్ప నాయకత్వానికి డా.బాబూ జగ్జీవన్‌రామ్ ప్రతీక. ప్రత్యేక కుల రాజకీయ వివక్షలపై బాబూజీ తిరుగుబాటు బావుటా. నాయకులకు స్ఫూర్తినిచ్చే ఆదర్శ వ్యక్తిత్వం బాబూ జగ్జీవన్ రామ్ ది. ఆయన జయంతి సందర్భంగా గొప్ప విజయగాథ అయిన బాబూజీ జీవితాన్ని స్మరించుకుందాం. జగ్జీవన్ రామ్ బీహార్‌లోని ఆరా పట్టణానికి దగ్గర ఉన్న చాంద్వ గ్రామంలో 1908 ఏప్రిల్ 5న జన్మించారు. బసంతీ దేవి, శోభీరాం జగ్జీవన్ రామ్ తల్లిదండ్రులు. జగ్జీవన్ రామ్ స్కూల్‌కి వెళ్లే నాటికి చర్మకారులు, పాకీ వృత్తివారు మొదలగు దళిత కులాల ప్రజలు దుర్భరమైన అంటరానితనం, బానిసత్వంలో నలిగిపోతూ ఉండేవారు.

గ్రామ వీధుల్లో, పురవీధుల్లో, చర్మకారులు నడవడానికి ఆంక్షలు ఉండే వి.జగ్జీవన్‌రామ్ చదువుకుంటున్న ఆరా పట్టణం స్కూల్లో అగ్ర కుల హిందువులకు, ముస్లింలకు వేరు వేరు మంచినీటి కుండలుండేవి. దాహంతో ఉన్న జగ్జీవన్ రామ్ ఒక రోజు అగ్రకుల హిందువుల కుండలోని మంచినీళ్లు తీసుకుని తాగాడు. ఇది చూసిన అగ్రకులాల విద్యార్థులు 'చర్మకారుడైన అయిన జగ్జీవన్ రాం ముట్టుకున్న కుండని మేము ముట్టుకోము' అని, స్కూలు కుండలో మంచి నీటిని తాగడం మానేశారు. దీనితో హెడ్మాస్టర్ అగ్రకుల విద్యార్థులకు, దళిత విద్యార్థులకు వేరు వేరు మంచినీటి కుండలు పెట్టించారు. ఇది చూసిన జగ్జీవన్ రామ్ హిందువులు, ముస్లింలకంటే తన దళితుల సాంఘిక స్థాయి ఇంత హీనమైనదా అని తీవ్రంగా కలత చెందాడు, ఆగ్రహించాడు.ఎవరూ చూడకుండా కుండలను తానే పగలగొట్టి, ఎవరో పగలగొడుతున్నారని ఫిర్యాదు చేసేవాడు. మళ్లీ పెట్టేవారు జగ్జీవన్ మళ్లీ పగలగొట్టేవాడు. చివరికి జగ్జీవన్ అభిమతాన్ని గమనించిన హెడ్మాస్టర్ విద్యార్థులందరికీ స్కూల్లో ఒకటే కుండ ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో జగ్జీవన్ శాంతించాడు, సంతోషించాడు. అలా జగ్జీవన్ రామ్ భవిష్యత్ పోరాటాలకు స్కూల్లోనే పునాదులు పడ్డాయి. బనారస్‌లో క్షవరం కోసం మంగలి షాప్‌కి వెళ్లేవాడు. జగ్జీవన్ రామ్ చర్మకార కులస్థుడని తెలిశాక, మంగలి వారు క్షవరం చేయడం మానేశారు. చర్మకారులకు క్షుర కర్మ చెయ్యడానికి



నిరాకరించడం మానవత్వానికే తీరని అవమానమని, ఇందుకు నిరసనగా ప్రజలు మంగలి షాపులను బహిష్కరించాలని జగ్జీవన్ రామ్ బస్తీలన్నీ తిరిగి జనాన్ని కూడగట్టాడు. ప్రజలు బహిష్కరించడం మొదలుపెట్టారు. దీనితో మంగలి వారు వైఖరిని మార్చుకుని చర్మకారులకు క్షవరాలు చేయడానికి ముందుకు వచ్చారు.

జగ్జీవన్ రామ్ ఆర్య సమాజం వారి విద్యార్థి వసతి గృహంలో భోజనం చేస్తూ కాలేజీకి వెళ్లేవాడు. జగ్జీవన్ రామ్ కులం తెలుసుకున్న హాస్టల్లోని వంట వారు అతని పాత్రలు కడగడం మానేసారు. ఈ సంగతి తెలియగానే మెస్ మేనేజర్ పనివారిని మందలించాడు. ఫలితం లేదు. జగ్జీవన్‌రామ్ హాస్టల్‌లో ఉన్నంత వరకు ఏ ఒక్క దళితేతర పనివారు అంట్లు తోమే పనిలో చేరలేదు. ఒక అధ్యాపకుని ఆహ్వానం మేరకు జగ్జీవన్ రామ్ నాలుగు రోజులు అతని ఇంట్లో భోజనం చేశాడు. నాలుగో రోజు జగ్జీవన్ రామ్ చర్మకారుడని తెలిసిన నౌకర్లు అధ్యాపకుని ఇంట్లో పని మానేశారు. ఆ తర్వాత ఆశీఘాట్‌లో ఒక శూద్రుని ఇంటిని జగ్జీవన్ రామ్ అద్దెకు తీసుకున్నాడు. ఒక నెల అద్దె అడ్వాన్స్ కూడా చెల్లించాడు. మరుసటి రోజు ఇంట్లో చేరడానికి సామాన్యులతో వెళ్లగా ఆ ఇంటి యజమాని అడ్వాన్స్ డబ్బుతో ఎదురొచ్చాడు. తానొక పూజారి వద్ద నౌకరిని అని, చర్మకారులైన మీకు ఇల్లు అద్దెకిచ్చిన సంగతి తెలిస్తే తన ఉద్యోగం ఊడుతుందని, ఇరుగు పొరుగులు హేళన చేస్తారు కనుక, అడ్వాన్స్ డబ్బు వెనక్కి తీసుకుని తిరిగి వెళ్లమని జగ్జీవన్ రామ్‌ని ఇంటి యజమాని కోరాడు. చాలా అవమానంగా భావించిన జగ్జీవన్‌రామ్ 'అడ్వాన్స్ కూడా ఇచ్చాను. ఇప్పుడు వద్దంటున్నావు. ఏం చేసుకుంటావో చేసుకో. నేను ఇక్కడి నుంచి

కదలను' అంటూ సామానుతో సహా అద్దె ఇంట్లోకి ప్రవేశించాడు. కొద్దిరోజులు ఇంటి యజమాని, జగ్జీవన్ రామ్ ఎడమొహం పెడమొహంగా ఉన్నప్పటికీ, త్వరలోనే వారిద్దరి మధ్య స్నేహ పూర్వక సంబంధం ఏర్పడింది. బాబూజీ చిన్ననాటి నుంచే వివక్షపై తిరుగుబాటు చేశాడు అనే దానికి ఈ సంఘటనలు కొన్ని మచ్చుతునకలు.

జగ్జీవన్ రామ్ 1914లో పట్టణంలో ప్రాథమిక విద్య ప్రారంభించి, 1925లో అగర్వాల్ మిడిల్ స్కూల్ నుండి మెట్రిక్యులేషన్ పాసయ్యారు. కాలేజీ విద్య కోసం బెనారస్ విశ్వ విద్యాలయంలో చేరి, అనారోగ్య కారణాల వల్ల చదువు మధ్యలో వదిలి వేయవలసి వచ్చింది. బాబూజీ ఉన్నత విద్య పట్ల శ్రద్ధతో, కలకత్తాలోని విద్యాసాగర్ కాలేజీలో చేరాడు. 1927లో కలకత్తా విశ్వ విద్యాలయం నుంచి బిఎస్‌సి డిగ్రీ పట్టా పుచ్చుకున్నారు. ఆనాటి సమాజంలో బాల్య వివాహాలు సహజమైనందున జగ్జీవన్ రామ్‌కు ఎనిమిదవ ఏటనే వివాహం జరిగింది. భార్య కొద్ది కాలానికే(1933లో) చనిపోయింది. తిరిగి 1935లో డాక్టర్ బీర్బల్ కుమార్తె ఇంద్రాణి దేవితో పెళ్లి జరిగింది. వీరికి సురేష్ కుమార్, మీరా అను ఇద్దరు సంతానం కలిగారు.


జగ్జీవన్ రామ్ 1930లో గాంధీ దృష్టిలో పడ్డారు. 1935లో కాన్పూర్‌లో జరిగిన ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ (అఖిల భారత దళిత వర్గాల సంఘం) మహాసభలకు అధ్యక్షత వహించగా, ఈ మహాసభలను గాంధీ ప్రారంభించడం విశేషం. డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్‌కు 1936 నుండి 1942 వరకు బాబూజీ అధ్యక్షత వహించారు. 1935లో జగ్జీవన్ రామ్ బీహార్ శాసన మండలికి నామినేట్ అయ్యారు. అదే సంవత్సరం బీహార్ శాసనసభకు జరిగిన ఎన్నికల్లో మొత్తం 15 ఎస్‌సి రిజర్వుడు ఎమ్మెల్యే స్థానాలకు జగ్జీవన్‌రామ్ అభ్యర్థులను పోటీకి దింపారు. 15 నియోజకవర్గాలకు 15 మంది అభ్యర్థులు గెలిచారు. వీరిలో 14 మంది ఏకగ్రీవంగా ఎన్నిక కావడం మరో విశేషం.

1942 ఆగస్టు 7న ప్రారంభమైన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు జగ్జీవన్‌రామ్ జైలుకు వెళ్లవలసి వచ్చింది. అంతేకాదు అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్‌ను రద్దు చేసింది. 1943లో జగ్జీవన్ రామ్ జైలు నుండి విడుదలయ్యాడు. విస్తృత పర్యటనలు చేసి, సభలు సమావేశాలు నిర్వహించి, దళిత వర్గాల్లో చైతన్యం తీసుకురావడానికి జగ్జీవన్ రామ్ చాలా కృషి సల్పారు. 1946లో నెహ్రూ ప్రధానిగా ఏర్పడిన తాత్కాలిక మొదటి మంత్రి మండలిలో జగ్జీవన్ రామ్ మొదటి కార్మిక శాఖ మంత్రిగా చేరారు. మంత్రులందరిలోకెల్లా చిన్న వయసు వాడైనందున అందరూ బాబూజీని 'బేబీ మినిస్టర్' అని పిలిచేవారు. అప్పటి నుండి 29 సంవత్సరాలు కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానమంత్రిగా, సెంట్రల్ పార్లమెంట్ బోర్డు సభ్యునిగా, పిసిసి అధ్యక్షునిగా, ఇంకా అనేక కీలక పదవులను బాబూజీ నిర్వహించారు. దళిత వర్గాల ప్రజల సమస్యలు, అభిప్రాయాలను తెలియచేయమని, బ్రిటిష్ కేబినెట్ మిషన్ బాబూజీని ఆహ్వానించింది. 1947లో రాజ్యాంగ పరిషత్తుకు బాబూజీ ఎన్నికయ్యారు. ఇదే సంవత్సరం ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ కార్మిక మహాసభ అధ్యక్షునిగా బాబూజీ ఎన్నికయ్యారు. కేంద్ర కార్మిక శాఖ, వ్యవసాయం, ఆహారం, ఉపాధి, పునరావాసం, రక్షణ, రైల్వే, సమాచార శాఖలను మూడు దశాబ్దాలు ఎంతో ప్రజ్ఞా పాటవాలతో, బాధ్యతతో బాబూజీ నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో, నాయకత్వాల్లో, అణగారిన వర్గాలకు ప్రాతినిధ్యం లభించడానికి బాపూజీ అవిశ్రాంతంగా కృషి చేశారు.

ఇందిరాగాంధీ నియంతృత్వ ధోరణితో విసిగిపోయిన జగ్జీవన్ రామ్ కాంగ్రెస్ పార్టీ నుండి విడిపోయి 'కాంగ్రెస్ ఫర్ డెమోక్రసీ' అనే పార్టీని స్థాపించారు. తర్వాత ఇది జనతా పార్టీలో విలీనమైంది. 1977లో మొరార్జీ దేశాయ్ ప్రధాన మంత్రిగా జనతా పార్టీ ఏర్పాటు చేసిన ప్రభుత్వంలో జగ్జీవన్ రామ్ కేంద్ర రక్షణ శాఖ మంత్రిగా.. ఉప ప్రధాన మంత్రిగా 1979 వరకు కొనసాగారు. అంతఃకలహాల కారణంగా, జనతా పార్టీ ప్రభుత్వం పడిపోయింది. 1980లో బాబూజీ కాంగ్రెస్ (జె) పేరుతో పార్టీని స్థాపించారు. 1950లో సికింద్రాబాద్ కర్బలా మైదానంలో జరిగిన ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ మహాసభల్లో బాబూజీ పాల్గొన్నారు. గడ్డి వాములో మాదిగ కోటేశు దహనం సంఘటనపై 1965లో బాబూజీ, కృష్ణా జిల్లా కంచికచర్ల గ్రామాన్ని సందర్శించారు. 1976లో ప్రతిష్ఠాత్మకమైన ఆంధ్రప్రదేశ్ హరిజన మహాసభల్లో ముఖ్య అతిథిగా బాబూజీ పాల్గొన్నారు. రాష్ట్రానికి చెందిన మాజీ కేంద్ర పెట్రోలియం, రసాయనాల శాఖా మంత్రి జేబీ ముత్యాలరావు, రాష్ట్ర మాజీ మంత్రి, డిప్యూటీ స్పీకర్ కీర్తిశేషులు సదాలక్ష్మి, ముదిగొండ ఈశ్వరయ్య మొదలై దళిత నాయకులకు బాపూజీ అండగా ఉన్నారు. 1985లో దేశ ప్రజలు బాబూజీ జన్మదినోత్సవాన్ని 'సమతా దివస్'గా జరుపుకున్నారు. 1986 జూలై 6న మహా పరినిర్వాణం చెందిన బాబూజీ కోసం కేంద్ర ప్రభుత్వం దేశమంతటా మూడు రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది. జూలై ఏడవ తేదీని రాష్ట్ర ప్రభుత్వాలు సంతాప సెలవు దినాన్ని ప్రకటించాయి.

సాహసి, మేధావి, ఉద్యమకారుడు, పరిపాలనాదక్షుడు, ఆత్మగౌరవ జెండా, నాయకుడు, విజేత అయిన బాబూజీ జీవితం ఒక గొప్ప విజయగాథ. ప్రజల్లో కార్యకర్తల్లో, నాయకుల్లో స్ఫూర్తి రగిలిస్తూనే ఉంది. బాబూజీ జీవితాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలి. బాబూజీకి ఇప్పటికైనా భారత ప్రభుత్వం 'భారత రత్న'ను ప్రకటించాలి. వివక్షల కొలిమిలో నుంచి నిగ్గు తేలిన నిరుపమాన ప్రజా నాయకుడు బాబూజీకి సమతా చేతనాంజలి. ❑

# జాతీయ దృక్పథం గల దళితోద్ధారకుడు



- డొక్కా మాణిక్య వరప్రసాద్

ఆధునిక భారత నిర్మాతల్లో ఒకరు బాబూ జగ్జీవన్‌రామ్. రాజకీయాల్లో ఆచరణవాది. తండ్రి జీవన తాత్విక బాటలో అహింసా తత్వాన్ని పుణికి పుచ్చుకొని, జాతీయోద్యమంలో గాంధీ స్ఫూర్తితో పాల్గొని, దేశ రాజకీయాల్లో ఒక సరికొత్త నినాదంగా మారిన వ్యక్తి. బ్రిటిషర్స్ 1935 భారత ప్రభుత్వ చట్టాన్ని తీసుకు వస్తున్న సందర్భంలోనే 'ఆల్ ఇండియా అణగారిన వర్గాల సమాఖ్య'ను ఏర్పాటు చేసి దళిత బహుజన వర్గాలను జాతీయ స్థాయిలో ఐక్యపరచే కార్యాచరణ ఉద్యమించాడు. బిహార్ అసెంబ్లీకి 1936లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పొత్తుతో అణగారిన వర్గాల సమాఖ్య తరపున బరిలోకి దిగి 14 మంది అభ్యర్థులను గెలిపించాడు. జాతీయ దృక్పథంతో పనిచేస్తూనే దళిత బహు జనోద్ధరణకు పూనుకున్న ప్రజ్ఞావంతుడు జగ్జీవన్ రామ్‌జీ. మానవ సమాజ మార్పునకు దోహదపడే రాజ్యాంగ మార్గ పద్ధతుల పట్ల బలమైన నమ్మకంతో పనిచేశాడు. రాజ్యాంగ రచనకై ఏర్పాటైన 'రాజ్యాంగ సభ' సభ్యునిగా బిహార్ నుంచి ప్రాతినిధ్యం వహించాడు. 1946లో కేంద్రంలో ఏర్పడ్డ తాత్కాలిక ప్రభుత్వంలో కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా పనిచేశాడు. 1947లో ఏర్పడ్డ ప్రభుత్వంలో మరోమారు ఇదే శాఖకు మంత్రి అయ్యాడు. కార్మికులపై జాతీయ కమిషన్‌ను ఏర్పాటు చేసి జస్టిస్ గజేంద్ర ఘట్కర్ వంటి ఉద్దండ న్యాయమూర్తిని అధ్యక్షుడిగా నియమించాడు. ఈ కమిటీ నివేదికల ఆధారంగా కార్మిక ప్రజా ప్రయోజనాల కోసం కనీస వేతనాల చట్టం, పారిశ్రామిక వివాదాల చట్టం, ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సవరణ) చట్టం, బోనస్ చెల్లింపుల చట్టం వంటి వివిధ కార్మిక ప్రజోపయోగ చట్టాలను రూపొందించాడు.

అలాగే ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ ఫండ్ వంటి చట్టాల ద్వారా సామాజిక భద్రతకు పునాదులు వేశాడు. ఫ్యాక్టరీస్ చట్టం ద్వారా మహిళలు, బాలలు ప్రమాదకర పరిశ్రమల్లో పనిచేయడాన్ని నిషేధించాడు. కార్మికుల పనిగంటలు నిర్ధారించాడు. అదనపు పనికి గానూ అదనపు చెల్లింపులకు శ్రీకారం చుట్టాడు. కాంట్రాక్ట్ లేబర్ విధానాన్ని ప్రవేశపెట్టాడు. రైల్వే మంత్రిగా చార్జీల పెంపు భారం పేదవాళ్లపై పడకుండా సంస్కరణలు చేపట్టాడు.

భారత సమాజం దళిత, అణగారిన వర్గాల పట్ల చూపుతున్న వివక్షలను 'భారత్‌లో కులం సవాళ్లు' (కాస్ట్ ఛాలెంజెస్ ఇన్ ఇండియా) రచన ద్వారా వివరించాడు. అంబేద్కర్ వంటి



మేధావి రాజ్యాంగ రచనా సంఘం బాధ్యతలు చేపట్టేందుకు తన వంతుగా నెహ్రూ, గాంధీ, పటేల్ వంటి జాతీయ నాయకులను ఒప్పించిన రాజకీయ నేర్పరి జగ్జీవన్. బిహార్‌లో భూకంపం సంభవించినప్పుడు ఆయన చూపించిన చొరవ, సామాజిక విపత్తులు సంభవించినప్పుడు ఎలా ఎదర్కొనాలో తెలుపుతాయి. ఈ సంఘటన మహాత్మాగాంధీని సైతం ఆకర్షించింది. దేశంలో ఆహార సంక్షోభం సంభవించినప్పుడు హరిత విప్లవానికి నాంది పలికి ఆహారోత్పత్తిని పెంచి, దేశాన్ని సంక్షోభం నుంచి ముందుకు నడిపాడు. ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రవేశపెట్టి నిరుపేదల ఆకలి తీర్చేందుకు పూనుకున్న దార్శనికుడు.

దేశ రక్షణ శాఖ మంత్రిగా ఆయన కార్యసాధన ఎప్పటికీ ఆదర్శనీయమే. పాకిస్తాన్‌తో యుద్ధం జరుగుతున్నప్పుడు సియాచిన్ పర్వత శ్రేణులలో సైనికులతో కలసి తిరిగాడు. యుద్ధం పాక్ భూభాగంలో మాత్రమే జరగాలని, భారత్ భూభాగంలో కాదని ఉద్బోధించి, భారత సైన్యాన్ని ఉత్సాహ పరుస్తూ సైనికుల్లో సైనికుడిలా మెలిగిన రక్షణ మంత్రిగా చరిత్రలో నిలిచిపోయాడు. భారత సైన్యం విజయం సాధించిన మొదటి యుద్ధం దళితుడైన జగ్జీవన్‌రామ్ నాయకత్వాన జరిగినది కావడం ఒక చారిత్రక విషయం. భారత పార్లమెంట్లో 4 దశాబ్దాలపాటు పార్లమెంటేరియన్‌గా మెలిగిన అజాత శత్రువు బాబూ జగ్జీవన్‌రామ్. దేశ ప్రజల చేత 'బాబూజీ' అన్న పిలుపు పొందిన గౌరవం ఇద్దరు వ్యక్తులకు మాత్రమే దక్కింది. ఒకరు మహాత్మాగాంధీ కాగా, మరొకరు బాబూ జగ్జీవన్‌రామ్ ! గొప్ప దేశభక్తుడు, దార్శనికుడు, మానవీయ మూర్తి జగ్జీవన్‌రామ్‌ను 'భారతరత్న' వంటి అత్యున్నత పురస్కారంతో దేశం గౌరవించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ❑

# సామాజిక, ఆర్థిక న్యాయం కోసం..
# ప్రజా ఉద్యమాన్ని ఎలా రూపొందించాలి ?

- డి.వి.వి.యస్.వర్మ



## మోదీ పాలన పర్యవసానాలు

మోదీ రాజకీయం రాజ్యాంగ విరుద్ధం. కార్పొరేట్ల దోపిడీ, సంపద కేంద్రీకరణ రాజ్యాంగ విరుద్ధం. రాజ్యాంగ పీఠిక ప్రకటించిన "సామాజిక, ఆర్థిక న్యాయం" కోసం ప్రజా ఉద్యమం రాజ్యాంగబద్ధమైన ఉద్యమం. మోదీ పాలన గమనించాల్సిన కొన్ని ముఖ్య అంశాలు.

- ఎ) మెజారిటీ ప్రజల ఓట్ల కోసం మతపరమైన విభజన, విద్వేష రాజకీయం కీలకమైంది. హిందూత్వ నినాదం ముసుగుతో హిందువుల ఓట్లను ఆకర్షించడం. హిందూ మతం ఒక విశ్వాసం. అందులో పరమత సహనం వుంది. విద్వేషం లేదు. హిందూ మతానికి తనదైన రాజకీయమూ లేదు. హిందూ మతాన్ని అనుసరించే హక్కు రాజ్యాంగ బద్ధమైంది. హిందూత్వ మతం కాదు. మత రాజకీయం. పరమత విద్వేషం మీద ఆధారపడిన రాజకీయం. రాజకీయానికి మతాన్ని వాడుకోవడం రాజ్యాంగపరమైన ఎన్నికల చట్టానికి విరుద్ధం. సంఘ్ పరివారం లక్ష్యంగా పెట్టుకున్న "హిందూ రాష్ట్ర" నినాదం-దేశ లౌకిక రాజ్యాంగానికి విరుద్ధం. రాజ్యాంగం స్థానాన్ని మనుధర్మ శాస్త్రం ఆక్రమిస్తుంది. సామాజిక న్యాయానికి అంత్యక్రియలు చేస్తుంది
- బి) మోదీ పాలనలో బిలియనీర్లు, కార్పొరేట్లు వికసిస్తున్నారు. పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య రంగాల మీద ఆధిపత్యం సాధించారు. ప్రభుత్వ సహకారంతో సహజ వనరులను స్వంతం చేసుకున్నారు. విమానాశ్రయాల మీద, ఓడ రేవుల మీద పెత్తనం చేస్తున్నారు. వ్యవసాయ రంగంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల, వ్యవసాయ పరికరాల కంపెనీలను స్వంతం చేసుకున్నారు. బీమా పేరుతో లాభాల పంట పండించుకుంటున్నారు. కార్పొరేట్ వ్యవసాయం పేరుతో పరోక్షంగా రైతుల భూములపై పెత్తనం చేసే స్థితిలో వున్నారు. సామాజిక రంగంలో కార్పొరేట్ విద్యాసంస్థలు, కార్పొరేట్ ఆసుపత్రుల వ్యాపారీకరణ జోరుగా సాగుతున్నది. రిటైల్ వ్యాపారంతో సాధారణ చిరు వ్యాపారాలు మూత పెడుతున్నారు. మోదీ ప్రభుత్వ అండతో కార్పొరేట్ల దోపిడీకి దేశం అడ్డాగా మారింది.
- సి) మోదీ పాలనలో స్వతంత్ర ప్రతిపత్తి గల ఎన్నికల సంఘాన్ని ఇతర రాజ్యాంగ సంస్థలను ప్రభుత్వ శాఖలుగా అధీనంలోకి తెచ్చుకుంటున్నారు. సీబీఐ, ఈడీలను ప్రత్యర్థులను బెదిరించడానికి లొంగదీసుకోడానికి వినియోగిస్తున్నారు. ప్రశ్నించే వారిని విచారణ లేకుండా ఏళ్ల తరబడి జైళ్ల పాలు చేసే నల్ల చట్టాలను ప్రయోగిస్తున్నారు. ప్రజల హక్కులు కాపాడే రాజ్యాంగాన్ని తమ పరిచారికగా ప్రజల హక్కులను హరించడానికి వాడుకుంటున్నారు.
- డి) మోదీ పాలనలో శ్రమ జీవుల దుస్థితి. కార్పొరేట్ల మెప్పు కోసం కార్మిక వర్గం మీద నాలుగు లేబర్ కోడ్లను తెచ్చారు. రైతులకు, కౌలుదారులకు లాభసాటి ధరలు లేవు. రుణ మాఫీలు లేవు. ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. నిరుద్యోగ శాతం గరిష్ట స్థాయికి చేరింది. ఉపాధి కల్పన కంటే ఊడిపోతున్న ఉపాధి హెచ్చుగా వుంది. పేదల స్థితి దుర్భరంగా మారింది. పరోక్ష పన్నులతో ధరల భారం మోస్తున్నారు. ఉపాధి అవకాశాలకు, ఉపశమన సంక్షేమ పథకాలను కత్తిరిస్తున్నారు. 80 కోట్ల మందికి రేషన్ పంచే స్థితి పేదరికానికి అద్దం పడుతున్నది. ప్రపంచ మానవాభివృద్ధి సూచిక, ఆకలి సూచికలు దీనిని ధృవపరుస్తున్నాయి. ప్రభుత్వ విద్య, వైద్య సేవలను ఉపేక్షించడం, పోషకాహార లోపం, శిశు మరణాల రేటు పేదల దుస్థితిని తెలియజేస్తు



న్నాయి. ఇవి కొన్ని ముఖ్యమైన అంశాలు. వీటి ఆధారంగా ప్రజలను చైతన్య పరిచే ఉద్యమాన్ని రూపొందించుకోవాలి. రాజ్యాంగానికి, సామాజిక న్యాయానికి విరుద్ధమైన మోదీ హిందూత్వ రాజకీయం మీద, కార్పొరేట్లు దేశాన్ని దోచుకుని పోగు చేసుకున్న సంపద కేంద్రీకరణ మీద ఉద్యమించాలి.

### మోదీ పాలనపై రెండు ప్రజా ఉద్యమాలు

మన ప్రజా ఉద్యమం ఒకటి మోదీ హిందూత్వ రాజకీయం మీద-మరొకటి దేశ సంపదను స్వంతం చేసుకుని అంతరాల సమాజంతో అత్యధికులను పేదరికంలో వుంచిన కార్పొరేట్ సంపద కేంద్రీకరణ మీద సాగించాలి. హిందూత్వ, కార్పొరేట్ శక్తులు ఒక దానితో మరొకటి పెనవేసుకుని ఉన్నాయి. మోదీ పాలన సహకారంతో కార్పొరేట్లు దేశ సంపదను కొల్లగొడుతు న్నారు. కార్పొరేట్ల విరాళాలతో, వారి గోదీ మీడియా ప్రచార బాకాలతో మోదీ అధికారాన్ని స్వంతం చేసుకుంటున్నారు. ఇది జమిలి పోరాటమే కాని రెండు రూపాలలో సాగించాలి.

### ఎ) హిందూత్వపై భావజాల ఉద్యమం - సామాజిక న్యాయం

మోదీ అనుసరిస్తున్న హిందూత్వ మీద ఉద్యమం ప్రధానంగా భావజాల రంగంలో జరపాలి. హిందూ మతాన్ని, హిందూత్వని వేరుచేసి చూపించాలి. హిందూత్వ జాతీయవాదం స్థానంలో భారత ప్రజల జాతీయవాదాన్ని ముందుకు తేవాలి. వివిధ భాషలను, ప్రాంతీయ వైవిధ్యాన్ని కాపాడే భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రచారం చెయ్యాలి. హిందూ రాష్ట్ర నినాదం, హిందూత్వ భావ జాలం సామాజిక న్యాయానికి విరుద్ధమైనదిగా ప్రచారం జరగాలి. హిందూ రాష్ట్ర నినాదం నిజ స్వరూపాన్ని అది ప్రతిపాదించే మనువాద ఎజెండాను వివరించాలి. దీనిలో భాగంగా జరుగుతున్న చరిత్ర వక్రీకరణలను, పాఠ్య పుస్తకాల్లో మార్పుల పర్యవసానాలను తెలియజెప్పాలి. ఈ భావజాల ఉద్యమం మోదీ హిందూత్వ జనాకర్షణను తగ్గిస్తుంది. మోదీ రాజకీయం బలహీన పడుతుంది. ఎందుకంటే మోదీ జనాకర్షణ హిందూత్వ రాజకీయం నుండి వచ్చిందే కాని ఆయన పాలనా ప్రతిభ నుంచి వచ్చింది కాదు. ఆయన పాలన, ఇచ్చిన నినాదాలు వైఫల్యాల పుట్ట మాత్రమే. మోదీ భావజాలం మీద సాగించే ఉద్యమం ప్రధానంగా ప్రచార రూపంలో వుంటుంది.

### బి) సామాజిక, ఆర్థిక న్యాయం కోసం ప్రజా ఉద్యమం

రాజ్యాంగ పీఠిక ప్రకటించిన సామాజిక న్యాయం, ఆర్థిక న్యాయం దేశ ప్రజలకు దక్కాలంటే ఆర్థిక అంశం కీలకమైంది. ఆర్థిక న్యాయంతోనే పేదరిక నిర్మూలనకు, సామాజిక న్యాయా నికి ద్వారాలు తెరుచుకుంటాయి. ఆర్థిక న్యాయం తక్షణ అవసరంగా వున్న వారు దేశ జనాభాలో సగానికి పైబడి వున్నారు. రాజకీయ పరిభాషలో ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనారిటీలు లలో అత్యధికులు పేదలు. వివక్షకు గురవుతున్న వారు. సామాజిక, ఆర్థిక న్యాయం నినాదం అత్యధిక సంఖ్యాకులకు అవసరమైన నినాదమవుతుంది. ఇది ప్రచార ఉద్యమం మాత్రమే కాదు, ప్రజా ఉద్యమ రూపం తీసుకునే వీలుంది. ఆర్థిక న్యాయం సాధించడానికి రాజ్యాంగబద్ధంగా వున్న అవకాశాలు.

### మోదీ పాలనలో సంపద కేంద్రీకరణ

2014లో దేశంలో 50 మంది బిలియనీర్లు వుంటే ఈ 12 సంవత్సరాల్లో అదనంగా 200 మంది పుట్టుకొచ్చారు. అసమానతలు హెచ్చుగా వున్న దేశంగా మారింది. 1 శాతం బిలియనీర్లు. కార్పొరేట్ల దగ్గర 46 శాతం దేశ సంపద పోగుపడింది. 10 శాతం కుబేరుల దగ్గర 75 శాతం సంపద గుట్ట పడింది. ఆదాయాలలో ఇదే తరహా అంతరాలు కనిపిస్తు న్నాయి. మోదీ ప్రభుత్వం వీరికి దేశ సంపదను దోచుకునే అన్ని వనరులను కట్టబెట్టడంతోపాటు, కార్పొరేట్ పన్ను 35 శాతం నుండి 22 శాతానికి తగ్గించారు. వారికి రుణ మాఫీలు, రాయితీ ల పేరుతో 20 లక్షల కోట్లు అందించారు. ఇంతకు ముందున్న సంపద పన్నును, వారసత్వ పన్నును రద్దు చేశారు.

### సంపద పునః పంపిణీకి మార్గాలు

రాజ్యాంగ బద్ధంగా గతంలో వుండి మోదీ ప్రభుత్వం తొలగించిన సంపద పన్ను, వారసత్వ పన్నులను తిరిగి విధించాలి. ఈ ప్రభుత్వం గణనీయంగా తగ్గించిన కార్పొరేట్ పన్ను కనీసం మూడు శాతం పెంచాలి. విపరీత ఆదాయాల మీద విండ్ ఫాల్ పన్ను విధించాలి. ఈ ప్రారంభ చర్యలతో సామాజిక న్యాయానికి, పేదరిక నిర్మూలనకు నాంది పలకాలి.

వివిధ పన్నులు విధిస్తే వచ్చే అదనపు ఆదాయం అంచనాలు. ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త ప్రభాత్ పట్నాయక్ : టాప్ 1 శాతం కుబేరుల మీద రెండు శాతం సంపద పన్ను వేస్తే 8 లక్షల కోట్లు, మూడో వంతు వారసత్వ పన్ను విధిస్తే 6 లక్షల 67 వేల కోట్లు. ఈ రెండు పన్నుల ద్వారా 14 లక్షల కోట్లుపైగా వస్తాయి. Tax Rich campaign సంస్థ అంచనాల ప్రకారం ఈ రెండు పన్నుల ద్వారా 17 లక్షల కోట్లు (ఈ రెండు అంచనాలు టాప్ 1 శాతం మంది మీద 2 శాతం పన్నును లెక్కించాయి) టాప్ 10 శాతం మీద సరాసరి 3 శాతం పన్ను విధిస్తే "చాట్ జి.పి.టి. ప్రకారం 27 లక్షల కోట్లు వస్తాయి. ఇందులో వారసత్వ పన్ను లేదు. టాప్ 10 శాతం మీద సంపద పన్నుతో వచ్చే 27 లక్షల కోట్లతో "జాతీయ సంక్షేమ నిధి"ని ఏర్పాటు చేసి వివిధ మార్గాల ద్వారా సకల శ్రమ జీవులకు, రైతులకు, యువతకు సంపద పునఃపంపిణీ చెయ్యాలి.

### ఇది హక్కుల ఉద్యమం - ఉచితాల ఉద్యమం కాదు

జీవించే హక్కు రాజ్యాంగబద్ధం - సంపదలో వాటా చట్టబద్ధం

“ఒక సిద్ధాంతం, ఒక ఆలోచన ప్రజల మనసులను ఆకట్టుకుంటే అది భౌతికశక్తి అవుతుంది” అనే ప్రసిద్ధ మాటను జర్మన్ తత్వవేత్త Karl Marx చెప్పారు. అలాంటి భౌతిక శక్తి గల ప్రజా ఉద్యమం ఎలా రూపొందుతుంది ? ప్రతి వ్యక్తికీ ఆకాంక్షలు, ఆశయాలు, సిద్ధాంతాలు వుంటాయి. వాటిని సాధించాలనే తపన ఆయనను నడిపించే శక్తిగా వుంటుంది. ఈ ఆకాంక్ష వ్యక్తికి మరొక వ్యక్తికి మారిపోతుంది. ప్రజా ఉద్యమానికి సామూహిక ఆకాంక్ష వుండాలి. అది సమూహం అందరి మనసులను ఆకట్టుకోవాలి. అప్పుడే అది ప్రజా ఉద్యమంగా లక్ష్యసాధన దిశగా నడిపించే భౌతికశక్తి రూపం ధరిస్తుంది. సామాజిక, ఆర్థిక న్యాయం అవసరం వున్న సకల పట్టణ, గ్రామీణ శ్రమ జీవుల సమూహాలు – కుల, మత, లింగ వివక్షకు గురవుతున్న సమూహాలకు ఒక ఉమ్మడి ఆకాంక్షను రూపొందించాలి. ఈ సమూహాలన్నింటినీ ప్రభావితం చెయ్యగల ఒక కొత్త ఉమ్మడి ఆకాంక్షగా వుండాలి. ఈ కొత్త ఆకాంక్ష లేదా నినాదం ఈ సమూహాల ప్రజల జీవితాలను మార్చేదిగా, అందరికీ గౌరవప్రదమైన స్వతంత్ర జీవనాన్ని ఇచ్చేదిగా వుండాలి. ఉదాహరణకు సంపద పునఃపంపిణీతో అందరికీ గౌరవ ప్రదమైన స్వతంత్ర జీవనం. ఇందులో ఒక కొత్త నినాదం, కొత్త ఆకాంక్ష వున్నాయి. ఒక నినాదం తనంతట తానుగా ప్రజల మనసులను ఆకట్టుకుని ఒక భౌతిక శక్తిగా, ఒక ప్రజా ఉద్యమంగా రూపొందదు. కొన్ని నినాదాలు ప్రజలను ఎందుకు ఆకట్టుకో గలిగాయో పరిశీలించుకోవాలి.

## ప్రజలను ఆకట్టుకున్న కొన్ని ప్రయోగాలు

- 1 నినాదం : గరీబీ హఠావో – 2 చర్య : బ్యాంకుల జాతీయకరణ సొమ్ము – 3 ఫలితం : 20 సూత్రాల పథకాల ద్వారా నేరుగా లబ్ధి
- 1 నినాదం : అచ్చేదిన్ 2 చర్య : విదేశాలలో లక్షలకోట్ల నల్లధనం 3 ఫలితం : ప్రతి కుటుంబానికి 15 లక్షలు
- 1 నినాదం : దున్నే వానికి భూమి – 2 చర్య : జమిందారీ వ్యవస్థ రద్దు 3 ఫలితం : రైతులకు భూమి హక్కు. ఇదే తరహాలో సంపద పునఃపంపిణీ ఉద్యమాన్ని రూపొందించుకోవాలి
- 1 నినాదం : సంపద పంపిణీతో స్వతంత్ర జీవనం – 2 చర్య : టాప్ 10 శాతం దగ్గర పోగు పడ్డ సంపదపై వివిధ పన్నుల ద్వారా జాతీయ సంక్షేమ నిధి ఏర్పాటు. 3 ఫలితం : ఎ) 50 శాతం శ్రమజీవులు, పేదలు, సామాన్యుల కుటుంబాలకు 50 వేలు వార్షిక బోనస్ (కంపెనీ లాభంలో వాటాను బోనస్ చట్టం హక్కును చేసింది. దాని విస్తరణ రూపమే హక్కుగా జాతీయ బోనస్ నినాదం).

బి) గౌరవప్రద జీవన హక్కులో భాగంగా హక్కుగా నివాస వసతి లేదా అద్దె, హక్కుగా ఉపాధి లేదా పరిహారం, – హక్కుగా రేషన్‌తోపాటు పోషకాహార దినుసులు, హక్కుగా పెన్షన్‌లు హక్కుగా అందరికీ వైద్య సేవలు, హక్కుగా అన్ని స్థాయిల చదువులు.

సి) రైతులకు హక్కుగా లాభసాటి ధరలు.

డి) యువతకు ఉచితంగా ఉపాధి నైపుణ్యాలు, హక్కుగా తగిన ఉపాధి లేదా పరిహారం. ఈ మూడు అంశాలు జత పడినప్పుడు ఒక నినాదం ప్రజల మనసులను ఆకట్టుకుంటుంది. విజయాలు తెచ్చిపెట్టే ప్రజా ఉద్యమం అవుతుంది.

- ఇది హక్కుల ఉద్యమం. హక్కుదారుల ఉద్యమం. ఇది ఉచితాల ఉద్యమం కాదు. లబ్ధిదారులుగా చేసే అభ్యర్థన ఉద్యమం కాదు. రాజ్యాంగం హామీ ఇచ్చిన సామాజిక, ఆర్థిక న్యాయం, ప్రాథమిక హక్కుగా ప్రకటించిన గౌరవ ప్రదమైన జీవన హక్కు కోసం ఉద్యమం. రాజ్యాంగ విరుద్ధమైన సంపద కేంద్రీకరణ మీద చేసే చట్టబద్ధమైన ప్రజా ఉద్యమం.

## ప్రజా సంఘాలు : ఉమ్మడి నినాదం

సమాజంలో వివిధ ప్రజా సంఘాలు వాటికి ప్రత్యేక సమస్యలు వుంటాయి. అన్ని ప్రజా సంఘాలకు ఒక ఉమ్మడి నినాదం వుండాలి.

## సామాజిక, ఆర్థిక న్యాయం కోసం


“కార్పొరేట్ల సంపద దోపిడీని కట్టడి చెయ్యండి. పోగుపడ్డ సంపదను పంపిణీ చెయ్యండి” అన్నది ఉమ్మడి నినాదం కావాలి. సకల పట్టణ, గ్రామీణ శ్రమజీవుల సంఘాలకి జాతీయ బోనస్ – జీవన హక్కుల నినాదం అవుతుంది.


## విద్యార్థి,యువజన, మహిళా సంఘాలకు


- కార్పొరేట్ విద్య, కార్పొరేట్ వైద్యం దోపిడీని అరికట్టాలి. సంపద పంపిణీతో హక్కుగా మంచి ప్రమాణాల విద్య వైద్య సేవలు అందించాలి.
- వ్యవసాయ రంగంలో కార్పొరేట్ దోపిడీని అరికట్టాలి. సంపద పంపిణీతో చట్టబద్ధంగా పంటలకు లాభసాటి ధర కల్పించాలి.
- సంపద పంపిణీతో అందరికీ సమానంగా ఎదిగే అవకాశాలు, పేదరికం లేని గౌరవప్రదమైన జీవనం కోసం అన్నది వివక్ష తరగతుల సంఘాల నినాదం కావాలి.
- అన్ని ప్రజా సంఘాలు ఒక ఉమ్మడి నినాదంతో ముందుకు వస్తే అది విజయాలు సాధించే ప్రజా ఉద్యమం అవుతుంది. ❑

## కొత్త పుస్తకాల స్వీకారం







**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**
Vol : 4 - Issue No : 7 Online Edition April 2026




కొత్త పుస్తకాల స్వీకారం

